
అద్వైత వెలుగు
గోపాలుని రఘుపతిరావు

# ఆధ్యాత్మిక వెలుగు

## ఆధ్యాత్మిక వ్యక్తిత్వ వికాస వ్యాసమాలిక

రచయిత

**గోపాలుని రఘుపతిరావు**

**ఆధ్యాత్మిక వెలుగు**

**గోపాలుని రఘుపతిరావు**

© రచయిత

ప్రచురణ : జూన్ 2016

ప్రతులు : 500

ముఖచిత్రం : సురేష్ కడలి
చిత్రకళ ఆర్ట్ ఎకాడమీ, హైదరాబాద్ - 89
సెల్ : 81 21 967040

ప్రతులకు :

**గోపాలుని రఘుపతిరావు**
శ్రీషిర్డి సాయి నిలయం
నెం. 14-5-45, వింజమూరివారి తోట
బాపట్ల - 522 101, గుంటూరు జిల్లా, ఎ.పి.
సెల్ : 99890 55837
email : raghupathiraogopaluni@gmail.com

మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపులలో

ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 520 002
సెల్ : 9490634849

వెల : రూ. 125/-



మా కుటుంబ ఆనందమే తన ఆనందంగా భావిస్తూమా ఉన్నతిని
సదా కాంక్షించి,ఆప్యాయతానురాగాలు మాకు పంచిన మా అత్తగారు
స్వర్గీయ శ్రీమతి **ఉప్పుగుండూరి లక్ష్మీసరస్వతమ్మ** గారికి అంకితం.

# నామాట

పుస్తక ప్రచురణ వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఎంతో కష్టపడి ఒక పుస్తకం ప్రచురించి ముద్రణ అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దటం ఒక ఎత్తయితే అందులోని విషయం చదివించేదిగా, విజ్ఞానవంతంగా ఉండటం మరొక ఎత్తు. కాగా పుస్తకం పాఠక దేవుళ్ళను చేరడం... అంటే మార్కెటింగ్ ప్రక్రియ యజ్ఞ సదృశం! ఒక పుస్తక ప్రచురణ బాధ్యతలు ప్రచురణ సంస్థలు తీసుకుంటే రచయితకు ఎంతో వెసులుబాటు కల్గుతుంది. ఆ అవకాశం అందరికీ లభించేది కాదు. ప్రచురణ సంస్థలు ఆర్థికపరమైన, నిర్వహణ పరమైన, మార్కెటింగ్ పరమైన నైపుణ్యాలు కలిగి వుంటాయి. రచయితే పబ్లిషర్ కూడ అయినపుడు ఆ సంక్లిష్టత వేరు. 2014లో నేను 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అనే కథల సంపుటి వెలువరించాక, ఈ ప్రచురణ.... 'ఆధ్యాత్మిక వెలుగు' ఆ పరంపరలో నాల్గవది. మధ్యకాలంలో 'అమ్మపల్లకి' (కవితలు); 'ఆధ్యాత్మిక తోరణం' (వ్యాసాలు) పుస్తకాలు వెలువడ్డాయి. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' మరియు 'అమ్మపల్లకి' ఈ-బుక్ లుగా www.kinige.com లో ఉన్నాయి.

మొదటగా నన్ను ఓ ప్రచురణ కర్తగా ప్రోత్సహించిన మిత్రుడు ప్రముఖ రచయిత శ్రీ సూర్యప్రసాదరావుగారు. అనుభవం కలిగాక ఎన్నో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ ప్రచురణ యజ్ఞం నిర్వహించేందుకు తగిన ఆత్మవిశ్వాసం, ఆసక్తి నాకు లభించాయి.

మానవజీవితం ఐహిక, పారమార్థిక విషయాలు, అనుభవాల మేలుకలయిక. జననం, వృద్ధి, విద్యాభ్యాసం, ఉద్యోగం, వివాహం, సంతానం వంటివి దైవ ప్రమేయంగా కొనసాగగా ఇహంలో సంపద, సమృద్ధి, విజయాలు కైవసం చేసుకోవడం వంటివి దైవానుగ్రహంతో పాటు స్వయంకృషి వల్ల

నెరవేరుతాయి. ఇహలోక విజయాలకు తెరవెనుక దైవ సంకల్పం తప్పని సరి! భగవదనుగ్రహం లేకపోతే ఓ చిన్నకార్యం కూడా సఫలం కాదని మనిషి స్వీయ అనుభవాల ద్వారా తెలుసుకుంటాడు. 'ఆధ్యాత్మిక వెలుగు' అనే ఈ గ్రంథానికి సంబంధించి కొన్ని ఆసక్తికరమైన అనుభవాలు ఉన్నాయి. ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ పత్రికలకు పంపబడని అముద్రిత రచనలు. పత్రికా రచనలో నాకున్న కొద్దిపాటి అనుభవం నన్నీ వ్యాసాలను ఏర్చికూర్చి ఓ పుస్తకంగా వేయాలనే సంకల్పానికి పురికొల్పింది. ఇందులోని వ్యాసాలన్నీ పాఠక జనరంజకాలు అవుతాయనే సంపూర్ణ విశ్వాసంతో పుస్తక ప్రచురణకు సిద్ధం కావటం జరిగింది. నా ముందటి ప్రచురణ 'ఆధ్యాత్మిక తోరణం' విజయవంతమైన అనుభవంతో 'ఆధ్యాత్మిక వెలుగు' ప్రచురణకు ప్రోత్సాహం లభించింది. టైటిల్‌కు సంబంధించి మా పెద్దబ్బాయి మధుశ్రీనివాస్ కొన్నిపేర్లు సూచించాడు. మిత్రులు, ప్రముఖ రచయిత శ్రీ దానం శివప్రసాదరావు గారు మరికొన్ని పేర్లు సూచించారు. అవన్నీ పరిశీలించి పుస్తక శీర్షికగా ఓ పేరు నిర్ణయించుకున్నాం. ఆర్టిస్ట్ శ్రీ కడలి సురేష్ (చిత్రకళా ఆర్ట్ అకాడమీ, మణికొండ, హైదరాబాద్) గారిని ముఖచిత్ర రూపకల్పన కోసం సంప్రదించాం. ఆర్ట్‌వర్క్ కోసం తన సహాయం స్వీకరిస్తామని ముందుగానే చెప్పిన కారణంగా ఆయన ఓ చూడచక్కని స్కెచ్ సిద్ధం చేశారు. దానికి 'ఆధ్యాత్మిక వెలుగు' అని ఆయన నామకరణం చేశారు. గ్రంథ శీర్షికగా ఆ విధంగా ముందటి అన్ని ప్రతిపాదనలూ సమసిపోయి 'ఆధ్యాత్మిక వెలుగు' టైటిల్ ఖరారు చేయడం జరిగింది.

దైవం లేకపోతే మనిషిలేడు. సమస్త సృష్టి లేదు. దైవం గురించి ఎంత విన్నా, చదివినా, ఇంకా ఇంకా వినాలి, చదవాలి అనే దాహం మనిషికి ఎన్నటికీ తీరేదికాదు. ఆస్తికులందరికీ ఈ విషయం అనుభవైక వేద్యమే! ఆ నేపథ్యంలోనే 'ఆధ్యాత్మిక వెలుగు' గ్రంథం ఊపిరి పోసుకుంది. పుస్తకంలోని వ్యాసాలలో కొన్ని సాంఘికపరమైన సమాచారం అందించేవికాగా మరికొన్ని వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడగలవని భావిస్తాను. కాగా ఆధ్యాత్మిక అంశాలు ముఖ్యపాత్రవహించడం సహజ పరిణామమే. 'ఆధ్యాత్మిక వెలుగు' లోని అన్ని వ్యాసాలూ పాఠక దేవుళ్ళకు

మనోరంజకంగా భాసించగలవని భావించడం అత్యాశ కాదని తలుస్తాను. ఇందులోని తప్పులను సహృదయులైన పండితులు, పాఠక మహాశయులు మన్నిస్తారని, ఒప్పులుగా స్వీకరిస్తారని మనసారా ఆశిస్తాను. 'ఆధ్యాత్మిక వెలుగు' పుస్తకాన్ని చక్కగా డి.టి.పి చేసి అందంగా అలంకరించి తీర్చిదిద్దిన శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ వ్యవస్థాపకులు శ్రీ విశ్వేశ్వరరావు గారికి, వారి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆధ్యాత్మిక విషయాసక్తి గల పాఠక మిత్రులకు హృదయపూర్వకంగా ప్రణమిల్లుతూ.....

**- గోపాలుని రఘుపతిరావు**

రచయిత

ఆధ్యాత్మిక వెలుగు....


| | | |
|---|---|---|
| 1. | ఆధ్యాత్మిక వెలుగు | 11 |
| 2. | నీకు నీవే ప్రత్యేకం | 14 |
| 3. | విద్యా గంధం | 16 |
| 4. | దైవానుగ్రహం | 19 |
| 5. | మరణం లేని మనం | 22 |
| 6. | మోజు | 24 |
| 7. | 'స్వయం సహాయం' | 27 |
| 8. | భగవత్తత్వం | 30 |
| 9. | మనసు - శరీరం | 32 |
| 10. | ఆనందం ఎక్కడ? | 35 |
| 11. | అహంకారం | 38 |
| 12. | ఊర్ధ్వ దృష్టి | 41 |
| 13. | 'భయంలేని జీవితం' | 43 |
| 14. | ఖ్యాతి | 45 |
| 15. | తీపిజ్ఞాపకం | 47 |
| 16. | ఆనందమందిరం | 49 |
| 17. | నిత్య భిక్షగాడు | 51 |
| 18. | బ్రతుకుతీపి | 53 |
| 19. | కల్పన : సృజన | 55 |
| 20. | దృష్టి | 58 |
| 21. | స్వభావం | 61 |
| 22. | ఆధిపత్యం | 64 |
| 23. | సానుకూల భావనలో చిప్పిల్లే ఆనందం | 67 |
| 24. | మనసు - మకిల | 70 |

| | | |
|---|---|---|
| 25. | యోగ సాధన | 72 |
| 26. | సంశయం | 75 |
| 27. | జ్ఞాన కిరణం | 78 |
| 28. | అహింస | 81 |
| 29. | అంచెలంచెల సాధన | 84 |
| 30. | మన వాంఙ్మయంలో మహోన్నత విలువలు | 87 |
| 31. | నీరు పల్లమెరుగు | 96 |
| 32. | మనసు తెర | 98 |
| 33. | కార్యశూరులు | 100 |
| 34. | 'సుఖదుఃఖాలు' | 102 |
| 35. | జీవిత చక్రం | 105 |
| 36. | కాపట్యం | 108 |
| 37. | భవితవ్యం | 110 |
| 38. | సంశయాలకు వీడ్కోలు | 113 |
| 39. | ప్రాణం | 115 |
| 40. | తీరంలేని కడలి | 117 |
| 41. | స్వార్థం | 119 |
| 42. | నీడ | 121 |
| 43. | 'జాతవేదుడు' | 123 |
| 44. | 'ప్రలోభాలు' | 125 |
| 45. | ముఖం | 127 |
| 46. | సత్యం | 130 |
| 47. | లోపలి మనసు | 132 |
| 48. | సుందర ప్రకృతి | 135 |
| 49. | దైవీగుణం | 137 |
| 50. | అనిమీలిత ధ్యానం | 140 |
| 51. | మాయా ప్రపంచం | 142 |
| 52. | ఆత్మబంధం | 144 |
| 53. | గతమెంతో ఘనం | 146 |
| 54. | స్త్రీ | 148 |

| | | |
|---|---|---|
| 55. | ఇంద్రియ విజయం | 151 |
| 56. | ఆత్మనిగ్రహం | 153 |
| 57. | ఆత్మజ్ఞాన రహస్యం | 155 |
| 58. | గుర్తింపు | 157 |
| 59. | మూడు నిజాలు | 159 |
| 60. | ఉదాత్త సాధన | 161 |
| 61. | సజ్జనుడి కోపం | 164 |
| 62. | చిత్త ఏకాగ్రత | 167 |
| 63. | ఆస్తికత్వం | 170 |
| 64. | మనసా! వ్యాకులపడు! | 172 |

# 1. ఆధ్యాత్మిక వెలుగు

వద్దనుకుంటే వస్తువు పొందలేకపోయిన బాధ ఉండదు. మనిషి చేసే తప్పులు అతడి అంతరాత్మకు తెలియవా? ఒకటి కావాలనుకుంటే ఈ ప్రపంచంలో మరొకటి వదులుకోక తప్పదు. మనసులోని సంతృప్త భావన ముఖంలో తప్పక ప్రతిఫలిస్తుంది.

ఉద్వేగభరితమైన ఆశ తీరనపుడు నిరాశ ఆవహిస్తుంది. ఎన్నో అనుకూల శుద్ధ భావాలు అంకురించేది మనోక్షేత్రంలోనే! మనసులో మెదిలే మంచిభావాలనే ఆచరణకు ఎంచుకోవాలి.

చెత్తలో సైతం మంచి వస్తువును ఎంచుకొని సేకరిస్తాడు చెత్త కార్మికుడు. అనేకానేక అనుభవాల నేపధ్యంలో ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకోగల స్థాయికి మనిషి ఎదగాలి. మన మనసు చెత్తబుట్టగా మారని సందర్భం మనకు కావాలి.

మన ప్రయత్నం ద్వారా కర్మ సాఫల్యం కానపుడు ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలి.

సాధకుడు భక్తి, జ్ఞాన, కర్మ మార్గాల్లో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. గాలి చొరని ప్రదేశంలో ఉంచిన పచ్చికాయలు మగ్గి పండ్లవుతాయి. సన్మార్గ చింతనలో కాగిన మనసు నిగ్గు తేలుతుంది. ధ్యాన నిష్ఠవల్ల మనసు పరిపక్వమవుతుంది.

ఊహించని అభినందన అమితానందానికి కారణం కావచ్చు. మనిషి చేసే తప్పును అంతరాత్మ ముల్లులా గుచ్చుతూ సూచిస్తుంది. అయినా తప్పు తనది కాదని నిజాయితీగా అంగీకరించకపోవడం దురహంకార ప్రభావమే! అహంకార త్యాగం మనోనైర్మల్యానికి ప్రధమ సోపానం.

మనిషి జీవితంలో శీలానికి అత్యంత ప్రాధాన్యత వుంది. శీలం వున్న వ్యక్తి హృదయం నిర్మలంగా వుంటుంది. అటువంటి వారిలో దురహంకారానికి చోటులేదు. కొందరు మహనీయులు లోకవ్యవహారాలకు దూరంగా అతి సామాన్యంగా జీవిస్తారు. దైవదర్శనం చేసి ప్రత్యక్ష ఆత్మానుభూతి పొందిన అటువంటి వారి విషయంలో సైతం లోకం సరిగా గుర్తించడంలో పొరపాటు పడుతుంది. అత్యంత సామాన్య జీవితం అనుభవించే అవధూతలు లోకానికి తేలిగ్గా బోధపడరు. వారి అత్యంత నిరాడంబర జీవితం చూసే సామాన్యుడు 'అతడికి నాకు తేడా ఏముంది? అతడూ నాలానే తింటాడు. తిరుగుతాడు. నిద్రిస్తాడు. ఆయనకూ తలదాచుకొనేందుకు ఓ గృహంకావాలి. నాకూ అంతే!' అనుకుంటాడు. గృహస్థ జీవితం గడిపిన కొందరు మహాత్ముల విషయంలో కూడ మనిషి వారిని వాస్తవంగా గుర్తించడంలో విఫలుడవటం చూస్తాం.

దైవత్వం సులభంగా బోధపడే అంశం కాదు. కానీ అదృష్టవంతులైన పవిత్ర జీవులకు ప్రతిక్షణం దైవీభావన అనుభవంలోకి వస్తుంది. చూడగలవారికి దివ్యత్వం అడుగడుగునా, అణువణువునా వెల్లడి అవుతూనే వుంటుంది. ఓ విత్తు చెట్టుగా మారటంలో, ఓ కాయ మగ్గి పండుగా రూపాంతరం చెందటంలో, అడుగున్నర పొడవుండే శిశువు ఆరడుగుల మనిషిగా మార్పు చెందటంలో, ఓ చిన్ని పూవు హృదయాన్ని తాకే పరిమళాన్ని వెలజల్లటంలోనూ మనం దివ్యత్వాన్ని దర్శించవచ్చు. మన్వంతరాలు, యుగాలు మారినా కాలాన్ని నిర్దేశిస్తూ సూర్యభగవానుడు ఉదయాస్తమయాలనే తన గురుతర బాధ్యతలను విరామమెరగకుండా నిర్విఘ్నంగా నెరవేర్చడం దివ్యత్వ 'శాశ్వత'త్వానికి ప్రతీక.

విశ్వం అనంతమయినది. అనంతత్వానికి మరో ప్రతీక సప్త సముద్రాలు. కాగా కంటికి ద్యోతకమయ్యే నీలాకాశం అంతంలేని భగవత్తత్వానికి మచ్చుతునక. అనంత అంతరిక్షంలో అనేక గ్రహాలు, నక్షత్ర సముదాయాలు వాటివాటి గురుత్వాకర్షణ శక్తులకు లోబడి తేలుతుంటాయి. మనం అనుభూతి చెందే శూన్యం (ఆకాశం) ఎంత పరిధి వరకు శూన్యంగా విస్తరించి వుందో అంతుబట్టని విషయం. అలాగే జనన మరణాలు కూడ! మరణించాక ప్రాణికి ఏమవుతుందో, ఎటువంటి

అనుభవాలు కలుగుతాయో చూచిన వారెవ్వరూ లేరు. అయితే ఆత్మ దర్శనం చేసిన మహర్షుల అంతర్వీక్షణం వల్ల సృష్టిలోని రహస్యమేదీ దాగలేదు. 'భగవంతుడు సాకారుడు, నిరాకారుడు. నీ అంతిమ లక్ష్య సాధనకు నీవు ఇది... ఇలా చేయాలి!' అని మనకు మార్గదర్శనం చేసిన ఆ మహా(పు)రుషుల మాటలు మనకు వేదాలయ్యాయి. వేదాంతాలయ్యాయి. పురాణేతిహాసాలయ్యాయి. పరమాత్మను నమ్మిన వారికి అంతా సుగతే అన్న మహా వాక్యం మరవక పోతే మనిషికి ప్రత్యక్షంగా పరోక్షంగా జీవితం కల్యాణప్రదమే అవుతుంది. అటువంటి జీవులకు శాంత్యానందాలు ఆగని తేనెల ఊటలా ఎప్పటికీ చేరువలోనే ఉంటాయి. ❋

# 2. నీకు నీవే ప్రత్యేకం!

ఓ మనిషీ! నీలాంటి వ్యక్తి ప్రపంచంలో నీవొక్కడివే! ఇది అతిశయోక్తిగా అన్నమాట కాదు. మనిషిని పోలిన మనిషుండవచ్చు. అదే పేరుగల వారు ఎందరో కనిపించవచ్చు. కవలగా పుట్టినా నీలాంటి మనిషి సృష్టిలో నీవొక్కడివే సుమా! అదే నీ గొప్పతనం! భగవంతుడు నీ పట్ల చూపిన శ్రద్ధ, నిన్ను సృజించడంలో పడిన శ్రమ నీ ప్రత్యేకతను చాటుతాయి. అయితే అది నీ గొప్పతనం ఎంతమాత్రం కాదు. ఆకారంలో మరోమనిషి నిన్ను పోలి వుండవచ్చు. రంగులో సరిపోలవచ్చు. అయితే ఆస్వాదించే రుచులు మాత్రం భిన్నంగానే వుంటాయి. మాటతీరు, కంఠస్వరంలో మార్పు ఉండి తీరవలసిందే.

మనిషి సంతకానికి ఈ దృశ్య ప్రపంచంలో ఉన్న విలువేపాటితో తెలుసుకదా! దానిని ఎవరూ నూటికి నూరుశాతం అనుకరించలేరని భావిస్తాం. కాని కొందరు కళాపోషకులు నిన్ను మరపించేలా నీ సంతకం అనుకరించగలరు. అందుకేనేమో భగవంతుడు అందంగా రూపుదిద్దిన వేలిముద్రల వైపు దృష్టి సారించారు న్యాయనిపుణులు. ఒకరి వేలిముద్రను పోలిన వేలిముద్ర మరొకటి ఉండదనే దాని భావం! ఆ భావన ఎంతో ప్రామాణికమైనది కూడ! మనిషి వేలిముద్రను వేరొకరెవరూ అనుకరించలేరు. అందుక్కారణం శరీర భాగాల నిర్మాణంలో భగవంతుడికున్న కౌశలమే! బొటనవేలు లేని వారికి మరోవేలు, అదీ లేకపోతే మరోటి వేలిముద్రకు అర్హమని చెప్పారు న్యాయశాస్త్ర పండితులు. వారికి అంతకన్నా భద్రమైన మరో ప్రత్యామ్నాయమార్గం స్ఫురించలేదని మనం గ్రహించాలి! ఇంకా నిక్కచ్చి అని భావించాడేమో మనిషి... వేలిముద్రల కన్నా కనుపాపల ఛాయాచిత్రం మరీ ప్రత్యేకమని నిర్ణయింపబడింది. అలా నీకే ప్రత్యేకమైన వేలిముద్రలు, కనుపాపలు కలవాడివి ఈ ఏడేడు పదునాల్గులోకాల్లో నీవొక్కడివే సుమా! మిత్రమా, అది నీ గొప్పతనమా, లేక నిన్ను సృజించిన భగవంతుడి గొప్పతనమా? ఆలోచించు!

దయ, ప్రేమ, అనురాగం, వాత్సల్యం వంటి దైవీగుణాలతో పాటు ఈర్ష్య, అసూయ, ద్వేషం, అసత్యభాషణం, కామం, క్రోధం వంటి దుర్గుణాలు కూడ దైవం సృజించినవే! అమ్మ బిడ్డడికి చెంచాతో పాలు పట్టినట్లు లేదా స్తన్యమిచ్చినట్లు ఒకరికి ఒకలా, మరొకరికి మరోలా దైవం ఆ గుణ సంపదను వితరణ చేశాడు. ఆ వితరణకు ఆధారభూతమైన మూలసూత్రమేమిటో మాత్రం ఎవరికీ తెలియదు. మనకర్మలే మనకు పుణ్యపాపాలు తెచ్చిపెడతాయంటారు. సత్కర్మ, దుష్కర్మ... చేయవలసినదేదో ఆయనే నిర్ణయించి నీ నొసటిపై రాసినపుడు కర్మ తాలుకూ కర్తృత్వం, ఫలితం నీకెందుకు వర్తిస్తాయో తెలియని విషయం ఆలోచించు మనిషీ! అందరూ ఆ భగవంతుడి బిడ్డలయినపుడు కొందరు అందలాలెక్కివుండటం, లేదా కొందరు పల్లకీలు మోయడం –ఈ తేడాలలోని రహస్యం ఏమిటో తెలియదు మిత్రమా!

జగద్రక్షకుడు సూత్రధారిగా ఆడించే నాటకంలో మనమందరం పాత్రధారులమే! 'దుఃఖమొస్తే దుఃఖించకు, సంతోషమొస్తే కట్టలు తెంచుకు మిడిసిపడకు. తటస్థంగా ఆనంద విషాదాలకతీతంగా జీవించు! అదే 'స్థితప్రజ్ఞత!' ఆ ప్రజ్ఞ సాధించిన వాడికే పట్టం గట్టి పరమపదం అనుగ్రహిస్తానంటాడు భగవానుడు. కంటికెదురుగా వున్న సుఖదుఃఖాలను విస్మరించి లేని తటస్థతను 'నటించాలని' భగవానుడి ఉద్దేశ్యమా! అందుకేనేమో ప్రపంచం ఓ నాటకరంగం, ఓ నటనాలయం అయింది. ఇవన్నీ ఊహలే మిత్రమా! ఈ భావాలకు ఆధారాలేమీ లేవు. ఒకటి మాత్రం నిజం. నీదైన ప్రత్యేకతను కలిగి వుండటంలో నీవెంతటి ఘనుడవో ప్రతివాడూ అంతే ఘనుడన్న వాస్తవాన్ని మాత్రం విస్మరించకు! అందుకే ప్రతివాడిలో అతడి మంచిని, ఔన్నత్యాన్ని చూడు! గౌరవించు! ప్రేమనుపంచు! ఎదుటివాడు నీకు అనుకూలంగా వ్యవహరిస్తే నీకు ఆనందం కల్గుతుంది కదూ! నీవూ సరిగ్గా అలాగే ప్రవర్తించి అందరికీ ఆనందం కల్గించు. ఈ నీ చర్య వల్ల భగవానుడికీ ఆనందం కల్గుతుంది. సృష్టికర్తకు ఆనందం కల్గించడం కన్నా గొప్ప విషయం లేదుగా?! అదే మానవుడి పరమధర్మమనే సత్యాన్ని ఎన్నడూ మరువకు. మిత్రమా! బాగా గుర్తుంచుకో! ❋

# 3. విద్యా గంధం

లోకంలో మంచి, చెడు రెండూ ఉంటాయి. లోకంలోని మంచి మనలో ఉందా? సత్యం మనం అనుసరిస్తామా? సహనగుణం మనలో లేశమాత్రమైనా ఉందా? సచ్ఛీలం, న్యాయం, ధర్మం, ప్రేమ, అహింస, శాంతం ఇత్యాది సుగుణాలు కొన్నయినా మనలో వున్నాయా? జీవనయానం ధనంతో ముడివడి ఉంటుంది. ధన సంపాదనకోసం మనం అనుసరిస్తున్న మార్గాలు అనుసరణీయమైనవేనా? ఈ ప్రశ్నలన్నీ ఎప్పుడో ఒకప్పుడు మనిషి అంతరంగంలో మెదిలేవే!

జ్ఞానం పండితుల వద్ద లభిస్తుంది. అది పొందే మార్గాలను జ్ఞానాభిలాషి అన్వేషిస్తాడు. 'అంగట్లో అన్నీ వున్నా అల్లుడినోట్లో శని' అన్నట్లు అందుబాటులో వున్న సంపద, అవకాశాలు మన అనుభవంలోకి రాకపోవడం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. అనుభవంలోకి తెచ్చుకునేందుకు న్యాయబద్ధమైన మార్గం ఎంచుకొనేవాడే వివేకవంతుడు!

రైతులు పంటలు పండిస్తారు. పారిశ్రామికవేత్తలు వస్తు ఉత్పత్తులు చేస్తారు. ధనం లేనంతమాత్రాన అవి అవసరమైన ఒక మనిషికి అందకపోవడం; లోకం తీరు అదే అయినా విచారించదగ్గ విషయం! పేదవారికి పెద్దవారు అనుభవించే ఫలాలు ఆమడదూరంలో వుంటాయి. నిరుపేదలు ఆకలికి మాడటం, ఆకలి చావుల బారిన పడటం వింటుంటాం! కానీ ధన వంతులతో సమంగా విద్యావంతులు సాధారణంగా ఆకలి కోరల్లో చిక్కుకుపోరన్నది గమనార్హమైన విషయం!

అవిద్యను అలక్ష్మిగా గ్రహించాలి. చక్కని చుక్కకైనా విద్యాగంధం లేకపోతే ముఖంలో లక్ష్మీకళ ఉండదు. అవిద్య చీకటి వంటిది. దానిని

తొలగించుకొనేందుకు జ్ఞానదీపం వెలిగించుకోవాలి. విద్యాగంధం అబ్బితే పల్లకీ మోసే మోత కాపుకైనా గజారోహణయోగం పట్టవచ్చు. అందరూ విద్యావంతులైతే. మట్టి పనిచేసేదెవరు? పంటపొలాల్లో కష్టించి కలుపు తీసేదెవరు? బరువులు మోసేదెవరు? పారిశుధ్య పనులు నిర్వహించేదెవరు? అనే ధోరణిని పిడివాదంగానే పరిగణించాలి. అందరూ విద్యావంతులే అయిన ప్రాంతాల్లో కూడ ఈ పనులు నిర్విఘ్నంగా కొనసాగుతుంటాయి. ఎవరి పనులు వారు చేసుకోవచ్చు. లేదా చేసుకోలేని వారికి సాయమందించేందుకు సహృదయులెవరైనా ముందుకు రావచ్చు. లేదా ఆ పనులు పూర్తి చేసేందుకు పని వారు తోడ్పడవచ్చు. కొన్ని సంపన్న దేశాల్లో ఇలాంటి పనుల కోసం యంత్రాలు వినియోగించడం మనకు తెలుసు.

విద్యను సుగంధంతో పోలుస్తారు. విద్యలేకపోతే మనిషి జంతువుతో సమానం! విద్య పరాధీనతను దూరం చేయగల దివ్యసాధనం! విద్యవల్ల లోకం పోకడ అర్ధమౌతుంది. విద్యకు వినయం తోడైతే చేయలేని మహత్కార్యం ఉండదు. విద్య ఓ అఖండ తేజోపుంజం. వెలుగులు విరబూసే తారాతోరణం. నిశీధిలో త్రోవచూపే అనురాగమయి. పువ్వుకు పరిమళం వలె అనామకుడికి సైతం కీర్తిప్రతిష్ఠలు ఆపాదించగల వరప్రదాయిని విద్యయే! కాలం సంపద అన్నారు. చదువూ ధనమే! సరస్వతీ స్వరూపాన్ని మహాలక్ష్మి తత్వంలో అంతర్భాగంగా చెబుతారు పండితులు!

విద్య వలన చేకూరే వాక్పటిమ వల్ల శ్రోతలను మంత్రముగ్ధుల చేస్తాడు వక్త. నవీన ప్రపంచంలో ఆధునిక మానవుడు అనుభవించే సమస్త వస్తు సుఖాలు, భోగాలు విద్యాలక్ష్మి వరప్రసాదమే! అందుకే జ్ఞాన భాండాగారాలయిన వేదాలను తస్కరించి సముద్ర గర్భంలో దాగిన శంఖాసురుని మత్స్యావతారుడై సంహరించి వేదనిధులను కాపాడి బ్రహ్మదేవుడికి అప్పగించాడు శ్రీహరి!

విద్యాగంధం అలదుకున్న ప్రయత్నశీలుడి శిరం చుట్టూ ప్రకాశవంతమైన తేజోవలయం (పరివేషం) విస్తరించి ఉంటుంది. విద్యను గుప్త రూపంలో ఉండే ధనంగాను దూరదేశాల్లో సాయమందించే ప్రియనేస్తం గాను అభివర్ణించారు

కవులు. అవిద్యను దూరం చేసి అందరికీ విద్య అందించేందుకు సహృదయులైన సేవాతత్పరులతో పాటు ప్రభుత్వాలూ పరిశ్రమించాలి. ప్రయత్నిస్తే విద్యాగంధం అందరికీ అందేదే! భార్యాబిడ్డలను పోషించుకుంటూ కడుపునింపుకునేందుకే కాక విద్య జ్ఞానదీపం వెలిగించుకొనేందుకూ తోడ్పడుతుంది. ఆ దివ్యశక్తి ఔన్నత్యాన్ని గ్రహించి, సాధనతో అవిద్యను తొలగించుకొని తెలివిలో కొండంత ఎత్తుకు ఎదిగేందుకు సాధకుడు పరిశ్రమించాలి. లక్ష్యసాధన కోసం అవిరళ కృషి సల్పే సాధకుడే జీవితంలో గెలుపు గుర్రాన్ని అధిరోహించగల్గుతాడు. ❃

# 4. దైవానుగ్రహం

ఒక్కోవ్యక్తి ఒక్కో ప్రత్యేకతతో అలరారుతాడు. వృత్తికి సంబంధించి కావచ్చు, ప్రవృత్తికి సంబంధించి కావచ్చు. కొందరికి తరాలు తిన్నా తరగని సంపద ఉంటుంది. కొందరికి అవసరాలు తీరుతుంటాయిగానీ జేబునిండా డబ్బుండదు. కొందరు కూలీనాలీ చేసుకొని నిత్యావసరాలు తీర్చుకుంటారు. కొందరు అభాగ్యులు భిక్షాటన చేసి జీవిస్తారు. అయితే అందరూ ఓ తల్లి గర్భం నుంచి ఆవిర్భవించినవారే! మరి, ఆ తేడాలెందుకు అన్నప్పుడు వారి వారి పుణ్యాపాపవశంగా సంపన్నులు, సామాన్యులు, దరిద్రుల యింట జన్మించడం వల్లనే అని బోధపడుతుంది. పాపపుణ్యాలు – పునర్జన్మల సిద్ధాంతాన్ని నమ్మక తప్పని పరిస్థితీ ఏర్పడుతుంది.

కృషివలన సర్వకార్యాలూ సిద్ధిస్తాయి. దుర్భిక్షం వుండదన్నది శాస్త్ర వచనం. కృషి చేసిన వారు నిశ్చయంగా గొప్ప ఎత్తులకు ఎదుగుతారు. అలా ఎదిగిన ప్రతి వారి వెనుక కృషి వుంటుందన్నది మాత్రం విస్మరించరాని నిజం.

దైవబలం మనిషికి ఎంతో అవసరం! అదివుంటే ఆధ్యాత్మికంగాను, లౌకిక ప్రపంచంలోను మనిషి ప్రవర్ధమానమౌతాడు. ప్రతిమనిషికీ ఓ 'మహత్తర' కాలం నిర్దేశింపబడి వుంటుంది. కాలం కలసివచ్చినవేళ అతడి ప్రభ దేదీప్య మానంగా వెలిగిపోతుంది. ఆ మహత్తర ఘడియలు నిష్క్రమిస్తే అతని వెలుగూ అంతర్థానమౌతుంది. పాండవులు శ్రీకృష్ణుడి దయ పరిపూర్ణంగా పొందినవారు. ఆ స్వామికృప వారికి అక్షయంగా లభించింది. ఆయన దయవల్ల ఎన్నో అవరోధాలు, అనర్థాలు, ప్రాణసంకటాలూ అధిగమించి అజేయులైనారు. ఐతే మహాప్రస్థాన సమయంలో దివ్యప్రభ అంతరించిన వేళ వారి శక్తి సామర్థ్యాలూ అంతర్థానం కావటం విశేషం!

యదువంశీయులు శ్రీకృష్ణుడితో అనుబంధం వల్ల భోగభాగ్యాలతో తులతూగారు. అరివీరపరాక్రములై ప్రకాశించారు. కొందరు యువకుల దుష్ప్రవర్తన కారణంగా మునులు శాపమివ్వగా శ్రీకృష్ణుడి కుమారుడైన సాంబుడికి ముసలం పుట్టినవేళ యదుకుల ప్రకాశవలయం అంతర్థానమై కులక్షయం ప్రారంభమయింది. శ్రీకృష్ణుడు సైతం వారిని రక్షించలేకపోయాడు. మంచి కాలానికి దైవానుగ్రహం తోడైతే మనిషికి మహర్దశ పడుతుంది. వేరుమాటల్లో మంచికాలం దైవానుగ్రహంతోనే వస్తుంది. విధి వక్రించి అనేక కష్టాలు అనుభవించిన నలదమయంతులు దేవతల ఆశీర్వాదబలంతో తమ పూర్వ వైభవం పొందారని వారి ఇతివృత్తం తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు అవతార పరిసమాప్తి జరిపినవేళ అప్పటిదాకా అఖండ వైభవంతో వెలిగిపోయిన ద్వారకా నగరం సముద్రజలాల్లో కలిసిపోయింది. దుర్వాసుడి శాపఫలంగా, శ్రీకృష్ణుడి నుంచి దివ్యతేజం నిష్క్రమించాక ఓ కిరాతుడి ద్వారా ముసలంతో చేయబడిన బాణం ప్రయోగింపబడి భగవానుడి పాదంలో గుచ్చుకొని ఆయన మృతికి కారణమైంది. ఆయన మృతదేహం ఒక్క అర్జునుడి చేత అంతిమసంస్కారానికి నోచుకోవడం దైవలీల!

వాసుదేవుడి అనుంగు సఖుడైన అర్జునుడు శ్రీకృష్ణ నిర్యాణానంతరం అండదండలేనివాడయ్యాడు. శ్రీకృష్ణుడి భార్యలను రక్షించవలసిన సమయం వచ్చినపుడు అస్త్రప్రయోగానికి అవసరమైన దివ్యమంత్రాలు స్ఫురణకు రాక పార్థుడు దుర్బలుడు కావడం దైవానుగ్రహం లోపిస్తే ఏం జరుగుతుందో తెలియజేస్తుంది. దైవకృప కల్గితే మానవుడు దివ్యాంశతో శోభిస్తాడు. అదిలోపిస్తే మానవుడు దానవుడవుతాడు. అంతటి శక్తిపూర్ణమైన దైవానుగ్రహం పొందటం ఎలా అన్నపుడు శాస్త్రాలు, పురాణేతిహాసాలు సాధకులకు ఎన్నో మార్గాలు చూపాయి. దైవాన్ని భక్తితో ప్రేమించడం, దివ్యస్వరూపమైన ప్రకృతిని ఆరాధించడం, ప్రకృతిలో అంతర్భాగమైన సమస్త ప్రాణులు, సోదర మానవుల పట్ల స్నేహభావం కల్గివుండటం వంటివి విశేషంగా చెప్పబడ్డాయి. మూగ జీవులైన పశుపక్షి మృగాలు పరమేశ్వర వాత్సల్యానికి నోచుకుంటాయి. వాటిపై

కరుణ మనిషిని దైవానికి ప్రీతిపాత్రుని చేస్తుంది. స్త్రీలు ఆచరించే మంగళకరమైన నోములు, వ్రతాలు ఇంటికి సౌభాగ్యాన్ని తెచ్చిపెడతాయి. లోకసంక్షేమం కోసం మహాత్ములు ఆచరించే యజ్ఞ యాగాది క్రతువుల వల్ల లోకాలు సుభిక్షంగా ఉంటాయి. లభించిన సంపదతో తృప్తిపొంది సత్ప్రవర్తనతో మనిషి దైవం పట్ల కృతజ్ఞుడై జీవించవలసి వుంది. రాత్రివేళ చెట్టుకొమ్మకు తలక్రిందులుగా వ్రేలాడే గుడ్లగూడకు, నేలపై పోరాడే చిట్టిప్రాణి చీమకు సైతం ఆహారమందించి పరిపోషణ చేసే భగవంతుడి అనుగ్రహం లేనిదే బ్రహ్మాండాలు క్షణకాలమైనా మనజాలవు. ఆదిమధ్యాంతరహితుడైన లోకనాయకుడు ఆది – అంతంలేని సృష్టికి రూపకల్పన చేసి జవజీవాలు అందించి పరిపోషణ చేస్తూ కల్యాణకారకుడౌతాడు. ఆకు, పువ్వు, పండు, నీరు, సప్రేమ భక్తితో వందనం తప్ప మనిషి దైవానికి సమర్పించగల ప్రత్యేక నివేదన ఏమీ లేదు. అయినా మానసిక సంతృప్తికోసం పూజాదికాలు, నామస్మరణతో ఓ భక్తుడుగా మనిషి తనను తాను ఉద్ధరించుకొనవలసి వుంది. ❃

# 5. మరణం లేని మనం

లోకంలో మనిషి భయపడే పెనుముప్పు ఒకటుంది. మాన్యుల నుండి సామాన్యులదాకా దృష్టి సారించే ఆ ఘటనకు 'మృత్యు'వని పేరు. మరణమంటే భయం ఎందుకు? అన్నపుడు కారణం 'ఇది' అని చెప్పలేనిది. నిరంతరం స్పృహలో ఉండి తన చుట్టూ జరిగేది గమనించడం, తెలుసుకోవడం మనిషి నైజం. అందుకే పదినిముషాల పాటు కళ్ళు మూసుకొని ధ్యానం చేయడానికీ ఏ కొందరో తప్ప అందరూ తటపటాయిస్తారు. అలాంటిది ఎప్పటికీ, మూతబడ్డ కనులు తెరచుకోని స్థితి (మరణం) అంటే మనిషి భయపడకపోతాడా? జన్మించాక లోకం తెలుస్తుంది. వర్తమానంలో పరిసరాల స్పృహ ఉంటుంది. శరీరం చాలించాక ఏమౌతుందో తెలియని కారణం వల్ల మనిషి తనువు చాలించాలంటే భయపడతాడు.

పాత అన్నది రోత పుట్టడం చేత అనేక వస్తువులను మనిషి త్యజిస్తూ, వాటి స్థానే కొత్త వస్తువులను సమీకరించుకుంటాడు. అలా కొత్త ఉపకరణాలు పొందినపుడు మనిషికి ఎంతో కొంత సంతోషం కల్గుతుంది. మనసు ఆనంద భరితమవుతుంది. మరి చిక్కిశల్యమై, రోగగ్రస్థమై, వార్ధక్యంలో మలిసంధ్య అంచున వున్న దేహం మరణిస్తే భయమెందుకు? శాస్త్రపురాణేతిహాసాలు, చనిపోయాక కొత్త శరీరం వస్తుందని చెప్పినా ఆ భయం పోదు. మృతి చెందాక ఈ దేహంతో అనుభవించే సుఖదుఃఖాలేవీ ఉండవు గనుక ఆ అనిశ్చితి మనిషిని కలవర పెడుతుంది. ఇంట్లో ఓ శిశువు ప్రాణం పోసుకుంటే ఇంటిల్లపాదీ ఆనందిస్తారు. తనువు వీడితే కూడ కొన్ని జాతుల్లో సంబురాలు జరుపుకుంటారట! అలాంటి స్థిత ప్రజ్ఞతే శ్రీకృష్ణ భగవానుడు తన గీతాబోధలో అర్జునుడికి తేటతెల్లం చేశాడు.

మరణించాక తను ఈ లోకంలో ఉండదన్న ఎరుక భీతి కల్గించేదే అయినా ఎందరో మహానుభావులు తనకళ్ళ ఎదుట కనుమరుగై భౌతికంగా లేక

పోయినా ఆత్మీయుల హృదయాల్లో చిరస్థాయిగా కొలువై ఉండటం చూస్తాడు మనిషి. మానవ శరీరం కోట్లాది పరమాణువుల సమాహారం. భూమండలమూ అంతే! నేలపై మట్టి, స్థావర జంగమాలైన ప్రాణులు, అప్రాణులూ పరమాణు నిర్మితాలే! మానవదేహం... ఆమాటకొస్తే ఏ ప్రాణి దేహమైనా జీవించి వున్నప్పుడు, పతనానంతరం కూడ మూలపదార్ధమైన పరమాణువుల సమాహారమే అయినపుడు మనిషికి మరణమెక్కడిది? అణుసముదాయం ఓ మానవ రూపం సంతరించుకున్నాక దానిని 'మనిషి' అని వ్యవహరిస్తాం. ఆ మనిషిని నడిపించే శక్తి దివ్యచైతన్యానికి వుంటుంది. ఆ చైతన్యం మనిషిలో మహోన్నతంగా భాసించడంచేత అతడే సృష్టిలో ప్రథముడుగా, మిగిలిన జంతుజాలాన్నంతటినీ శాసించే నాయకుడుగా చలామణి అవుతాడు. మరణభయం కలవరపరచేదే ఐనా అది ఓ తప్పని క్రతువు అయినపుడు శిరోధార్యం కావలసిందే! పరీక్షలంటే భయపడతాం! రోగాలంటే భయపడతాం! దారిద్ర్యమంటే భయపడతాం! కానీ అమోఘమైన సంకల్ప శక్తిచేత ఆ భయాలన్నీ పటాపంచలై పరీక్షల్లో కృతార్థులమౌతాం. సంపూర్ణ ఆరోగ్యాన్నిచేజిక్కించుకుంటాం. ధనం సంపాదించి భాగ్యవంతులమౌతాం. మరణభయాన్ని జయించి అమృత పుత్రుడు కావటం మనిషి వివేకానికి దర్పణం!

మనోబలం, సంకల్పబలం పొంది ఎన్నో కష్టసాధ్యమైన పనులను సుసాధ్యం చేసుకుంటాం. వైద్యుడు రోగభయాన్ని దూరం చేసినట్లు భవరోగభయాన్ని సద్గురువు నయం చేస్తాడు. గురువు చూపిన బాటలో నడిచి భవక్లేశాలను దూరం చేసుకున్న మనిషిని ఏ భయమూ బాధించదు. సూర్యచంద్రుల్లా, నక్షత్రరాశిలా, ఆత్మ... శాశ్వతమని గ్రహింపజేసే 'సాధకశక్తి' మనిషిని అమృతత్వం సంతరించుకునేలా చేస్తుంది. కనిపించే మనిషి అంతర్హితుడైన వేళ కనిపించని దైవంతో సమానమౌతాడు. ఆ అఖండ మహాతత్వంలో మనిషి పరమాణుతత్వం మమేకమైనవేళ, అంతటా నిండివున్న ఆత్మలో భాగంగా పరిణతి చెందిన వేళ మనిషికి మరణమెక్కడిది? మనిషి ఈ ధరాతలం మీద ఎప్పటికీ చిరంజీవిగా అలరారుతాడు! ❋

# 6. మోజు

మనసుకు నచ్చిన పనిని ఇష్టంగా చేస్తాం. పని ఇష్టంగా అంటే త్రికరణ శుద్ధిగా! దానినే కొందరు 'మోజు' పడటం అంటారు. దానిని కొత్త మురిపెం అనీ అనవచ్చు. అంతవరకు బాగానే వుంది గానీ మోజుకు 'తీరడం' అంటూ వుంటుంది. కొన్నాళ్ళు, కొందరి విషయంలో కొన్నేళ్ళపాటు మోజు కొనసాగుతుంది. అది తీరగానే మనిషి అప్పటిదాకా ఇష్టపడి స్వంతం చేసుకున్న వస్తువునో లేదా వ్యాపకాన్నో వదిలించుకొనే ప్రయత్నం చేస్తాడు. వస్తువు వరకైతే ఎవరికీ ఎలాంటి నష్టమూ ఉండదు గానీ మనసున్న మనిషిని వదిలించుకొనే ప్రయత్నం జరిగితే బాధితుల క్షోభ వర్ణనాతీతం!

పని కుడి చేతితో చేసి నంత పద్ధతిగా ఎడమ చేత్తో చేయలేం. పురచేతి వాటం వున్న వాళ్ళ విషయం వేరు. రెండు చేతులతో సమానంగా పనులు నిర్వహించగల్గిన వాడిని సవ్యసాచి అంటారు. కష్టసుఖాలను రెండు చేతులతో చక్కబెట్టగల్గితే ఆ తీరే వేరు! అలాంటి స్థితిని 'స్థితప్రజ్ఞత' అంటాం! నేటి సామాజిక, ఆర్థిక, మానవ సంబంధాల నేపథ్యంలో స్థిత ప్రజ్ఞత సాధ్యమా అనిపిస్తుంది. మనిషికి ఏదీ అసాధ్యం కాదు. సాధారణంగా స్థిత ప్రజ్ఞతను ఆధ్యాత్మిక కోణంలో దర్శిస్తాం. లౌకిక వ్యవహారాలలోనూ దానికి ప్రాధాన్యం వుంటుంది. ఆధ్యాత్మికం 'మోజు' తీరాక వదిలేసే వ్యాపకం కాదు! ఆ సత్యాన్ని గ్రహించి కార్యదక్షత ప్రదర్శించి మనిషి దైవోన్ముఖుడు కావాలి.

సమస్యలు మనుషులకే కాదు జంతువులకు, జలచరాలకు, ఖేచరాలకూ వస్తాయి. సమస్య తీరితే సరి; లేదా అవి దానికి బలైపోతాయి. సాధారణంగా ప్రకృతి నుంచి కాక మనుషుల నుండే వాటికి చిక్కులు సంప్రాప్తించడం విశేషం!

పట్టుపడితే కడ దాకా కృషి కొనసాగించగల సత్తా మనిషికే వుంటుంది. మనిషి ప్రకృతిపై, దానిలో అంతర్భాగంగా జీవించే సకల ప్రాణులపై ఆధిపత్యం కల్గి ఉండటం వల్ల అతడి ప్రవర్తనతో ప్రకృతి సమతౌల్యం దెబ్బ తినడం చూస్తాం! ప్రకృతి న్యాయాల వర్తింపు వల్ల మనిషికి ఒక నాడు ప్రీతికరమైన ఓ అంశం మరొక నాటికి విసుగు జనింపజేసేదవుతుంది. ఆ విసుగు ఐహిక విషయాలకు పరిమితమైతే విషయం వేరుగానీ ఆధ్యాత్మికానికి విస్తరిస్తే బ్రతుకు నిస్సారమవుతుంది. భగవద్భక్తి విసుగు జనించవలసిన విషయం కాకూడదు. సూర్యచంద్రులు, నక్షత్రాలు విరామం లేకుండా తమ భ్రమణాన్ని కొనసాగిస్తాయి. అందులో లోక సంక్షేమం ఉంది. ఆహార పానీయాలు మానటం ఎలా సాధ్యంకాదో అలాగే ప్రకృతి వ్యాపకాలూ పునరావృతం కాక మానవు. పదార్థాల విషయంలో రుచి మార్పు చేసి పండుకొని హితంగా భోం చేస్తాం. దైవం సృజించిన షడ్రుచుల పరమార్థం అదే! మిశ్రణం చేస్తూ కొత్త రుచులు సృజించి మనిషి ఆనందాన్ని విస్తరించుకోవడం చూస్తాం. ఆధ్యాత్మిక వ్యాపకంలోనూ మనిషి నేర్పుతో, ఓర్పుతో దైవాభిరుచి పెంచుకొనవలసిన అవసరం ఎంతైనా వుంది.

పసిబిడ్డకు పరిశీలనా శక్తి ఎక్కువ! కనిపించే ప్రతి వస్తువునూ నిశితంగా తర్జనితో తాకి పరిశీలిస్తుంది. నోట్లో పెట్టుకొనే ప్రయత్నం చేస్తుంది. నిజ భక్తుడు కూడా కనిపించే ప్రతి జీవరాశిలోనూ భగవదంశ దర్శించేందుకు ప్రయత్నిస్తూ ఆ విశేష అనుభవ సాకారానికి తన ప్రయత్న లోపం లేకుండా పరమాత్మ దివ్య నామాన్ని ఎదలో ప్రతిష్టించుకొని చరితార్థుడు కావాలి.

ఐహిక విషయాల అనురక్తిని 'మోజు' అని పిలిచినా ఆధ్యాత్మిక దివ్య వ్యాపకాన్ని ఆ పదానికీ, ఆ అర్థానికీ పరిమితం చేయలేం! భగవంతుడిపై మనిషి వ్యక్తం చేసే దివ్య ప్రేమను 'భక్తి' అంటాం. లౌకిక విషయాల మోజు తీర్చుకుంటే తీరేది. భక్తి 'అనుసరించే' కొద్దీ అధికరించేది. పరమాత్మ దివ్యచరణాల మ్రోల అస్తిత్వం కొరకు భక్తుడి మనసు పరితాపం చెందుతుంది. తీవ్ర తపస్సుగా పరిణతి చెందుతుంది. విష్ణు లీలలు వినే కొద్దీ ఆధ్యాత్మిక దాహం తీరుతూ కామదాహం నశిస్తుందని శుక భగవానుడు పరీక్షిత్తుకు చెప్పడం విశేషం! లౌకిక అందాలు

కాముకులకు మోజును పెంచుతాయి. దైవమే లక్ష్యంగా, పరమార్ధంగా దివ్య ప్రేమను అనుభవిస్తున్న పరమ భాగవతోత్తముల ప్రేమదాహం ఎన్నటికీ తీరేది కాదు.

జీవితం అశాశ్వతం! ఎప్పుడైనా మృత్యువు ముంచుకురావచ్చు. అస్తిత్వాన్ని కబళించవచ్చు. వయసు మీరిన వాడా, ప్రాయంలోని వాడా అన్న తేడా యమపాశానికి ఉండదు! లౌకిక వ్యవహారాలలో మోజును కాక భగవంతుడిపై ప్రేమను పెంచుకొనే భక్తుడు అమరభక్తి భావనామృతఝరిలో మునిగి పరమపావనుడయినప్పుడే అతడికి భవసాగరం నుంచి 'విముక్తి' అంటాడు శుక మహర్షి. *

# 7. 'స్వయం సహాయం'

కష్టసుఖాల్లో ఇతరుల అనుభవాలు పంచుకొని వారితో మానసికంగా మమేకం కావడం, తదనుగుణమైన ఓదార్పు వ్యక్తం చేయడాన్ని 'సానుభూతి' అంటాం. కానీ ఇతరుల కష్టకాలంలో ఏవో నాలుగు మంచి మాటలు చెప్పి ఊరడించడం వరకే నేటి సానుభూతి పరిమితమౌతోంది. ఈర్ష్యలేకుండా ఒకరి 'మంచి'లో భాగస్వాములమైతే మనకూ ఆనందం కల్గుతుంది. పంచుకుంటే పలుచబారేది దుఃఖం! అలాచేస్తే ఓ మనిషిని ఊరడించి మంచి పనిచేసిన సంతృప్తి మనకు మిగులుతుంది. ఆధ్యాత్మికంగా అందరిలోని ఆత్మ అభిన్నమైనది కాబట్టి ఎదుటివారు, మనం వేరువేరుకాని దివ్యాత్మలమని అర్థం చేసుకోవాలి. పరులకు సాయం చేయడంలో ఎంతో పరమార్థం వుంది. అయితే మనకు మనమూ సాయం చేసుకోవడం ఆధ్యాత్మిక ప్రగతికి అవసరమవుతుంది. భగవాన్ రమణమహర్షి, రామకృష్ణ పరమహంస కాన్సర్ వ్రణంతో బాధపడుతూ కూడ తమ శరీర బాధను తమదిగా భావించలేదు. వారు తమపై తాము సానుభూతి చూపుకోలేదు. మానవ సంస్కృతిలో స్వీయ బాధలను సహనంతో భరించడం ఉత్కృష్ట అంశంగా భావించబడింది. ఎదుటివారు కష్టాలపాలు కాకూడదన్నది మానవ సమాజ సహజ ఆకాంక్షగా భాసిల్లడం విశేషాంశం! తమ కష్టాలను 'సహించడం' వల్ల తమపై తాము సానుభూతి చూపుకోవడమనే అంశం ప్రాధాన్యతను కోల్పోవడం మనం చూస్తాం!

'సానుభూతి' విశేషపదమైనా ఒక వ్యక్తి తనపై తాను సానుభూతి చూపుకోవడం జాలిగొలిపే అంశమే! వ్యక్తిగత సానుభూతిలో పరమార్థం ఉండకపోవచ్చును గానీ సమాజంలోని ఆర్తులు, దుఃఖితులపై సానుభూతి

చూపడం సత్ఫలితాలకు వేదిక అవుతుంది. ఈ సందర్భంగా 'సహాయం' వహించే పాత్ర చెప్పుకోవలసి వుంది. ఆర్థికంగా, మానసికంగా ఒకరికి చేతనైన తోడ్పాటు అందించడం 'సహాయం'! సానుభూతి మానసిక ప్రాధాన్యత కల్గివుండగా 'సహాయం' భౌతిక వస్తువుల త్యాగంతో ముడిపడి వుంటుంది. తమకున్న దానిలో 'కొంత' ఇతరులకు దానం చేయడం ముదావహమైన వ్యాపకం! మంచి మనసుతో 'కోల్పోతున్నా'మన్న భావన లేకుండా 'తన' వారుగా పరిగణించి పరులకు తోడ్పడటంలో పెద్ద ప్రయోజనమే ఇమిడివుంది. సమస్తలోకాల సుఖీభావన సనాతన ధర్మ వైశిష్ట్యంగా పరిగణించబడింది. లోకకల్యాణ భావన ఆధారంగానే పరహితం కోరడం ఆనవాయితీ. ఇతరులకు సహాయం చేయడం గొప్పదేగానీ తనకు తాను సహాయం చేసుకొనే సందర్భం కూడ మనిషికి కల్గుతుంటుంది. సమాజంలో కొందరు ఉన్నతస్థితిలో వుండి కూడా దుఃఖితులవుతారు. ఎవరికైనా కోల్పోవడమనే సంఘటన మానసికంగా గానీ భౌతికంగా గానీ జరగవచ్చు. ఆత్మోన్నతి సాధించడం స్వీయ సహాయం వల్లనే సమకూరే విశేషాంశమని మరువకూడదు. ఆత్మవిశ్వాసం అన్ని అవరోధాలనూ అధిగమించగల మహత్తర శక్తి. అది కోల్పోయిన మరుక్షణం చేతనైన పనులు కూడ మనిషి చేయలేకపోతాడు. మానసికంగా అల్పభావన పొందుతాడు. అదోదయనీయమైన స్థితి. అలాంటి స్థితిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకొనే అవసరం మనిషికి ఎంతైనా వుంది. అర్జునుడు విషాదంలో కూరుకుపోయి సామాన్యమానవుడిలా పిరికితనంతో ప్రవర్తించిన వేళ శ్రీకృష్ణభగవానుడు అర్జునుడిలో ధైర్యం నూరిపోసి నూతన సమరోత్సాహాన్ని నింపాడు. అది దైవం ఎదురుగా వుండి అర్జునుని నడిపించిన మహత్తర సన్నివేశం. ఆధునిక కాలంలో అలాంటి సందర్భం అరుదు కాబట్టి ఎవరికి వారు తమ తమ ఆత్మబలాన్ని పెంచుకొని ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేసుకోవడంలో శ్రద్ధ వహించాలి. తనకు తాను సహకరించుకోలేని వ్యక్తి తనను తాను ఉద్ధరించుకోలేడు. అలాంటి వారికి పరిహితంకోసం పాటుపడగల సామర్థ్యం వుండదు. స్వీయసహాయం చేసుకోగల ధీశక్తి ఆత్మవిశ్వాసం వల్లనే కల్గుతుంది. ఆత్మవిశ్వాసం దైవ విశ్వాసం వల్లనే సాధ్యం. దైవ విశ్వాసం భక్తి

వల్లనే లభ్యమౌతుంది. తన మంచి, సమాజం మంచి కోసం సాధకుడు భక్తియోగాన్ని ఆశ్రయిస్తాడు. భౌతిక సంపదకు సంబంధించి 'ఉన్నది' అన్న పదంలో ఎన్నో సానుకూల ప్రకంపనలు ఉండగా ఆధ్యాత్మిక విషయంలో వేరుగా చెప్పనవసరం లేదు. దైవం ఉనికికి సంబంధించి ఆశీర్వాదపూర్వక అస్తిత్వ భావన మనిషిలో ఎనలేని ఉత్సాహాన్ని నింపుతుంది. సాధనతో ప్రాప్తించే ఆధ్యాత్మిక శక్తివల్ల మనిషి తేజోపూర్ణుడౌతాడు. కష్టసుఖాలను సమభావనతో స్వీకరించగల మహత్తరశక్తిని అతడు కైవసం చేసుకుంటాడు. అలాంటి స్థితిలోనే సాధకుడు తనను తాను ఉద్ధరించుకొని సమాజాన్ని సైతం ఉద్ధరించగల శక్తికి పాత్రుడౌతాడు. ❋

# 8. భగవత్తత్వం

భగవత్తత్వం మహోన్నతమైనది. దివ్యమైనది. భవ్యమైనది. పవిత్రమైనది. సంక్లిష్టమైనది. సరళమైనది కూడ!

మహామహులైన రుషీశ్వరులు నిరాహారులై వాయు భక్షణం చేస్తూ నిరంతరం భగవదన్వేషణ చేయగా బాలభక్తులయిన ప్రహ్లాదుడు, ధృవుడు, మార్కండేయుడు తమ చిన్ని చేతలతో, చేష్టలతో సరళ నిరంతర సాధనతో పరమాత్మను దర్శించారు. ఆ సాధన అంత సులభం కాకపోయినా మనసా, వాచా, కర్మణా అత్యంత సులభుడని నమ్మిన భక్తాగ్రేసరులకు దైవం సులభసాధ్యుడే అయ్యాడు. చూచే దృష్టిననుసరించి తన తత్వాన్ని కుదిస్తూ, పెంచుతూ పరివర్తన చేసే అస్తిత్వకారుడు భగవంతుడు. కన్నుకు కన్నే 'మందు' అని భావించిన కన్నప్పకు అదే నిజమని భావింపజేయగా భక్తశబరికి తను రుచి చూసిన ఎంగిలి పండ్లను శ్రీ రామచంద్రమూర్తికి సమర్పించడంలోనే ఔచిత్యం స్ఫురింపజేశాడు. ఒకపరి మరుగుజ్జుగా వామనమూర్తియై బలిచక్రవర్తి ముందు సాక్షాత్కరించిన స్వామి అనంతరం భూనభోంతరాళాలకు విస్తరించి విశ్వపరివ్యాప్తమైన స్థితి తనదని చెప్పకయే చెప్పినట్లు నిరూపణ చేశాడు.

దృష్టిననుసరించి భావం స్ఫురిస్తుంది. భావాన్ననుసరించి దృష్టీ మారుతుంది. రుతువులననుసరించి పంచభూతాలతో మనిషి అనుభవాలు, అనుబంధాలు మారుతాయి. తమ నెలవులు తారుమారయితే మిత్రులు సైతం శత్రువులౌతారు. శత్రువులు సన్నిహితులౌతారు. తీవ్ర వేసవిలో భానుడి మహోగ్రప్రతాపంతో తపించిన ప్రాణులకు వర్షరుతువు చల్లని చినుకును ప్రసవిస్తే తనూల్లాసం కలుగుతుంది. సహస్ర కిరణుడు శ్రావణ భాద్రపద మాసాల్లో ప్రజలు హర్షించే ప్రసన్నమూర్తి అవుతాడు. వణికించే చలిలో భానూదయం హాయైన

వెచ్చని సుఖ స్పర్శనందిస్తుంది. దైవం తన అమృత స్పర్శ చేత ప్రాణికోటికి జన్మనిచ్చి పోషణ చేస్తాడు. లయకారుడై తనలో లీనం చేసుకుంటాడు.

అనుభవిస్తున్న సమస్త భౌతిక ఆవిష్కరణలూ మనిషి తను సృజించుకున్నవే. ఆవిష్కరణలన్నీ ప్రకృతి తత్వానికి అనుగుణంగా భగవత్తత్వాన్ననుసరించి ఉంటాయి. ఓ శాస్త్రజ్ఞుడుగా నిజం నిరూపితమయ్యేదాకా వస్తువులో భగవత్తత్వముందని మనిషి అంగీకరించకపోవచ్చు. శీతలతత్వాన్ని అనుసరించి ఓ శీతలీకరణ యంత్రం, ఉష్ణతత్వాన్ని అనుసరించి ఓ ఉష్ణోపకరణం, వేగతత్వాన్ని అనుసరించి ఓ పంఖా, ఓ రవాణా సాధనం శాస్త్రజ్ఞుడుగా మనిషి సృష్టించుకున్నాడు. అందుకు అవసరమైన సంకల్పాన్ని, ప్రేరణనూ మనిషి ప్రకృతి నుంచే అందుకొనడం విశేషం! ప్రకృతి భగవత్తత్వానికి భిన్నం కాదు. మానవుడు కనుగొనే ప్రతి ఉపకరణం ప్రకృతికి నకలుగా నిలుస్తుంది.

దైవం ఉనికి గురించిన సందేహం ఒక్కోసారి మనిషిలో బలంగా అంకురిస్తుంది. ఆ ప్రతికూల భావనలోని ఔచిత్యం అర్థం చేసుకొనేలోగా ప్రకృతిలో వింతలు జరుగుతుంటాయి. ఓ జననం, ఓ మరణం ఆస్తికుడిలో మానవాతీతశక్తి అస్తిత్వపు దాఖలా స్ఫురింపజేయగా ఓ నిరీశ్వరవాది ఆలోచనలో హేతుబద్ధమైన పోకడ కనిపిస్తుంది. మనిషి దేహం చాలించాక దానినో దైవ ఘటనగా నమ్ముతాం. మరణానంతర పరిణామాలు మనిషి ప్రజ్ఞకు అందకపోవడం దివ్యత్వంలోని సంక్లిష్టతకు నిదర్శనం.

'చేసుకున్నవారికి చేసుకున్నంత' అంటారు కర్మయోగులు. నమ్మిన వారికి నమ్మినంతగా దైవం బోధపడతాడన్నదీ వాస్తవమే! కాగా కొందరికి తమ జీవితానుభవాలు భగవన్నిరూపణకు తోడ్పడగా మరికొందరికి ఆ భాగ్యం వుండదు. మెరుపు మెరిసేది క్షణకాలమే! క్షణం దాటాక కనబడకపోయినా మెరుపు ఉనికిని లేదనలేం! నిశితంగా పరిశీలిస్తే ప్రతి జీవితానుభవంలోనూ దైవ నిరూపణ జరుగుతుంది. దైవాన్ని బ్రహ్మాండ నాయకుడిగానూ పరమాణుస్వరూపుడుగా సైతం అనుభూతి చెందిన రుషీశ్వరులు ధన్యులు. ఆ అనుభూతులు కూడ జగన్నాథుడి కృప వల్లే కల్గుతాయన్న మహా సత్యాన్ని సాధకుడు తెలుసుకోవలసి వుంది. ❋

# 9. మనసు - శరీరం

మానవుడి పూర్ణాయుర్దాయం నూరేళ్ళుగా చెబుతారు. నేటి కాలుష్య ప్రపంచంలోనూ అక్కడక్కడా శతమానం ఆరోగ్యంగా బతికేవారు కనిపిస్తారు. అలా జరగడం ఆయా వ్యక్తులు మానసిక శరీర ఆరోగ్యాలపై చూపే శ్రద్ధవలన కావచ్చు; జన్యుకారణాలవల్ల కావచ్చు.

శరీరం ఓ మంచి మనసున్న సహృదయుడి వంటిది. తనను సరిగా చూచుకున్న వారికి ఎంతో సహకరించి ఆయురారోగ్యాలు పంచుతుంది. చెడు తిళ్ళు తింటూ శరీరాన్ని ఓ చెత్తబుట్ట స్థాయికి దిగజార్చే వారికి కూడ దేహవ్యవస్థ సహకరించిన మేరకు సహకరించి అనర్థాల నుండి రక్షణ కల్పిస్తుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు రోగనిరోధకవ్యవస్థ తోడ్పడుతుంది. ఆ వ్యవస్థ నిర్వీర్యం కానంతవరకు ఆరోగ్యం కోసం శరీరం చేసే ప్రయత్నం సఫలీకృతమౌతూనే వుంటుంది. మనసు, శరీరం మేలు కలయికతో దైనందిన వ్యాపకాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి.

ఆహారం లేకుండా మనిషి 21 రోజులు జీవిస్తాడు. నీరులేకుండా 8-10 రోజులు జీవించే అవకాశం వుంది. ప్రాణవాయువు లేకుండా 3 నిముషాలపాటు శరీరం మనగల్గుతుంది (ఈ వివరాలు సమాచారం కోసం మాత్రమే!). ఇంత మహోన్నతమైన దేహాన్ని దైవం ప్రాణికోటికి కానుకగా ఇచ్చాడు. తగు ప్రాధాన్యత మనిషి దేహానికివ్వవలసి వుంది. ఆకలికి పోషకాహారం, దాహానికి స్వచ్ఛజలం, ప్రాణం నిల్పుకోడానికి ప్రాణవాయువు మనిషి అందించవలసి వుంది. శరీరం, రుజాగ్రస్థం కాకుండా ఎన్నో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తుంది. అలా కొనసాగినంతకాలం ప్రాణం నిల్చివుంటుంది. తదనంతరమే దేహపతనం జరుగుతుంది. దేహవ్యవస్థ జడం కాదు. చైతన్యానికి ఆధారభూతం మనసు.

శరీర ఆరోగ్యంతోపాటు మనిషి మనసును సైతం పవిత్రంగా ఉంచుకోవలసి వుంది. ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యవంతమైన మనసు వుంటుంది. ఆరోగ్యమైన మనసుతో సాగే సాధన సత్ఫలితాలనిస్తుంది. యోగ మార్గం ద్వారా మనసును, శరీరాన్ని ఆరోగ్యంగా, నిర్మలంగా ఉంచుకోవచ్చని యోగశాస్త్రం చెబుతుంది.

శరీరానికి కొన్ని ధర్మాలు, అవస్థలు ఉన్నాయి. బాల్య యౌవన గృహస్థ వాన ప్రస్థాలు ఆశ్రమధర్మాలు. చేతనాపరంగా జాగ్రత్ స్వప్న సుషుప్త్యావస్థలు అవస్థాత్రయంగా చెప్పబడింది. దేహం 'ఇలాంటి స్థితిలో ఈ విధంగా స్పందిస్తుంది' అన్నది దేహధర్మం. సాధారణంగా శీతోష్ణస్థితులు, గాలి, నీరు, ఆహారం వంటి అంశాలపరంగా మనశ్శరీరాలు స్పందిస్తాయి. ఏ విషయంలోనైనా మితం హితకరం! శరీరం, మనసు మితమైన అనుభవాల వల్ల నియంత్రణలో ఉంటాయి. ఆహార పానీయాల మితత్వం శరీరారోగ్యాన్ని ప్రవర్థిల్లజేస్తుంది. వాచాలత లేకుండా మౌనానికి తగిన ప్రాధాన్యం ఇచ్చినపుడు మనసు స్థిరంగా వుంటుంది. దృశ్య ప్రపంచంలో అపరిమితంగా దొరికే వస్తువులకు ఆదరణ తక్కువ! అలాగే సమాజంలో వాచాలుడికి గౌరవం ఉండదు. ప్రాచీన ఋషులు మౌనవ్రతానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు. అతిగా సాగే సుఖాల వల్ల మనశ్శరీరాలకు ఒనగూడే ప్రయోజనం కన్నా కీడే ఎక్కువ. విషయ లౌల్యం వల్ల వ్యక్తి పతనావస్థకు చేరుకుంటాడు.

ఈ మధ్యకాలంలో నగరాలు, గ్రామాల పరిశుభ్రతకు పెద్దపీట వేయడం జరుగుతోంది. శుభ్రత పాటించడం వల్ల మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బాహ్య శౌచంతోపాటు అంతశ్శౌచం కూడ అవసరమే. నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరిస్తుందని సామెత. ఇది కపట స్వభావులకు వర్తిస్తుంది. కాపట్యం, వంచన, టక్కుటమారప్రవర్తన వల్ల ఎదుటి వ్యక్తిపై ఆధిపత్యం సంపాదించినా అది స్వల్పకాలానికే పరిమితమౌతుంది. అలాంటి దుష్టుల మనసు, శరీరం రెండూ కలుషితమై తగిన ఫలితం అనుభవించవలసిన దుర్గతి పడుతుంది. స్వచ్ఛ మనసు సాధన చేసే ప్రయత్నశీలురికి శరీరారోగ్యం అరచేతిలో ఉసిరిక

ఫలమే! ఆధ్యాత్మిక కోణంలో వారి జీవనయాత్ర అప్రతిహతంగా కొనసాగుతుంది. తదనంతర ఫలంగా వారు పొందే ఆనందం ఇంత అని చెప్పలేనిది. ప్రేమ, ధర్మాచరణ, అహింసా వ్రతం వల్ల ప్రపంచంలో తమకు సాటి తాముగా పేరుతెచ్చుకుంటారు. ధవళకాంతులతో మెరిసిపోయే వస్త్ర విశేషంలా వారి బ్రతుకులు ఆయురారోగ్యాలతో ప్రవర్ధిల్లుతాయి. వారి మనీషత్వం ప్రపంచానికి ఆదర్శనీయమవుతుంది. ❋

# 10. ఆనందం ఎక్కడ?

'ఆనందం!' ఆ పదంలోనే ఏదో తెలియని మాధుర్యం వుంది. భగవంతుడి సన్నిధి ఆనంద నిలయం. ఆ వారసత్వ సంపద పుణికిపుచ్చుకున్న వారి (భక్తుల) సాహచర్యంలోనూ ఆనందం లభిస్తుంది. ఆనందం ఎక్కడపడితే అక్కడ లభించే వస్తువు కాదు. దాని అన్వేషణలో నిజాయితీ వుండాలి. పట్టువిడుపుల గుణం వుండాలి. గొంతెమ్మకోరికలు ఆనందాన్ని దూరం చేస్తాయి. పెరటిమొక్కలా అది మనిషి అంతరంగంలోనే ఉంటుంది. ఐతే అది వేసుకున్న మేలి ముసుగును సున్నితంగా తొలగించినపుడే దాని ఉనికి సాక్షాత్కరిస్తుంది.

పూర్వం సుజనవర్మ అనే చిన్న రైతు ఓ ఊరిలో నివశిస్తుండేవాడు. తలలో నాలుకలా మెలిగే అతడంతే ఊరివారందరికీ ప్రాణం. అతడికి ఎన్నడూ కోపం రాదు. ఉద్రేకం చెందదు. ఎవరన్నా మంచి అభిప్రాయమే వుండేదతడికి. తనను విమర్శించే వారిని సైతం ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు. అతడికి సాదాసీదా జీవనం యిష్టం! విలాసాలు, ఖరీదైన జీవితం అతడికి నచ్చేవి కాదు. ఎవరిని గురించీ చెడుగా మాట్లాడేవాడు కాదు. కష్టసుఖాలను సమంగా స్వీకరించే స్వభావమతడిది. అతడి ముఖంపై చెరగని చిర్నవ్వు ఎప్పుడూ లాస్యం చేస్తుండేది. అదే గ్రామంలోని విక్రమ సింహుడు మరో రైతు. సుజనవర్మ ఆనంద రహస్యం తెల్సుకోవాలనుకున్నాడు. సుజనవర్మకు అంత ఆనందమెలా లభ్యమవుతుందో తెలియని విక్రమసింహుడు ఒకరోజు ఉండబట్టలేక సుజనవర్మ దగ్గరకెళ్ళి అతడి ఆనంద రహస్యం అడిగాడు. సుజనుడు చిర్నవ్వుతో, నా దగ్గర ఎలాంటి రహస్యాలూ లేవు. నాతత్వం పదుగురికి ఉపకరించేది. నాక్కూడా మేలు చేసేది. నాకు గొప్పగొప్ప ఆశలు లేవు. ఉన్నంతలో తృప్తిపడతాను. నాక్కూడా మొదట్లో

కోపతాపాలు వుండేవి. వాటిని క్రమంగా నియంత్రించుకోవడం అలవరుచుకున్నాను. సాదాసీదా జీవితం ఇష్టపడే నావద్ద సంపద పోగుపడలేదు. భౌతిక సంపదలేకపోవడంతో ఎవరో నా నుంచి లాక్కుంటారనే భయం దూరమైంది. నన్ను ఎవరైనా ద్వేషిస్తే బాధ కల్గుతుంది కదా! అందుకే అందరితో ప్రేమగా వుంటూ ఎవరికీ బాధకలక్కుండా జీవితం గడపడం అలవాటు చేసుకున్నాను. నాకున్న దాంట్లో చేయి చాపిన వారికి యింత పెడుతూ ఇవ్వడంలోని హాయిని అనుభవిస్తుంటాను. నా ఆనందానికి ఇంతకన్నా గొప్పకారణం ఏదీ లేదు. అదే నా ఆనంద రహస్యం! అంటూ సుజనుడు ముగించాడు.

విక్రముడికి సుజనవర్మ ఎందుకు ఆనందంగా ఉండగల్గుతాడో తెలిశాక తనూ అలా ఉండేందుకు సాధన చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆరునెలల్లో వారు వీరవుతారని నానుడి. విక్రముడు సుజనుడితో స్నేహం చేసి ఆరు నెలలు గడిచేసరికి ఆనందాన్ని సొంతం చేసుకున్నాడు.

ఆనందం బయటదొరికే వస్తువుకాదు. ఒక వాహనంలో, నివాస గృహంలో, ఆభరణంలో, నిధిలో ఆనందం వుంటే అవి వున్న వారందరూ ఎంతో ఆనందం పొందుతూ వుండాలి. నిజానికి సంపూర్ణ ఆనందంతో ఏ వ్యక్తీ కనిపించడం చూడం!

భగవంతుడి సృష్టి ద్వంద్వాల సమాహారం! భౌతిక సంపదలో నిజమైన ఆనందం ఉండదు కాబట్టే మనుష్యులందరికీ పరమాత్మ వస్తు సంపదను సమానంగా పుష్కలంగా ఇవ్వలేదేమో! ఆనందం మానసిక పరిపక్వత వల్ల లభించేది కాబట్టి మంచి మనసున్న మనుషులందరూ ఆనందప్రాప్తికోసం ప్రయత్నిస్తే అది తప్పక లభిస్తుంది. మనసును నియంత్రించే సాధన వల్ల సమకూరగల ఆనందాన్ని సొంతం చేసుకోవడానికి ఎవరైనా అర్హులే! ఆనందం ఓ సాంక్రమిక వ్యాధివంటిది. ఐతే ఆనందం వ్యాధి వలె బాధించేది కాదు. తేలిగ్గా విస్తరించే స్వభావం కలది. అగరుబత్తీల మధురమైన పరిమళంలా మనసును ఆనందం ఆవరిస్తుంది. హాయిగా, ఆనందంగా వుండే వ్యక్తిని

కలిసినపుడు మనకూ ఆనందం కలగడం యాదృచ్ఛికం కాదు. అది ఆనందం స్వభావం! 'నేను ఆనందంగా వున్నాను' అన్న భావన ఆనంద ప్రాప్తికి ప్రథమ సోపానం. ఆనందం కోసం సాధన చేసే ఎవరైనా దానిని పొందుతారు. కావలసింది మనసును అది అందుకొనేందుకు పరిపూర్ణంగా సిద్ధం చేయడమే! మనమూ ప్రయత్నిద్దాం! ❋

# 11. అహంకారం

తలలు పట్టుకు కూర్చున్నా పరిష్కారం దొరకని సమస్యలకు ఓ చిన్న ఉపాయం ద్వారా పరిష్కారం లభించవచ్చు. మేధోమధనం వల్ల తేలని ఓ వివాదం ఓ బంట్రోతు సలహా వల్ల పరిష్కారదిశగా మరలవచ్చు. ఐతే పొంచి వుండే ఓ ప్రమాదమేమంటే పరిష్కారం సూచించినవాడు ఓ బంట్రోతు అనే తేలిక భావం మేధావుల మదిలో మెదిలితే పరిష్కారం లభించదు సరికదా మానవతా విలువలు మంట కలుస్తాయి. ఏ పేరుతో పిలిచినా గులాబీ పువ్వు అంతే పరిమళాన్ని వెదజల్లుతుంది. పరిష్కారం సూచించినవాడు మేధావి ఐనా బంట్రోతు ఐనా తేడా పేర్లోనే గానీ అనుగమించే లాభం మాత్రం ఒక్కటే!

ఎవరైనా ప్రతిభ ప్రదర్శిస్తే ప్రశంసగా ఓ మాట మహత్తర పరిణామాలకు నాందీ అవుతుంది. ఓ విద్యార్థి మంచి మార్కులు సంపాదిస్తే తల్లిదండ్రులు, గురువుల అభినందన అతడిలో అమోఘ ప్రేరణ కల్గించి మరిన్ని విజయాలకు బాటవేస్తుంది. ఒక కుటుంబంలో, ఓ కార్యాలయంలో ప్రతిభ చూపిన వారిని అభినందిస్తే పోయేదేం లేదు... పాత్రులైన వారిలో ప్రతిభ ఇంకా ఇంకా వెలికి వస్తుంది. ప్రశంస అందించని సందర్భాల్లో అసూయ, అహంకారాల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నది కఠోర వాస్తవం. అనాది నుంచీ మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య దురహంకారమే! ఆత్మవిశ్వాసం తగినంత ఉంటే దానిని ఆత్మాభిమానం అనవచ్చు. శృతిమించితే అది దురహంకారమౌతుంది. అహంకారం వల్ల ఎవరైనా లాభపడిన దాఖలా చరిత్రలో కనబడదు. ఒక దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కంసుడు, శిశుపాలుడు, రావణుడు కారణమేదైనా, ఎవరైనా దురహంకారం వల్ల నశించినవారే!

అహంకారపూరిత ధోరణి వల్ల వ్యక్తికి నియంతృత్వ పోకడలు

అలవడతాయి. నియంతకు అధికారం, అజమాయిషీ మినహా ఇతర వ్యాపకాలు రుచించవు. దురహంకారికి 'తన'వారు సైతం కాలగతిన శత్రువులుగా మిగులుతారు. ఒక వ్యక్తిలో రాజసం ఉండొచ్చు. నాయకత్వ లక్షణాలు, ప్రతిభ ఉండవచ్చు. సృష్టిలో ఏ గుణం అధికంగా వున్నా అది లోకోపకారం నిమిత్తం వాడినంతకాలం ప్రశంసలు పొందుతూనే వుంటుంది. లోకశ్రేయం నశించి అంతా తన గొప్పతనమే అని భావించినపుడు వ్యక్తిత్వం కుదేలవటం ఖాయం. దురహంకారిగా మారిన ఏ నేత ఐనా అనతికాలంలో ప్రజాభిమానాన్ని కోల్పోతాడు. దురహంకారి ఐన కళాకారుడు ప్రజలను తన కళతో మెప్పించగల శక్తిని కోల్పోతాడు. ప్రజలు అతడి కళాభినివేశాన్ని మాత్రమే కాక వ్యక్తిగత జీవితాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటారని మరువకూడదు.

అహంకారి ఎవరి మనస్సునూ రంజిల్లజేయలేడు. ఎవరితోనూ సఖ్యత నెరపలేని అసమర్థుడుగా మారతాడు. 'అహం' మనసులోని ఒక పార్శ్వం. మనసు నిర్మలంగా ఉంచుకుంటే అహంకారమనే పొగ అంతః కరణాన్ని ఆవరించే అవకాశం వుండదు. కట్టెలు సాక్షికంగా దగ్ధమౌతున్నపుడు వాతావరణమంతా పొగతో కలుషితమైనట్లు అహంకారం మనసు నిర్మలత్వాన్ని దగ్ధం చేస్తున్న వేళ వ్యక్తికి మనశ్శాంతి కరువవుతుంది. శాపమే వరమయినట్లు మనశ్శాంతి దూరమౌతున్న వేళ వ్యక్తి అందుకు విరుగుడు ఆలోచిస్తాడు. చింతన వల్ల అతడికి నిష్కృతి మార్గాలు బోధపడతాయి. మనసును ఆవరించే అహంకారానికి విరుగుడు కరుణ, దయ, ప్రేమ అని అతడు తెల్సుకుంటాడు. భగభగ మండుతున్న హోమగుండంలో కళ్ళు మండించే పొగకు తావులేని విధంగా ప్రేమ నిండిన మనసులో చింతకు తావులేదు. చింతన ఆవిష్కృతమైన వేళ మనసులో చింతకు చోటుండదు. గయ, కాశీ వంటి పుణ్యక్షేత్రాలు సందర్శించే భక్తులు తాము అమితంగా ఇష్టపడే ఆహార పదార్థాలను దైవ ప్రీతి కోసం త్యజిస్తుంటారు. తీర్థ దర్శనం చేసే సాధకులు అహంకారాన్ని దైవార్పితం చేసి ఆదుర్గణం నుంచి విముక్తులు కావచ్చు. లౌకిక వ్యవహారాల్లో అహంకారం వల్ల మిత్రులు శత్రువులవుతారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో అహం మనసుకు కావలసిన శాంతిని

మింగివేస్తుంది. చిత్తశాంతి కోల్పోయిన మనిషికి బ్రతుకు భారమవుతుంది. మనసు స్వాధీనం తప్పుతుంది. ఐతే వేరెవరినో ఉద్ధరించడానికి కాకపోయినా అటు లౌకిక వ్యవహారాల్లోను, ఇటు పారలౌకిక విషయాల్లోనూ ప్రగతి సాధించడం కోసం మనిషి అహాన్ని పూర్తిగాచంపుకోనవసరం లేదు. అహం, ఆత్మగా దైవానికి ప్రతీకగా వెలుగులీనే మహాసత్యం. దురహంకారాన్ని రూపుమాపుకుంటే చాలు మనిషికి అనేక ప్రతికూల అంశాలనుండి నిష్కృతి లభిస్తుంది. ❋

# 12. ఊర్ధ్వ దృష్టి

దృష్టిపాతం శక్తివంతమైనది. సంకల్పాన్ని అనుసరించి దృష్టి వుంటుంది. శనీశ్వరుడు అధోదృష్టి కలిగినవాడుగా చెబుతారు. ఆయన సూటిగా దృష్టి కేంద్రాన్ని చూడడని ప్రతీతి. తను చూస్తున్న వారికి చెడు కలగరాదనే ఆకాంక్షతో ఆయన అధోదృష్టి కల్గివుంటాడన్నది శాస్త్రవచనం. సామాన్యుల విషయంలో ఊర్ధ్వదృష్టి వల్ల లౌకిక, ఆధ్యాత్మిక లాభాలు రెండూ కల్గుతాయని శాస్త్రాలు చెబుతాయి. ఊర్ధ్వలోకాలు దర్శించడం భౌతికంగా సాధ్యపడని విషయమే ఐనా దృష్టి కోణంలో ఊర్ధ్వ లక్ష్యాలు మనిషి కల్గి వుండటం వల్ల మేలు జరుగుతుంది. భగవదంశ వ్యక్తమయ్యే పుణ్యక్షేత్రాలు ఊర్ధ్వ లక్షణాలు కల్గివుంటాయి. మానవ కపాలంలో ఆజ్ఞాచక్ర స్థానంలో మనసు వుంటుందనే వారు రామకృష్ణపరమహంస. సంస్కారం పొందని మనసు దృష్టి అల్పమైన కామినీ కాంచనాల వైపు వుంటుందన్నది ఆయన బోధామృతసారం.

మనసుకు ఊర్ధ్వదృష్టి ప్రాప్తించడం ఉత్తమ సంస్కార లక్షణం. అది దూరదృష్టికి భిన్నమైనది. పారలౌకిక ఔన్నత్యాన్ని అందుకోవడమే దాని ప్రధాన లక్ష్యం. సత్పురుష సాంగత్యం వల్ల మిత్రలాభం, భగవదనుగ్రహం రెండూ సంప్రాప్తిస్తాయన్నది మనకు తెలిసిన సత్యం. సాధనలో భాగంగా అంతర్ముఖం కావడం సహజమైన విషయం. అంతర్ముఖుడై సాధకుడు ఆత్మను తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు. సాధన పండిన సత్పురుషుల విషయంలో ఆత్మజ్ఞానం లభించి ఆత్మ సాక్షాత్కారం కల్గుతుంది. ఇక్కడ 'ఒంటరి'గా సాధన చేయడం ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. మరి 'సత్‌సంగం' వల్ల ఏకాంత సాధన లక్ష్యం నెరవేరదు కదా! అన్న ప్రశ్నకు ఇక్కడ అవకాశం లేకపోలేదు. సమష్టిగా వుండి కూడ సాధకులు అంతర్ముఖులు కావడం వల్ల అనేక ఆత్మల సంగమం జరిగి సమష్టి లాభం సైతం కల్గుతుంది. వ్యక్తిగత ఉన్నత సంస్కారంలో భాగంగా ప్రేమ, సేవ,

కామినీకాంచనాల పరిత్యాగం ప్రధాన పాత్ర పోషిస్తాయి. సత్సంగులైన సాధకులు చేసే భజన, ధ్యానాది కార్యక్రమాలు ఉమ్మడిగా చేసినా లక్ష్యం ఒకటే కావడం వల్ల ఏకాంత సాధన వల్ల కలిగే సమస్త ప్రయోజనాలూ చేకూరుతాయి. ఆసరా అవసరమైన దీనులపై ప్రేమ, సేవాభావం వంటి ఉన్నత విలువల ప్రకటన వల్ల సాధకుడు ఊర్ధ్వదృష్టి సాధించిన ఫలితాలు పొందిన వాడవుతాడు.

మన ప్రాచీన యోగులు ఉత్తమ సంస్కార బలం కల్గివుండేవారు. పరిత్యాగ లక్షణం వారికి క్రియాబలంగా వుండేది. తానుమెచ్చిన, తనకు నచ్చిన లౌకిక కార్యకలాపాలను సాధకుడు పరిత్యజించినపుడు ఉత్తమ యోగి లక్షణాలు సంప్రాప్తిస్తాయి. స్వార్థ ప్రేమ, అహంకారం, కామాది అరిషడ్వర్గాలను అధిగమించడంతోపాటు మనిషి దానం రూపంలో ధనాన్ని వితరణ చేయడం సాధనలో భాగం కావాలి! తన వారిపై మమకారం, మోహం స్థానే ప్రేమ అంకురింపజేసుకొని దానిని పరులకు విస్తరించడం వల్ల సార్వజనీన ప్రేమ సాధించడమనే ఉన్నత లక్ష్యం సాకారమౌతుంది.

లౌకిక జగత్తులో గృహస్థుకు సంకల్పబలం వున్నప్పటికీ ఊర్ధ్వ అవలోకనాశక్తి ప్రదర్శించినపుడు మాత్రమే ఇంద్రియ విజయం వైపు అడుగు ముందుకు పడుతుంది. సాధన ప్రారంభంలో వస్తు ఆకర్షణ, విషయాకర్షణ అత్యంత బలంగా ఎదురుపడతాయి. ఆ ఆకర్షణలో కొంచెమైనా భగవంతుడి పట్ల లేకపోవడం జరిగితే సాధన తప్పక వైఫల్యపు ముసుగు తొడుక్కుంటుంది. స్త్రీ పట్ల పురుషుడికి, పురుషుడి పట్ల స్త్రీకి ఉండే సహజాకర్షణ భగవంతుడి యోగమాయాశక్తి ప్రభావమే అన్నది నిర్వివాదం. మాయాశక్తిని అధిగమించలేక పోవడం కూడ సహజమే కాబట్టి భగవదనుగ్రహంతో దానినధిగమించేందుకు సాధకుడు ప్రయత్నించాలి. సాధనలో భాగంగా ఉన్నత లక్ష్యాలు సాధించడం కోసం సాధకుడు చేసే పురుష ప్రయత్నంలో ఊర్ధ్వదృష్టి సాయపడుతుంది. సాంసారిక జీవితాకర్షణ, కామినీ కాంచనాల వ్యామోహం, మిక్కిలిగా ఆస్తులు కూడ బెట్టడం వంటి ఆసక్తిని అధిగమించి విశ్వ సౌభ్రాతృత్వ భావనతో ప్రేమను సాధించడం ఉన్నత మార్గ గమనానికి తోడ్పడుతుంది. ఆ దృష్టికోణంలో సాధకుడి పయనం అతడు నిర్దేశించుకొనే ఉన్నత ఆధ్యాత్మిక లక్ష్యాలను సాకారం చేస్తుంది. ❋

# 13. 'భయంలేని జీవితం'

ఈ సృష్టి సాధ్యాసాధ్యాల సమాహారం. చిత్రవిచిత్రాల సంగమం. నవరస భావాల ఉద్దీపనం. ఆనంద విషాదాల అపూర్వయోగం. ఎన్నో రసవద్భరిత ఘట్టాలు, భావాల మేళవింపు ఐన సృష్టికి ప్రతీకయే మానవజీవితం. మానవ జీవితంలో ఈ వైవిధ్య భావాల సంగమం అతడి ప్రాప్యత – అప్రాప్యతల ననుసరించే జరుగుతుంది. అదృష్టవంతులకు జీవితం షడ్రసోపేత విందులా, అభాగ్యులకు మింగుడుపడని వెలగపండులా ఉంటుంది. కొందరిని జీవితం ఆనంద డోలికల్లో తేలించగా మరి కొందరిని అనునిత్యం శోధిస్తుంది. కొందరిని ఉల్లాసభరిత ఊహల నౌకావిహారం చేయించగా కొందరిది సుడిగాలిలో చిక్కిన గాలిపటంలా భయకంపితం చేస్తుంది. ఇంతకీ జీవితం ఏమిటి? అన్నపుడు అదోవర్ణించవీలులేని, ఎవరిది వారికే ప్రత్యేకమైన అనుభవాల రాశిగా అర్ధమౌతుంది. ఆ రాశి మురిపించేది కావచ్చు, వెరపించేది కావచ్చు. భౌతిక ప్రపంచంలో మానవ జీవితం ఓ అంకం మాత్రమే! ఈ నేపద్యంలో ఎవరినైనా పలకరించే ఒక ప్రశ్న... ఇహంలో 'భయంలేని జీవితం' సాధ్యమా?! సమాధానం ఏమంటే భగవదనుగ్రహం లభించిన వారికి అది అసాధ్యమేమీకాదు.

వీధిలో యథాలాపంగా నడుస్తున్న ఓ బాటసారికి ఒక నడివయసు నిరుపేద స్త్రీ కనిపించింది. ఆ యింట ఈ యింట పాచిపన్లు చేస్తూ ఆలయాల్లో భక్తుల సహాయం పొందుతూ వుంటుంది. బాటసారికి ఆస్త్రీ యాచకురాలిగా పరిచయం. ఎప్పుడూ సంతోషంగా కనిపిస్తూ వినయం ప్రకటించేదామె. ఆరోజునా అలాగే కనబడిన ఆమెకు బాటసారి ఉదారంగా ధన సహాయం చేశాడు. వినమ్రంగా చూస్తూ దుర్గుణాలకు దూరంగా ఉండే ఆ నిర్ధనురాలంటే బాటసారికి ఎప్పుడూ ప్రసన్నతా భావం కలిగేది. భయంలేని జీవితం గడపటానికి సంపదతో పనిలేదని అతడికి అర్ధమయింది.

భగవంతుడు దృశ్య జగత్తంతటికీ యజమాని. మనదిగా మనం చెప్పుకునే సమస్తద్రవ్య సంపదకూ అధిపతి ఆయనే! కొంతకాలం అనుభవించాక స్థిరచరాస్థులు ఒకరి నుండి ఒకరికి బదిలీ అవుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఎవరికీ కాకుండా పోవడం సైతం సంభవిస్తుంది. భగవంతుడి ఖజానాలో భౌతిక పరిశీలన చేయనలవికాని అపారవస్తు సంపదకు మానవుడుగా జన్మించిన ప్రతి వ్యక్తీ అర్హుడే! ఎందుకంటే సృష్టికి తండ్రి దైవం గనుక. యజమానిగా దైవాన్ని సంతుష్టపరచినపుడు మనిషికి ఆ కనిపించే / కనిపించని సంపదలో భాగం లభిస్తుంది. తనపట్ల దైవం ప్రసన్నుడు కావటానికి అవసరమైన సదాచరణ, నిర్మల హృదయం, నిష్కామ – నిస్వార్థ భక్తిని సాధకుడుగా మనిషి సంతరించుకోవాలి.

ఆనందం వుంటే అన్నీ వున్నట్లే! కేవలం భౌతిక సంపద వల్ల ఆనందం లభిస్తుందనుకోవటం పొరబాటు! ఆ సత్యాన్ని గ్రహించినపుడే భక్తుడు దైవానుగ్రహానికి అర్హుడు కావటానికి కృషి చేస్తాడు. అనుగ్రహం పొందాక (భావ) దారిద్ర్యం తొలగిపోతుంది. కంటికి కనిపించని లోపలి శత్రువర్గం అతణ్ణి బాధించదు. భవసాగరం సానుకూలమౌతుంది. లోకానికి తన ప్రవర్తన వల్ల ఆనందం కల్గితే సాధకుడు అంతర్యామికి సైతం ఇష్టుడౌతాడు. అపుడు ఓ 'భయంలేని' అద్భుత ప్రపంచం అతడి ముందు ఆవిష్కృతమవుతుంది. సాధకుడి జీవితం భయంనీడపడని నిరుపమాన ఉపాధి అవుతుంది. అతడు సంసారసాగరపు ఆనందతీరం చేరుకుంటాడు. ఆధ్యాత్మిక పథంలో సాధకుడు వేసే ప్రతి అడుగూ దైవప్రాప్తికి దోహదం చేశాక తను సాధించవలసింది అంతకన్నా మరేమీ లేదని గ్రహించడానికి అతడికి ఎంతో సమయం పట్టదు. అపుడు 'భయంలేని జీవితం' అనుభవంలోకి రావటం అతడు గ్రహిస్తాడు. ❋

# 14. ఖ్యాతి

ఓ చరిత్రకారుడు, చిత్రకారుడు, సాహిత్యకారుడు, ఓ నటుడు, ఓ రాజకీయవేత్త... ఇలా రంగం ఏదైనా తమ కృషి వల్ల ఖ్యాతి నార్జిస్తారు కొందరు ఖ్యాతి సంపాదించడం ఒక ఎత్తయితే ఆ ఖ్యాతిని పదికాలాల పాటు పదిలంగా నిలుపుకోవలసిన వారి బాధ్యత మరొకెత్తు. అందలం ఎక్కిన వాడికి పడిపోతానేమోననే భయం ఉంటుందేమోగానీ కిందనున్న వాడికి ఆ భయం వుండదు. తమ తమ కృషి, ప్రతిభ వల్ల రాణించే గొప్పవారు తమ స్థానాలను పదిలపరచుకోవడంలో విఫలమైతే అపఖ్యాతి పాలవడం ఖాయం! అపఖ్యాతి భయం ప్రముఖులకే ఎక్కువ! సమాచార రంగం వృద్ధి చెందిన ఈరోజుల్లో అప్రతిష్ఠ వల్ల ప్రజల నోళ్ళలో నాని పతనావస్థకు చేరుకునే వారెందరో!

అపఖ్యాతి చాలా సున్నితమైనది. దాని పాలబడ్డవారికి ప్రజల్లోకి వెళ్ళడానికి ముఖం చెల్లదు. చాల సందర్భాల్లో ప్రముఖులు అప్రతిష్ఠ పాలయ్యేది కామినీ కాంచనాల విషయంలోనే! ఇంద్రియాలపై పట్టు సాధించి సత్యమార్గంలో నడుస్తున్న వ్యక్తికి ఖ్యాతి వస్తుందేగానీ చెడ్డపేరు ఊసుండదు.

ధనం, స్త్రీ వలన కలిగే ప్రలోభం ఓ ఉచ్చులాంటిది. ఉచ్చులో పడేదాకా అందులో కూరుకుపోతున్న సంగతి బాధితుడికి బోధపడదు. ఊర్వశి పట్ల కలిగిన ప్రలోభం విశ్వామిత్రుడికి శాపమై అతడి తపశ్శక్తిని నిర్వీర్యం చేసింది. దుర్యోధనాదులు రాజ్యసంపదకు సంబంధించిన లోభత్వం వల్ల అపకీర్తి పాలయ్యారు. జూదవ్యసనం వల్ల పాండవాగ్రజుడు రాజ్యలక్ష్మిని కోల్పోయి అపఖ్యాతిపాలయ్యాడు. సోదరులు, భార్యసమేతంగా అరణ్యాల బాట పట్టవలసిన దుర్గతి అతడికి పట్టింది. ఇంద్రియాలను జయించిన మహర్షులు వాటికి ప్రభువులై పరమాత్మకు చేరువయిన ఉదంతాలు మన వాంఙ్మయంలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తాయి.

డబ్బు, స్త్రీ వ్యామోహం ఎంతటివారినైనా ప్రలోభానికి గురిచేస్తాయి. వీటివల్ల ఆనందం అనుభవంలోకి వస్తుందని విశ్వసించడం హాస్యాస్పదం! వాటివల్లే ఉన్న కాస్తంత ఆనందమూ ఆవిరైపోగలదన్నది నిష్ఠురసత్యం. ప్రలోభాలను నిర్మూలించగల సాధనాన్ని భగవంతుడు మనిషికి 'బుద్ధి' రూపంలో అనుగ్రహించడనీ, దాని సాయంతో ఇంద్రియాలపై పట్టు సాధిస్తే విజయం తప్పక లభించగలదనీ గ్రహించాలి. ఇంద్రియాలపై విజయం సాధించిన యోగీశ్వరులు హృషీకేశులని ఖ్యాతి పొందటం విశేషం! సజ్జనులు నడిచిన బాటలో జీవిక నిర్దేశించుకుంటే అర్హతననుసరించి సమాజం గౌరవిస్తుంది. పూర్వజన్మ సుకృతం వల్ల గొప్ప కుటుంబంలో జన్మించడం జరుగుతుంది తప్ప ఒకవ్యక్తి అదృష్టానికి అన్యకారణం కనిపించదు. అర్హతలేకుండా పేరు ప్రతిష్ఠల కోసం వెంపర్లాడితే అది వ్యక్తి మనస్తాపానికే దారితీస్తుంది. కృషితో అర్హతను పెంపొందించుకునే వ్యక్తి రుషి సమానుడవుతాడన్నది కాదనలేని నిజం! ❋

# 15. తీపిజ్ఞాపకం

జ్ఞాపకాలు మెదడు యంత్రం ముద్రించే అనుభవాల పుస్తకం. ఓ జ్ఞాపకం మధురమైనది కావచ్చు. లేక నరాలను ఉద్రిక్తపరచే దురనుభవం కావచ్చు. లౌకిక జీవితంలో మానవులకు అనేకానేక చేదు – తీపి స్మృతులు భగవత్ ప్రసాదంగా లభిస్తుంటాయి. ఓ చేదు జ్ఞాపకం భగవత్ భిక్ష ఎలా అవుతుందనే సందేహం రావచ్చు. చేదు జ్ఞాపకం మూలాల్లోని అనుభవాల సారం మనిషికి మేలు చేయవచ్చు. ఓ వేప కొమ్మ మానవ సమాజానికి మేలు చేసే విధంగా! మోటారు వాహనాలు లేని రోజుల్లో దూరంలోని పాఠశాలకు నడిచి వెళ్ళిన సందర్భంలో అది ఓ చిన్నారి అనుభవించిన చిట్టికష్టం. అతడు పెరిగి ప్రయోజకుడయ్యాక ఆఅనుభవం అతడు తన సంతానంతో పంచుకోగల తీపి జ్ఞాపకమవుతుంది.

మానవ మస్తిష్కం దాచిపెట్టే అనుభవాలన్నీ తీపి జ్ఞాపకాలు కానవసరంలేదు. భద్రపరచిన చేదు జ్ఞాపకాలు చేదునుకోల్పోయి అనుభవించిన వారికి మాధుర్యం పంచేవిగా మారగా, నిజమైన తీపి అనుభవాల జ్ఞాపకాలు అమృతపు చెలమలవుతాయి.

ఓ ప్రాంతంలో ఒకప్పుడు పెనుతుపాను సంభవించింది. ఓ వ్యక్తి తాను స్వయంగా బాధితుడైనప్పటికీ సేవాగుణం గల అతడు పూర్తిగా వరదపాలు కాని తన గృహంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాడు. ఆచర్యవల్ల అతడి మనసు వర్ణించలేని ఆనందానుభూతికి లోనయింది. జీవితమంతటిలో మరచిపోలేని తీపిజ్ఞాపకమయింది. కేవలం బాధించేవి, బంధించేవి నిజానికి చేదు జ్ఞాపకాలు కాదు. పొరుగువారి బాధలను చూచి చలించి, వారికి సాయపడి వారి ప్రేమను పొంది వారితో అలౌకిక అనుబంధాన్ని ఆర్జించిన ప్రతీ అనుభవం ఓ తీపిజ్ఞాపకంగా మారుతుంది.

ప్రకృతి ఆరురుతువుల సమ్మేళనం. పునరావృతమయ్యే ప్రతి క్షణం

జ్ఞాపకాల సమాహారమే! ఓ చిట్టి చీమ ఓ చోట ఓ చక్కెర నిధిని కనుగొంది. ఆ వార్త తన తోటి చీమలకందించింది. లెక్కలేనన్ని చీమలు వరసకట్టాయి. చక్కెర నిధి నుంచి తమ తమ స్థాయిలో ఓ కొండలాంటి చక్కెర అణువును మోసుకొచ్చే చీమలు ఒకటోరెండో! అయితేనిధి అన్వేషణలో తలమునకలయిన చీమలు వందలాది!

ఆశకర్తవ్యాన్ని బోధిస్తుంది. కర్తవ్యం పనిని నిర్దేశిస్తుంది. సంకల్పబలం వుంటే వందలాదిలో ఒకడు మహోన్నత విజయం సాధిస్తాడు. వందచీమల బారులో ఒక్కచీమ చక్కెర కణాన్ని మోసుకొని చీమల బారు నుంచి వెనుకకు మరలినట్లు! ప్రయత్నలోపం లేనపుడు ఓ ప్రస్థానం వల్ల లాభం చేకూరకపోయినా ఆచరించిన క్రియ నిమిష నిమిషమూ ఓ తీపి జ్ఞాపకమే అవుతుంది. ఇప్పటి కష్టం సైతం తర్వాతి రోజుల్లో ఓ తీపి జ్ఞాపకంగా కనిపిస్తే నిజానికి మనిషికి దురనుభవమెక్కడిది? రుజుమార్గంలో నడవటమే ప్రధానం! ఓ చేమంతి మొక్కకు పూచిన పూవు లేత పసుపువర్ణంలో డజన్లకొద్దీ అందమైన రేకలను పేర్చుకొని మనోహరంగా కాంతులీనుతుంది. పువ్వుల ప్రేమికులు వాటిని తెంచితేమరునాటికి అదోవాడిన జ్ఞాపకం! తెంపకపోతే ప్రకృతి ఒడిలో కొమ్మకు మిగిలిపోయిన పువ్వుగా మరపురాని తీపిజ్ఞాపకం! ఓ చెట్టుకు ఫలం తీపిగురుతయితే విత్తుకు మొక్క అనుగమించే మధుర స్వప్నసాకారం! అందుకేనేమో ఓ కవి అన్నాడు ‘ద్వంద్వాలు ఓ భ్రాంతి మాత్రమే! భగవంతుడి సృష్టిలో చెడులేదు’ అని! ఒక వస్తువు లేదా ఓ వ్యక్తి మంచిచెడులను లోకం నిర్ణయిస్తుంది. భగవంతుడికి తన సృష్టి ఎన్నడూ తీపిని పంచే మధుర సంకల్పసాకారమే! ప్రళయం ముందరి సృష్టి ఆయనకు ఓ తీపిగురుతు. అందరూ మంచినే చూడాలి, వినాలి, చేయాలి, మాట్లాడాలి అన్నది వేదవేదాంగాల సారం. జగత్తంతా మంచి పరచుకోవడం ఓ సంఘుసంస్కర్త దివ్య స్వప్నసాకారం! తమ స్వప్నాలు పల్లవించాలంటే మంచి ప్రవర్తన, ఆశాపూర్ణ భావం, ఎల్లలోకాల సౌభాగ్యం లక్ష్యం కావాలి. అపుడే సాధకుల అనుభవాలన్నీ నునులేత ఎండలో మెరిసే బంగారు పువ్వులవుతాయి. ప్రకృతిలోని ద్వంద్వా లన్నిటిలో మంచినే చూడగల విజ్ఞులకు గతం, వర్తమానం, భవిత అంతటా వికాసమే కనిపిస్తుంది. ఎల్లెడలా తీపి జ్ఞాపకాలే పరచుకొని ఆనంద సౌరభాలు గుబాళిస్తాయి.❋

# 16. ఆనందమందిరం

నవరంధ్రాలతో కూడిన మానవదేహం గురించి ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిప్రాయం ఉండవచ్చు. జ్ఞానులకది దైవసన్నిధికి చేర్చే ఉపాధి! ఉపకరణం! దివ్యసాధనం! ప్రపంచ మాయాసాగరంలో ఆ ఉపకరణమనే పడవ సాయంతో మోక్షతీరమనే ఒడ్డుకు చేరుతాడు ముముక్షువు. దేహం యోగికి సాధనకు తోడ్పడగా భోగికి విషయవాంఛలు తీర్చుకొని సుఖమయ జీవనం సాగించడానికి ఉపకరిస్తుంది. దేహం అశాశ్వతమైనా పుణ్యపాపాలు, కీర్తిప్రతిష్ఠలు వెంటవస్తాయని పండితులు వచిస్తారు. ఏర్పరచుకున్న ఆధ్యాత్మిక, లౌకిక లక్ష్యాలు సాధించుకోడానికి దేహధారి అహరహం శ్రమించవలసి వుంటుంది.

కలియుగంలో మానవ ఆయుర్దాయం నూరేళ్ళని చెప్పబడింది. నూరేళ్ళు జీవించిన కొందరికి నూరుక్షణాల్లో జీవితం కరిగిపోయిన భావన కలగవచ్చు. అవి వారి వారి జీవితానుభవాల మీద ఆధారపడి వుంటుంది. బాల్యానుభవాలు తెలిమంచు తడి ఆరని నునులేత పుష్పాల్లా నిత్యనూతనంగా భాసించవచ్చు. శరీరంతో అనుసంధానమై వుండే బంధుమిత్రగణం అనురాగ పాశాలు బిగిస్తారు. అష్టపాశాలతో బందీకృతమై వుండే దేహం భగవత్ కృపాకటాక్ష వీక్షణంతో సంకెలను ఛేదించుకుంటుంది. శతాబ్దాల పర్యంతం చిమ్మచీకటిలో మగ్గిన గుహలో ఓ అగ్గిపుల్ల వెలిగిస్తే చిమ్మచీకట్లు పటాపంచలై క్షణాలలో అంతటా వెలుగు పరుచుకున్నట్లు సాధకుడికి ఏ క్షణాన్నయినా భగవత్ సాక్షాత్కారమనే వెలుగు కిరణం అనుభవానికి రావచ్చు. అగ్గిపుల్ల వెలుగును పదిలపరచుకోవాలంటే ఓ చిరుదీపం వెలిగించుకోవలసిన అవసరమున్నట్లు వివేకవంతుడు తనకు అనుభూతమైన జ్ఞానాన్ని హృదయ సీమలో పదిలపరచుకుంటాడు. అదే భక్తి యోగ పరమార్థమన్నారు పెద్దలు!

ఏ పూట తన జీవిక ఎక్కడ గడుస్తుందో తెలియని ఒక సాధువు ఓ కొబ్బరిచెట్టుకింద సేదదీరుతున్నాడు. సాధు సన్యాసులు ఆనందంగా జీవిస్తారనీ, సామాన్య ప్రజలను బాధించే విషయాలేవీ వారిని అంతగా బాధించవనీ చెప్పగా విని ఆ రహస్యమేమిటో తెలుసుకోవాలనుకన్నాడో బాటసారి. చెట్టుకింద కనిపించిన సాధువుతో మాటామంతీ కలిపాడు. తన సందేహం బయటపెట్టేంతలో ఓ కోతి చెట్టుపై నుంచి ఓ కొబ్బరికాయను సాధువు నెత్తిపై వేసింది. క్షణంపాటు దిమ్మతిరిగినా వెంటనే తేరుకున్నాడు సాధువు. కాయకు రంధ్రం వేసి కొబ్బరి నీళ్ళు చక్కగా సేవించాడు. కాయను రెండుగా పగలగొట్టి నునులేత కొబ్బరి రుచిని ఆస్వాదించాడు. బాటసారికీ అందించాడు. ఓ కొబ్బరిచిప్పను భిక్షాపాత్రగా మలుచుకున్నాడు. ఇదంతా చూస్తున్న బాటసారికి సాధువును మరి ప్రశ్నించే అవసరం లేదనిపించింది. ఎందుకంటే ఎలాంటి ప్రతికూల పరిస్థితినైనా అనుకూలంగా మార్చుకునే మనిషి హృదయం ఆనందమందిరమే అని అతడికి అవగతమైంది.

సంగీత, సాహిత్య, నట, నాట్య, రాజకీయ రంగాల్లోని ప్రముఖులను వారి జయంతి, వర్ధంతి సమయాల్లో సంస్మరించుకుంటాం. వారి మధుర స్మృతులు జన హృదయాల్లో పదిలంగా నిలిచివున్నట్లుగా, దైవం కొలువై వుండే మహనీయుల హృదయసీమల్లో పరమాత్మ స్మరణమాత్రంగా వారి నీరాజనాలు అందుకుంటాడు. విశ్వమానవ శ్రేయానికి దేహం ఉపకరిస్తే అది ధన్యతగా మనిషి భావించాలి. మరణించాక మనిషి గుప్పెడు బూదిగా మారటం మనకు తెలుసు. అది ప్రకృతి ధర్మం కూడ! జీవించినన్నాళ్ళూ దేహాన్ని దేవాలయంగా, ఆనంద మందిరంగా మార్చుకొనే మహనీయులు మరణానంతరమూ చిరస్మరణీయులే! నిరవచ్ఛినంగా కొనసాగే తైలధారలా వారి సత్కీర్తి నిత్యనూతనమై జన హృదయాలలో విరాజమానమవుతుంది. ❋

# 17. నిత్య భిక్షగాడు

ప్రకృతి పరంగా, సమాజపరంగా ఎన్నో వ్యవస్థలు మానవ జీవనం సాఫీగా గడవడానికి తోడ్పడతాయి. జీవిక కోసం మనం ఉద్యోగ వ్యాపారాలు చేస్తాం. వ్యవసాయం, పరిశ్రమలు నిర్వహిస్తాం. ఉద్యోగమయితే యజమానిని, వ్యాపారమైతే వినియోగదారునీ సంతృప్తిపరిచే ప్రయత్నం చేస్తాం. వ్యవసాయానికి ప్రకృతి మాత కరుణ అవసరం. వ్యవస్థలు సజావుగా సాగటానికి విరాట్ పురుషుడి దయ అనంతంగా అవసరమని గ్రహించలేం. ఎక్కవలసిన రైలు ఆలస్యమయితే నిరుత్సాహపడతాం. వ్యాకులత చెందుతాం. సకల సౌకర్యాల లభ్యత మనిషికి దైవానుగ్రహం కలిగినపుడు ప్రకృతి మాధ్యమంగానే సాకారమవుతుంది.

వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి తాపం అధికరిస్తే ఉడికిపోతాం. ఆహార ఉత్పత్తుల లభ్యత తగ్గి ధరలు పెరుగుతాయి. బావులు ఎండిపోయి అవసరం మేరకు నీరు లభించదు. సరఫరా తగ్గినపుడు వెల చెల్లించి మరీ నీరు కొనుక్కొనే దురవస్థ కల్గుతుంది. ఆ తరుణంలో వర్షరూపంగా మానవాళిని అనుగ్రహించేది దైవమే! ఉన్న సరుకులు అందరికీ అందేలా పాలకులు చేయగలరేమోగానీ వనరులు సృజించలేరు. అందుకు ప్రకృతి రూపంలో దైవానుగ్రహం ఎంతో అవసరం! వర్షాల కోసం యజ్ఞయాగాదులు చేస్తాం. జానపదులు కప్పలకు పెళ్ళిళ్ళు చేసి వరుణదేవుడికి తమ ఆర్తిని నివేదిస్తారు. నిరీశ్వరవాదులు ఈ క్రతువులను ఖండిస్తారేమోగానీ సమస్యకు పరిష్కారం వారి వద్ద ఉండదు. కనిపించని ఆద్యాశక్తి కరుణిస్తే జలాశయాలు నిండి భూమి సస్యశ్యామల మవుతుంది. మానవ జీవన ప్రగతి ప్రవర్ధిల్లుతుంది.

అరాచకశక్తుల నైజం హింసకు పాల్పడటమైతే పరమపితదైవం సద్గుణం జీవులపై కరుణ కురిపించడమే! హిరణ్యకశిప, హిరణ్యాక్షులు శత్రుత్వం

వహించినా, బుద్ధిహీనుడై రావణాసురుడు పరమేశ్వరుడు నివశించే కైలాసపర్వతాన్ని పెకలించే ప్రయత్నం చేసినా, అవతారపురుషుడుగా గుర్తించని కౌరవులు రాయబారానికి వెళ్ళిన శ్రీకృష్ణుని అవమానించినా ఆ దుష్టుల దేహాలు పతనమయ్యాక దైవం వారికి ఉత్తమ గతులు కల్పించాడే తప్ప కక్ష తీర్చుకోలేదు.

విజయాలు కైవసమైతే విర్రవీగుతాం. కళ్ళు నెత్తినెక్కి దైవంలేదని వాదిస్తాం. అంతా మా ఘనతే అని గొప్పలు పోతాం! అయినా మన సుఖమయ జీవనానికి అంతరాయం కలుగదు. అలాగే కొనసాగుతుంది. అందుకు కారణం సకల ప్రాణివల్లభుడైన జగన్నాధుడు కరుణామయుడు కావటమే! అన్నదాత, ఆరోగ్య – ఐశ్వర్య ప్రదాత లోకనాయకుడయిన భగవంతుడే! దైవం ముంగిట నిత్యభిక్షగాడు మానవుడు! మనం సదా అనుభవించే భౌతిక, అభౌతిక వస్తు జాలమంతా భగవత్ప్రసాదితం కానిదేదీలేదు. ఏం చూసుకొని మనం గర్విస్తామో అదేదీ మనది కాదనీ, అంతా దైవం సొత్తేననీ గ్రహించలేని అజ్ఞానులం మనం. ఆద్యాశక్తి ప్రకృతి కన్నెర్ర జేస్తే తల్లివేరు తెగిన చెట్టవుతాం. మోడు చివురించాలంటే శ్రీమాత కృపాకటాక్ష వీక్షణం అవసరం! తైలం లుప్తమయినపుడు వత్తి వెలుగును కోల్పోయినట్లు దైవానుగ్రహం కోల్పోయిన ఉత్తరక్షణం లోకాలు నిర్వీర్యమవుతాయి. విరాట్ పురుషుడి ఉనికి సమస్త ప్రాణులు – అప్రాణుల్లో చూడగల విజ్ఞత మనిషి సంతరించుకున్నపుడు ఆనందమే అతడి స్వరూపంగా మారుతుంది. మనిషి సాధన ఫలవంతమయిన దానికి నిదర్శనం భగవంతుడి ముందు అతడు నిత్య భిక్షగాడు అయినా పరిపూర్ణ ఆనంద స్వరూపుడుగా మారటం! ఆ భాగ్యం కోసం మనిషి అవిశ్రాంత భగవత్ సాధనలో కృతకృత్యుడు కావాలి! అలుపెరుగని కృషి అతణ్ణి దైవానికి చేరువ చేయగలదనటంలో సందేహం లేదు. ❋

# 18. బ్రతుకుతీపి

ఒక వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. సరైన చికిత్సతో కోలుకునే అవకాశం వున్నా వ్యయ ప్రయాసలతో కూడిన కొన్ని శస్త్ర చికిత్సలు జరిపించవలసి వుంది. ఆ స్థితిలో బాధితుడు చికిత్స చేయించుకొని సాధారణ జీవితం గడపగల శుభ ఘడియకోసం తహతహలాడుతాడు. నయంకాని రోగంతో బాధపడుతున్న సందర్భంలో ఖరీదైన వైద్యం అందించినా రోగి బ్రతికేది కొన్నాళ్ళే అని తేలినా బ్రతకాలనే ఆశ అతడిలో జీవించే వుంటుంది.

ఓ విమానం గగనతలంలో ప్రయాణిస్తోంది. యంత్రంలో సాంకేతిక లోపం తలెత్తిందనీ అత్యవసర ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్నా మనీ కాక్‌పిట్ నుంచి ప్రకటన వెలువడింది. ఊపిరి బిగబట్టి నిన్న ప్రయాణీకుల్లో ఏదో అలజడి! విమానం సురక్షితంగా కిందకు దిగేదాకా అందరూ ఉత్కంఠతో ఎదురుచూసినవారే!

'ప్రాణమంటే మనిషికి అంత తీపెందుకు?' అనాదిగా మానవ మేధను మథిస్తున్న ప్రశ్న ఇది! మానవుడు ఎదుర్కొనే భయాలను భయాలనటం కన్నా ప్రాణంపై తీపివల్ల జనించే కల్లోలిత క్షణాలనడం సబబేమో! పశుపక్షిమృగాలు, చెట్టు చేమలకూ ప్రాణభయం ఉంటుందా అన్నపుడు 'అవును' అంటుంది విజ్ఞానశాస్త్రం. మంచి చెడులకు వృక్షాలు సైతం స్పందిస్తాయని పరిశోధనలు రుజువు చేశాయి. శిలలు కూడ అప్రాణులు కావనీ, వాటికీ స్పందన ఉంటుందనీ, అవినిద్రించే సమయమంటూ వుంటుందనీ, ఆ సమయంలో వాటిని అపూర్వ కళాఖండాలుగా మలవడం సులువనీ ప్రాచీన శిల్పకళానిపుణులు ధృవీకరించారు. ప్రయోగ ఫలితాలు విజయవంతంగా చూపించారు కూడ!

సౌందర్యవంతులు, అనాకారులు సైతం ప్రాణభయానికి ఒక రీతిలో స్పందిస్తారు. తను ఓ అందగాడు కానందుకు వగచే క్షణాలు ఉండొచ్చేమోగానీ అనాకారికి కూడ తన రూపంపై ద్వేషం ఉండదు. ప్రాణంపై తీపి దేహంపై మోహానికి కారణమౌతుంది. బ్రతుకు తీపి లేకుంటే ఎప్పుడైనా ఎక్కడైనా ప్రాణం వదిలేందుకు ఎవరికీ అభ్యంతరం వుండదేమో! మోడువారిన చెట్లు స్వల్ప ఆనుకూల్యత లభిస్తే చాలు తిరిగి చివురించి మారాకు తొడగడం ప్రారంభిస్తాయి. పాదుచేసి నీరుపోసి ఓ ఎండు కట్టెను నాటినా కొన్నాళ్ళకు చివురించి ఆకులు తొడుగుతుందనటంలో అతిశయోక్తి ఉండదేమో! పేడపురుగు సైతం జీవించడానికే ఇష్టపడుతుంది. కాళ్ళు, చేతులు లోపించిన వ్యక్తి కూడ బ్రతుకు తీపి వ్యక్తపరుస్తాడు. అలాంటి వ్యక్తి ఓ చిత్రకారుడైతే నోటితో కుంచెపట్టి అపురూప కళాఖండాలు సృజించవచ్చు. బ్రతుకుతీపి అనే జీవరసాయనం దైవం ప్రాణికోటి రక్తంలో అంతర్హితం చేయగా నరనరానా ప్రవహిస్తోందా అన్నది ఆసక్తికరమైన విషయం!

మానవేతర ప్రాణులేవీ తమకు తాముగా జీవితాన్ని అంతం చేసుకోవు. కష్టాలను ఎదురీదలేనని భావిస్తే మనిషి మాత్రమే ఆ దుష్కృత్యానికి పాల్పడతాడు. ఆత్మహత్యాపాపానికి ఒడిగడతాడు. ఎవరైనా ఏదేని అనుచిత కార్యం చేస్తే 'ఆత్మహత్యాసదృశ' మనటం పరిపాటి. అలా అనడం అదెంత చేయకూడనిపనో తెలియజేస్తుంది. బ్రతుకుపై మమకారం దైవప్రేరితం. అది జీవితమాధుర్యాన్ని, పరమార్థాన్ని, కష్టసుఖాలపట్ల పెంచుకోవలసిన సమభావాన్నీ తెలియజేస్తుంది. ప్రాణంపై మమకారం నూరేళ్ళ మనిషి నిండు జీవితాన్ని పండించేది కావాలి. 'బ్రతికి ఏదైనా సాధించుకోవాలిగానీ మరణించి కాదు!' అన్నది మానవుడు సదా స్మరించవలసిన మహామంత్రం కావాలి! ❋

# 19. కల్పన : సృజన

ఉన్నది ఉన్నట్లుగా చెబితే నిజమనిపించుకుంటుంది. ఏ మాత్రం తేడాగా చెప్పినా అది అసత్యమే! కొన్ని నిజాలు మధురానుభూతులను పంచుతాయి. తత్ విరుద్ధమైన అసత్యభాషణం దుర్భావాలు, మనోవికారాలు కల్పిస్తుంది. ఒక వస్తువు లేకపోయినా దానిని ఉన్నట్లు ఊహించుకొని ఆనందిస్తాడు భావుకుడు. అతడి భావుకతకు, ఆనందానికి కల్పన ఆధారమౌతుంది. కల్పనలు, సృజనలు ఎప్పుడూ మధురంగానే వుండాలి! సమాజంలో కొందరు అభూతకల్పనలు ప్రచారం చేస్తుంటారు. అవి వినేవారిలో, చూచేవారిలో భయ క్రోధావేశాలు ఉత్పన్నం చేస్తాయి. అభూతకల్పనలు ప్రచారం చేసేవారిని సంఘ విద్రోహ శక్తులనవచ్చు. వారి అవాస్తవిక కల్పన వల్ల ప్రజల్లో భయాందోళనలు నెలకొని సాంఘిక అశాంతికి కారణమవుతుంది. సమాజంలో ప్రశాంతి దూరమౌతుంది.

మన కావ్యాలు, ఇతిహాసాలలో ఆశావాద పూర్ణమైన కల్పనలు అసంఖ్యాకం! శాస్త్రాలు, పురాణాలు, వేదాంతాలలో సైతం కల్పనల ప్రమేయం వుంది. ఈ కల్పనలను సన్నివేశాలనవచ్చు. ఇవే ఉపాఖ్యానాలుగా, చిన్న కథలుగా ఉండి శ్రోతలు, పాఠకులు ఓ సత్యాన్ని చక్కగా అర్థం చేసుకునేందుకు తోడ్పడతాయి. 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అన్నారు. తేలిగ్గా తెలుసుకోవడం కోసం ఆకాశాన్ని, మహాసాగరాన్ని బ్రహ్మానికి సంకేత రూపంగా చెప్పారు. వాయువు కంటికి కనిపించదు. దాని శక్తి అందరికీ అనుభవమే. శాస్త్రాలు మనసును వాయువు రూపంలో సంకేత పరచడం విశేషం! వాయు వేగం ప్రంచడమైనది. ఆ వేగాన్ని మించిన వేగం లేదు. కానీ సూక్ష్మాతి సూక్ష్మమయిన మనసు వేగాన్ని అంతకన్నా శక్తివంతమైనదిగా, కల్పనకు అతీతమయినదిగా మనం అర్థం చేసుకోవలసి వుంది.

నిజం అన్ని కాలాల్లోనూ ఉంటుంది. అది అత్యంత ప్రభావవంతమైనది. ధర్మరాజు, సత్య హరిశ్చంద్రుడు, నలచక్రవర్తి సత్యం కోసం ఆత్మ త్యాగాలకు సిద్ధపడ్డారు. ఎన్నో కష్టాలు అనుభవించారు. శాస్త్రాలు నిజాన్ని నిప్పుతో పోల్చాయి. ఎవరైనా సంకట స్థితిలో ఉన్నపుడు లేదా అపజయాన్ని పొందినపుడు 'నీరు కారిపోయాడు' 'జావకారిపోయాడు' అంటాం. ఒక పాత్ర రంధ్రం గుండా కారిపోయే నీరు ఎలాంటి ప్రయోజనాన్నీ ఇవ్వదు. కావ్యనాయికా నాయకులు తమ విరహ నివృత్తి కోసం ఓ సంకేత స్థలంలో కలుసుకుంటారు. కలుసుకోబోయే ప్రదేశాన్ని, కాలాన్ని మాటలతో చెప్పే అవకాశం ఉండదు. సంకేత వస్తువులతో, సంకేత భాషలో వారు ఆప్రదేశాన్ని, కాలాన్ని సూచించుకోవడం పరిపాటి.

చిలుక పంజరంలో ఉన్నంత వరకు యజమానికి దాని ఉనికి ఎరుకే! అస్తిత్వం పదిలమే! ఏ కారణం చేతనైనా చిలుక పంజరం దాటి బయటికి వస్తే అది సువిశాల గగనంలోకి తుర్రుమని పారిపోవడం ఖాయం. అందుకు కారణం, ఎంత బాగా చూచుకొనే యజమాని ఉన్నా దాని అస్తిత్వం 'బందీ'గానే కదా! ఆత్మను మనశాస్త్రాలు పంజరంలో బందీగా ఉండే చిలుకతో పోల్చాయి. ఒకసారి ఆత్మదేహాన్ని వీడితే ఆ దేహంలోకి తిరిగి రావటం జరగదు. కాలాన్ని ప్రవాహంతో పోల్చారు. ప్రవాహ జలం ఎన్నడూ వెనుకకు మరలదు. అడ్డు కట్టవేసి ప్రవాహ దిశ మార్చినా అది కల్పితమే గానీ సహజ సిద్ధం కాబోదు. కామాన్ని అంధత్వంతో పోల్చారు. కామంతో కన్ను మిన్ను కానక వికృత చేష్టలకు పాల్పడే వారిని 'కామాంధులు' అన్నారు. అంధులు ఎలా నిజమైన లోకాన్ని చూడలేరో కామాంధులు సైతం వావి వరుసలతో కూడిన నిజాన్ని చూడలేరని భావం! సత్యాలు, కల్పనలు, సృజనలు ఒక మతానికి, సాంప్రదాయానికి పరిమితమైనవి కావు. సృష్టి జరగాలంటే ఆడ, మగ కావాలి. మానవ జాతి ఆవిర్భావాన్ని ఓ కథగా చెబుతుంది బ్రహ్మ పురాణం. ఆదిలో బ్రహ్మదేవుడు, పురుషుడిగా స్వయంభూ మనువును, స్త్రీగా శతరూపను సృష్టించాడనీ 'మనువు' నుంచి ఆవిర్భవించిన సంతతి 'మానవులు'గా మిగిలిందనీ కథనం. ఆదం, అవ్వలు సృష్టి ప్ర ప్రథమ స్త్రీ పురుషులనీ, వారి నుంచే మానవ జాతి ఆవిర్భవించిందనీ క్రైస్తవం చెబుతుంది.

ప్రతి వ్యక్తీ మంచినే ఊహించుకుంటాడు. తనకు మంచే జరగాలని అభిలషిస్తాడు. కల్పనా జగత్తు మధురమయినది. అది పంచే ఫలాలు సైతం మధురంగానే వుంటాయి. కల్పన మానవ జాతినుద్ధరించేది కావాలి. ఓ సాహిత్యకారుడి కల్పన జ్ఞానాన్ని పంచితే ఓ నాట్యశాస్త్ర విశారదుడి సృజన వినోదాన్ని అందిస్తుంది. ఓ సంగీత చక్రవర్తి సృజించే రాగం మనశ్శరీరాలకు మైమరపు కల్గించి ఆనందాంబుధిలో ఓలలాడిస్తుంది. ఓ నటుడు, నటి ప్రేక్షకులను కథలో లీనం చేసే ప్రజ్ఞాపాటవాలు కలిగి వుండాలి. కల్పన – సృజనల పరమార్థం మానవ జాతి ఆనందం, అభ్యుదయమే!

మైఖేల్ కలశ్నికోవ్ ఎ.కె.47 మారణాయుధాన్ని సృజించాడు. దాని దుర్వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలు అనేకం! ఎన్నో నరమేధాలకు ఆ ఆయుధం సాక్షిభూతంగా నిలిచింది. విషయ కల్పనా రంగంలో దుష్ట సాహిత్యం వేరు పురుగులా ప్రజల బుద్ధిని హరించి మారణ హోమం సృష్టించవచ్చు. వస్తు కల్పనా విషయానికి వస్తే ఆ సృజన ఓ ఎడిసన్ సృజించిన విద్యుత్ బుల్బువలె కాంతులీనాలి. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ సృజన చేసిన ప్రాణ రక్షక ఔషధం పెన్సిలిన్ వలె ఆర్త మానవ ప్రాణ సంరక్షణి కావాలి.

సృజన దృశ్య మాన ప్రపంచాన్ని క్షణాల్లో భస్మీపటలం చేయగల అణుబాంబు కాకూడదు. వేదాలు, పురాణేతిహాసాలు ప్రస్ఫుటించే ధర్మాచరణకు అనువుగా లోక కళ్యాణానికి కారణభూతమయ్యే సృజనలు, కల్పనలు చరిత్రలో పదిలంగా కలకాలం నిలుస్తాయి. నిజానికి ఓ కల్పన, ఓ సృజన మానవ జాతి సంక్షేమానికి చిరునామా కావాలి. అప్పుడే జాతి సుభిక్షంగా మనగల్గుతుంది. ❋

# 20. దృష్టి

కనుదోయి వున్నది చూడటానికే. ప్రకృతిలో ఏ ప్రాణికికూడ కనులు రెండే వుంటాయి. రెండు కనులూ కలిసి చూసేది ఒకే దృశ్యాన్నే. సృష్టిలో ఈ నిబంధనకు మినహాయింపు లేదు. మనిషి రెండు కళ్ళతో తనకు ఇంపైన దృశ్యాన్ని మక్కువతో చూస్తాడు. మనిషికి భగవంతుడు కన్నులిచ్చింది ఆహారం సమకూర్చుకోవడం, తనను, తన వారిని రక్షించుకోవడం కోసం. ఈ సూత్రం పశుపక్ష్యాదులకూ వర్తిస్తుంది. పశువు, పక్షి వక్రదృష్టితో వస్తువును చూడవు. వక్రదృష్టి కల్గిన నక్కను 'జిత్తులమారి' అంటాం. కనిపించే వస్తువులో వక్రత ఉండదు. చూచే చూపులోనే అది వుంటుంది.

రాజదృష్టి సోకితే రాళ్ళు సైతం బద్దలవుతాయని సామెత. ఆధునికీకరణ పేరుతో మనిషి చేస్తున్నదదే. నగరాల సుందరీకరణలో భాగంగా మానవుడు కొండలను పిండి చేయడం చూస్తున్నాం! ఇరుగు దృష్టి పొరుగు దృష్టి ఇంట్లో వారి దృష్టి అంటూ అమ్మలు చంటి బిడ్డలకు దిష్టి తీయడం మనకు తెలుసు. కొన్ని గృహాల నుంచి నవగ్రహాల వక్రదృష్టి జాతకులను దుష్ప్రభావితుల చేయడం పరిపాటి. మనసు, మానవత్వమున్న మనిషి సదా చల్లనిచూపుతో లోకాన్ని వీక్షిస్తాడని ప్రతీతి.

అమ్మది చల్లని చూపు. సృష్టిలో ఏ ప్రాణికీ అమ్మంత చల్లని చూపు వుండదు. రావణుడు సీతమ్మను చూచింది వక్రదృష్టితోనే. తత్ఫలితంగా అతడు నామరూపాలు లేకుండా లంకాపురితో సహా నశించిపోయాడు. దృష్టిదోషం భౌతికంగా కల్గినపుడు వైద్యుడు చికిత్స చేస్తాడు. జబ్బు పడినవారు రెండవ వైద్యుడి సలహా పొందటం ఆనవాయితీ. భగవత్ సృష్టిలో రెండు కళ్ళతోనూ చూసి నిజ నిర్ధారణ చేసుకోవడమన్న సూత్రం ప్రాముఖ్యత కల్గివుంది.

దుర్యోధనుడు తనను అవమానించిందని భావించిన సమయంలో మయసభలో ద్రౌపది చూపును భరించలేకపోయాడు. తన అహాన్ని సంతృప్తిపరచుకోవడం కోసం నిండు సభలో ఆమె మానాన్ని బహిర్గతం చేసేందుకు వలువలు వలిపించాడు.

కంసుడు మధురాపురికి మహారాజు. అతడు ఉప భోగించేందుకు నాడే పరిమళద్రవ్యాలు కొనిపోతోంది కుబ్జ. శ్రీకృష్ణుడు అడిగిందే తడవుగా ఆమె రాజోపభోగ్యమైన కస్తూరి, అత్తరు, పన్నీరు, అగరు ద్రవ్యాలు స్వామికి సమర్పించి తన భక్తి చాటుకుంది. తనకంటి చూపుతో ఆమె వక్రదేహాన్ని సరిచేసి మహా సౌందర్యరాశిగా తీర్చిదిద్దాడు శ్రీకృష్ణ ప్రభువు. ఎదుటివాడు సిరిసంపదలతో తులతూగుతుంటే కొందరు చూచి సహించలేరు. కళ్లలో నిప్పులు పోసుకుంటారు. ఈర్ష్య వలన వారికి ఒరిగేదేమీ లేకపోగా వారి దృష్టే కలుషితమౌతుంది. ఆర్తులు, అభాగ్యుల కడగండ్లు చూచినపుడు సౌహార్ద్ర హృదయుల గుండెలు చెమ్మగిల్లుతాయి. వారి ఆర్ద్రత వస్తు రూపేణా, ధన రూపేణా ధారలై ప్రవహిస్తే అనాధల దుఃఖ నివృత్తి అవుతుంది. ఆకతాయిల కళ్ళు అతివల అంగాంగాలనూ స్పృశిస్తూ వారికి కడగండ్లు తెచ్చిపెడతాయి. చట్టం చల్లని చూపు చూసినవేళ న్యాయార్తుల వెతలు చెల్లాచెదరవుతాయి.

శ్రీ మహాలక్ష్మి కడకంటి చూపు లోగిళ్ళలో సిరుల వర్షం కురిపిస్తుంది. ముక్కోటి దేవతల చల్లని చూపుతో నెలమూడువానలు కురిసి సస్యాలు సమృద్ధిగా పండి గృహసీమల్లో పురులు నిండుగా వర్ధిల్లుతాయని పెద్దలమాట!

శనీశ్వరుడు సూర్యభగవానుడి కుమారుడు. మొదట ఆయన చూపు చల్లని దీవెనగా ఉండేదట! భార్య జ్యేష్ఠాదేవి కినుకతో స్వామి చూపులు శాపం సోకి చూడబడిన వారికి వెతలు ప్రాప్తించడం ప్రారంభమైనదట! శనిమహాదేవుడి చూపుకు భయపడి ముక్కంటి చెట్టు తొర్రలో దాక్కున్న సన్నివేశం కథగా మలచి పఠితలకందించారు ఋషిపుంగవులు. లోకంలో ఎవరి దృష్టిలోనూ లోపం వుండదు. దోషం వుండదు. చూచే భావనలో లోపం దృష్టి దోషంగా పరిణమిస్తుంది. మంచి మనసుతో చూస్తే ఆ దృష్టి మేలే చేస్తుంది. చిన్న పాపాయిలకు కర్పూర

హారతితో దిష్టితీయడం మనకు తెలుసు. భగవంతుడి చల్లని దృష్టిని ఆహ్వానిస్తూ జరిపే ఉత్సవ మూర్తుల ఊరేగింపులు సనాతనధర్మంలోని సాకార భక్తవరేణ్యుల కమ్మని కలల పంటలు! అందరూ శతాయుష్మంతులై చల్లగా వర్థిల్లాలని వేదమూర్తులైన ద్విజులు అందించే చల్లని దీవెన, అన్ని మతాల వారు సోదర ప్రేమతో పరస్పరం అనుకూలురై లోకకల్యాణానికి కారకులు కావాలనే సనాతన ధర్మ సుదూర దృష్టి ఫలితమే! ❃

# 21. స్వభావం

భౌతిక ప్రపంచంలో జీవ, నిర్జీవ పదార్థాలన్నిటికీ ఓ స్వభావం వుంది. స్వభావం అంటే తమదైన ప్రత్యేక గుణం అని అర్థం చేసుకోవచ్చు. పంచభూతాలు తమ తమ స్వభావాలకనుగుణంగా వర్తిస్తాయి. పంచభూతాత్మకమైన జీవజాతులకూ తమ తమ స్వభావాలు ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ స్వభావాల లక్ష్మణరేఖను జీవులు దాటివెళ్లవు. అగ్నికి కాల్చేగుణం, నీటికి తడిపే గుణం, గాలికి చెదరగొట్టేగుణం, ఆకాశానికి అనంతత్వాన్ని తనలో ఇముడ్చుకొనేగుణం, ఉన్నట్టే భూమికి ప్రత్యుత్పత్తి, పోషణ, భారం వహించే గుణంతోపాటు విశేషమైన సహనవక్తి ఉండటం విశేషం!

మనిషి కొత్తవారితో గుంభనంగా వ్యవహరిస్తాడు. కలుపుగోలు స్వభావం వుండేవారి పరిస్థితి వేరు. అయితే అతడి సహజ స్వభావమేమిటో పరిచయస్థులకు కాలగతిన అవగతమౌతుంది. సహజ గుణాలు క్రోధావేశ సమయాల్లో మనిషి దాచినా దాగేవి కాదు. సాధన చేయగా చేయగా సహజ దౌర్బల్యాలయిన పిరికితనం, అజ్ఞానం, అసహనం మనిషి దూరం చేసుకోగలిగే అవకాశం వుంటుంది. జ్ఞాన భాండాగారాలయిన మహాత్ముల చరితలు, తపోధనుల దివ్యగాధలు వ్యక్తం చేసే సత్ గ్రంథాల పఠనం వల్ల మానవుడికి అజ్ఞానపు చీకటిని తరిమికొట్టగల సత్తా లభిస్తుంది. మహావీరులైన శ్రీరాముడు, అర్జునుడు – పరాక్రమశాలురైన భీష్ముడు, ద్రోణుడు వంటి మహనీయుల గుణగుణాలను ఆకళింపు చేసుకున్న సామాన్యుడిలో సైతం ఒకనాటికి పిరికితనం నిర్వీర్యమై ధైర్యసాహసాలు అంకురించే అవకాశం లేకపోలేదు.

సమర్థులైన నాయకులు, ధీరోదాత్తులు సైతం పుట్టుకతో ఆ గొప్ప లక్షణాలను పొందలేరు. బాల్యంలో తల్లిదండ్రుల నుంచి వారసత్వం,

మంచిమిత్రుల సాహచర్యం, సద్గురువులు నేర్పే విద్య (జ్ఞానం) ఒక మనిషి వ్యక్తిత్వం వికసించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. 'నీ స్నేహితుడెవరో చెప్పు; నీవేమిటో చెబుతాను' అన్న సూక్తి మంచి స్నేహితుల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతుంది.

సహజ స్వభావాన్ని అధిగమించి మనిషి ప్రవర్తించగల్గుతాడా? కోపం, ఆవేశం, అసహనం వ్యక్తమయ్యే విషమ సమయాల్లో మనిషి సమతూకం కోల్పోకుండా విచక్షణతో వ్యవహరించగల్గుతాడా? అన్న ప్రశ్నలు విశేష ప్రాధాన్యత గలవి. కొన్ని పరిమితులకు లోబడి ఆయా సందర్భాల్లో మనిషి సమర్ధతతో మెలగగలడన్నది ఆశావాద ఆలోచనకు దర్పణం పడుతుంది. ఆ సామర్ధ్యం ఆధ్యాత్మిక సాధనవల్లే సాధ్యం!

అన్ని సమయాల్లోనూ మనిషి తన సహజరీతిలోనే స్పందిస్తాడు. ప్రవర్తిస్తాడు. కోపతాపాలు, భేషజాలు, బంధాలు - అనుబంధాలు వంటివి మనిషి సహజ బలహీనతలు. సాధారణ వ్యక్తికి, ఓ గొప్ప మనిషికుండే తేడా అనుకూలం కాని సమయాల్లో తమ దౌర్బల్యాలను అధిగమించగల నేర్పు మాత్రమే!

సీతాదేవి తన ఆశ్రయంలో వున్న తరుణంలో రావణుడు, శ్రీ రాముడు ఓ సాధారణ మానవుడనీ, అతడికన్నా తాను ఎన్నో రెట్లు అధికుడనీ, శ్రేష్ఠుడనీ, సమర్ధుడనీ వచిస్తాడు. అటువంటి భర్తపట్ల పాతివ్రత్య ప్రదర్శన అవివేకమనీ చెపుతాడు. అందుకు భిన్నంగా సత్యసంధత గల శ్రీరామచంద్రుడు రావణాసురుని తక్కువచేసి, కించపరిచి ఎవరిముందూ దుర్భాషలాడిన సందర్భం కనబడదు. అవి వారి వారి స్వభావాలు! సాలెపురుగు, సర్పం, ఏనుగుల భక్తికథ విన్నపుడు వాటి సహజ గుణాల కతీతంగా అవి భక్తి పర్వం నడిపించాయని బోధపడుతుంది. ఓ భావాన్ని అనుకరించవలసిన తరుణంలో శ్రేష్ఠమైన దానినే మనషి అనుకరించి అనుసరించాలని ఓ నీతి కథ ప్రస్తావిస్తుంది. కుక్కపని గాడిద చేసి యజమాని చేత కర్రదెబ్బలు తిన్న ఉదంతం మనం చదివి వుంటాం. భౌతిక ప్రపంచంలో శ్రేష్ఠులైన వారినే జాతి అనుసరిస్తుందని శ్రీకృష్ణుడు భగవద్గీతలో అర్జునుడికి

బోధిస్తాడు. భావం మంచిదయినపుడు స్వభావాన్ని మార్చుకోవలసిన అగత్యం మనిషికుండదు.

వందలాదిగా మనమెరిగిన జీవజాతులు ప్రత్యేకమైన పద్ధతిలో జీవించడం చూస్తాం. మానవుడిది అన్నిటికీ భిన్నమైన శైలి. అధికారదాహం, సంపద పట్ల ఆసక్తి, ఉన్నతమైన ప్రతివస్తువునూ కోరుకునే నైజం; ఇలాంటివి మనిషి 'జాతి' లక్షణాలు కాగా సర్వే సర్వత్రా ప్రతి వ్యక్తీ తనదైన శైలిలో అందరికన్నా విభిన్నంగా ఉండటం, ఆలోచించడం, జీవించాలని కోరుకోవడం మనిషి ప్రత్యేకత! ఓ వ్యక్తి ఓ స్వభావాన్ని అనుకరించడం అది ఉత్తమ మైనదైనపుడే జరుగుతుంది. పుట్టుకతో ఎవరూ మేధావులు కాలేరు. ప్రకృతి నుంచి సమాజం నుంచి జ్ఞానార్జన చేసిన వ్యక్తే అవగుణాలను పాతరేసి నలుగురు మెచ్చే ఉన్నత వ్యక్తిత్వం సంపాదించుకోగల్గుతాడు. దైనందిన జీవితంలో మంచి – చెడులతో కూడిన తను పొందే అనుభవాలు మనిషిని ఉన్నతుడుగా తీర్చిదిద్దుతాయి. కొలిమిలో కాగిన బంగారం మేలిమి సంతరించుకొనే విధంగా మనిషి అపార అనుభవం నేపథ్యంలో జ్ఞాన వంతుడౌతాడు. అలా కాకపోతే జననమరణ రూపమైన చక్రభ్రమణం నుండి అతడు ఎన్నటికీ విముక్తుడు కాలేడు. ❋

# 22. ఆధిపత్యం

నీరు మనిషికి ప్రాణాధారం. సర్వప్రాణులూ నీటి ఆధారంతో తమ జీవయాత్ర సాగిస్తాయి. అడవుల విధ్వంసం, కాంక్రీటు అరణ్యాల ఆవిర్భావంతో వానలు సరిగాపడక జలాశయాలు, భూగర్భజలాలు సైతం ఆవిరైపోవడం మనం చూస్తాం. నీటికోసం వర్షాలపై ఆధారపడివున్నాం. సముద్రాలు జల నిధులయి నప్పటికీ వాటిలోని ఉప్పు వల్ల అవి త్రాగు, సాగు అవసరాలకు ఉపయోగపడవు. ఈ తరుణంలో ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. 'సముద్రాల్లో గనుక మంచినీరు లభ్యమైవుంటే మనిషి చెలరేగిపోయి ప్రకృతిపై అనుచిత ఆధిపత్యం ఇంకా ఇంకా కొనసాగించేవాడు కాదా?!' ఔననడానికి ఎలాంటి సందేహం అవసరంలేదు. మనిషి ఆధిపత్య ధోరణి అలాంటిది. పచ్చగా కనిపిస్తే చాలు దేనినైనా కొల్లగొట్టి స్వంతం చేసుకోడానికి మనిషి వెనుకాడడు. ఆధిపత్యవాదం వల్లే మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు వచ్చాయన్నది నిర్వివాదం.

ఆత్మరక్షణ చేసుకోవడాన్ని ఎవరూ తప్పుపట్టరు. మానవుడు మారణాయుధాలను పోగు చేసుకుంటూపోతున్న తీరు... ముఖ్యంగా అణ్వాయుధాలు –ప్రపంచ ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉగ్రవాదుల చేతుల్లోకి అణ్వాయుధాలు పోవడం తటస్థిస్తే మానవాళి గతేమిటన్నది కలవరపరచే ప్రశ్న.

ఆధిపత్య ధోరణి మనిషికి అహంకారం వల్లే పుట్టుకొస్తుంది. తాను అగ్రేసరుడనని భావించే ప్రతి వ్యక్తీ తన స్థాయిలో ఆధిపత్యధోరణి చూపడానికి నాందీ పల్కుతాడు. తనను చూసి ఎదుటివారు భయపడాలనే ఈ ధోరణి సంఘ వ్యతిరేకమైనది. దానిని అసుర సాంప్రదాయంగా భావించాలి. పురాణేతిహాసాలు పరిశీలిస్తే ఈ ధోరణి అనాది నుంచి ఉన్నట్లు అర్థమవుతుంది.

విశ్వామిత్రుడు దండకారణ్యంలో లోకకల్యాణం కోసం ఒక క్రతువు ప్రారంభించాడు. రావణాసురుడికి దగ్గర బంధువులైన మారీచ సుబాహులనే సోదర ద్వయానికి ఆక్రతువు కంటగింపుగా మారింది. హోమకుండంలో రక్తం, మాంసం, ఎముకలు ఆకాశమార్గాన వచ్చి కుమ్మరిస్తూ పవిత్ర యజ్ఞ వాటికను అపవిత్రం చేయసాగారు. యజ్ఞం ధ్వంసమయితే ఆ రాక్షసులకేమిటి లాభం? అంటే, 'ఏమీలేదు!' అన్నదే సమాధానం! రుషులు వారి వినాశం కోసం యజ్ఞాలు చేస్తున్నారా? అంటే అదీకాదు. లోకకల్యాణం రుషీశ్వరుల మహా సంకల్పమయినపుడు మానవులైనా, రాక్షసులైనా అందరికీ లాభమే!

ప్రతివారూ చెడును గర్వించినట్లు మంచిని ఓర్చుకోలేని వారూ కొందరుంటారు. లోక సంక్షేమం కోసం ఏదైనా శుభకార్యం జరుగుతుంటే వారు చేతనైనంతగా నిర్వీర్యం చేయడానికి కృషి చేస్తారు. అందుక్కారణం అది వారి నైజం కావటమే! అనువంశికంగా కొందరు దుష్టులుగా మారితే చెడు స్నేహాల వల్ల, చెడు అలవాట్ల వల్ల కొందరీ అవలక్షణాన్ని పుణికి పుచ్చుకుంటారు.

అతిశయించిన అరాచకాన్ని మట్టుబెట్టడానికి దైవం మానవ రూపం ధరించి భూమ్మీద అవతరిస్తాడంటారు. ఒక్కొక్క అవతారంలో ఒక్కొక్క పంధాను అనుసరించి పరమాత్మ దుష్టుల ఆధిపత్యధోరణిని నిర్మూలించాడు. ఒక దుష్టుడ్నిసంహరిస్తే మరో దుర్మార్గుడు పుట్టుకొస్తాడు. అందుకని పరమాత్మ అనుసరించిన మార్గం దుష్టస్వభావాన్ని నిర్మూలించడం ఈ యుగంలో చూస్తాం. పరమాత్మ అవతారపురుషుడుగా, అవధూతగా, సద్గురువుగా మానవకల్యాణానికి బాటలు వేశాడు. మహాత్ములు తమ బోధనల ద్వారా మనిషిలోని కల్మషాలను తొలగించారు. కాలానుగుణ్యంగా వారి ఉపదేశాలు ఎందరో భక్తకోటిని పునీతుల చేశాయి. సద్గురువులు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి భక్తజనులనూ భాగస్వాములు చేశారు.

మనిషిలో అహంకారం నశిస్తే ఆధిపత్య ధోరణి కూడ సమసిపోతుంది. ఆధిపత్య భావన అనేక అనర్థాలకు మూలమని గుర్తించడం ద్వారా చక్కని ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని లబ్ధిపొందే అవకాశం కల్గుతుంది. మంచి,

మానవత్వం, అందరూ హర్షించే సద్గుణాలు. మంచి ప్రవర్తన కలవారిని అందరూ ఇష్టపడతారు. మనమూ ఈశ్వరకోటి (భగవంతుడికి ఇష్టమైన వారి) పట్టికలో ఒకరుగా మారితే ప్రశాంత జీవనం 'కోరకుండానే' మన స్వంతమవుతుంది. ప్రయత్నించి చూద్దాం ! ఆచరణలో విజయులమైతే అమృత ఫలాలు మనస్వంతమైనట్లే ! ❋

# 23. సానుకూల భావనలో చిప్పిల్లే ఆనందం

'జంతూనాం నరజన్మ దుర్లభం!' ఈ ఒక్క వాక్యంతో మానవ జన్మ ఎంత ఉత్కృష్టమైందో తెలియజేశారు మన రుషులు. అన్ని అంగాలు, హంగులూ వుండే మనం వాటి విలువ తెలుసుకోలేక నిరాశ నిర్లిప్తతల్లో కూరుకుపోయి మన జీవితాలను దుర్భరం చేసుకుంటాం. ఎందరికో మనస్తాపం కల్గిస్తుంటాం. శరీరం, మనసు - ఇవి భగవంతుడిచ్చిన అమూల్యవరాలు. అందంలేదనో, విద్యలేదనో, సంపదలేదనో వెలితిగా జీవిస్తూ ఒకచో మనల సృజించిన పరమాత్మ ఉనికినే ప్రశ్నిస్తూ కృతఘ్నులుగా జీవించడం వెనుక మన అజ్ఞానమే ఉందని గ్రహించలేం. లోకాన్ని చూడలేని అంధుల చూచినపుడు మనకన్నులు ఎంత గొప్పవరమో అర్థమవుతుంది. పంచభక్ష్యపరమాన్నాలు లేవని గునుస్తూ రుచుల వేటలో మునిగివేసారిపోయే మనం ఆ పూటకు తిండిలేని దురదృష్టవంతుల గురించి ఆలోచించం. న్యాయబద్ధతకలిగి శాంత్యానందాలతో కూడి దైవం చూపిన బాటలో నడవటం మనకర్తవ్యమని తెలుసుకోలేక చింతిస్తూ తప్పుదోవ పడుతుంటాం!

ఒక మంచిపని కలకాలం ప్రశంశార్హంగా నిలుస్తుంది. పరులకు చేసిన మేలు మన హృదయ సీమలో భద్రంగా నిలిచి వుండి అమృత రసాలూరిస్తూ మనల అమృతపుత్రుల జేస్తుంది. మనం కోరుకునే ఆనందం బయట ఎక్కడో వుందను భ్రమతో జీవించే మనం అది మనలోనే వుండి మననుంచే బహిర్గతమై మన జీవితాలను ఆనందమయం చేస్తుందని గ్రహించలేకపోతాం!

బాల్య యవ్వనాలు మానవ జీవితంలో అపురూపదశలు. వాటి జ్ఞాపకాల దీప్తి అప్పుడప్పుడూ మనసులో మెదులుతూ వుంటుంది. మన మిత్రులతో గడిపిన అలనాటి మధుర జ్ఞాపకాలు హృదయ స్పందన ద్వారా అనుభూతిస్తే ఆ అపురూప

క్షణాలను మన మనోహర మనోసీమలో దర్శించి, స్పర్శించి మహదానందం పొందుతాం. మనసు జ్ఞాపకాల పొరల్లోంచి ఒకటొకటిగా బయల్వెడలే ఆ మధుర స్వప్నధారను జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలి. వాటిని అనుభూతించగలమేమోగానీ వర్తమానంలో పునరావృత్తి చేయలేం.

ఆనందంగా జీవించాలనే తపన అందరికీ వుంటుంది. కానీ ఆనందం ఎక్కడ వుందో, ఎలా చేజిక్కించుకోవాలో తెలియక మనిషి తికమకపడుతుంటాడు. ధూమపానంలో, మద్యపానంలో, జూదంలో, స్త్రీ వ్యామోహంలో ఆనందాన్ని వెదుక్కుంటూ వాటి సేవచేసే కొందరు వాటి నుంచి ఆనందం బదులు గరళం చిమ్మినపుడు కలవరపడతారు. నరకాన్ని చేరువచేసే ఆ దురలవాట్లను వదిలించుకోలేని అశక్తతతో వ్యసనపరులు అల్లాడిపోతారు.

సానుకూలభావాలు మనిషి జీవితాన్ని పండించే పరమానందశక్తులు. దైవం, స్తుతి, ప్రార్థన, దేవాలయం, ప్రశాంతి, ఆనందం, సౌహార్ద్రం, సామరస్యం, సంతోషం, సానుభూతి, క్షమ, ప్రేమ, కృతజ్ఞత, అహింస, అనురాగం, విజయం, స్నేహం, సాహసం, శాంతి – ఇలాంటి పదాలు వింటేనే మది పులకించిపోతుంది. ఆనందం చిప్పిల్లుతుంది. వాస్తవరూపంలో అదైవీలక్షణాలు సాధించిన సాధకుల జన్మలు ధన్యం! నిత్యసంతోషి నిండునూరేళ్ళు హాయిగా జీవిస్తాడు. ప్రతికూల భావాలు రోగాల్ని, దరిద్రాన్ని వెంట తెస్తాయన్న స్పృహ కొరవడిన కొందరు నిరాశానిస్పృహలతో జీవితాన్ని వెళ్లబుచ్చడం దృశ్యజగత్తులో పరిపాటి కావడం విచారించదగ్గ విషయం.

మనిషి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుంటే, అది సానుకూలాంశమైతే దైవం తోడ్పాటు తప్పక ఉంటుందని విశ్వసించాలి. మంచి కార్యాలకు ఇరుగుపొరుగు వారి సహకారం అయాచితంగా లభించవచ్చు.

సానుకూల భావాలు నిండిన మనసు పవిత్ర గంగాజలం వంటిది. పరుల సేవ పరమాత్మసేవకు పర్యాయం! 'నొప్పించక, తానొవ్వక' అంటూ శతకకారుడు చెప్పిన సత్యం సంస్మరణీయం. తను బాధపడుతూ ఒకరికి చేసే సహాయం మంచి ఫలితాలనివ్వదు. ద్రవ్య సహాయం చేయలేని వారు ఒక మంచి

మాటతో ఆర్తులనూరడించగలరు. ఒక మంచి లక్ష్యంతో నిర్దేశిత కార్యసాధనకోసం మనం ఈ లోకంలోకి వచ్చామని విశ్వసించి, బాధ్యతలు చక్కగా నిర్వర్తిస్తే వ్యక్తికి ఇహపరాల్లో అభ్యుదయమే కల్గుతుంది. దైవాన్ని నమ్ముతూ ఆయన సృష్టిని గౌరవించే వాడు సానుకూల భావాల వలన కలిగే అన్ని లాభాలూ పొందుతాడన్నది తోసిపుచ్చలేని సత్యం. మన కర్తవ్యాలను ప్రతికూలభావాల జడిలేని సరళ వ్యవహారశైలితో నిర్వర్తిస్తూ అభ్యుదయ మార్గాల్లో ఆనందాన్ని కైవసం చేసుకొని సుఖజీవనం చేద్దాం ! ❋

# 24. మనసు - మకిల

శరీరానికి గానీ, దుస్తులకు గానీ మకిల అంటితే చిరాకు పడతాం. నీటితో పోయేదైతే వెంటనే కడుక్కుంటాం. దుస్తులకు అంటిన మరకలను ప్రత్యేక రసాయనాలతో శుభ్రపరచుకుంటాం. మరి మనసుకు అంటే మకిల గురించి పట్టించుకోం. ఎందుకంటే అది కంటికి కనిపించేదికాదు. అయినా మనసుకి పట్టిన మరకలు మన ఆహార విహారాలపై, జీవితంపై ప్రభావం చూపిస్తాయి. తినే ఆహారం కణకణంలోనూ జాగ్రత్త అవసరం. గడిపేకాలం క్షణక్షణం పట్టించుకుంటే ఎలా చేస్తే ప్రశాంతంగా, ఆనందంగా ఉంటుందో లెక్కకట్టి మరీ అడుగు ముందుకు వేయాలి. మనసును మకిల బారిన పడకుండా చూచుకోవడం వల్లే అంతః శౌచం ప్రాప్తిస్తుంది. విత్తనశుద్ధి వల్ల చీడపీడలు అంటనివిధంగా చిత్తశుద్ధి ఉంటే మానవజన్మ ఇహపరాలలో విజయపథంలో నడుస్తుంది.

చిన్నపిల్లవాడు కంటికి నదురుగా, ఆకర్షణీయంగా కనిపించిన ప్రతి వస్తువూ కావాలంటాడు. మరీ చిన్న పిల్లలయితే కనబడ్డ ప్రతి వస్తువునూ నోట్లో పెట్టుకుంటారు. ఆ చర్య వల్ల పడని పదార్థాలు, సూక్ష్మజీవులు కడుపులోకి పోయి ఆరోగ్యానికి హానిచేస్తాయని తెలియని పసితనం వారిది. తల్లిదండ్రులు వారించి జాగ్రత్త తీసుకుంటారు. చిన్నపిల్లల ఈ మనస్తత్వాన్ని పెద్దలు సైతం అనుకరిస్తారనీ, బాగోగులు పట్టించుకోకుండా ప్రవర్తిస్తారనీ మనకు ఎరుక ఉండదు. ఆటపాటల్లో అడ్డువచ్చిన ప్రత్యర్థి బాలుడిపై పసివాడు చేయిచేసుకుంటాడు. అది ఆటే కాబట్టి అంతవరకే పరిమితం! రజోగుణ ప్రభావితులైన పెద్దవారు ప్రత్యర్థులు కుప్పకూలాలనీ, నాశనం కావాలనీ కోరుకుంటారు. ప్రత్యర్థులకు హాని జరుగుతుందో లేదోగాని అలా కోరుకున్న వ్యక్తి మనసు మాత్రం కలుషితకాసారమవుతుంది. కొందరు ఎలాంటి సన్నివేశంలోనైనా నిబ్బరంగా ఉంటారు. మరికొందరు నిబ్బరంగా కనిపిస్తారు. సందర్భమేదైనా కల్లోలిత క్షణాల్లో మనకు జరకూడని హాని జరిగిపోతుంది.

బాహ్యంలో మార్పులేకపోయినా ఆంతరికంగా మనసు కల్మషాల జడివానలో తడిసిముద్దవుతుంది. నిర్జీవమవుతుంది.

మనసును తాకే సంఘటనలు అందరికీ రోజూ కొన్ని ఉత్పన్నమవుతుంటాయి. కొన్ని సన్నివేశాలు మనసుపై చెరగని ముద్రవేస్తాయి. అలా ముద్ర వేసే ఘటనలు నకారాత్మకమైనవయితే ఆ వ్యక్తి మానసిక జీవితం కుదేలవుతుంది. కొన్ని శారీరక వ్యాధులు సైతం దాడి చేస్తాయి. శారీరకంగా పరిశుభ్రంగా ఉంటూ తేజస్సును పెంచుకొనే ప్రయత్నంచేసే మనుష్యులు మానసికంగానూ అంతే పరిశుభ్రతను పాటించ వలసిన అవసరం వారి లౌకిక, ఆధ్యాత్మిక ప్రగతికి ఎంతో అవసరమని గుర్తించక తప్పదు.

సబ్బులు వంటి ఉపకరణాలు శరీరాన్ని శుభ్రపరిచినట్లు ఆధ్యాత్మిక జీవిత పంథా మనసును శుభ్రపరుస్తుంది. పవిత్రీకరిస్తుంది. ఓ కమనీయ దృశ్యం మనసును ఆహ్లాదపరచినట్లు; ఇంపైన సంగీతం మనసు నిండా ఆనందం నింపినట్లు; ఓ మంచి మాట విన్నా, మాట్లాడినా మనసుకు హాయికల్గుతుంది. చేసే దానధర్మాలవల్ల మనసుకు నకారాత్మక భావజాలం నుండి విముక్తి దొరికి సాంత్వన చేకూరుతుంది. 'బ్రతుకు, బ్రతకనివ్వు' అన్న సూత్రం వల్ల మనసును ఆవరించే కల్లోల మేఘాలను భగవన్నామం అనే మలయ సమీరంతో చెదరగొట్టవచ్చని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. చూపులో, మాటలో, చేతలో పవిత్రత వలన మనసు చైతన్య స్రవంతి అవుతుంది.

సమాజానికి చెడు జరగని విధంగా మసలుకొనేతీరును అందరూ హర్షిస్తారు. మనిషితో సహా ప్రతిప్రాణీ దైవం సృజించగా ఈ లోకపు జగన్నాటక రంగంపై నటిస్తున్నవారే! ఎవరి ఉనికికీ, శ్రేయస్సుకూ భంగం వాటిల్లని మన ప్రవర్తన మన మనసును నిర్మలం చేస్తుంది. దానికి దైవ విశ్వాసమనే రక్షాకవచం తొడిగితే మనసు మరలా మాలిన్యాల బారిన పడదు.

తోటివారి ఆనందానికి భంగం వాటిల్లని రీతిలో మనం ఆనందం పొందటం ఎలాగో జీవిత క్రీడలో మన అనుభవాలు మనకు నేర్పుతాయి. మాలిన్యం అంటని మనసు ఆనందాలపుట్ట. అక్కడే ఆరోగ్యం, ఐశ్వర్యం సైతం వెలుగులీనుతాయి. మనసు మకిలపట్టకుండా కాపాడే దైవచింతన సాధకుడికి ఇహ పరాలలో ఎన్నో లాభాలు చేకూర్చిపెడుతుంది. ❋

# 25. యోగ సాధన

మానవ జీవితం భౌతిక ఆధ్యాత్మిక వ్యాపకాలతో ముడిపడి ఉంటుంది. శరీర ఆరోగ్యం మానసిక ఆరోగ్యంపై ఆధారపడి వుంటుంది. మనసు ఉనికి తెలియని జీవులు చెడ్డ మనసు వల్ల సంక్రమించే వ్యాధులు రావు గనుక అధికశాతం ఆరోగ్యంగానే జీవిస్తాయి. ఏదైనా రోగం సంక్రమిస్తే పెంపుడు జంతువులు మినహా మిగతావన్నీ ఎలాంటి చికిత్సకూ నోచుకోవు. ప్రకృతే వైద్యురాలై వాటి సంరక్షణ చేస్తుంది. కోలుకోలేని జంతువులు రోగాలతో దైవాధీనంగా బ్రతుకీడ్వటం చూస్తాం.

మనిషికి మనసు ఓవరం! మనసు ఉండటం వల్ల విచక్షణతో మంచి చెడులు నిర్ణయించుకొని ప్రభావవంతమైన జీవితం గడిపేందుకు మనిషికి అవకాశం ఉంటుంది.

చాల మందికి తెలిసి ఉండవచ్చు; జంతువులు సైతం యోగా భ్యాసం చేస్తాయి. ఒళ్ళు విరుచుకోవడం, దేహాన్ని కొన్ని ప్రత్యేక భంగిమలలోనికి తెచ్చుకోవడం మానవులకు సామీప్యంగా వుండే పిల్లులు, కుక్కలు చేయడం చూస్తాం. అరగని ఆహారాన్ని కక్కేందుకు కుక్కలు కొన్ని రకాల గడ్డి మొక్కలు తినడం గమనిస్తాం.

సృష్టిలో మహోన్నతుడైన మనిషికి శరీర వ్యాధులకు వైద్యం చేసుకోవడం వేద పరంపరగా అందిన విజ్ఞాన ఫలితమే. ఆయుర్వేదం, రుగ్వేదంలో అంతర్భాగంగా అలరారుతూ మనిషికి అందుబాటులో ఉండటం అతడి సుకృతం. శరీర వ్యాధులకు వైద్యం తెలుసుకున్న మానవుడు ధ్యానాభ్యాసంతో ప్రశాంతంగా జీవిస్తూ ఆనందాన్ని అనుభవించడం అతడి పూర్వకర్మ విశేషం! అది రుషి పరంపరగా అందిన వారసత్వం! ఆధునిక వైద్య శాస్త్రంలో భౌతిక, మానసిక

రోగాలకు ప్రత్యేక విభాగాలు, చికిత్సలూ ఉంటాయి. రుషి సాంప్రదాయంగా శారీరక, మానసిక ఆరోగ్యాలు యోగాభ్యాసంతో సమకూరడం చెప్పుకోదగ్గ విశేషం!

ఆరోగ్యాభిలాషులు అనునిత్యం యోగ సాధన చేస్తారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం మహర్షులు ధ్యాన సాధన చేసేవారు. అలజడిలేని ఆలోచనా రహిత ధ్యాన స్థితిని సొంతం చేసుకొనేవారు. ఆ స్థితి శ్వాతమయిన వారు జీవన్ముక్తులుగా వెలుగొందారు! పరమహంస యోగానంద, మహా అవతార్ బాబా, లాహిరి వంటి యోగ పుంగవులు ధ్యానయోగాన్ని వెలుగులోకి తెచ్చి లోకానికి అందించారు. సాధకులు కొందరు బుద్ధ భగవానుడు ఆచరించిన శ్వాసపై దృష్టి నిలిపి చేసే ఆనాపానాసతి ధ్యానం అనుసరించగా మనసు – ఆత్మలో లయం చేసి (ఓభావన) పరమాత్మతో అనుసంధానం అయ్యేందుకు కొందరు యోగీశ్వరులు క్రియాయోగాన్ని రూపొందించి ఆచరించి చూపారు. క్రియాయోగ మంటే మనసు – ఆత్మల కలయికను భావన చేసి చేసే ధ్యానం! వెన్ను పూసను ఆశ్రయించి వుండే ఆరు చక్రాలపై ధ్యానం గురుముఖంగా నేర్చుకొని చేస్తే మంచి ఫలితాలనిస్తుంది. మహా అవతార్ బాబా కన్నులు తెరచి వుంచి ధ్యాన ప్రక్రియ నిర్వహించే వారట! లాహిరి మహాశయుడు సగం తెరచి ఉంచిన కన్నులతో ధ్యానం చేసేవారు.

ప్రజాకవి యోగి వేమన పద్యాలు పైకి మామూలు నిజాలను వెల్లడి చేస్తున్నట్లు కనబడినా లోపల ఎంతో నిగూఢ వేదాంత అర్థం ఉండేదని విమర్శకులు చెప్పడం విశేషం! బయటికి సాధారణ అర్థం ధ్వనించినా 'చెప్పులోన రాయి, చెవిలోన జోరీగ' అనే పద్యంలో 'ఓంకారాన్ని బయటికి చెప్పు; హృదయ ఫలకంపై రాసుకో!

'ఓంకార శబ్దం జోరీగ శబ్దంలా రెండు చెవులలో ఘోషించాలి!' అనే అర్థం వుందని వేదాంత పండితులు చెప్పడం విశేషం! ఓంకారం జపిస్తూ ధ్యానం చేయడం ఓ సాంప్రదాయం. ఓంకార నాద ప్రకంపనలు ధ్యాత (ధ్యానం చేసే

వ్యక్తి)లో ఆధ్యాత్మిక శక్తులు నింపడంతో పాటు ఆరోగ్యాన్నీ అందిస్తాయని ప్రాచీన యోగుల మాట.

నిరంతర ఇంద్రియాభిలాష వల్ల సంక్రమించే మానసిక అనారోగ్యం ఆధ్యాత్మిక ద్యానం ఆచరించడంతో నిర్వీర్యమవుతుంది. అపుడు చేకూరే మానసిక ఆనందం సచ్చిదానంద స్వరూపమని యోగీశ్వరుల భావన. ధ్యానాన్ని కొద్దిపాటి శరీర శ్రమ, స్వల్ప ప్రాణాయామం అనంతరం మనసు అలసిపోయాక మొదలు పెట్టాలంటారు శిక్షకులు. ఓ ధ్యేయాన్ని దర్శిస్తూ చేస్తే మనసుకు నిశ్చలత్వం, ప్రశాంతి లభిస్తాయన్న ది నిర్వివాదం. విడకుండా ప్రతిరోజూ ధ్యానం చేసినపుడు క్రమంగా ఆత్మోన్నతి సాధ్యమౌతుందని యోగీశ్వరుల మాట. ఇదే సాధన విస్తరించుకొని ఆత్మ దర్శనం పొందవచ్చున్నదీ వారి మనోగతం. ఓ రూపం లేని ఆత్మను భౌతిక వస్తువులను మాత్రం చూడగల కళ్ళతో చూడలేం కాబట్టి మనోయోగ సాధన ద్వారా ఆత్మ దర్శనం చేయవచ్చున్న యోగి పుంగవుల మాటను కృషితో నిజం చేయవలసిన బాధ్యత సనాతన ధర్మ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న మన అందరిపై ఉందన్నది కాదనలేని నిజం ! ❋

# 26. సంశయం

ఆధ్యాత్మిక జీవనంలో సంశయ పడటం ఒక దశ మాత్రమే! సంశయం కలగనిదే విచారణ చేసే అవకాశం లభించదు. విచారణలో సాధకుడు అనేక అంశాలను పరిశీలిస్తాడు. దేనికి దాన్ని నిగ్గు తేలుస్తూ సంశయాలన్నిటినీ పటాపంచలు చేస్తాడు. జ్ఞానులు, అద్వైత వేదాంతులు, 'నేతి... నేతి...' (ఇది కాదు.. ఇది కాదు) అంటూ ఒక్కో అంశాన్ని అధిగమిస్తూ ముందుకు సాగుతారు.

దృశ్య ప్రపంచంలో వస్తువులు అందరి కంటికీ ఒకేలా కనిపించవు. ప్రతి వారి దృష్టీ వేరు. ఒక యువకుడు ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళాడతానన్నాడు. తండ్రికి ఆ అమ్మాయి నచ్చలేదు. ఆ విషయమే యువకుడి ముందుంచితే, 'కాదు, ఆ అమ్మాయి సర్వ లక్షణ సమన్వితురాలు. ఆ అమ్మాయినే చేసుకుంటా'నన్నాడు. తన సంశయాలు కొడుకు ముందు విప్పిన తండ్రికి 'నా దృష్టితో చూడు.... నీకు నిజాలన్నీ బోధపడతాయి' అన్న కుమారుడి మాటలు కనువిప్పు కల్గించక పోయినా 'కుమారుడు తను చెబితే వినే స్థాయి దాటిపోయా'డని మాత్రం గ్రహించ గల్గాడు తండ్రి. ఒకరి దృష్టిలో మేలయినది వేరొకరి దృష్టిలో హీనంగా కనపడవచ్చు.

సాధకుడు సంశయ పడనిదే నిజాన్ని గ్రహించే స్థాయికి చేరుకోలేడు. సకల సంశయాలూ నశించిన తరువాతే అతడు మోక్షాన్ని చేరుకోగల అవకాశం ఉంటుంది.

తరగతిలో విద్యార్థికి సైతం ఎన్నో సంశయాలు వస్తుంటాయి. అధ్యాపకుడు వాటన్నిటినీ ఓర్పుతో, నేర్పుతో పరిష్కరించిన అనంతరం విద్యార్థికి చేరవలసిన జ్ఞానం చేరుతుంది. విద్యలో కృతార్థుడవుతాడు. గీతాకారుడు,

'సంశయాత్ముడు నశిస్తా'డని చెప్పడం చూస్తాం. సంశయాన్ని వదులుకోవలసిన తరుణంలో సైతం మూర్ఖంగా వ్యవహరిస్తూ తాను పట్టిన కుందేటికి మూడుకాళ్ళనే రకం సంశయాత్మకత వినాశం తెచ్చిపెడుతుందని గ్రహించాలి.

ఒక నేరం జరిగింది. పోలీసు అధికారి ఎందరినో అనుమానిస్తాడు. విచారణచేసే సమయంలో కొందరు నిర్దోషులని తేలుతుంది. నిజం నిర్ధారణ అయ్యాక అసలు దొంగ బయట పడతాడు. లౌకిక జీవన పథంలో విచారణ ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. ఒక సూది కొనడం నుంచి మోటారు వాహనం కొనడం దాకా అనేక సందర్భాల్లో సంశయాలను నివృత్తి చేసుకుంటూ విచారణతో ముందుకు సాగవలసి వుంటుంది. ఆధ్యాత్మిక జీవనంలో సైతం సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగితేనే భగవల్లాభం కలిగే అవకాశం ఉంటుంది.

జ్ఞాన సముపార్జన సులభమైన విషయం కాదు. జ్ఞానమందించే వాడు గురువు. శిష్యుడు సరైన వాడా, కాదా నిర్ధారణ చేసుకున్నాకే గురువు జ్ఞాన వితరణకు సిద్ధపడతాడు. శిష్యుడు సైతం ఎంతో విచారణ చేసి సంశయాలు నివృత్తి జరిగాకే గురు అన్వేషణలో సఫలీకృతుడవుతాడు. మూర్ఖులు సంశయాత్మక నైజం కలిగి వుండటం సహజం. మానసిక, శారీరక దుర్బలులను సైతం ఎన్నో అనుమానాలు పట్టి పీడిస్తుంటాయి. అవన్నీ తొలగడానికి జ్ఞానం అవసరం. అవసరమైన జ్ఞానాన్ని అందించేవాడు గురువు మాత్రమే!

ఆధ్యాత్మిక క్షేత్రంలో మూఢ నమ్మకాలు, మూఢాచారాలకు తావుంటుంది. జంతుబలులు, చేతబడులు ఇత్యాది మూఢనమ్మకాలు క్షుద్రదేవతోపాసనలో ఉంటాయి. విసర్జనీయ పద్ధతులను విడనాడి శాస్త్ర సమ్మతమైన పూజా విధానాలను సాధకుడు చేపట్టవలసి వుంది.

ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతిని అందించే పవిత్ర వ్యాపకం. తను చేసే పూజలు, జపతపాలు, స్తవస్తోత్రాలు తనకు కళ్యాణ కారకం అవుతాయనీ, వంశవృద్ధి జరుగుతుందనీ సాధకుడు విశ్వసించాలి! దైవం పట్ల దృఢ విశ్వాసం

వల్ల అనవసర సందేహాలు దూరమవుతాయి. త్రిమూర్తులు సృష్టి స్థితి లయలు ఆద్యాశక్తి అంశగా చేస్తారని శాస్త్రాలు చెబుతాయి. సృష్టిలో ద్వంద్వాలు సహజం. మంచిచెడ్డలు ప్రతి అంశంలోను ఉంటాయి.! చెడును చూచి సాధకుడు బెదరవలసిన పనిలేదు. దైవాన్ని శరణుజొచ్చి శుద్ధభక్తిని ప్రసాదించమనీ, భువనమోహనమయిన భగవానుడి మాయలో సమ్మోహితుడు కాకుండా తనను కాపాడమనీ మనసా వాచా కర్మణా సర్వస్య శరణు వేడి భక్తుడు ప్రార్థిస్తే సంశయాలనన్నిటినీ దైవం పటాపంచలు చేస్తాడు. ఆ విశ్వాసంతోనే సాధకుడు ప్రతి అడుగూ ముందుకు వేయాలి.

కేవలం విచారణ ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోలేం. విశ్వాసం ద్వారానే అది సాధ్యమవుతుందన్న రామకృష్ణ పరమహంస పలుకులు సర్వదా ఆచరణీయం! ❋

# 27. జ్ఞాన కిరణం

అదో చారిత్రక మహా కట్టడం. ఎప్పుడూ సందర్శకులతో కిటకిటలాడుతూ కనువిందు చేసే ఆ మహా సౌధం ఒకప్పుడు సంభవించిన భూకంపంలో కూలిపోయింది. ఎల్లెడలా పరుచుకున్న ఇటుకలు, ఒకటొకటిగా వాటిని పేర్చి భవనం రూపురేఖలు దాల్చడంలో తోడ్పడిన సున్నం – దుమ్ము, ధూళి రూపంలో ఆ ప్రాంతమంతా పరుచుకున్నాయి. ఆ సంఘటన తర్వాత ఆ కళాఖండమున్న ప్రాంతం పర్యాటక ప్రాధాన్యత కోల్పోయింది. అందుక్కారణం ఆ మహాకట్టడం నామ రూపాలు లేకుండా పోవడమే! ఓ తార్కికుడు ఇలా ఆలోచించాడు "భవన నిర్మాణంలో ఉపయోగించిన ఇటుకలు, సున్నమూ, అప్పుడూ ఉన్నాయి ఇప్పుడూ ఉన్నాయి. లేనిదల్లా భవనపు పూర్వ రూపురేఖలు మాత్రమే! ఒకప్పుడు ఉన్నది, ఇప్పుడు లేనిది ఆ చారిత్రక కట్టడపు పూర్వ ఆకృతి మాత్రమే! సందర్శకులను ఇప్పుడా ప్రదేశం ఎందుకు ఆకర్షించడం లేదు?"

తరచి చూస్తే మానవ దేహము, జీవితమూ అంతే! అనిపించిందతడికి. ఎముకలు, కండరాలు, రక్తమాంసాలను చర్మం కప్పి వుంచినంతకాలం దేహధారుల ఆకృతులు అందంగా ఆకర్షణీయంగా కనబడతాయి. స్త్రీలు సౌందర్య పోటీలలో పాల్గొని విజేతలౌతుంటారు. సౌందర్య పిపాసులు, ఆరాధకులలో మధురానుభూతులు వెలయింప గల మానవ దేహాలు బహుశ విరాగులకు సప్తధాతువులు, మలమూత్రాలతో కూడిన ఉపాధులుగానే గోచరించవచ్చు. దృష్టి చూచే చూపుకు అనుగుణంగానే ఉంటుంది. అయితే వైరాగ్యం అందరూ అందిపుచ్చుకొనే సులభమైన అంశం కాదు.

అభ్యాస వైరాగ్యాల వల్ల మనసును లొంగదీసుకొని ఇంద్రియాలపై పట్టు సాధించవచ్చని శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చాడు. అహంకార

మమకారాలతో జీవితాన్ని దుర్భరం చేసుకుంటారు కొందరు. 'నేను' అనే ప్రకృతి 'ఆత్మ'గా అందరికీ తెలుసు. సర్వత్రా వ్యాపించి వుండే ఆత్మ తరతమభేదాలు లేనిదే అయినా 'నేను' 'అహం'గా శృతిమించినపుడు మనిషి పతనానికి కారణమవుతుంది. దుష్ట దుర్యోధన, రావణాసురులు లోభత్వానికి, కాముకత్వానికీ బానిసలై అహంకారంతో పతనానికి చేరుకున్న వారే!

ఒక భవనాన్ని ఆనందంగా నిర్మించేది భవన నిర్మాణ నిపుణులైన కార్మికులే అయినా భవన యజమాని ఇంటిని 'తాను' నిర్మించానంటాడు. భగవత్ప్రసాదితమైన తన దేహ సౌందర్యం, ఆస్తిపాస్తులు తన ఘనతగా, ప్రయోజకత్వంగా భ్రమపడి గర్విస్తాడు మనిషి. నూటికో కోటికో ఒక మహనీయుడు తన శక్తి సామర్థ్యాలు, గొప్పతనం భగవంతుడు తనకు అనుగ్రహించిన భిక్షగా తెలుసుకుంటాడు. తినడం, తాగడం, నిద్రపోవడం, జీవనోపాధి నెరపడం మాత్రమే జీవితం కాదు. భార్యా బిడ్డలను పోషించడం మాత్రమే బాధ్యతలు నిర్వర్తించడం కాదు. బతుకు మూన్నాళ్ళ ముచ్చట అని తెలుసుకున్న తర్వాతే ఇతర గురుతర బాధ్యతలు మనిషి దృష్టికి వస్తాయి. సేవ సామాజిక బాధ్యత. ఆ బాధ్యత స్వీకరించిన ఉదార వరేణ్యులు తమ డబ్బును సద్వినియోగం చేసుకోవడం మనకు తెలుసు. కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని కొందరు మహనీయులు ఔదార్యం చాటుకుంటున్నారు. తమ జీవితాల ప్రయోజనం, పరమార్థం తెలుసుకొని ధన్యజీవులవుతున్నారు.

ఓ పండు ముసలి నడక త్రోవపై పడుకొని వచ్చే పోయే వారిని భిక్ష కోసం అర్థిస్తున్నాడు. అటుగా పోతున్న తార్కికుడు అతడి భిక్షా పాత్రలో అధిక విలువ గల కరెన్సీ కాగితాన్ని ఉంచాడు. గాలికి ఎగిరి పోకుండా పట్టుకోమని సూచించాడు. ఆ దారిలో వెళుతున్న మరో వ్యక్తి దానం చేసిన తార్కికుడితో 'భిక్షగాడు ఒకప్పుడు చాల బాగా బతికినవాడు. స్థితిపరుడు. పెద్ద పెద్ద భవంతులు ఉండేవి. ఎంతో అందంగా హుందాగా ఉండేవాడు. కాలగతిన అతడి సంపద ఆవిరై పోయింది. మనిషి ఇలా అయ్యాడు.'

ఇలాంటి జీవితాల కథలు కొందరిలోనైనా జ్ఞాన జ్యోతులు వెలిగిస్తాయి.

శుష్కించిపోయి బవిరి గడ్డంతో అత్యంత దీనావస్థలో ఉన్న భిక్షగాడి గురించి తార్కికుడితో బాటసారి అన్న మాటలు అతడిలో ఆలోచన రేపాయి. 'కనిపించే భవనాలు, మనుష్యుల అంద చందాలు, సంపదలు శాశ్వతం కావు. శాశ్వతమైనదేదో దానిని సాధించాలి' అనుకున్నాడు తార్కికుడు. ఓ ఆధ్యాత్మిక జ్ఞాన కిరణం అతడి మనసులో తళుక్కున మెరిసింది. ఆ కిరణ ప్రభ వెలుగులో తన నిండు జీవితాన్ని అర్థవంతమైన రీతిలో గడిపి జన్మ చరితార్థం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. ఆ నిర్ణయాన్ని దైవం హర్షిస్తున్నాడా అన్నట్లు సమీప దేవాలయంలో గుడి గంటలు మ్రోగాయి. ❋

# 28. అహింస

అన్ని ధర్మాలలోకి అహింస పరమధర్మంగా చెప్పబడింది. అయినా హింస అనాదిగా లోకంలో తోక ఝాడిస్తూనే వుంది. బలమైన మృగాలు బలహీనమైన జంతువులను వేటాడి, చంపి భక్షిస్తాయి. ఇలాంటి హింస సృష్టికొనసాగింపులో భాగమే! మానవులు కూడ పశుపక్ష్యాదులను చంపి ఆహారంగా స్వీకరిస్తారు. ఆ చర్యలో హింస బహిరంగంగానే వుందన్నది కనబడే నిజం. ఈ నేపథ్యంలో, సృష్టి పరిపోషణకు హింస అనివార్యమైనపుడు అహింసను పరమధర్మంగా మన పెద్దలు ఎందుకు చెప్పారన్న ప్రశ్న బలం పుంజుకుంటుంది.

హింస రెండు రకాలు. ఒకటి శారీరక హింస, రెండవది మానసిక హింస. శారీరక హింస జంతువులతోపాటు మనుషులు కూడ చేసేదే అయినా మానసిక హింస చేయగల సామర్థ్యం మనిషికి మాత్రమే వుంది. శారీరకంగా దేహ విచ్ఛిత్తి కల్గించడం ఒకరకమైతే ఎలాంటి ప్రత్యక్ష హింస చేయకుండా సూటిపోటి మాటలతో తోటి మనిషి మనసు నొప్పించడం, కలవరపాటుకు గురిచేయడం మానసిక హింస పరమార్థం! మానసిక హింసలో శరీరానికి ఎలాంటి ఘాతమూ కలగదు. కానీ మనసు కల్లోల సంద్రమౌతుంది. దేహానికి కలిగే నొప్పి కాలవశంగా మానిపోయేది కాగా మనసుకు కలిగే బాధ కలకాలం గుర్తుండిపోతుంది. 'హింస' పదానికి నిఘంటువు 'వధ', ప్రాణచ్ఛేదమనీ అర్థం చెప్పగా మనసుకు ఆమోతాదులోనే హింస వల్ల ఘాతం కల్గుతుందన్నది గమనించదగ్గ నిజం!

మాటలతో హింసించే వాడికి హింస వినోదంగానే వుంటుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా హింసకారుడు తన ప్రవృత్తి కొనసాగిస్తాడు. బాధితుడు

తెలుసుకోలేదని భావించి ఆ దుశ్చర్య సాగించడం ఒక ఎత్తయితే, బాధితుడికి ఆ నిర్వాకం అర్థమైనా ప్రతిహింస చేయలేని అతడి నిస్సహాయతను ఆసరా చేసుకొని హింస కొనసాగించడం అపరాధికి అనుకూలాంశమౌతుంది. సూటిపోటి మాటల హింస కరకురాయిలా తక్షణం బాధించడమే కాక ఓ చేదు జ్ఞాపకంగా కలకాలం కలుక్కుమని ముల్లులా గుచ్చుకుంటూనే వుంటుంది. అయినవారి, బయటివారి మాటల తూటాలను ఎదుర్కోవడం సులభమైన విషయం కాదు. ఈనాడు మహిళలపై కొనసాగే గృహ హింస, వీధి హింస ఈ కోవకే చెందుతాయి. అబలలైన గృహిణులు అయినవారి వాక్ హింస భరించలేక జీవితాలను అంతం చేసుకుంటున్న ఉదంతాలు ఎన్నో. బాధితుల నిస్సహాయతను ఆసరా చేసుకొని రెచ్చిపోయే మగధీరులెందరో! చదువుకున్నవారు, చదువుకోనివారు అన్న తేడా లేకుండా అందరూ వాక్ హింస కొనసాగించే వారే అయినా విద్యావంతులు, సమాజంలో హోదాగలవారు వినోదం కోసం, లేక ఒక ఉప లబ్ధికోసం వాక్ హింస కొనసాగించడం ఒక సామాజిక జాడ్యం.

శిబి చక్రవర్తి ఓ పావురాన్ని రక్షించడం కోసం డేగకు పావురాయి శరీర తూకానికి సమానమైన మాంసాన్ని తన తొడ నుండి కోసి సమర్పించడం మనకు తెలుసు. సృష్టి యావత్తూ భగవత్ సృజన. ప్రాణులకు తల్లీతండ్రీ భగవంతుడే. ప్రతి ప్రాణి ప్రకృతి నియమాలకు లోబడి జీవించడం సృష్టి నిర్దేశం. ఆ మేరకు మనుష్యులు జీవయాత్ర సాగించడం ప్రకృతి దర్మం. ప్రకృతి ధర్మాన్ని అనుసరిస్తూ కొనసాగే ధార్మిక జీవన ప్రస్థానంలో అహింస స్థానం సాటిలేనిది.

ధర్మవ్యాధుడు కసాయి వృత్తి అవలంబించినా అతనేనాడూ జీవవధ చేయలేదు. ఎవరో చంపి తెచ్చిన జంతుమాంసాన్ని కేవలం విక్రయించడం బ్రతుకు తెరువు కోసం వృత్తిగా చేసుకున్నవాడు. ఆ మహనీయుని అహింసకు ప్రతిరూపంగా ధర్మశాస్త్రాలు గుర్తించడం విశేషం! కౌశికుడికి ధర్మబోధ చేయగల స్థాయికి ఎదిగిన పరమ భాగవతోత్తముడు ధర్మ వ్యాధుడు.

తన శరీరానికి, మనసుకు ఘాతం కల్గితే విలవిలలాడిపోయే మనిషి ఎదుటివారికి తనవల్ల ఆ దుర్గతి కలుగకుండా గుర్తించి వర్తించడం నేర్చుకోవాలి.

అదే సంస్కారం! మాటలో మంచితనం ప్రదర్శించడం ప్రస్తావించదగిన సద్గుణం! సుహృద్భావ పూరితమైన ప్రవర్తన వల్ల బంధుమిత్రులు, అపరిచితులు సైతం ఆహ్లాదాన్ని పొందుతారు. ఇరువురిలోను సంతోషం వెల్లివిరుస్తుంది. ఆనందం పొందడం, అందించడం మనసున్న మనిషి కర్తవ్యం. బ్రతుకు మూణ్నాళ్ళ ముచ్చట అన్న నిజం తెలుసుకున్న ఏ వ్యక్తీ ఎదుటివాడి మనసు నొప్పించడు. ప్రపంచంలో ఒకరిపై మరొకరి ఆధిక్యత తాత్కాలికం. హోదావల్ల, అధికారం వల్ల, ఉన్న స్థితి వల్ల లభించే ఆధిక్యత శాశ్వతమని భావించే ప్రబుద్ధుడు మూర్ఖుడే! భౌతిక చట్టాలు శిక్షించలేని నేరాలు, పాపాలకు సైతం పారమార్థిక దృక్కోణంలో శిక్షలు ఉంటాయని మరువకూడదు. అహింసతో కూడిన నిష్కళంక సాత్త్విక జీవనం ఇహపర లాభాలు రెండూ ప్రాప్తింపజేస్తుందనే సత్యాన్ని మనిషి వివేకంతో గ్రహించవలసి వుంది.
*

# 29. అంచెలంచెల సాధన

'ఓ గమ్యానికి నడక ప్రారంభించినపుడు చేరవలసిన ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుంటాం. నిర్దేశిత రహదారిలో వేసే ప్రతి అడుగూ గమ్యాన్ని దగ్గర చేసేదే! గమ్యం నిర్ణయించుకున్నాక దృష్టి అడుగులపై ఉండాలే కానీ గమ్యంపై కాదు. అడుగులను గమనించుకుంటూ ముందుకు నడిస్తే కష్టం తెలియకుండా చేరవలసిన ప్రాంతం చేరుతాం. గమ్యంపై దృష్టితో అడుగులను మరిస్తే ప్రయాణం భారమౌతుంది. ఆధ్యాత్మిక ప్రయాణమూ అంతే! సాధనాంశం పద్ధతి ప్రకారం ఉందా లేదా చూడాలి. మోక్షంపై తదేక దృష్టి వల్ల సాధన కష్టతరమౌతుంది. 'ఓ గురువు తన శిష్యుడికి బోధించిన ఆధ్యాత్మిక అనుభవమిది.

ఒక రోగానికి పనిచేసే దివ్యౌషధం వాడవలసిన పద్ధతిలో వాడితే సక్రమంగా పనిచేస్తుంది. అలా వాడనపుడు రోగం తగ్గని విధంగా సాధనలో కూడా నేర్వవలసిన విధి విధానాలు, అంచెలు చాలానే వుంటాయి. యుక్తాయుక్త విచక్షణతో సాధన క్రమాన్ని పాటించే భక్తులు దివ్య ఫలాలను అవశ్యం కైవసం చేసుకోగల్గుతారు.

మోక్ష లక్ష్యం చాలా పెద్దది. అనేక మంది 'మహాత్ములు' చేరుకున్న గమ్యమది. భగవత్ సాక్షాత్కార గమ్యాన్ని ఓ సగటు సాధకుడు సులభంగా చేరుకోలేడు. ప్రయత్నించిన ప్రతి వారూ లక్ష్యాన్ని చేరుకోలేకపోయినా చాలా దూరాన్ని అధిగమిస్తారు. లక్ష్యం ఎంత దూరంలో వున్నా ఆ మధుర ఫలపు సుమధుర పరిమళాలు అడుగడుగునా ఆఘ్రాణించగల్గుతారు.

ఓ గురువు శిష్యుడితో అన్నాడు, 'మోక్ష సాధన అంచె లంచెలుగా ఉండాలి. ఉన్న పళంగా గమ్యం చేరువకు రాదు. విద్యాభ్యాసంలో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిలున్నట్లే ఆధ్యాత్మిక క్షేత్రంలో కూడ సాధన పాఠాలు

అంచెలంచెలుగా నేర్వాలి. ఓ ప్రాథమిక స్థాయి విద్యార్థి పట్టా తరగతిలో నేర్చుకోగలిగేది ఏమీ ఉండదు. అందుక్కారణం ఉన్నత విద్యాపాఠాలు క్రింది స్థాయి విద్యార్థులకు అర్థం కాకపోవడమే!.

వేదాలు జ్ఞాననిధులు. అవి పండితులకేగానీ సామాన్యులకు అర్థంకాని జ్ఞాన భాండారాలు. అయితే జ్ఞానం పామరులు సహా అందరూ నేర్వవలసినదే! వేదవేదాంగాలు అర్థం చేసుకోవడం కష్టతరమని భావించిన మహర్షులు వేదసారాన్ని ఇతిహాసాలుగా, పురాణాలుగా మలచి సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు. శ్రీ మద్రామాయణ మహా భారతాది ఇతిహాసాలు, భాగవతం వంటి పురాణాలు సకల వేదాల సారాన్ని తమలో ఇముడ్చుకొని కథల ఆధారంగా విస్తరించాయి.

రామాయణం అరిషడ్వర్గాలలో కామం వల్ల మనిషి ఎంత నష్ట పోతాడో దుష్ట రావణ పాత్ర ద్వారా వివరించింది. పాతివ్రత్యం స్త్రీలకే కాదు, ఏకపత్నీవ్రతం పురుషులకూ అవసరమని రాముడు, సీత పాత్రల ద్వారా నివేదించింది. దుష్టాంగాన్ని ఖండించినట్లు చెడ్డవాడు అయితే సోదరుని సైతం విడనాడాలని విభీషణుడి పాత్ర వివరిస్తుంది. ఆంజనేయుడు కష్టతరమైన కార్యాన్ని సైతం ఎంత సమర్థంగా సాధించవచ్చో తేటతెల్లం చేస్తాడు.

మారుతి రామ భక్తి సామాన్య మానవులు భగవంతుడి పట్ల ఆత్మీయ ప్రేమ కల్గి ఉండటానికి ప్రేరణ అవుతుంది. ఈ మహాకావ్యంలో అగస్త్య మహర్షి ద్వారా శ్రీ రాముడికి యుద్ధభూమిలో తెలియబడిన 'ఆదిత్య హృదయం' సూర్యభగవానుడి సర్వ వ్యాపక చైతన్యశక్తిని తెలియజేస్తుంది. ఆ స్తోత్రం శ్రద్ధగా పఠించిన వారికి సతత ఆయురారోగ్య ఐశ్వర్య సంపద ప్రాప్తిస్తుందని ప్రతీతి. సుందరకాండ ద్వారా రామభక్త హనుమంతుడి దివ్యలీలలు విశదమౌతాయి. సద్ భక్తుడు భగవంతుడంతటి శక్తి మంతుడని వెల్లడి చేసే గొప్ప విభాగం సుందర కాండ... బంగారు లంకకు ప్రభువైన రావణుడు ఇంద్రియ దాసుడైన కారణంగా సర్వమూ కోల్పోయి అనాథగా మరణాన్ని ఆహ్వానించిన ఉదంతం రామాయణం కన్నులకు కడుతుంది.

జూద క్రీడ వంటి దుర్వ్యసనాలు జీవిత స్థాయిని దిగజారుస్తాయి. ఆ మహా సత్యాన్ని శ్రీ మన్మహా భారతం తెలియజేస్తుంది. హిందూ వారసత్వ సంస్కృతికి ఆధార భూతమైన 'భగవద్గీత' ఆవిర్భవించింది మహాభారతం నుంచే! మహా భారతం అనుశాసన పర్వంలోని భీష్ముడు ధర్మరాజుకు అందించిన 'విష్ణు సహస్ర నామ స్తోత్రం' సర్వ మానవాళి జీవితాలను ఉద్ధరించే మహా నారాయణ మంత్రం.

ఇతిహాస పురాణాలు నిత్య పారాయణకు అర్హమైనవి. అనువైనవి. సుందరకాండ, భగవద్గీతలను లక్షలాది సాధకులు రోజూ మననం చేస్తారు. శాప వశాత్తూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడే అంతిమ ఘడియల్లో పరీక్షిన్మహారాజు శుక మహర్షి ద్వారా నారాయణ లీలా శ్రవణం (భాగవతం) విని ఉత్తమ గతి పొందుతాడు.

'అంచెలంచెలుగా సాధన' మాధ్యమంగా ఈ పవిత్ర గ్రంథాల సారాన్ని అనుభవైక వేద్యం చేసుకోవాలి. ప్రస్తుత జన్మలో లక్ష్యం చేజారితే మరుజన్మలో ఆ పవిత్ర ఆకాంక్ష నెరవేరుతుందని సనాతన ధర్మాన్ని అవలంభించే భక్తులు విశ్వసిస్తారు. సాధనలో మెట్లు ఒకటొకటిగా ఎక్కి ఉన్నత స్థితికి చేరుకోవచ్చు. ఈ విషయంగా ఎటువంటి సంశయం అవసరం లేదని భక్తాగ్రేసరుల గాథలు నివేదిస్తాయి. ఆ పరమ సత్యాన్ని స్ఫురణలో ఉంచుకున్న సాధకులు తమ పరమగమ్యాన్ని అంచెలంచెల సాధన ద్వారా సాకారం చేసుకోగలరని విశ్వసిద్దాం. ❋

# 30. మన వాంఙ్మయంలో మహోన్నత విలువలు

**భా**రతదేశం పవిత్రమైనది. ఆ పవిత్రత మన వేద వాంఙ్మయం, ఇతిహాస పురాణాలైన రామాయణ, మహాభారత, భాగవతాది కావ్యాలు వలన ఉద్దీపన అయి మన సంస్కృతిని ప్రతిఫలిస్తుంది. ఆ వాంఙ్మయం మన దేశీయులనెంతగా ప్రభావితం చేసిందంటే మనవారి పేర్లు కూడా పురాణేతిహాసాల కథానాయకులు, నాయికలవే కావడం విశేషం! ఆధునిక మానవ జీవన శైలి ఒత్తిడితో కూడి సంక్లిష్టంగా మారటం మనం చూస్తాం. భగవద్గీత ఓ సానుకూల దృక్పథకావ్యంగా, వ్యక్తిత్వ వికాస సాధనంగా మనకు ఉపయోగపడటం ప్రస్తుతనీయం. రామాయణం నుంచి, భారతం నుంచి, భాగవతం నుంచి, భగవద్గీత నుంచి ఎన్నో కార్యసిద్ధి సూత్రాలు మన దృష్టికి వస్తాయి. ఆదికవి వాల్మీకి సృజించిన రామాయణంలో ప్రతినాయకుడి పాత్రతో సహా ప్రతిపాత్రా ఆధునిక జీవన సౌలభ్యానికి తోడ్పడేదే!

**రామాయణం :** శ్రీరాముడు ఈ కావ్యానికి కథానాయకుడు. ధర్మ సంరక్షణ కోసం ఆయన అవతరించాడు. ఆయన పుట్టింది లగాయతు అవతారపరిసమాప్తి దాకా ఆయన జీవన నేపథ్యం చూస్తే పవిత్రత అలరారుతుంది. దుష్ట శక్తులపై పోరాటం, సాధుజనులను ఆదుకొనడం ఆయన మంచి వ్యక్తిత్వానికి తార్కాణాలు. ఈ ఆధునిక యుగంలో అవినీతిపరులను ఎదుర్కొనడం, సామాన్యులను ఆదుకొనడం కోసం ప్రభుత్వాలు, సంస్థల దృక్పథం ఎలా ఉండాలో తెలియజెప్పే అంశమిది.

ఈనాడు స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింసలకు పరిష్కారం శ్రీరామచంద్రుడి ఏకపత్నీత్వ అంశం నుండి లభిస్తుంది. రామాయణ కథను నమ్మి ఒంటపట్టించుకున్న ఏ మగవాడూ పరస్త్రీని కన్నెత్తి చూడడు.

గురువైన విశ్వామిత్రుడు రుషుల యుగాలను రక్షించడం కోసం దశరధుని అనుమతితో రామలక్ష్మణులను అరణ్యానికి కొనిపోయాడు. యాగాలకు విఘ్నాలు కల్గిస్తున్న రాక్షసులను చంపిన తర్వాత సీతాస్వయంవరంలో శ్రీరాముడు పాల్గొని ధనుర్భంగం చేశాడు. జనకుడు సీతాదేవితో శ్రీరాముడి వివాహం గురించి ప్రస్థావించినపుడు తండ్రి అనుమతి లేనిదే వివాహం చేసుకోనని ఆయన చెప్పడం తండ్రి మాటకు తనయులు ఎంత విలువివ్వాలో తేలతెల్లం చేస్తుంది. భరతుడు రాజ్యాన్ని శ్రీరాముడికి ఇవ్వజూపినపుడు శ్రీరాముడు సున్నితంగా తిరస్కరించిన ఘట్టం భరతుని సోదర ప్రేమను, శ్రీరాముడి పితృవాక్యపాలనను తెలుపుతుంది. శ్రీరాముడు విభీషణుడికి ఆశ్రయమిచ్చినపుడు అందరూ ఆయన చర్యను శంకించినా క్లిష్టసమయంలో శ్రీరాముడి తక్షణ విధాన నిర్ణయశక్తిని ఆ ఘటన వ్యక్తం చేస్తుంది. భరతుడు రాముడికి రాజ్యం అప్పగించే ప్రయత్నం చేసినపుడు ఆయన పితృవాక్య పాలన నెపంతో రాజ్యాధికారం పట్ల విముఖత చూపించిన వైనం నేటి యుగంలో అధికారకాంక్షతో ఆగడాలు చేసేవారికి మంచి హితబోధ కాగలదు.

స్నేహభావంలో అల్పులు, అధికులన్న తేడా లేకుండా లోక కల్యాణం కోసం ఎవరితోనైనా మైత్రి నెరపవచ్చని తేటతెల్లం చేస్తుంది శ్రీరామసుగ్రీవుల మైత్రి. ఆ మైత్రి వల్ల శ్రీరాముడు ఆంజనేయుడంతటి శూరుడు, బహు పరాక్రమ వంతుడిని దాసుడుగా పొందగల్గాడు.

**విశ్వామిత్రుడు :** ఎంత తపోధనుడైనప్పటికీ మేనక పట్ల మోహం కల్గి తపో భంగం పొందాడు. వసిష్ఠుడంతటి తపోధనుడు కావాలంటే మేనక వంటి ఎరలు ఎదురవుతాయి. వాటిని అధిగమించినపుడే విజయం ప్రాప్తిస్తుందని బోధ చేస్తుందీ వృత్తాంతం. శ్రీరామచంద్రుడికి వసిష్ఠుడి తర్వాత అంతటి యోగ్యుడైన గురువుగా స్థానం సంపాదించడం విశ్వామిత్రుడి కార్యకుశలతకు నిదర్శనం.

**కైకేయి :** శ్రీరామచంద్రుడిపై ఎంతో పుత్రవాత్సల్యం కల్గిన దశరధుడి ధర్మపత్ని ఈమె. కానీ మంధర దుర్బోధలకు ప్రభావితురాలై శ్రీరామ వనవాసానికి కారణభూతురాలయింది. భర్తను పోగొట్టుకుంది. చెప్పుడు మాటల వలన పుత్రుడైన

భరతుడి ప్రేమను కూడ ఈమె పోగొట్టుకుంది. లౌకిక జీవులు ఈమెను చూచి కొండేలు చెప్పేవారిని దూరంగా ఉంచాలని బోధిస్తుంది రామాయణం.

**సుమిత్ర :** ఈమె రాముడితో తన తనయుడైన లక్ష్మణుడు అరణ్యాలకు వెళ్ళడానికి అనుమతించిన త్యాగశీలి. సీతారాములను తల్లిదండ్రులుగా భావించిన లక్ష్మణస్వామి తల్లినుంచి త్యాగగుణాన్ని కైవసం చేసుకొని శ్రీరామపాదసేవలో తరించాడు. త్యాగం వల్ల అమృతత్వం సిద్ధిస్తుందని వేదాలు వచించడం మనకు తెలుసు.

**సీతాదేవి :** ఈమె సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి. శ్రీరామ ధర్మపత్ని. రావణుడి ప్రేరణతో మారీచుడు మాయలేడిగా పర్ణశాలకు వచ్చినపుడు ఆ బంగారు జింకపై మోజుపడిందామె. ఆ జింక సజీవంగానైన, నిర్జీవంగానైనా తనకు కావాలని భర్తకు నివేదించింది. తదనంతర పరిణామంగా రాముడు మాయలేడిని సంహరించడం, ఆమె ప్రేరణతో లక్ష్మణుడు రాముడి కడకు వెళ్ళడం, రావణుడు ఆమెను అపహరించడం జరిగాయి. వస్తువులపై తగని మోజు వల్ల మానవుడికి ఎంతటి కష్టనష్టాలు సంప్రాప్తిస్తుంటాయో ఈ మాయలేడి వృత్తాంతం మనకు నివేదిస్తుంది.

జటాయువు : ఈ పక్షి రాజు రావణుడితో పోలిస్తే ఎంతో శక్తి హీనుడు. అయినా రామకార్య సాధనలో భాగంగా రావణుడితో పోట్లాడి సీతాదేవిని రక్షించే ప్రయత్నం చేశాడు. దైవకార్య సాధనలో ప్రాణాలు పోగొట్టుకోవడానికి సైతం వెరవలేదు.

భరతుడు : ఓ ఆదర్శ మానవతావాది. తన మూలంగా అన్న శ్రీరాముడు అరణ్యాలకు వెళ్ళడం సహించలేకపోయిన పుణ్యచరితుడు. తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు పెద్దన్న అంటుంది మన సంస్కృతి. శ్రీరాముడు రాజ్యదూరుడై వనవాసి కావడం సహించలేకపోయాడు. అందుక్కారణమైన మాతృదేవి కైకేయిని తూలనాడాడు. చిత్రకూటానికి వెళ్ళి రాజ్యాన్ని శ్రీరాముడికి ధారాదత్తం చేసే ప్రయత్నం చేశాడు. అందుకాయన సమ్మతించని కారణంగా రామపాదుకలను సింహాసనంపై వుంచి రామ ప్రతినిధిగా రాజ్యపాలన చేసిన త్యాగధనుడు భరతుడు.

**లక్ష్మణుడు :** ఈయన విష్ణుమూర్తి తల్పమైన ఆదిశేషుడి అంశగా శ్రీరామ సహోదరుడుగా జన్మించాడు. ఒకే తల్లికి పుట్టకపోయినా అన్న శ్రీరాముడి సేవలో జీవితాన్ని సఫలం చేసుకున్న ధన్యజీవి. శ్రీ రామ పాద సేవ తప్ప ఇతర వ్యాపకం తెలియని ఆదర్శ సహోదరుడీయన. యుద్ధంలో ఇంద్రజిత్తు ప్రయోగించిన అస్త్రానికి ఫలితంగా స్పృహకోల్పోయాడు. సుషేనుడు హిమాలయాలలోని కైలాస (ఔషధి) పర్వతం గూర్చి ప్రస్తావించాడు. అక్కడ వుండే సంజీవని మూలిక తెస్తే లక్ష్మణుడు బ్రతుకుతాడని సెలవిచ్చాడు. శ్రీరాముడికి నీడలా ఉంటూ ఒక అన్నపట్ల తమ్ముడి ప్రవర్తన ఎలా వుండాలో మానవాళికి నిర్దేశించాడు లక్ష్మణుడు. శ్రీరాముడి వంటి అన్న ఉన్న ప్రతి వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలో లక్ష్మణుడి పాత్రద్వారా ఆదికవి వాల్మీకి లోకానికి చాటి చెప్పాడు. ఊర్మిళ వంటి అందమైన భార్యను కూడా త్యాగం చేసి పదునాలుగేండ్లు భ్రాతృసేవలో తరించాడీయన. విషయ సుఖాలపై అనురక్తి కన్నా ప్రజలు మెచ్చే సోదరసేవ మిన్న అని నిరూపించిన ధన్యజీవి లక్ష్మణస్వామి.

**సంజీవని మూలిక :**

> "మృత సంజీవనీం చైవ విశల్యకరణీమపి
> సావర్ణ్యకరణీం చైవ సంధాన కరణీం తథా"

ఈ శ్లోకార్థం ఇది : సంజీవనీ మూలిక ప్రాణాలను రక్షిస్తుంది. విశల్యకరణి గాయాల బాధను తొలగిస్తుంది. సంధానకరణి శరీరాన్ని యధాతథ స్థితికి తెస్తుంది. సావర్ణ్యకరణి వల్ల గాయం మానిన శరీరం పూర్వవర్ణంతో శోభిల్లుతుంది.

మానవుడు ఆయుర్వేదం ద్వారా ఎన్నో మూలికలను గుర్తిస్తున్నాడు. పై నాలుగు మూలికలలో సంజీవని మూలిక అందరికీ తెలిసినదే. అయినా మిగతా మూడిటిగురించి విని వుండరు. ఏనాటికైనా ఆయుర్వేద పండితులు ఆ మూలికలను గుర్తించగల్గితే భారతీయ జీవనం సువ్యవస్థితమవుతుంది.

**హనుమంతుడు :** ఈయన శ్రీరాముడి పరమభక్తుడు. భవిష్య బ్రహ్మగా వరాలు పొందినవాడు. ఆధునిక యుగంలో వ్యక్తిత్వ వికాసానికి జీవం పోశాడీయన. జాతిరీత్యా ఓ కపి అయివుండి ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేశాడు. సేవకుడు

ప్రభువు పట్ల ఎలా భక్తి ప్రపత్తులు కల్గివుండాలో విశదం చేసిన మహాపురుషుడు. బాల సూర్యుణ్ణి ఓ మధుర ఫలంగా భావించి ఆకాశానికి ఎగిరి సూర్యభగవానుని భక్షించబోయిన ప్రచండ పరాక్రమశాలి హనుమంతుడు. దైవానుగ్రహం ఉంటే ఓ కోతి కూడ అద్భుతాలు చేయగలదని నిరూపించిన మహామహిమాన్వితుడు. అఖండ విశ్వాసంతో నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి ప్రభుకార్యాన్ని సాధించడంలో కృతకృత్యుడయ్యాడు. మాటకారి అయిన ఆంజనేయుడు వాయుదేవుడు, ఇంద్రుడు వంటి దేవతల అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందాడు. కార్యసాధకులకు స్వీయ శక్తి యుక్తులతో పాటు దైవానుగ్రహం కూడ అవసరమని నిరూపించాడు. చేసే పని మంచిదైతే అందరి తోడ్పాటు తప్పక ఉంటుంది. అందునా సజ్జనుల ప్రోత్సాహం అవశ్యం లభిస్తుందని మానవాళికి దిశానిర్దేశం చేసిన ధీశాలి హనుమంతుడు. సముద్ర లంఘన సమయంలో ఎదురైన ఎన్నో విఘ్నాలను హనుమంతుడు విజ్ఞతతో ఎదురీదాడు.

రామాయణంలో శ్రీరాముడి పాత్ర నుంచి మహోన్నత విలువలు నేర్చుకుంటాం మనం. అబద్ధాలు ఆడకపోవడం, పరస్త్రీలను పవిత్రంగా చూడటం, అమాయకులు – దుర్బలురైన వారిని రక్షించడం, లోక ప్రయోజనం కోసం ఎన్ని కష్టాలనైనా స్వీకరించడం (రావణాసురవధ నిమిత్తమే శ్రీరాముడు తండ్రిమాట నిలబెట్టే నెపంతో అరణ్యాలకు వెళ్లి మాయలేడిని వేటాడే పనిలో పర్ణశాలకు దూరంగా వెళ్లి లక్ష్మణుడు సమక్షంలో లేని సమయంలో రావణుడు మాయసీతను అపహరించే వీలు కల్పించాడని విమర్శకుల అభిప్రాయం). ప్రభువైన వాడు ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వాలనే సాంప్రదాయం నెలకొల్పడం (ఓ సామాన్యుడి మాటకు బద్ధుడై సీతాదేవిని మరల వనవాసానికి పంపాడీయన) వంటి ఎన్నో విలువలు శ్రీరాముడి నుంచి మనం గ్రహించవచ్చు.

**ఉడత సాయం :** రామసేతువు నిర్మించేపుడు ఓ ఉడత చిన్న చిన్న రాళ్ళను, గండు ఇసుక రేణువులను సేతువుపైకి మోసిందట. చేస్తున్న పని ఎంత ఘన మైనది అనికాకుండా ఆ పని వెనుకగల సంకల్పం చూడాలి అని బోధపరుస్తుందీ ఉడత వృత్తాంతం.

సనాతన ధర్మం ఇలా చెబుతుంది. ధర్మాన్ని ఆచరించు తల్లిదండ్రుల పట్ల, భార్య పట్ల, పిల్లలు, సోదరుల పట్ల, సమాజం పట్ల ధర్మాన్ని అనుసరించు. అలా చేసిన వాడు ప్రత్యక్ష ఆధ్యాత్మిక సాధన చేయకపోయినా రక్షింపబడతాడు. ఓ గొప్ప భక్తుడు, లోకాలను జయించినవాడు, సర్వసమర్ధుడు అయిన రావణుడు కూడ పరస్త్రీ వ్యామోహం వల్ల నాశనమయ్యాడు. అతడి భ్రష్టత్వం ధర్మాచరణను లెక్కచేయకపోవడం వల్ల సంప్రాప్తిస్తుంది. అందుకు వ్యతిరేకంగా ధర్మాచరణ చేసిన రాముడు త్రిలోక పూజ్యుడయ్యాడు. శ్రీరాముడి ఏకపత్నీత్వం, భరత లక్ష్మణుల వంటి సోదర ప్రేమ, కోతి నుంచి జ్ఞానిగా పరిణతి చెందిన హనుమంతతత్వం, మనం నేర్చుకొనవలసి వుంది. మహాజ్ఞాని, భక్తుడు అయిన రావణుడు అల్పబుద్ధితో సీతామహాసాధ్విని వాంఛించి పతనమయ్యాడు. రామాయణం ధర్మార్ధ కామమోక్షాలను ప్రతిపాదించింది. ఒక పురుషుడు ఒకే స్త్రీని వివాహమాడాలి, తాను ఆడిన మాటను తాను విస్మరిస్తే ఇక మాటకు అర్ధమేముంటుంది? చెప్పుడు మాటలు వినరాదు. తండ్రి మాటను అనుసరించాలి. వినయం గొప్ప సుగుణం. కష్టాల్లో ఉన్న శత్రువునైనా ఆదరించాలి. అన్న అంశాలు రామాయణ మహాకావ్యం ప్రతిపాదించిన సుభాషితాలు.

**భారతం :** వ్యాసభగవానుడు రచించిన మహా గ్రంధం శ్రీ మన్మహాభారతం. తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ అనువదించారీకావ్యాన్ని. తింటే గారెలే తినాలి, వింటే భారతం వినాలి అన్నది నానుడి. తన భక్తులయిన పంచ పాండవులను వెంట ఉండి నడిపించాడు శ్రీకృష్ణుడు. సాక్షాత్తు దేవుడైన శ్రీకృష్ణుడు తమ పట్ల పక్షపాతం కల్గివున్నా తమకే కష్టాలు ఎందుకు పరంపరగా వస్తున్నాయని భావించని ధీరోదాత్తులు పాండవులు. పంచపాండవుల సోదరప్రేమ అపూర్వమయినది. ధర్మానికి ప్రతీక అయిన ధర్మరాజు బయటకు తప్పుగా, దుర్వ్యసనంగా కనిపించే ఎన్నో నిర్ణయాలు తీసుకొని తమకు ప్రాప్తించిన కష్టాలకు కారణభూతుడుగా కనిపించినప్పటికీ వారు అన్నమాట జవదాటలేదు. ధర్మోరక్షతి రక్షితః అన్నట్లు ధర్మాన్ని పాటించేవారికి అంతిమ విజయం తప్పక లభిస్తుందని నిశ్చయపరుస్తుందీ మహాకావ్యం.

దుర్యోధనుడు కురు సామ్రాజ్యాధినేత అయివుండీ పాండవుల పట్ల, ముఖ్యంగా భీముడు పట్ల విముఖత, విద్వేషాన్నీ పెంపొందించుకున్నాడు. రావణాసురుని కాముకత్వానికి, దుర్యోధనుని లోభత్వానికి ప్రతీకలుగా చెబుతారు పండితులు. ఈర్ష్య, అసూయల వల్ల సాధించేది ఏమీ లేదని, భారత ఇతిహాసం రుజువు చేస్తుంది. హిందూ ధర్మానికి ప్రామాణిక గ్రంథమైన భగవద్గీత, విష్ణు సహస్రనామం ఉద్భవించింది మహాభారత కావ్యం నుంచే. భగవద్గీత ఓ విషయ పరిజ్ఞాన సింధువు. ఈనాటి కార్పొరేట్ రంగ ప్రముఖులు భగవద్గీత నుంచి వ్యక్తిత్వ వికాస సూత్రాలు సేకరించి ఆధునిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి తమ ఉద్యోగులకు ఆ సూత్రాలు బోధించి విజయమార్గంలో పయనిస్తున్నారు. ఘోషయాత్ర సమయంలో దుర్యోధనుడు యక్షుడి చేతిలో భంగపడి బందీ అయినపుడు ధర్మరాజు సాయం చేసి అతడి పరువు కాపాడటం అనే అంశంగా శత్రువైనప్పటికీ ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించడం మానవత్వమనిపించు కుంటుందనే సత్యం వెల్లడి చేస్తుంది ఈ మహాకావ్యం. ఆత్మశక్తి గొప్పది. పరమాత్మశక్తి ఆత్మశక్తికి ఆలంబన అయినపుడు సాధించలేని మహత్కార్యం ఉండదు. ఆత్మ శక్తి ప్రజ్వలితమైనపుడు ఎన్నో కష్టమైన పనులు కూడా సులభసాధ్యమవుతాయి. శంతనుడు భార్య గంగకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏడుగురు పుత్రులను కోల్పోయాడు. ప్రశ్నించినమరుక్షణం బార్యనూ కోల్పోయాడు. అనాలోచితంగా వాగ్దానాలు చేయకూడదని బోధపరుస్తుందీ వృత్తాంతం.

దుర్యోధనుడు శకునిని చేరదీసి తన పతనానికి తానే పునాది వేసుకున్నాడు. మంచి స్నేహం చేయడం సద్గుణమని భావించాలి.

అనాలోచితంగా నవ్విన ద్రౌపది దుర్యోధన ఆగ్రహానికి గురయింది.

దుర్యోధనుడు కురుసామ్రాజ్యాన్నేగాక పాండవ భూభాగాన్ని కూడ ఆశించి లోభి అయ్యాడు.

వివేచన లేకుండా అందరినీ మనఃస్ఫూర్తిగా నమ్మకూడదు. ధర్మరాజు దుర్యోధనుడి పాచికలాట ఆహ్వానాన్ని శంకించకపోవడం పాండవుల కష్టాలకు కారణమైంది.

పెద్దల మంచి సలహాలు పాటించాలి. విదురుడు, భీష్ముడు వంటి మహనీయుల సలహాలను పెడచెవిన పెట్టిన ధృతరాష్ట్రుడు కురువంశ నాశనానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమయ్యాడు.

పాచికలాట తప్పని తెలిసినా ఆటకు దుర్యోధనుడి ప్రోత్సాహాన్ని మన్నించి కష్టాలు కొని తెచ్చుకున్నాడు ధర్మరాజు.

సగం సగం జ్ఞానం అనర్థదాయకం. అభిమన్యుడు పద్మవ్యూహం నుంచి బయటపడే మార్గం తెలీక పోయినా వ్యూహంలోకి ప్రవేశించి ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

స్త్రీని గౌరవించే చోట దేవతలు తిరుగాడుతారట. అందుకు భిన్నంగా కురుసభలో ద్రౌపదికి జరిగిన పరాభవం కురువంశ క్షయానికి కారణమైంది.

**భారతం బోధించే మహా సత్యాలు :**

ధర్మార్థ కామాలను న్యాయంగా అనుసరిస్తే మోక్షం దానంతటదే వస్తుంది.

లోక ప్రయోజనకరమైనది ఏదో అదే ధర్మం!

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి కర్మసిద్ధాంతం బోధిస్తాడు.

నిష్కామకర్మలో లోకప్రయోజనం ఎక్కువగా వుంటుంది.

మన తప్పిదాల వల్ల సంప్రాప్తించే బాధలు, కష్ట సుఖాలకు మూలకారణం 'అహం'కారం.

తక్షణం లాభదాయకం కాకపోయినప్పటికీ 'మంచి'ని అనుసరిస్తే అంతిమంగా సాధకుడికి ఆనందమే ప్రాప్తిస్తుంది.

అహంకారం, గర్వం, అజ్ఞానం, బలవంతపెట్టడం, తెలిసీ తప్పులు చేయడం, అధికార కాంక్ష – అది సాధించేందుకు చౌకబారు రాజకీయం నెరపడం ప్రతీకారం తీర్చుకోవడం, అందుకోసం కుట్రపూరిత ధోరణి... ఇవన్నీ దుర్యోధనుడి అనైతిక విలువలు.

తత్ విరుద్ధమైన భావాలు సొంతం చేసుకొని ఓ మంచి మనిషిగా మనం ఎదిగేందుకు ప్రయత్నించాలి.

**భాగవతం :**

వ్యాసభగవానుడు వేదరాశిని నాలుగు భాగాలుగా విభజించాడు. అయినా ఆయనకు లభించవలసిన మనశ్శాంతి లభించలేదు. అప్పుడాయన భాగవత పురాణం రచించి మనశ్శాంతి పొందాడని చెబుతారు.

తాపం అగ్ని యొక్క ధర్మం. చల్లదనం నీటి ధర్మం. సహనం ధరిత్రి దర్మం. ప్రాణాన్ని నిలబెట్టడం వాయువు ధర్మం. సర్వ లోకాలనూ తనలో ఇముడ్చుకోవడం ఆకాశం ధర్మం. ప్రేమ మనిషి ధర్మం. జంతువులూ ప్రేమిస్తాయి. వాటి ప్రేమ పిల్లలకు పరిమితం కాగా మానవుల ప్రేమ ఎల్లలు దాటుతుంది. సర్వజనులను, ప్రాణులను ప్రేమించగల మహాలక్షణం మనిషికే ప్రత్యేకం. అతడి ప్రేమ ఇంకా విస్తరించి సృష్టిని పాలిస్తున్న భగవంతుని ఆశ్రయించడం ఎంతో గొప్ప విషయం. శ్రీకృష్ణ పరమాత్మ, గోపికల ప్రేమ అజరామరమైన జీవాత్మ – పరమాత్మల సంగమ ప్రేమగా భాసిల్లుతుంది.

పురాణాలలో తలమానికమైనది భాగవతం. ఆత్మను సాధించాలనే ముముక్షువులకు భక్తిని ప్రసాదించి ఉద్ధరించే దివ్యకావ్యం భాగవతం. భగవంతుడిని, భక్తుని అనుసంధానించి అలరించే భాగవతం వలన ఆధునిక మానవుడు ప్రశాంతిని కైవసం చేసుకోవచ్చు. శరీరాన్ని ధరించడం మోక్షప్రాప్తికే గానీ సౌఖ్యాలు అనుభవించడం కోసం కాదని చెప్పే భాగవతం సామాన్య నిరాడంబర జీవన సాఫల్యానికి దారి సూచిక వంటిది. ❋

# 31. నీరు పల్లమెరుగు

ఓ అదృశ్య శక్తి ప్రేరణతో సమస్త విశ్వ వ్యాపకం లయబద్ధంగా సాగుతుంది. కించిత్తైనా తేడా రాదు. ఒకవేళ వస్తే మానవుడి నిరంకుశ ధోరణి, అల్ప బుద్ధితో కూడిన పనుల వల్ల అలాంటి ఫలితం చేకూరుతుందేమో! శ్రీరామచంద్రుడి పాలనలో నెల మూడు వానలు కురిసి భూములు సస్యశ్యామలమై పాడి పంటలు సమృద్ధిగా ఉండేవట! పాలకులు ఎలాంటి వారైతే ప్రజలూ అలాంటి వారవుతారని శాస్త్ర వచనం.

రోజులు మారాయి. ప్రపంచ ధోరణి మారింది. కలియుగ ప్రభావం విస్తరించిన సమాజంలో మనం నివసిస్తున్నాం. ప్రపంచ స్థితిగతులు పంచ భూతాత్మకంగా కొనసాగుతాయి. ఆ తీరులో ఎలాంటి మార్పూ వుండదు. ప్రకృతికి ఓ ఒరవడి వుంది, నిర్దేశిత చట్రంలో అది పనిచేస్తుంది. ప్రకృతిలో అంతర్భాగమైన పంచ భూతాలు తమ స్వభావానికి అనుగుణంగానే వర్తిస్తాయి. వాటి దశ దిశ ఎవరూ మార్చలేనిది. భూమ్యాకాశాలు, నిప్పు, వాయువుకు ఓ ప్రమాణం వున్నట్లే నీటికీ ఓ ప్రత్యేక లక్షణం వుంది. నిల్వ చేసిన పాత్ర ఒంపుల కనుగుణంగా నీరు ఒదిగిపోతుంది. ప్రాణుల దప్పి తీర్చి నేలను సస్యశ్యామలం చేస్తుంది. మానవ శరీరంలో నీటి శాతం 50 నుంచి 75 దాకా ఉంటుందని విజ్ఞాన శాస్త్ర పరిశీలన. భూమ్మీద మూడు వంతులు నీరే! ఇంకా కొన్ని గ్రహాల్లోనూ నీరున్న దాఖలా ఉందని పరిశోధనలు చెబుతాయి. ఒకప్పుడు నీరుంటే ఇప్పుడెందుకు లేదన్న ప్రశ్న సాధారణం! నీరు ఘనీభవించిన మంచు ఆకృతిలో ఉండవచ్చు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ననుసరించి ఉపరితలంలోని నీరు ఆవిరై, లేదా ఆయా గ్రహాల గర్భాలకు చేరి ఉండవచ్చు.

మానవజాతి మనుగడకు అత్యంత ప్రధానమైన నీటికి ఓ ప్రత్యేక లక్షణం వుంది. నీరు పల్లానికే ప్రవహిస్తుంది. "నీరు పల్ల మెరుగు నిజం దేవుడెరుగు"

అన్నది నానుడి. నీటి ఈ సహజ గుణం నుంచి అనేక ఆధ్యాత్మిక సత్యాలు వెలుగు చూస్తాయి. అడ్డు కట్ట వేసినా పరమాణు పరిమాణంలో రంధ్రం ఉంటే నీటి బొట్టు బయటికి వస్తుంది. బంధనం నుంచి బయటపడాలనే నీటి బిందువు ఆరాటం అది. చిన్నపాటి బలహీనతలున్నా క్రమశిక్షణతో సాగే జీవనం సత్య ధర్మాలను కాపాడుతుందన్నది బోధపడే సత్యం!

నిజాన్ని నిప్పుతో పోలుస్తాం. నీటి నుండి నిప్పు ఆవిర్భవించిందని చెబుతుంది ఋగ్వేదం. నీరు, నిప్పు, గమన దిశలు నిక్కచ్చిగా వుంటాయి. పల్లానికి ప్రవహించడం నీటి సహజ లక్షణం అయితే అగ్ని ఊర్ధ్వానికి కదులుతుంది. 'సత్'గా పిలువబడు 'నిజా'నికి దైవం వైపు నడక సాధారణం. నీరు, నిప్పులను పిడికిట బిగించలేం. ఎప్పటికైనా 'నిజం' వెలుగు చూస్తుందన్నది ప్రామాణిక సత్యం. సత్యాన్ని ఆచరణకు స్వీకరించిన సాధకుడికి ఆత్మ సాక్షాత్కారం ఏదో నాటికి కలగవచ్చు. ఒక నేరస్థుడు భౌతిక చట్ట పరిధి నుంచి తప్పించుకున్నా ఓ నిరప రాధికి శిక్ష పడరాదని న్యాయ కోవిదులు చెబుతారు. నిజాన్ని ప్రియంగా చెప్పాలి. ప్రియంగా ఉన్నంత మాత్రాన అసత్యం స్వీకార యోగ్యం కాదు. ఒకరికి హాని జరిగే సందర్భంలో నిజాన్ని వెల్లడించడంలో జాగ్రత్త వహించమంటుంది ధర్మ శాస్త్రం దైవం త్రికాలాల్లోనూ ఉంటాడు. సృష్టికర్తకు మరణం లేదు. ఆత్మకూ మృత్యువు లేదు. భూత భవిష్యత్ వర్తమానాల్లో నిలిచి వుండే శక్తి దైవం. అతడి ఆధిపత్యం సృష్టికి శిరోధార్యం! సత్య మార్గంలో మనిషి ప్రయాణం నీరు వాలుకు ప్రవహించడం వంటిది. సత్య మార్గంలో జీవనం అన్నది అహింస, శాంతి, ప్రేమ వంటి ధర్మ మార్గాల్లో సాధకుడి ఆధ్యాత్మిక ప్రయాణం! తన బృహత్ ప్రవాహ వక్తికి అడ్డువస్తే నీరు కట్టలు పగుల గొట్టుకొని వాలుకు ప్రవహించునట్లు సాధకులు తమ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా సత్య ధర్మాలను ఆధారం చేసుకొని దైవం వైపు నడవాలన్నది నీటి సందేశం! వాలుకు ప్రవహించడం వెనుక నీటి మనోగతం సముద్రాన్ని త్వరగా చేరాలనే తహతహ మాత్రమే! మానవుడి ఆధ్యాత్మిక ప్రయాణం కూడా దైవాన్ని చేర్చేందుకు నిశ్చయమైనది కావాలి. ఆ బహు దూరపు ప్రయాణంలో 'సత్యమే'వ జయతే! ధర్మో రక్షతి రక్షితః!' వంటి మహా సత్యాల ఆచరణ సాధకుడికి త్రి కాలాల్లోనూ రక్షా కవచంగా నిలుస్తుంది. ❃

# 32. మనసు తెర

మనిషి కీర్తికి గానీ అపకీర్తికి గానీ ప్రవర్తనే మూల కారణం. ఆ ప్రవర్తనను నిర్దేశించేది సూక్ష్మ రూపంలో ఉండే మనసే. వ్యక్తి నడవడి మనసు మీదే ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యం, వాతావరణం, ప్రదేశం – ఇలా చాలా అంశాలు మనసు పోకడను నిర్దేశిస్తాయి.

పరిసరాలు కాలుష్యపూరితంగా ఉన్నపుడు ఎవరికైనా చికాకు కల్గడం సహజం. అయితే మొరటు స్వభావం కలవారిపై ఏ కాలుష్యమూ ప్రభావం చూపకపోవచ్చు. పరిశుభ్రమైన పరిసరాలు సంస్కారవంతుడైన వ్యక్తిలో ఆధ్యాత్మిక అంశాన్ని ఉద్దీపన చేస్తాయి.

పుస్తకం వైవిధ్య భరితమైన రంగుల్లో చూడచక్కని కాగితంపై ముద్రించినపుడు దాని సారాంశం అదే స్థాయిలో లేకపోయినా పుటలు తిరగేస్తాం. భౌతిక వస్తువులపై ఉండే ఆకర్షణ అలాంటిది. ముద్రణలో నాణ్యతలేకపోతే విషయం గొప్పదైనా పాఠకులకు ఆకర్షణ కలగకపోవచ్చు. ఒక వస్తువు పట్ల ఆకర్షణకు గానీ వికర్షణకు గానీ మనసే మూలాధారం.

కళ్లతో చూచిన దానిని మనసు ఇట్టే గ్రహిస్తుంది. ఇష్టమైనది చూచినపుడు మనసు పదిలంగా ఆ జ్ఞాపకాన్ని దాచుకుంటుంది. అనిష్ట దృశ్యాలుమనసులో ఆట్టేకాలం మనలేవు. అయితే భయం, ఏహ్యత వంటి భావాలతో కూడిన జ్ఞాపకం చెడ్డదైనా మనసులో తిష్ట వేస్తుంది. సన్నిహితుల నడుమ ఉండే తీపి బాంధవ్యాలు ముద్ద మందారాల్లా, స్నిగ్ధ మనోహరంగా మనసు పుటల్లో పదికాలాల పాటు పదిలంగా ఉంటాయి. వాటి భావన స్ఫురించినప్పుడల్లా ఆ జ్ఞాపకాల దొంతర మనసుకు ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. ఇష్టదైవానికి సంబంధించిన సుహృద్భావ

తరంగాలు భక్తుల హృదయాల్లో సభక్తికంగా నిల్చిపోతాయి. అవి స్ఫురించినపుడల్లా వారి అంతరంగం ఆనందకందళితమౌతుంది.

ఒక సాధకుడు నిత్యం వీధిదీపాన్ని తదేకంగా చూస్తుండేవాడు. జ్యోతిపై మనసు నిల్పి ధ్యానం చేయడం విని వున్న అతడికి వీధి దీపం ఆ స్ఫూర్తినిచ్చింది. ఒక రాత్రి వీధి దీపాన్ని సిబ్బంది వెలిగించలేదు. సాధకుడు చీకట్లో ఉన్న దీప స్తంభాన్ని యథాలాపంగా చూచినపుడు అతడికి దీపం వెలుగుతున్న దృశ్యం కంటబడింది. అది ఓ భ్రాంతే అయినప్పటికీ దీపాన్ని నిజంగా దర్శిస్తున్నట్లే అనిపించిందతడికి. భగవంతుని స్ఫురణకు తెచ్చే ఉపాధులు, సంభారాలు చూచినపుడు దైవం గుర్తుకు రావడం సహజంగా జరుగుతుంది.

ఒక గృహస్థుకు ఇంటికి తాళం వేశాక పదేపదే పరీక్షించడం ఓ తప్పనిసరి క్రతువు. నిజానికి అదో మానసిక రుగ్మత. దానినే వైద్య పరిభాషలో 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్' అన్నారు. అలాంటి జబ్బున్న వ్యక్తులు తాళం వేసినప్పటికీ ఆక్రియను నిర్ధారించడంలో ఇబ్బంది పడతారు. ఇలాంటి తికమక పారలౌకిక వ్యవహారంలో గనుక కలిగితే అది ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధమౌతుంది. కంటి ముందు కనబడుతున్న విషయాన్నే నమ్మలేని వారు కంటికి కనబడని దైవం విషయంలో ఎలా పురోగతి సాధించగలరు? భగవద్వైభవం విరాజిల్లేక్షేత్రాలు, ఆలయాల సందర్శనం వల్ల సంశయ హృదయాల్లో కూడ ఆధ్యాత్మిక బీజాలు అంకురిస్తాయి.

ధ్యానానికి కూర్చున్నపుడు ఎన్నో అర్థంలేని ఆలోచనలు సాధకుని వేధిస్తాయి.. గణితశాస్త్రంలో ఓ సమీకరణం ఉంది. అదే – × – = +. రెండు విరుద్ధమైన (రుణాత్మక) అంశాలను ఒకదానిపై ఒకటి ప్రయోగించి దృఢ సంకల్ప శక్తి ఘాతంతో తరిమి కొడితే మనసు నిశ్చలమౌతుంది. ద్యాన సాధనకు ఉండవలసిన అర్హత, మనసుపై దుష్ప్రభావం చూపే బలమైన ఆలోచనలను నిర్వీర్యం చేయగలనేర్పే! ఏమనసు, సాధన సరళతరంగా సాగకుండా అవరోధం కల్పిస్తుందో ఆ మనసునే ప్రయోగించి భక్తి వైరాగ్యాలను ఆంతర్యంలో పాదుకొల్పుకోవాలి. అదే ముక్తి సాధనకు మార్గం చూపగలదని నిర్ద్వంద్వంగా నమ్మవచ్చు. ❋

# 33. కార్యశూరులు

కార్యసాధన కోసం ఎన్నో సంకల్పిస్తాం. కొన్ని సంకల్పాలు నెరవేరినా కొన్ని నెరవేరవు. నెరవేరని సంకల్పాల వల్ల ఆశాభంగం కల్గుతుంది. సాధన దిశగా అడుగు ముందుకు వేయలేం. అది సామాన్యుల విషయంలో జరిగే పరిణామం. అందుకు భిన్నంగా వ్యవహరిస్తారు ప్రజ్ఞావంతులు. సంకల్పించిన కార్యం నెరవేరేదాకా వారు విశ్రమించరు. అపజయాలను సోపానాలుగా మలచుకొని విజయపథంలో పరాక్రమిస్తారు.

సంకల్పసిద్ధికి పట్టుదల ప్రాణం. సంకల్పిత కార్యం మంచిదైనపుడే ప్రకృతి తోడ్పాటు, ప్రజల తోడ్పాటు ఉంటాయని తెలుసుకోవాలి. స్వార్థ చింతనతో కార్యం సాధించేవాడిని కార్యశూరుడనరు. అటువంటి వాడి కార్యానుకూలత వల్ల లోకానికి ఒనగూడేమేలేం ఉండదు. ఒకచో కంటక ప్రాయంగా మారే ప్రమాదమూ పొంచి ఉంటుంది.

రాక్షసులు తపమాచరించి కోరదగని కోరికలు కోరినపుడు దేవతలు యుక్తిగా వరాలిచ్చిన సన్నివేశాలు పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. రావణుడి సంకల్పం శ్రీరామపత్నిని లొంగదీసుకొని ఇంద్రియ సౌఖ్యాలు అనుభవించడం! అదే నెరవేరితే మంచివారికి మనుగడ లేదనే సంకేతం వెలువడేది! మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు చేతకానివాడని లోకం అపోహపడే ప్రమాదమూ వాటిల్లేది. కాని జరిగింది వేరు!

రామకార్యసాధన కోసం ఆంజనేయుడు చేసిన సంకల్పంలో లోకహితం ఉంది. 'మంచి' పరిరక్షణ కోసం మనుషులే కాక సమస్త ప్రాణులూ స్పందిస్తాయని రామాయణం స్పష్టం చేసింది. వానర జాతికి చెందిన జాంబవంతుడు ప్రణాళిక రచించాడు. రాక్షస జాతికి చెందిన విభీషణుడు, పర్వత రూపుడైన మైనాకుడు, పక్షిరాజైన జటాయువు, కడలి రూపంలో వరుణదేవుడు, చివరకు ఓ ఉడత

తమ పాత్ర పోషించడం విశేషం! విశ్వమాత సీతాదేవి విడుదల కోసం సమస్త ప్రకృతీ స్పందించింది. రావణ వధ అనంతరం రఘురాముడు సీతాదేవిని శీలపరీక్ష కోరినపుడు అగ్ని అమ్మవారిని బాధించక చల్లని స్పర్శ అందించి ఆమె పాతివ్రత్య నిరూపణ చేశాడు. లోకపావని సీతామాతను శ్రీరామసన్నిధికి చేర్చే ప్రయత్నంలో కీలక పాత్ర పోషించిన సంజీవరాయుడి కార్యకుశలత లోకాలకే ఆదర్శం! ఆనుకూల్యత లభించినపుడు కార్యసాధన నల్లేరుమీద నడకవుతుంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ కార్యం సాధించినపుడే సాధకుడి శక్తి సామర్థ్యాలు వెల్లడౌతాయి.

నరేంద్ర కోహ్లీ పాతతరం హిందీ రచయిత. అవిభాజ్య పంజాబు రాష్ట్రంలో జన్మించిన ఆయన ఉపాధ్యాయ వృత్తిలో జీవించారు. రచన ఆయన ఇష్టవ్యాపకం. వాల్మీకి రామాయణాన్ని కొత్త కోణంలో దర్శించి శ్రీరాముడి పాత్రను ఆదర్శంగా మలచి నవతరానికి మార్గదర్శనం చేసిన ఘనత ఆయనది. కోహ్లీ విరచిత 'అభ్యుదయ' బృహత్ గ్రంథంగా రామాయణాన్ని మలచిన ఓ నవ నవలాకావ్యం. పాఠకుల మనోసీమల్లోకి ప్రవేశించి వారి అనేకానేక వ్యక్తిగత, సామాజిక, మానసిక సమస్యలకు పరిష్కారం చూపుతూ కార్యశూరుడుగా శ్రీరామచంద్రుని మలచిన విశేష కావ్యమీ గ్రంథ రాజం!

ఓ శాస్త్రవేత్తగా, ఓ అభ్యుదయువాదిగా, ఓ విద్యావేత్తగా, ఓ మానవతావాదిగా; అభిరుచి ఏదైనా అవిశ్రాంత ప్రయత్నమే ఆశావాది కార్యశూరతకు ప్రేరణ! ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఏదో నాటికి అనుకున్న కార్యం తప్పక సాధించగలనన్న బలమైన నమ్మకమే ఆశావాది ప్రయత్నానికి పునాది! 'జీనియస్ ఈజ్ వన్ పర్సెంట్ ఇన్‌స్పిరేషన్. నైన్టీనైన్ పర్సెంట్ పెర్‌స్పిరేషన్' (బుద్ధి కుశలత ఒక శాతం ప్రేరణ. తొంభయి తొమ్మిది శాతం కష్టతరం) అన్నది ఓ అనుభ'విజ్ఞుడి' ఉవాచ. తన తొలి ప్రయత్నంలో అపజయాలు పొందినా మానవ నవజీవన స్రవంతిని మనోరంజకంగా తీర్చిదిద్దుతూ వేలాదిగా ప్రజోపయోగ ఉపకరణాలను మానవాళికి అందించిన థామస్ ఆల్వా ఎడిసన్ కార్యశూరత ప్రపంచానికే గర్వకారణం! అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొంది కార్యశూరత అలవరచుకొనే దిశగా అడుగులు వేసి కలలు గన్న విజయాలను కలిసి సాధిద్దాం! ❋

# 34. 'సుఖదుఃఖాలు'

సుఖం ఓ ఆనందానుభవం. దుఃఖమూ ఓ అనుభవమే! అయితే అది నిరాశ, నిస్పృహలతో కూడినది. సుఖదుఃఖాలు ఒకదాని వెంట ఒకటి మనిషికి అనుభూతమౌతూనే వుంటాయి. అదో చక్ర భ్రమణం! ఆకాశం ఎలా స్థిరమైనదో సుఖదుఃఖాలు కూడ అనుభవాల రూపంలో జీవితంలో అంతే స్థిరంగా పాగావేస్తాయని చెబుతారు పెద్దలు. మనసుకు ప్రియమైన అనుభవం 'సుఖం' కాగా అప్రియమైనది 'దుఃఖం'గా పరిగణింపబడుతుంది. సుఖదుఃఖాలను కదిలిపోయే మేఘాలుగా అభివర్ణించారు భగవాన్ శ్రీసత్యసాయిబాబా.

సమాజంలో మానవ జీవిత సంబంధాలు, గమనం నుంచి సుఖదుఃఖాలు ఉత్పన్నమౌతాయి. మరోకోణంలో... స్వీయ అనుభవాల నేపధ్యంలో మానసిక – శారీరక సుఖాలు, దుఃఖాలు ఆవిర్భవిస్తుంటాయి. సామాన్య మానవుడు సుఖం కల్గితే ఆనందపడతాడు. ఆ సంతోషాన్నతడు మాటల్లో వ్యక్తపరచి మరీ ఆనందిస్తాడు. దుఃఖమైనా అంతే! తనవారితో చెప్పుకొని దుఃఖ తీవ్రతను తగ్గించుకుంటాడు. మహాత్ములు సుఖదుఃఖాల అనుభవాలకు పెద్దగా స్పందించరు. స్థిరమైన ఆకాశం భగవంతుడికి ప్రతీక. మహాత్ములలో భగదంశ పరిపూర్ణం కాబట్టి వారు కూడా ఆకాశం వలే 'స్థిర' చిత్తం కల్గివుండి మనశ్శరీరాల వలన కలిగే సుఖదుఃఖాలను స్థిరచిత్తులై అనుభవిస్తారు. అలాంటి వారినే స్థిత ప్రజ్ఞులుగా ఉదహరిస్తాడు గీతాచార్యుడు. సుఖంగానీ, దుఃఖం గానీ చిరకాలం నిలవదు కాబట్టి సాధకుడు సహనశీలత అలవాటు చేసుకొని విపరీతంగా స్పందించక పోవడం మంచిదంటారు పెద్దలు.

మానసిక బలం శారీరక బలాన్ని పెంచుతుంది. మానసిక పరిపుష్టి గల దీప్తిమంతులను శారీరక రుగ్మతలు తొందరగా దరిచేరవు. సుఖంగానీ,

దుఃఖంగానీ కేవలం మనసు స్పందించడం వల్ల కలిగే ఓ అనుభవ వికారం. కల్లను నిజమనీ, నిజాన్ని కల్లనీ భ్రమించడం మనసు లక్షణం. చిక్కని రాత్రిలో ఏ వస్తువూ కంటికి కనిపించదు. ఆ సమయంలో వస్తువు ఉనికికి సంబంధించి ఎలాంటి సందేహానికి ఆస్కారం వుండదు. అలాగే పట్టపగలు జగమంతా స్పష్టంగా దృగ్గోచరమవుతుంది. కాబట్టి అప్పుడూ సందేహానికి తావులేదు. సంధ్యవేళ మసక చీకటిలో తాడును సర్పంగా భ్రమించే అవకాశం వుంది. ఆ సమయంలో పొటమరించే సందేహమే రజ్జు సర్పభ్రాంతికి కారణం! అది సామాన్యుల విషయంలో సంభవం కాగా యోగీశ్వరులు యతీంద్రులు తమ తపోబలం వల్ల దుఃఖాన్ని సునాయాసంగా అధిగమించేవారు. శరీరంపై పుట్టలు పెరిగినా ఆ స్పృహ పొందక, ఉపాధిని చీమలు తింటున్నా ఆ బాధ అనుభవించక, దేహంపై విష పురుగులు పోరాడుతున్నా ఆ నిజం గ్రహింపుకు రాక మనసును దైవంపై లగ్నం చేసి, సుస్థిరపరచి పరమాత్మను దర్శించేవారు తపోధనులు. అలా రామానుగ్రహం పొంది 'వాల్మీకి'గా మారిన రత్నాకరుడు రామాయణ మహాకావ్యకథను తన దివ్య దృష్టితో ముందుగా దర్శించి, ఆపై రచించి భారతీయులకు అమరమైన ఓ ఇతిహాసాన్ని అందించి ఆదికవి అయ్యాడు. సనాతన ధర్మ అస్తిత్వానికి, పరిపుష్టికి ఆలంబనగా రామాయణ మహాకావ్యం నిలుస్తుందన్నది జగమెరిగిన సత్యం. రామకృష్ణ పరమహంస కాళీమాతతో నేరుగా మాట్లాడేవారని ప్రతీతి! దైవానుగ్రహం పొంది మనసు ప్రశాంతంగా మారితే లభించే బ్రహ్మానందానుభవం దానికదే సాటి! ఆ జీవ బ్రహ్మైక్యానుభవంలో ఓ సాధకుడు పొందే ప్రశాంతి ముందు వెన్నెల విందులు, హంసతూలికా తల్పశయనం, సౌందర్య వంతుల సాన్నిహిత్యంవంటివన్నీ దిగదుడుపే! దైవ ప్రసాదంగా లభించే ఆనందానుభవం దివ్యమైనది, భవ్యమైనది, పరమమయినది. అందుకు భిన్నమైన సుఖాలన్నీ దుఃఖాన్ని తోడుతెచ్చుకొనేవే! త్యాగరాజస్వామి అంటాడు; 'నిధి చాల సుఖమా... రాముని సన్నిధి, సేవ సుఖమా... నిజముగ పల్కుమా... మనసా!' సుఖ రూపంగా కనిపించే దుఃఖమా, దుఃఖరూపంగా కనిపించే సుఖమా ఏదికావాలో తేల్చుకోవలసింది సాధనవల్ల సమకూడే విజ్ఞతతోనే! తాత్కాలిక

సుఖాలు బరువైన దుఃఖపు మూటలను తమ వెంట మోసుకొొస్తాయన్న సత్యం గ్రహించి శాశ్వత సుఖ ప్రదాత అయిన పరమాత్మ అనుగ్రహం కోసం సాధకులు ప్రయత్నించాలంటారు పండితులు. దైవాన్ని అనుసరిస్తూ చేసే ప్రతి కర్మా సుఖ హేతువుగానే పురోగతి పొందుతుంది. ఆ సత్యాన్ని గ్రహించిన సాధకులపై దుఃఖ ప్రభావం నామమాత్రంగానే ఉంటుంది. రెండూ సమన్వయం చేసుకోగలవారే స్థిత ప్రజ్ఞులు! వారి చరితలు సాధకులకు మార్గదర్శనం చేసి సచ్చిదానంద మార్గంలో నడిపిస్తాయి. ❋

# 35. జీవిత చక్రం

జీవితం పరిణామ శీలమైనది. ఉత్కృష్టమైనది. సుఖదుఃఖాల సమాహారం. జీవులు సుఖదుఃఖాలను 'జీవిత' మాధ్యమం ద్వారా అనుభవిస్తారు. కొందరికి మహోన్నతంగా, మరికొందరికి మధ్యస్థంగా, ఇంకొందరికి హీనంగా జీవితం ఎందుకు ఆవిష్కృతమౌతుందన్న ప్రశ్న యుగయుగాలుగా, తరతరాలుగా మానవ మేధస్సును తొలుస్తూనే వుంది. వార్ధక్యం, రోగం, సన్యాసం, మరణం వంటి జీవిత వికృత పోకడలను ఏకకాలంలో దర్శించిన సిద్ధార్ధుడిలో జీవితం పట్ల తీవ్రమైన అయిష్టత జన్మించింది. వాటికారణాల అన్వేషణలో ఆయన భార్యను, కుమారుని, సకల సౌఖ్యాలను విడనాడాడు. ఆ ఆలోచనా తరంగిణిలో పరిభ్రమించాడు. ఓ రావిచెట్టు నీడలో చివరకు సత్యమేమిటో కనుగొన్నాడు. ఆ సత్యాన్ని లోకానికి వెల్లడి చేశాడు.

ప్రపంచం పరివర్తనాశీలమైనది. మార్పుదాని సహజ లక్షణం. భౌతిక జగత్తులో చెట్టు చేమ, కొండ – కోన, పక్షి – మృగం, చివరగా మహోన్నతుడైన మనిషి అంతర్భాగాలు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారమనే నాలుగు లక్షణాల అంతఃకరణ చతుష్టయంపై పట్టుసాధించిన వాడి పరిస్థితి వేరు. మనసు కారణంగా సుఖవాంఛ మనిషిలో నిత్యం కల్గుతూనే ఉంటుంది. కోరికలు సాఫల్యమయితే సరేసరి. లేనిపక్షంలో మనసును దుఃఖం ఆవరిస్తుంది. పరికిస్తే లోకంలో ఇలా కోరికలు సాఫల్యంకానివారి సంఖ్యే అత్యధికం. నిజానికి అందరూ వారి స్థాయిలో వారు కోరికలు తీర్చుకోలేనివారే. జీవితపు స్థాయిల్లో భేదం ఉన్నప్పటికీ కోరికలు తీరకపోవడమనే అవలక్షణం అందరికీ ఒకేలా ఉండటం గమనార్హం. కోరికలు తీరిన పక్షంలో దుఃఖం ప్రసక్తే ఉండదనేది నిర్వివాదాంశం.

మనసు కోరికల పుట్ట. శాశ్వత ఆనందానికి బుద్ధుడు ఓ మార్గం ప్రతిపాదించాడు. అష్టాంగమార్గం అనుసరించడం ద్వారా కోరికలను జయించవచ్చు; దుఃఖాన్ని అధిగమించవచ్చన్నది ఆయన ప్రతిపాదన. జీవితం పట్ల సరైన దృక్పథం, ఓ లక్ష్యం ఏర్పరచుకొని తదనుగుణంగా వర్తించడం సత్యాన్ని అనుసరించడం, ప్రవర్తన లోపరహితంగా చేసుకోవడం, అందరూ మెచ్చే విధంగా జీవనోపాధిని ఎంచుకోవడం, అందుకు తగిన కృషి చేయడం, వాస్తవాన్ని అనుసరించి జీవన దృక్పథం కల్గి ఉండటం, చివరగా ధ్యానం ద్వారా సత్యాన్వేషణ చేయడం 'అష్టాంగ మార్గం'లో ప్రధాన మార్గదర్శకాలు.

సృష్టిలోని సమస్త వస్తుజాలంతో పాటు మానవుడు కూడ సదా మార్పుకు లోనవుతూనే వుంటాడు. ఆ మార్పును అతడి శరీరం, మనసు ప్రతినిత్యం ప్రకటిస్తూనే ఉంటాయి. అందుకే నిన్నటిలా నేడు మనిషి శరీరం వుండదు. మనసూ ఉండదు. మార్పు హర్షించేదిగా ఉంటే అంతటా ఆనందమే. కానీ వాస్తవం వేరుగా ఉండటం జీవ ప్రకృతి లక్షణం. తన చింతనను, ప్రవర్తనను అనుసరించి జీవిత చక్ర భ్రమణం ఉంటుందన్నది తాత్విక చింతనాపరుల భావన. సంసారం పట్ల అనురక్తి కలిగి ఉండటం మానవ జీవితంలో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. ఆ అనురక్తి కొనసాగినంత కాలం అతడిని వైఫల్య ప్రాప్తి వెంటాడుతూనే వుంటుంది. వృద్ధాప్యం జీవిత చక్రం అంతిమ గమ్యం కాగా మరణంతో చక్రభ్రమణం ముగుస్తుంది.

కోరికలు పెంచుకోవడం, అవితీరకపోతే బాధపడటం వంటి సహజ ప్రక్రియకు భిన్నంగా మానవుడు ప్రవర్తించినపుడే అతడు తన పరమార్ధ లక్ష్యమైన 'ఆనందా'న్ని చేరుకొనే వీలుంది. దుఃఖం వలెనే ఆనందం కూడ మహా సాగరంతో పోల్చబడింది. కష్టాలు వస్తే దుఃఖాల కడలిలో మునిగిపోయి అస్తిత్వం లేనివాడయినట్లే, పరమానందం సిద్ధిస్తే కూడా ఆనందరస సాగరంలో మనిషి ఓలలాడుతాడని పారమార్ధిక శాస్త్రాలు చెబుతాయి.

జీవితం మనసొంతం. శైశవ బాల్యాలలో పరిరక్షణ అవసరమౌతుంది. జీవిత అంకానికి తల్లిదండ్రులు, గురువులు ఓ రూపు, జ్ఞానం జతచేస్తారు. తన

జీవితాన్ని తానుగా బ్రతకడం నేర్చుకున్నాక దాని నడవడి పూర్తిగా మనిషి స్వహస్తాలలోకి వస్తుంది. గుర్రాల్లా పరుగెత్తే కోరికలకు కళ్ళెం వేయగల్గితే దుఃఖాన్ని నిలువరించడం సులువన్న గౌతమబుద్ధుడి బోధ మానవాళికి ఎంతో ఉపకరిస్తుంది. కోరికల అదుపు మనిషి చేతుల్లో ఉన్నట్లే. ఆనందప్రాప్తికూడ అతడి కర్మలతో ముడివడి ఉంటుందన్న సత్యం మరువకూడదు. భౌతిక సుఖాన్వేషణలో కాక ఆనందాన్వేషణలో గమించే సాధకుడికి సుఖదుఃఖాలు సమంగా ద్యోతక మవుతాయి. అటువంటి సాధనతో జీవితచక్రం ఒడుదొడుకులు లేకుండా సాగి సంపూర్ణ విజయంతో ముగుస్తుందని మరువకూడదు. ❋

# 36. కాపట్యం

సృష్టిలో జీవజాలం ఆహారాన్ని ఆకలి తీర్చుకోవడానికి ఆరగిస్తుంది. 'మనిషి నెత్తురు రుచి మరిగిన పులి'కి జిహ్వాచాపల్యం ఉండొచ్చేమోగానీ పశు పక్షి మృగాలు జిహ్వాచాపల్యం ప్రదర్శించవు. కానీ మనిషి ఎప్పుడూ రుచికరమైన ఆహారాన్నే ఇష్టపడతాడు. ఆహారానికి రుచి అదనపు హంగు. అది దైవం 'పదార్థానికి' అనుగ్రహించిన ప్రత్యేకవరం. మనుషుల్లో దాంభికులు ఉంటారేమోగానీ జంతుజాలం తమ జీవనశైలిలో ఎప్పుడూ దంభం ప్రదర్శించదు.

కల్లాకపటం ఎరగని అమాయకత్వం 'అమాయకు'డైన (మాయకు అతీతుడైన) దైవానికి ప్రీతిపాత్రం. తనకు లేని అర్హతలు నటిస్తూ అలా ప్రజలను నమ్మించేందుకు మనిషి చేసే ప్రయత్నం ఆత్మవంచనకు నిదర్శనం. మనోవాక్కాయ కర్మల ఏకత్వం నటించే వ్యక్తిని దాంభికుడని శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చాడు. మనసులో అరమరికలు లేని సరళ స్వభావిని బోళాశంకరుడంటారు. అలాంటి వారు అందరికీ ఇష్టులు కావలసి వుంది. అయితే నిజం వేరుగా ఉండవచ్చు. కాపట్యం ఎరుగని చిన్నపిల్లల స్వభావం పుణికి పుచ్చుకున్న పెద్దలకు జీవితంలో ఆనందం ఎప్పుడూ కరతలామలకమే.

వ్యవహారదక్షత ఉన్నవారిని లోకం కీర్తిస్తుంది. వ్యవహార దక్షత ప్రదర్శించడానికి కాపట్యం అక్కరలేదు. నిజానికి కపట స్వభావులు క్రియాశీలురు కాలేరు. కాపట్యాన్ని ఆంగ్ల భాషలో 'హిపోక్రసీ' అంటారు. తానున్న స్థితికి భిన్నంగా ఉన్నతంగా వ్యక్తపరచుకొనే వ్యక్తిత్వమే శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చిన 'దంభం'! అదే 'కాపట్యం!' కుటుంబ బాంధవ్యాలలోను, సన్నిహితుల సాహచర్యంలోను ప్రదర్శించే దంభం మానవ సంబంధాలను నిర్వీర్యం చేస్తుంది.

నిత్యవ్యవహారాలలో నలుగురి మధ్య పొరపొచ్చాలు సహజం! వాటిని సమర్థంగా నిర్వీర్యం చేయగలవారు వివేకవంతులు. పశుపక్ష్యాదులు తమను

తాము ఉన్నతంగా ప్రదర్శించుకోవు. ఐతే జంతులోకంలో నక్కకు ఓ ప్రత్యేక స్థానం వుంది. దానిని 'జిత్తులమారి'గా తోటి జంతువులు గుర్తిస్తాయో లేదోగానీ జంతు సాహిత్యంలో కవులు ఆ జంతువుకు ఆ విశేష లక్షణాన్ని ఆపాదించారు. నక్క జిత్తులు ప్రదర్శించే వ్యక్తులు సమాజంలో విజయం సాధించలేరు.

ఉన్నస్థితికి భిన్నంగా అధికంగా తమను తాము ప్రదర్శించుకొనేవారు తాత్కాలికంగా లాభపడినట్లు కనిపించినా ఆ అవలక్షణం వారి ఉన్నతికి ఏమాత్రం తోడ్పడదు. మనిషికి దేహపరంగా, మేధాపరంగా కొన్ని ప్రత్యకతలున్నాయి. వాటిని అనుసరించే అతడికి సమాజంలో గౌరవాదరాలు ఉంటాయి. లేని హెూదాను ఆపాదించుకొనే వ్యక్తికి మోసకారిగా ముద్రపడుతుంది. అమిత ప్రతిభ లేకున్నా మంచితనం గుండెనిండుగా వున్న వ్యక్తికి ప్రజలు నీరాజనం పడతారు. వారికి ప్రజాదరణ పుష్కలంగా లభిస్తుంది.

మానవ సంబంధాలు అహాన్ని అనుసరించి రూపుదిద్దుకుంటాయి. అహాన్ని దూరం పెడితే దైనందిన వ్యవహారాల్లో తలెత్తే అపార్థాలు వాటికవే సమసిపోతాయి. సౌహార్ద్ర వాతావరణం వెల్లివిరుస్తుంది. అహాన్ని ఆత్మగా, దైవంగా గుర్తించాలే తప్ప మనిషికి మనిషికి మధ్య దూరం పెంచే వాహకంగా మార్చుకోకూడదు.

సద్భావనా సందర్శనలు, సంబంధాలు డీలాపడిన సమయాల్లో మంచి ఫలితాలనిస్తాయి. స్పర్థలు ఏర్పడినపుడు ఒకరి గృహాన్ని మరొకరు సందర్శించడం, చిన్న చిన్న బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, చేతనైన మంచి మాటలు నాలుగు ప్రేమతో మాట్లాడటం వంటివి చేయడం వల్ల ఊహించలేని మంచి ఫలితాలు అందివస్తాయి. మనస్పర్థలు కలిగితే క్రుంగిపోనవసరంలేదు. పరిష్కరించుకున్నాక గతంకన్నా మానవ సంబంధాలు మెరుగుపడి పరిమళాలు గుబాళిస్తాయి. వ్యక్తికి తానేమిటో తనకు తెలుసు. పొరుగువారికి కూడా అలాగే వ్యక్తం కావడంలో దాపరికంలేని వ్యక్తిత్వం ఇమిడి వుంటుంది. ఉన్న స్థితికి భిన్నంగా ఉన్నతి ప్రదర్శించడం కపటులకు సాధ్యమేమోగానీ లోకం దానిని ఏమాత్రం హర్షించదు. వ్యక్తిలో హృదయ సౌందర్యం వెల్లివిరిసినపుడు ఎల్లెడలా శాంతిలతలు విస్తరించి శాంతి పుష్పాలు వికసిస్తాయి! సమాజాన్ని నవపరిమళానంద భరితం చేస్తాయి! ❋

# 37. భవితవ్యం

ఓ యువకుడికి భవిష్యత్తు తెలుసుకోవాలనే అభిలాష మెండుగా వుండేది. కనిపించిన జ్యోతిష్యుడి నల్లా తన గ్రహబలం అడుగుతుండేవాడు. హస్త సాముద్రిక నిపుణులకు తన చెయ్యి చూపించి ఆయుర్దాయం తెలపమనేవాడు. ఒక మధ్యాహ్న భోజనమయ్యాక పగటి నిద్రకు ఉపక్రమించాడు. ఓ అద్భుతమైన కలగన్నాడు. కలలోని దృశ్యాలు ఉత్సుకత రేకెత్తించేలా ఉన్నాయి. గుర్తుంచుకోవాలని ఎంత గానో తపించాడు కానీ మెలకువ వచ్చాక కన్న కలంతా నీటిమీద రాతలా అంతర్ధానమైంది. అంతలో ఓ అశరీరవాణి ఇలా వినిపించింది. 'ఎప్పుడూ నీ ఆయుర్దాయమెంతో తెలుసుకోవాలని ఉబలాటపడేవాడివి కదా! నీవు కన్న కలలో నీ ఆయుర్దాయమెంతో చెప్పబడింది!' ఎంత ప్రయత్నించినా యువకుడికి తను కన్న కల స్ఫురణకు రాలేదు!

గతం తెల్లకాగితం మీద రాతలా స్పష్టంగా కనిపిస్తుంది. వర్తమానం వడ్డించిన విస్తరిలా కనుల ముందు నిలుస్తుంది. భవిష్యత్ ఎప్పుడూ ఓ మర్మమే. అనాదిగా శాస్త్ర సహకారంతో ఆ మర్మాన్ని ఛేదించేందుకు పండితులు చేయని ప్రయత్నమంటూ లేదు. పండులో గుజ్జులా కాలంలో నిబిడీకృతమైవున్న భవిష్యత్‌మనిషికి ఎప్పుడూ అగమ్యగోచరమే!

'బుద్ధికర్మానుసారిణి!' భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకనుగుణంగా మనిషి కర్మలు ఆచరించడం జరుగుతుందని శాస్త్రవచనం! ఎంతటి వారికైనా చిన్నవో పెద్దవో సమస్యలు ఉండనే వుంటాయి. వాటికి పరిష్కారం కనుచూపుమేర లో ఉందేమో అని మనిషి ఎదురుచూడటం పరిపాటి. నిజానికి అహంకారం వల్ల చాల సమస్యలు మనిషి ముందు ఆవిష్కృతమౌతాయి. అహంవీడి వినయం అలవరచుకున్న వ్యక్తికి భవిష్యత్ ఎప్పుడూ ఆశాజనకమే.

ఆగామిక్షణమే భవిష్యత్తు. ఆ క్షణం వర్తమానంతో అనుసంధానమై వుంటుంది. ఎలా వున్నా, ఏం జరగబోతున్నా దాని సాక్షాత్కారం ఓ తప్పని క్రతువు. వర్తమానమే నిత్యం, సత్యం. క్షణం గడుస్తున్నకొద్దీ వర్తమానం కాలగర్భంలో కలిసిపోతూంటుంది. గతంకానీ, ఆగామికాలంకానీ నీటిలో జారిపోయే చేపవలె మనిషి చేతికి చిక్కవు. కాలాన్ని ప్రవాహంతో పోలుస్తారు. గతంలో ఇలా జరిగింది కాబట్టి వర్తమానంలోను, రాబోవుకాలంలోను అలాగే జరగవచ్చని మనిషి అంచననా వేస్తాడు. భవిష్యత్తుకు సంబంధించిన పీటముడి వర్తమానంలో వీడదు. గతంలో ఏది భవిష్యత్తుగా భాసించిందో దానిముడులు వర్తమానంలో క్షణాలు గడిచే కొద్దీ క్రమంగా వీడుతుంటాయి. తన జీవితం ఎలా సాగాలో మనిషి కలలుకంటాడు. కాలం అనుకూలంగా ఉండబోతుందన్న ఆశావహ ఆలోచన మనిషి జీవన సరళిని పుష్టివంతం చేస్తుంది.

భవితవ్యానికి సంబంధించిన మనిషి ఆలోచనలు సాధారణంగా తన కుటుంబం గురించో, ఉద్యోగ వ్యాపారాల గురించో సాగుతాయి. ఆధ్యాత్మిక వ్యాపకం సుస్థిర లౌకిక, పారలౌకిక ఉన్నతికి తోడ్పడుతుంది. అస్తమయం తర్వాత రాత్రి గడిచి సూర్యోదయం తప్పక జరుగుతుంది. రాబోవుకాలంలో సాకారం కావాలనుకునే న్యాయబద్ధమైన కోరికలు తప్పక ఈడేరుతాయన్న విశ్వాసం మనిషికి వెయ్యి ఏనుగుల బలాన్నిస్తుంది.

అందరూ భవిత నిశ్చింతగా గడచిపోవాలని కోరుకుంటారు. ధర్మావలంబన, అనుష్ఠానం, సజ్జన సాంగత్యం జీవితానికి ఉన్నత విలువలు ప్రసాదిస్తాయి. సంకల్పం బలంగా ఉంటే క్లిష్టమైన కార్యాలు కూడ సాకారమౌతాయి. పూర్వం ఓ చిత్రకారుడు తన కళాఖండాలలో చేతికి ఆరు వేళ్ళు చిత్రించేవాడట! లబ్ధప్రతిష్ఠుడైన అతడి ఏకళాఖండం కూడ మానుష హస్తానికి ఆరవ వేలు లేకుండా చిత్రింపబడేది కాదు. విచిత్రంగా కొన్నేళ్ళ తర్వాత అతడు నివసిస్తున్న గ్రామంలో జన్మిస్తున్న శిశువులలో కొందరు ఆరువేళ్ళతో పుట్టడం జరిగిందట! ఈ ఘటన అంతరంగ శుద్ధి కలిగిన వ్యక్తి సంకల్పశక్తిని తెలియజేస్తుంది. అన్ని విషయాలలో కాకపోయినా మనిషికి తన భవిత ఎలా

ఉండబోతుందో సూచనప్రాయంగా కొంత తెలుస్తుందంటే ఆశ్చర్యం కల్గుతుంది. కానీ అదినిజం! అందుకు వర్తమానంలోనే బీజం పడుతుంది. మంచి సంకల్పంతో ఆచరించిన మంచి పనులు మంచి ఫలితాలనే ఇస్తాయి. నిజానికి జరగబోయే ఘటన ముందుగా తెలిసినంతమాత్రాన మనిషికి మేలే జరుగుతుందన్న హామీలేదు మానవుడు ఆశాజీవి. సర్వం దైవ సంకల్పాన్ని అనుసరించే జరుగుతుందని పెద్దలు చెబుతారు. కర్మకు తగిన ఫలితం ఉండనే ఉంటుంది. మంచికర్మలు ఆచరిస్తూ నిశ్చింతగా జీవించడం అలవాటు చేసుకోవాలి. స్వహితంతోపాటు సమాజశ్రేయం కోరే స్వభావాన్ని సాధన చేసిన వ్యక్తికి రాబోవుకాలం ఎప్పుడూ ఆశావహమే! 'ఉందిలే మంచికాలం ముందు ముందున' అంటాడో కవి. ఆశాజీవులకు ఆగామికాలం సానుకూలమే కాక పదికాలాల పాటు జీవితం నిశ్చింతగా గడుస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించిన సాధకులు రాబోవు కాలాన్ని ఎప్పుడూ ఆశావహంగానే భావించాలి ! ❃

# 38. సంశయాలకు వీడ్కోలు

ఏది ఎలా జరగవలసి వుందో అలాగే జరుగుతుందని చాలామంది నమ్ముతారు. కొందరికి తప్పక జరిగే రీతిని కూడ సంశయించడం అలవాటు. సంశయాత్ముడికి విభిన్నమైనవాడు ఆశావాది. ఆకాశంలో క్రమ్మిన నల్లని వాన మబ్బులను చూసి అవి తప్పక వర్షిస్తాయి; కుండలో నీరు దాచుకొనవలసిన అవసరమేమిటని ఒక విశ్వాసి కుండ ఒలకపోశాడట! బహుశ అది విశ్వాసానికి పరాకాష్ట కావచ్చు!

లోకంలో అనేకమంది ఆధ్యాత్మిక సాధన చేస్తారు. వారి సాధనా సంపత్తి రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి గురువుపై విశ్వాసం, రెండు... గురువు చేరువ చేయగలదైవం తమ కోరికలు తీరుస్తాడన్న నమ్మకం. సకల ప్రాణి వల్లభుడైన భగవంతుడిని తప్పక చేర్చే గురుతర బాధ్యతను గురువు తీసుకోగా ఆయన ఏర్పరచిన బాటలో నమ్మకంతో నడవటంతో శిష్యుడి కర్తవ్యం పూర్తవుతుంది.

నమ్మకాన్ని ఓ సానుకూల దృక్పథంగా చెప్పవచ్చు. ఒక పాత్రలో సగం నీరు ఉంటే ఆ విషయాన్ని ఉన్నదున్నట్లు ఒప్పుకొనేవాడు ఆశావాది కాగా పాత్ర సగం ఖాళీగా వుందని భావించేవాడు నిరాశావాది. ఆశ కల్పించేవాడు భగవంతుడు. తీర్చేవాడు సైతం అతడేనని నమ్ముతాడు ఆస్తికుడు. నడిచేదారిలో ప్రయాణం చేస్తే ఓ గమ్యం చేరగల సందర్భంలో ఎటువంటి శంక లేక ఆశావాది కష్టనష్టాలకు ఓర్చి గమ్యం చేరుకుంటాడు. నిరాశావాది ఆ రహదారి గమ్యం చేరుస్తుందా? మార్గ మధ్యలో ఆటంకాలు కలిగి చేరలేకపోతానా? అని సంశయిస్తాడు. నమ్మిన మనసు శక్తిపూర్ణం కాగా సంశయాత్ముడి మనసు దుర్బలమై కార్యసాధనకు ఉపకరించదు.

గొప్పగొప్ప సాధనలు చేసినా ఒక వ్యక్తి ఇతరేతరంగా విఘ్నాలు సంభవించి మోక్షకామన సిద్ధించకముందే శరీరం చాలించడం జరగవచ్చు. అలా యోగ భ్రష్టులైన వారి గతి ఏమిటని ప్రశ్నించినపుడు శ్రీకృష్ణుడు అర్జునుడితో 'అలాంటి వారికి సుగతే' అని సెలవివ్వడం ఆధ్యాత్మిక పథగాములకు ఓ ఆశాకిరణం! 'నమ్మి చెడినవారు లేరు' అన్న సూక్తికి గీతాచార్యుడి వాక్యం ఏనుగంత బలాన్నిస్తుంది. ఒకానొక సందర్భంలో భగవానుడు, 'సంశయాత్ముడు నశిస్తా'డని చెప్పడం మూర్తీభవించిన నిరాశావాదానికి చెంపపెట్టు!

వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆధునికకాలంలో సిఫార్సు చేస్తున్న మహామంత్రం 'ఆశావహ దృక్పథం'! నమ్మకం మనిషిని బ్రతికిస్తుంది. భోగభాగ్యాల నిచ్చే కృషికి ఊతమిస్తుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అన్న సూక్తి జగద్విదితం! కృషికి వలసిన మంత్రదండం నమ్మకం! భోగ వస్తువును గానీ, ఆధ్యాత్మిక లక్ష్యాన్ని గానీ సాధించాలంటే కృషి వెనుక నిలువెత్తు 'నమ్మకం' అవసరం! అంతేకాదు సమస్త సంశయాలనూ సాధకుడు సమాధి చేయాలి!

ఓ సాహసి పట్నంలో వినోద కార్యక్రమాన్ని వీక్షించి తను చేరవలసిన పల్లెకు ప్రయాణం మొదలిడే వేళకు అర్ధరాత్రి మీరింది. ఇరుకు కాలిదారికి ఇరుప్రక్కలా ఏపుగా పెరిగిన జొన్నచేలు! కీచురాళ్ళు సామూహికంగా చెవులు హోరెత్తిస్తున్నాయి. దారిలో ఎత్తైన పాములపుట్టలు దాటవలసి వుంది. పాములు ఎదురౌతాయేమోనన్న సంశయం మదిలో మెదిలినా అది తాత్కాలికం! ఆ శంకకు బలమివ్వక ఈలవేసుకుంటూ వడివడిగా ముందుకు నడవసాగాడు. అనుకున్నట్లే నాలుగైదు అడుగుల త్రాచు ఒకటి మెలికలు తిరుగుతూ కొద్ది దూరంలో జరజరా కాలిదారి దాటడం గమనించాడు. చీకటి రాత్రి చుక్కల మసక వెలుగులో కనీకనిపించని ఆదృశ్యం అతణ్ణి భీతిగొల్పలేదు. సర్పం అతడి వైపురాలేదు. సంశయరహితుడైన అతడు క్షేమంగా ఇల్లు చేరుకున్నాడు.

లోక వ్యవహారాల్లోను, ఆధ్యాత్మిక సాధనలోను సంశయాలు పనికిరావంటారు అనుభవజ్ఞులు. నమ్మకం మనిషికి కావలసిన శారీరక, మానసిక పరిపుష్టినిచ్చే ఓ దివ్య సాధనం. నమ్మకమనే తారకమంత్రాన్ని జపిస్తూ 'సంశయాలకు వీడ్కోలు' పలికే కార్యసాధకులకు అపజయం ఎన్నటికీ ఉండదు. ❋

# 39. ప్రాణం

జీవితం జీవించడానికే! ఆవేశంలోనైనా దానికి చుక్కపెడదా మనుకోవడం తెలివితక్కువ పని! ప్రాణం ఎవరికైనా తీపే! అది అందరూ అంగీకరించే నిజం! జన్మించిన ప్రతి వ్యక్తీ ఏదో ఒక వృత్తిని జీవనాధారం చేసుకొని జీవిస్తాడు. దైవం ఏ మనిషికి ఎంత ప్రాయం అనుగ్రహించాడో తెలుసుకొనే అవకాశం మాత్రం వుండదు. కడదాకా మనిషి కనిపించని ఊతాన్ని ఆధారం చేసుకొని జీవయాత్ర సాగించడం విశేషం!

ప్రాణం అమూల్యమైనది. దానికి సాటి మరొకటి లేదు. ఎవరికీ ఎవరి ప్రాణాన్నీ హరించే హక్కు ఉండదు. రాజ్యాంగాలు పౌరుల ధనమాన ప్రాణాలు పరిరక్షించేందుకు తోడ్పడతాయి. నేరాలు చేసినవారు శిక్ష అనుభవిస్తారు. మరొకరి ప్రాణం హరించిన వారికి ప్రభుత్వాలు విధించే శిక్షలు యావజ్జీవ కారాగారవాసం, లేక మరణశిక్షలే కావడం గమనార్హం! దేశాల కాలమాన పరిస్థితుల దృష్ట్యా కూడ ఆ విషయంలో ఏకీభావన కనిపిస్తుంది.

తల్లిగర్భాన్ని ఆధారం చేసుకొని శిశువు ప్రాణం పోసుకుంటుంది. గర్భవాసం తొలగాక శిశువు నూరేళ్ళ నిండు జీవితం కోసం సన్నద్ధమై సర్వశక్తులూ ఒడ్డి జీవయాత్ర ప్రారంభిస్తుంది. కడదాకా మనిషి శరీరాన్ని అంటిపెట్టుకొని ఉండే 'ప్రాణం' సులభంగా వీడిపోని విధంగా దైవం చేత అవయవాల రూపకల్పన చేయబడి పరిరక్షింపబడుతుంది. ఆత్మప్రాణంగా భాసించగా మనిషి మరణానంతరం సైతం ఆ జోడీ ప్రయాణం ఒకటిగా కొనసాగుతుంది. దైవం సృజించిన ప్రాణుల అంతరవయవాలు ఎన్నో అననుకూలతలను తట్టుకొని స్థిరంగా మనుగడకు సన్నద్ధం కావడం వలన ప్రాణరక్షణ జరగడం విశేషం! అవయవ వైఫల్యం చెందినవారిలో ఆ లోపం ప్రారబ్ధ కర్మవశంగా సంభవిస్తుందని సనాతనులు భావిస్తారు.

ఎన్నో జన్మల తర్వాత పుణ్యవశంగా మానవజన్మ లభిస్తుంది. సులభసాధ్యంకాని మానుష పుట్టుక అమూల్యమని గ్రహించి జన్మచరితార్థం చేసుకోవాలి. అంత గొప్ప జన్మ ఎత్తి కూడ స్వయంకృతంగాను, చెడు సహవాసంతోను జీవితాన్ని పాడుచేసుకొనేవారు కొందరు. ఆత్మహత్య మహాపాపమన్న సుభాషితం మనిషి ప్రాణం విలువకు సాటిమరొకటి లేదని తెలియజేస్తుంది. ఆత్మహత్యలకు ఉపక్రమించేవారు మరణానంతరమూ జీవితం ఉంటుందని విశ్వసించే వారయితే 'చచ్చినా' సుఖం దొరకదని గ్రహించి ఆపాప భావనకు స్వస్తి చెప్పడం జరగవచ్చు. విఫలయత్నం చేసిన వారు భౌతిక చట్టాల నుంచి తప్పించుకున్నా దైవశాసనానికి అతీతులు కాలేరు. తీర్పు వెలువడిన రోజున పరలోకంలో ఇహంలోని పాపాలకు తగిన శిక్ష ఉంటుందని అన్ని మతాలూ ఉద్ఘాటిస్తాయి. చవులూరే అమృతఫలమైనా అదేపనిగా ఆరగిస్తే రసాస్వాదన నిర్వీర్యం అవుతుంది. శాశ్వతానందం ఇచ్చే పదార్థం ఇహంలో లేదన్నది నిర్వివాదం. శాస్త్రాలు సైతం శాశ్వతానంద ప్రదాత, లోకనాయకుడైన పరబ్రహ్మ తప్ప అన్యంకాదని వచిస్తాయి. పరబ్రహ్మతత్వం అర్థం చేసుకున్న సాధకుడికి పారలౌకిక జీవనం పట్ల ఆసక్తి కలిగి శ్రేయోమార్గంలో గమిస్తాడు.

కష్టాలు అందరికీ వస్తాయి. తట్టుకొని కడదాకా జీవించేవాడే వివేకి! ప్రాణ నిష్క్రమణ సహజరీతిలో జరగాలే తప్ప ప్రాణం తీసుకొనే సాహసం మనిషి చేయకూడదు. మహాభారత కథలో ఇచ్ఛా మరణవరం గల భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలందాకా ఆగి దైవసన్నిధికి చేరాడన్న ఉదంతం మరణం కూడా శుభఘడియలో జరగవలసిన పుణ్యకార్యమని తెలియజేస్తుంది.

ఇంద్రియ సుఖాలు కేవలం భావోద్వేగాల సంతృప్తికేగానీ, శాశ్వతానంద ప్రాప్తికి దోహదం చేయవు. అదిగ్రహించిన ప్రజాకవి వేమన చావుపుట్టుకల గుట్టు విప్పడంతోపాటు సామాన్యుడికి సైతం అర్థమయ్యేరీతిలో జీవిత సత్యాలను తేటతెల్లం చేశాడు. మనిషికి జన్మించడంలో ఎలా స్వేచ్ఛ లేదో మరణం లోను వుండదు. కష్టాలు దాపురించినా, కడగండ్లు ప్రాప్తించినా కడదాకా జీవనయానం కొనసాగించడంలోనే తన గెలుపు దాగుందని మనిషి గ్రహించాలి. ఊపిరేప్రాణం! ప్రాణమే ఆత్మ! ఆత్మదైవం! దైవమే ఆనందం! ఆ నిజం తెలుసుకున్న సాధకుడు ఆత్మానందానికి ఎన్నడూ దూరం కాడు! ❋

# 40. తీరంలేని కడలి

తీరమున్న కడలి భౌతికమైనది. భవ (సంసార) సాగరం తీరంలేని కడలి వంటిది. మానవుడి అనుభవాలు అతడి ఆశలు, ఆశయాలతో ముడిపడి ఉంటాయి. కొన్ని కోరుకున్న అనుభవాలు కాగా మరెన్నో ఊహకు అందనివి! కొన్ని బాధించేవి; మరికొన్ని పునః కావాలనిపించేవీ ఉంటాయి. ఆశకు హద్దులు ఏర్పరచుకోగల్గితే ఆత్మ సంతృప్తి దానికదే అనుభవంలోకి వస్తుంది సంసార సాగరంలో చిప్పిల్లే ఆనందానుభూతి భక్తుడి సాధన పరిపక్వతననుసరించే ఉంటుంది.

ఈ జగత్తును పరిశీలిస్తే బోధపడే విషయం ఒక్కటే! ప్రకృతి నిర్ణేతగా తనకు తానుగా విధించుకున్న నియమావళికి భగవంతుడెప్పుడూ కట్టుపడి ఉంటాడని! దైవం ప్రతి రూపాలయిన పంచభూతాలూ తమ తమ నియమాల ఉల్లంఘనకు పాల్పడవు. ఈ సువిశాల విశ్వంలో ఆకాశం ఎంతమేర ఆవరించి ఉందనే పరిజ్ఞానం అంతరిక్ష పరిశోధకులకు ఊహకు అందనిదైనా మన ప్రాచీన రుషి పుంగవులు తమ దివ్య దృష్టితో అంతా గ్రహించి ఆకాశం, భగవచ్ఛక్తీ రెండూ అనంతమైనవని నిర్ధారించారు నీలవర్ణ శోభితమైన గగనం భగవంతుడి అనంతత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని ప్రతిఫలిస్తుంది. స్థూల దృష్టికి భూతత్వం స్థిరత్వానికి సంకేతం. నీరు వాలు వెంట సాగే ప్రవాహ గరిమకు నిదర్శనం. వాయువు ప్రాణం నిలుపుదలకు, చాలనానికి దర్పణం. అగ్ని ఊర్ధ్వ గమనానికి, దాహక శక్తికీ పర్యాయం. భగవత్తత్వాన్ని పదునాల్గు భువనాలకూ విస్తరించి వున్న సర్వవ్యాపకశక్తిగా మన ప్రాచీన రుషులు ఏనాడో తెలుసుకొని సనాతన ఆధ్యాత్మిక ప్రజ్ఞా పాటవాన్ని చాటడం విశేషం!

సర్వవ్యాపి అయిన దైవం ప్రాణుల హృదయాల్లో పదిలంగా ఉంటాడు. పూర్వ పాపపుణ్యాలు జీవగతిని నిర్దేశించేవిగా భావింపబడగా పశు పక్ష్యాదులు అందుకు మినహాయింపుగా జీవిస్తాయి. మంచి – చెడు కర్మల ఫలితాలకు మానవుడు అతీతంగా వ్యవహరించలేడు. అద్వైతికి జగమంతా తానుగా గోచరించగా ద్వైతికి తాను, జగత్తు వేర్వేరుగా బోధపడతాయి. దైవమే సమస్త విశ్వానికీ కర్త అన్న ఉదాత్త భావనకు సంబంధించి ఇఉవురి ఆలోచనా ఒక్కటే!

మనిషి ఆలోచనలు, అనుభవాలు సంసార సాగరంలో అంతర్భాగం. అతడి ఆలోచనలు ఎక్కడ మొదలై ఎక్కడ అంతమౌతాయో చెప్పలేం! ధ్యాన ప్రక్రియతో కొంతవరకైనా ఆలోచనల ఉధృతికి అడ్డుకట్ట వేయవచ్చున్నది ప్రాచీన మునీశ్వరుల భావన. దైవం 'అహం'గా మానవ ఉపాధిలో ఉన్నప్పటికీ చిత్తశుద్ధి కలిగే దాకా అతణ్ని తెలుసుకోవడం దుర్లభం!

సంసారం దాట శక్యంకాని మహార్ణవమన్నారు వేదాంతులు. మానవుడు ఆ సాగరంలోనే బ్రతుకు నావను నడిపిస్తాడు. దేహంలో దైవం జీవాత్మగా స్థితుడై ఉన్నప్పటికీ ఆత్మ ఆనుపానులు మానవ మేధకు అందనివి. హృదయ స్థానంలో ప్రాణాన్ని రక్షిస్తూ, సహస్రారంలో మేధకు పదును పెడుతూ దశ, దిశ నిర్దేశనం చేస్తాడు అంతర్యామి. పదునాల్గు భువనాలకూ నమూనా మానవదేహం! సంసార సాగరంలో మానవుడి జీవిత నౌక ప్రయాణం మోక్షతీరం వైపుకే! భవసాగరం తీరంలేని కడలిని తలపించినా సాధనాబలంతో మనిషి భగవన్నామమనే పడవ సహాయంతో ముందుకు నడుస్తూ సాధన ఫలవంతమయ్యాక ఆనందతీరానికి తప్పక చేరుకుంటాడు. అలా చేయడంతో మానవుడికి అతడి జైత్రయాత్ర సంపూర్ణమౌతుంది. సంసార సాగరతీరం చేరుకోవడంలో ఏ భక్తుడికైనా కలుగవలసిన మొదటి, చివరి అనుభవం భగవంతుడితోడిదే!

'పునరపి మరణం, పునరపి జననం' – ఈ శృంఖలకు చరమగీతం పాడటమే సాధకుడి అంతిమ లక్ష్యం కావాలి ! ❋

# 41. స్వార్థం

జననం ఆనందాన్నిస్తుంది. శాశ్వత వియోగానికి కారణమయ్యే మరణం దుఃఖానికిహేతువవుతుంది.సంబంధంలేని వారి జననం, మరణం మనిషి పెద్దగా పట్టించుకోడు. ఆ ఘటనలు అతడిలో ఎలాంటి భావోద్వేగాలూ కల్గించవు. తరచి చూస్తే ఆ వైఖరి స్వార్థం వల్లనే అని తేలుతుంది. మానవుడు అంత స్వార్థపరుడా అని ప్రశ్నిస్తే చరిత్ర 'ఔ'ననే సమాధానం చెబుతుంది.

స్వార్థ గుణం పాపహేతువా అన్న ప్రశ్నకు జవాబుగా 'ఔను', 'కాదు' రెండూ చెప్పవలసి వుంటుంది. వ్యక్తిని బట్టి, ఆశించే ప్రయోజనాన్ని బట్టి అన్వయం మారుతుంది. కరుణాపూర్ణ హృదయులకు లోకమంతా తమ స్వగృహమే అన్న భావన ఉంటుంది. వారిని పొరుగు వారి కష్టసుఖాలు ప్రభావితం చేస్తాయి. ఆత్మోన్నతి పొందిన మహనీయులు సుఖదుఃఖాలకు అతీతంగా వ్యవహరిస్తారు. లోక సంక్షేమమే వారి ధ్యేయం కాబట్టి 'స్వార్థ' మనే పదానికి వారి నిఘంటువులో సంకుచితార్థం ఉండదు.

ఎవరైనా స్వీయ కర్మల ఫలితం అనుభవించవలసిందే! పుణ్యకర్మలు చేస్తాం; పాపకర్మలూ చేస్తాం. పాపమని తెలియక కర్మ చేయడం వేరు; తెలిసీ చేయడం వేరు! నిప్పును తాకితే చేయి కాలినట్లు పాపకర్మ దుఃఖానికి కారణమౌతుంది.

ఓ భక్తుడికి ఓ సందేహం కలిగింది. సందేహ నివృత్తి కోసం గురువు గారిని ఆశ్రయించాడు. 'భగవంతుడు దయామయుడంటారు కదా! ఆయన సంకల్పం లేకుండా ఏ కర్మా చేయలేం! తండ్రి లాంటి దైవం మన చేత పాపకర్మలెందుకు చేయిస్తాడు? చేయించే ఆయనకు పాపఫలం అంటదా?' శిష్యుడి ప్రశ్న గురువుగారికి అమాయకంగా తోచి చిర్నవ్వుతో జవాబిచ్చాడు. 'సర్వం

భగవదేచ్ఛ అయినప్పటికీ మనిషికి సర్వస్వతంత్రమైన ఆలోచనా శక్తి ఉంది. ఏది మంచి? ఏది చెడు? బేరీజు వేయగల విజ్ఞత వుంది. పురాకృతకర్మ వశంగా గానీ, సంస్కారాన్ని అనుసరించి గానీ కర్మలు చేస్తే అవి తెచ్చిపెట్టే పుణ్యపాపాలకు అతడే బాధ్యుడు గనుక కర్మఫలం కూడ అతడికే చెందుతుంది. మధుమేహ రోగికి తీపి పదార్థాలు నిషిద్ధం. మనో నియంత్రణ కోల్పోయి తీపి ఆరగిస్తే తదనుగుణంగా వ్యాధి అతిశయిస్తే బాధ్యత అతడిదే గానీ, ఇచ్ఛాశక్తి అనుగ్రహించిన భగవంతుడిది కాదు. వ్యక్తి కర్మ ఫలం అనుభవించి తీరవలసిందే!

మాతృదేవి శారదామాత కడకు ఓ భక్తుడు వచ్చి తన వివాహ విషయంలో ఆచరణాత్మక సలహాయిచ్చి కటాక్షించమని కోరాడు. వివాహం అవశ్యం చేసుకొమ్మని మాతృశ్రీ అతడికి సలహాయిచ్చింది. కొద్ది రోజుల అనంతరం వేరొక భక్తుడు అదేవిధంగా సలహా కోరినపుడు అమ్మ అతడికి వివాహం చేసుకోవద్దని సూచించింది. ఇదంతా గమనించిన ఓ భక్తురాలు ఇద్దరికీ వేర్వేరుగా సలహా యిచ్చిన శారదామాత ఆంతర్యాన్ని తెలుసుకోగోరింది. 'మొదటి వాడిలో వివాహ వాంఛ బలంగా వుంది. వద్దని వారిస్తే అతడి బుద్ధి పెడత్రోవ పట్టే ప్రమాదం ఉంది. రెండవ వాడిది భిన్న సంస్కారం! తగిన విధంగా ప్రోత్సహిస్తే అతడు ఆధ్యాత్మికోన్నతిని అనతికాలంలో సాధించి తనను (స్వార్థం), సమాజాన్నీ (పరార్థం) ఉద్ధరించే అవకాశం ఉంది. అందుకే యిద్దరికీ వేర్వేరు సలహాలు యిచ్చాను' విశదీకరించింది అమ్మ భగవదంశ దీపించే మహనీయులు తమకోసం ఏదీ చేసుకోరు. వారి తపనంతా లోకహితం కోసమే! బిడ్డ అంటే తల్లి కడుపు చల్లబడ్డట్లు పుణ్యపురుషులు పరార్థంలోనే ఆనందం పొందుతారు. తనను శిలువ వేసిన దుష్టులను అమాయకులుగా పేర్కొంటూ వారిని క్షమించవలసిందిగా యహోవాను ప్రార్థించాడు క్రీస్తు. స్వార్థాన్ని త్యజించి లోకహితం దేనివల్ల కలుగుతుందో తెలుసుకో గోరి జ్ఞానాన్వేషణ చేసి బుద్ధుడు లోకాన్ని ఉద్ధరించాడు. లోకం మేలు కోసం ప్రకటమయ్యే స్వార్థం చెడుగుణం కాదు. లక్ష్యాన్ని విస్తృతం చేసి జగమంతా తమ కుటుంబంగా భావించే వారి స్వార్థం సర్వజన శ్రేయోదాయకమే అవుతుంది. ❃

# 42. నీడ

వెలుగు నీడలు సహవాసం చేస్తాయి. వెలుతురున్న చోట నీడ అతి సహజంగా పరచుకుంటుంది. చీకటి పలచ బారిన ఉషోదయవేళ వ్యాపించే అరుణకాంతి సూర్యోదయాన్ని సూచిస్తుంది. పూర్వ, అస్తమయ సంధ్యా సమయాల్లో పరచుకొనే పొడవాటి నీడలు జీవితానికి కొత్త అర్థాలను చెబుతాయి. మనిషిని యశస్సుగానీ, అపకీర్తిగానీ నీడలా అనుసరిస్తుంది. కూడు, గుడ్డ, నీడ మానవుడి ప్రాథమిక అవసరాలు కాగా ఆ ఆవశ్యక త్రయంలో నీడ పాత్ర ఎనలేనిది. బీదసాదలతో పాటు యశః పురుషులకైనా నీడనిచ్చే ఇల్లు ఎండవానల నుంచి రక్షణ కల్పించే మహత్తర సాధనం. పక్షులు చెట్లపై తాము నిర్మించుకొనే చలువ గూళ్ళలో ఒదిగిపోయి ఆనందాన్ననుభవిస్తాయి. సంచార జాతుల వారు చెట్టునీడనే ఇల్లు చేసుకొని జీవయాత్ర సాగిస్తారు. పగటి వెలుగు వేడిమిలో హాయినివ్వజాలని మలయమారుతం పచ్చని చెట్టునీడతో జతకలిపినపుడు మనసుకు ఆహ్లాదం కలుగుతుంది.

చోరులు, హంతకుల వంటి దుశ్చరితుల అపకీర్తి వారిని నీడలా వెంటాడుతుంది. అటువంటి వ్యక్తుల 'ఛాయా' చిత్రాలు రక్షక భట నిలయాల్లోను, బహిరంగ రద్దీ ప్రదేశాల్లోను గుట్టు రట్టు చేసేలా ప్రదర్శనకు ఉంచబడటం ఆనవాయితీ.

యశఃకాములైన సత్పురుషుల కీర్తి వారిని నీడలా అంటిపెట్టుకుంటుంది. శ్రీరాముడు తండ్రి ఆనతి మేరకు అరణ్యాలకు తరలి వెళుతున్నపుడు సీతాలక్ష్మణులు ఆయనను నీడలా అనుసరించారు.

చల్లని అమ్మఒడిని మాతృఛాయ అంటారు. నీడ హాయిగొల్పేదే అయినా దట్టమయిన వటవృక్షఛాయలో మరో మొక్క ఎదగదన్నది జగద్విదితం. జగత్తులో

వెలుగునీడలు ఎంత సహజమో, మానవ జీవితంలోనూ అవి అంతే సహజంగా నడయాడతాయి. సమాజంలో వేళ్ళూనే విష సంస్కృతిని విష వృక్ష ఛాయతో పోల్చవచ్చు. అభాగ్యులకు దాతల సహాయంతో లభించే ఆశ్రయాన్ని చల్లని నీడగా అభివర్ణిస్తాం. సూర్యచంద్రులు రాహుకేతు గ్రస్థమయ్యే గ్రహణ సమయాల్లో బూమిపై పరచుకొనే నీడలో తిరగాడటం అమంగళకరంగా భావిస్తారు. పూర్వపు రోజుల్లో రాత్రివేళ నూనె దీపాల క్రీనీడలో భుజించవద్దనే వారు. గుడ్డి వెలుగులో కనీకనిపించని సూక్ష్మ కీటకాలు ఆహారంలో కలుస్తాయన్నది కారణం కావచ్చు. పురాణాల్లో సూర్యపత్ని ఛాయాదేవి 'నీడ'కు ప్రతీకాత్మక దేవతగాను, సూర్యుని మొదటి భార్య సంజ్ఞాదేవి యొక్క ఛాయారూపంగాను చెప్పబడింది. భానుడి ప్రచండ వేడిమిని తట్టుకోలేని సంజ్ఞ ఆయనను వీడి తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిందని మార్కండేయ పురాణ వచనం.

మనం ఆనందించే నీడ, హృదయాకాశం కింద అలరారే ప్రాతః సంధ్యా సమయపు చల్లని మబ్బుల పందిరి కావాలి. అది దురాగతం వల్ల ఆవరించే యుద్ధ మేఘాల క్రీనీడ వంటిది కాకూడదు. ఉదారులు, సంపన్నులయిన వ్యక్తులు 'నీడ'లేని వృద్ధులు, అనాథలకు ఆద్యంతాలు తామే అయి ఆశ్రయమివ్వడం ఓ మంచి సాంప్రదాయం. అలా కల్పింపబడే ఆశ్రయం ఎండ వేడిమి ధాటికి తట్టుకోలేని సున్నితమైన మొక్కలకు కల్పించే పారదర్శక చలువపందిరి (గ్రీన్ హౌజ్ రూఫింగ్) వంటిది కావాలిగానీ చిన్నమొక్కలను ఎదగనీయని మర్రిచెట్టునీడ కాకూడదు.

ఎండిమోడులైన వృక్షాలు నీడనివ్వలేవు. సరికదా అగ్గి రాజుకుంటే చల్లని నీడనిచ్చే పచ్చని వృక్ష సంతతితో కూడిన వనమంతా భస్మీపటలమౌతుంది. పేరు ప్రతిష్ఠలున్న వంశంలో నీచుడు జన్మిస్తే వంశగౌరవం మంటగలుస్తుందంటూ జాగ్రత్తలు చెబుతాడు ప్రజాకవి వేమన. ❋

# 43. 'జాతవేదుడు'

రాతియుగపు మానవుడు పచ్చిమాంసాన్ని తిని జీవించేవాడు. ఓ మంసాహార పక్షిలా! ఓ మృగంలా! రెండు ఎండు చెట్టుకొమ్మల రాపిడికి నిప్పు రవ్వలు పుట్టి కర్ర జ్వలించడం చూసి తమాషాగా తోచి తను కృత్రిమంగా కర్రలను ఒరిపిడికి గురిచేసి నిప్పు పుట్టగా కేరింతలు కొట్టాడు. అలా పుట్టిన నిప్పుకు కాల్చేగుణం ఉండటం చూశాడు. పచ్చిమాంసాన్ని కాల్చి రుచి చూశాడు. బావుండటంతో మాంసం కాల్చుకుని తినడం ప్రారంభించాడు. నిప్పుతో అలా మొదలైన మనిషి ప్రస్థానం నేటి విస్తృత శ్రేణి ఉపయోగాలు, పరిణామాల దాకా అలా కొనసాగుతోంది.

అగ్నిని జాతవేదుడు, జాతవేదసుడు అన్నారు. ఆయన వేదాల నుండి ఉద్భవించాడని భావం. వేదాలు జ్ఞాన నిధులు. అగ్ని జ్ఞాన సంభవుడు. లౌకిక ప్రపంచంలో అగ్నిని వంటకు ఉపయోగించడం నుంచి శాస్త్రవేత్తలు పరిశ్రమల బాయిలర్లలోని అత్యధిక ఉష్ణపీడన శక్తితో విద్యుదుత్పత్తి చేయబూనటం దాక అగ్నితత్వ పరిణామదశ అలా కొనసాగుతూనే ఉంది.

నిజాన్ని నిప్పుతో పోలుస్తారు. సత్యసంధత నిరూపణ కోసం 'అగ్నిసాక్షిగా' అని ప్రమాణం చేస్తారు. హైందవ ధర్మంలో వివాహాది క్రతువులు అగ్నిసాక్షిగా జరుగుతాయి. వేదకాలం నుంచీ అగ్నికి అంత ప్రాధాన్యం ఉంది. ఋగ్వేదంలో మొట్టమొదటి శ్లోకం 'ఓం అగ్నిమీళేపురోహితం'.. అగ్ని దేవుని ప్రార్థిస్తూ వెలువరించిన తొలిమంత్రరాజం. యజ్ఞ యాగాది క్రతువుల్లో అగ్నిహోత్రుడిది పురోహితపాత్ర. దేవతలకు యజ్ఞాల పట్ల ఆసక్తికి కారణం అగ్ని ద్వారా వారికి అందే హవిస్సులే. వారికి ప్రీతిపాత్రుడైన అగ్నిని ఆరాధించే మానవులకు అష్టైశ్వర్యాలు కలుగుతాయని ప్రతీతి. యజ్ఞాలు అగ్నివల్లే సాధ్యం. అగ్నిలేకుండా యాగాది క్రతువుల ఉనికి కనీసం ఊహించనైనా లేనిది.

నిత్యాగ్నిహోత్రులు వేదకాలం నుంచీ ఉన్నారు. ఆధునిక కాలంలో ధునీవాలాబాబా, షిర్డీ సాయి బాబా నుంచి వెంకయ్య స్వామి దాకా మహనీయులు నిత్యాగ్నిహోత్రులై తాము తరించి లోకాన్ని తరింపజేసినవారే. హిమగిరియాత్ర చేసి వరూధిని కామపాశానికి బందీ అయి,తన పవిత్ర శీలంతో ఆ సమస్యను అధిగమించి నిత్యకర్మానుష్ఠానానికి సకాలంలో ఇల్లు చేరుకోగల్గిన బ్రాహ్మణ యువకుడు ప్రవరాఖ్యుడు అగ్ని ఆరాధకుడే.

రుగ్వేదం అగ్నిని లోకానికి పితృసమానుడిగా అభివర్ణించింది. కొందరు ప్రత్యక్షంగా అగ్నిని ఆరాధించగా మాన్యుల నుంచి సామాన్యుల దాకా పొయ్యి రాజేయకుండా జీవిక సాగించడం సాధ్యంకానివారే. ఆంగీరసుడు అగ్ని కుమారుడు. అగ్ని గుణధర్మ విశేషాలను లోక విదితం చేసింది ఆయనే. జఠరాగ్ని వల్ల కడుపులోని ఆహారం జీర్ణమై రక్త వీర్యాలుగా మార్పు చెంది సంతానోత్పత్తికి కారణమవుతుంది. కాబట్టి అగ్ని సృష్టికారక శక్తిగా చెప్పబడ్డాడు. ప్రాణ, ఆపాన, వ్యాన, ఉదాన, సమానాలనబడు పంచప్రాణాలు అగ్నిరూపంగా చెప్పబడ్డాయి.

సూర్యుడివలె అగ్నికి దాహక, తాపక శక్తులు ఉండటం వల్ల వారిరువురికీ గుణధర్మాలలో సామ్యం ఉంది. కణ్వమహర్షి సూర్యుడి నుంచి అగ్నిని సృజించాడని ఓ ఉక్తి ఉంది. అగ్ని నుంచే మరుద్గణాలు ఉద్భవించాయి. నీటియందు అగ్ని కలదన్న వేదవాక్కును శాస్త్రవేత్తలు జలవిద్యుదుత్పాదన ద్వారా నిరూపించి రూఢి చేయడం హర్షదాయకపరిణామం.

నిరాకార పరబ్రహ్మ ఊర్ధ్వలోకాలలో ఉంటాడని ప్రతీతి. జ్వలించే అగ్ని శిఖలు ఊర్ధ్వ ముఖంగా వెలువడటం విశేషం. సూర్యకిరణాల వల్ల నీరు ఆవిరై మేఘాలు ఏర్పడి వర్షరూపంలో తిరిగి భూమిని చేరుతుంది. అగ్నితత్వంగల సూర్యకిరణాలలోని తాపక శక్తి వల్ల రుతుచక్ర భ్రమణం జరిగి పంటలు పండి జీవులు పోషింపబడతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సృష్టి పరిపోషణకు కారకుడైన అగ్నిహోత్రుడు ఆరాధనీయుడు.

పంచభూతాలలో ఒకడైన అగ్ని లేకుండా మానవాళికి మనుగడ లేదు. అగ్నిలేని ప్రపంచాన్ని ఊహించడం కూడ కష్టమే. అగ్ని లేకపోతే ఆధునిక మానవుడు తిరిగి ఆదిమ మానవుడిగా తిరోగమన దశకు మళ్లింపబడతాడన్న విషయం కాదనలేని నిజం. ❋

# 44. 'ప్రలోభాలు'

భౌతిక ప్రపంచంలో విషయ వస్తు జాలానికి సంబంధించి మానవుని ఊరించే ఆకాంక్షలే ప్రలోభాలు! మానవుడు ఇంద్రియాలకు వశుడై జీవితం గడపవలసిన నిమిత్తమాత్రుడు. అతడికి ఎన్నో ఆకర్షణలు! ఎన్నెన్నో ప్రలోభాలు!!

మనిషి బాహ్య ఆకర్షణల విష వలయంలో చిక్కుకొని సాలీడు గూడు వదలి రాలేనట్లు ప్రలోభాలను ఛేదించుకొని రాలేక విలవిలలాడుతాడు. పసిబిడ్డ తన అమాయకత్వం చేత వివిధ ఆకర్షణలకు గురైనట్లు మనిషి భౌతికంగా ఎదిగినా బుద్ధి వికసించని కారణంగా వివిధ ఆకాంక్షలకు ఎరవుతాడు.

తనది కానిది, తనకు లేనిదానినే మనసు తీవ్రంగా కోరుకుంటుంది. దానిని సాధించడం కోసం అవిశ్రాంతంగా జీవన పోరాటం చేస్తుంది. అది మానవ బలహీనత! అయినా ఆంతరిక శౌచం సాధించినపుడు మనసును నియంత్రించడం అంతగా కష్టం కాకపోవచ్చు. అభ్యాస వైరాగ్యాలచేత మనసును లొంగదీసుకోవచ్చంటాడు గీతాచార్యుడు.

ఇంద్రియాలు పవిత్రంగా కర్మలు చేసినపుడు మనిషి మనుగడ సజావుగానే సాగుతుంది. వాటి పోకడలో సమతుల్యత లోపించి ఇంద్రియ విషయాల పరిధి విస్తరించినపుడు మనిషి బాహ్య, ఆంతరిక సమస్యల వలయంలో చిక్కుకుంటాడు. మొదటగా మానవుని ప్రలోభపరిచే శక్తివంతమైన ఇంద్రియం కన్ను. ఆకర్షించిన ప్రతిదాన్నీ అది కోరుకున్నపుడు ప్రలోభం కలుగుతుంది. జీవితం దుర్భరమౌతుంది. రెండవ ప్రలోభం జిహ్వేంద్రియం. నాలుక నిర్వర్తించే జంట విధులు రుచి, వాక్కు – రెండిటిలోనూ ఆకాంక్షలు విస్తరిస్తే కొత్త కష్టాలు ముంచుకొస్తాయి. కొత్త రుచులు కోరే మనస్తత్వం శారీరక ఆరోగ్యానికి చెరుపు

చేస్తుంది. విషయ వాంఛలకు సంబంధించి మనసును అపవిత్రం చేస్తుంది. సాధన కుంటుపడుతుంది. శ్రోత్రేంద్రియం అసత్య లోక వ్యవహారాలను వినడంలో చూపే కుతూహలం ఆధ్యాత్మిక ప్రగతికి చేటు! మనిషి సుఖ 'స్పర్శ'కు బానిసైతే భోగలాలసుడౌతాడు. శీతోష్ణాల సుఖమూ నియంత్రించ సాధ్యంకాని ప్రలోభమే! ప్రలోభాలు మనసుకు పరిమితంకాక వాస్తవ అనుభవాల రూపంలో వ్యక్తమయితే జరిగే నష్టం అపారం!

రామకృష్ణ పరమహంస ధర్మపత్ని శారదాదేవి అంటారు. 'నీవు చేసే పాపపు ఆలోచనలు మనసుకు పరిమితమయితే భయంలేదు. బాహ్య కర్మలుగా రూపాంతరం చెందితే వినాశం కొనితెచ్చుకున్నట్లే!'

ప్రలోభాలవల్ల కర్మలు అపవిత్రమౌతాయి. కర్మ భ్రష్టులైన వారికి ఉదాహరణగా రావణాసురుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కీచకుడు, జరాసంధ, కంస, శిశుపాలాదుల వంటివారు మన ఇతిహాసాలలో కనబడతారు. సమాజం నీతివంతంగా మనుగడ సాగించవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ వారి భ్రష్ట చరితలు లోకానికి హెచ్చరిక చేస్తాయి.

గులాబీ చెట్టు ముళ్ళతో కూడి ఉన్నట్లు మానవ మెదడు ప్రలోభాలనే కంటకాలతో ఆవరింపబడి ఉంటుంది. గులాబీ ముళ్ళు పూలను రక్షించేందుకు ఉద్దేశించబడినవికాగా ప్రలోభాలు మనిషిని కబళించే తత్వం కలవి. భక్తిజ్ఞాన వైరాగ్యాలు ప్రలోభాలకు విరుగుడుగా,మానవుని సర్వోన్నతుడిగా తీర్చిదిద్దగల మహత్వపూర్ణ ఆధ్యాత్మిక సాధనాలు. ఆ దిశగా సాధన కొనసాగించే కార్యశీలురు ఆత్మజ్ఞాన పూర్ణులౌతారు. ప్రలోభాల మసి అంటని ఆధ్యాత్మిక సాధనతో జిజ్ఞాసువులు సులభంగా పరమాత్మ నిజస్వరూపాన్ని తెలుసుకోగల్గుతారు. అటువంటి మహనీయుల దివ్యయోగసాధనలు ఆధ్యాత్మిక భావోద్దీపనకు ప్రేరణ అవుతాయి. ❋

# 45. ముఖం

ముఖం చూసి మనిషి మనస్తత్వాన్ని అంచనా వెయ్యగలమా? అవుననే అంటారు శాస్త్రవేత్తలు. అందుకేనేమో ముఖం మనో సూచిక అంటారు. ముఖం నుంచి మానవదేహ సర్వవ్యాపకాలూ నిర్వహింపబడతాయి. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలకు ఇక్కణ్నుంచే ఆజ్ఞలు జారీ అవుతాయి. ఏ అవయవానికీ లేని ప్రాధాన్యత ముఖానికే ఉంది. శరీరంలో ఏదైనా అవయవం పనిచేయకపోతే, లేక కొరవడితే అంగవైకల్యం ప్రాప్తించిందంటారు. ముఖమే లేకపోతే శరీరానికి ఒక గుర్తింపుగాని, ఉనికిగానీ ఉండదు. తల తొలగితే ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోతుంది. పూర్వం పరువు తీసే, లేదా ఓటమిని ఆపాదించే ప్రయత్నంలో భాగంగా శిరస్త్రాణాన్ని, లేదా తలపాగాను తొలగిస్తే అది మరణంతో సమానమని భావించేవారు.

తలముందు భాగాన్ని ముఖాకృతిగా చెబుతాం. తలలో ఉండే మెదడుతో శరీర నాడులన్నీ అనుసంధానమై ఉంటాయి. ప్రాణశక్తి ప్రవాహ వాహికలైన ఇడ (చంద్ర), పింగళ (సూర్య) నాడులు ఎడమ, కుడి ముక్కు రంధ్రాల ద్వారా ప్రాణశక్తిని ప్రసరిస్తాయని యోగశాస్త్రం చెబుతుంది. ఏదేని రాజధాని నగరాన్ని శత్రువులు ఆక్రమిస్తే రాజ్యమంతా స్వాధీనమైనట్లుగా భావించే విధంగా తలలేని మొండెం ప్రాణాన్ని కోల్పోతుంది. ముఖంలో ఇమిడి వుండే కనుదోయి అన్ని ఇంద్రియాలలోకి ప్రధానమైనది. దానితో భౌతిక ప్రపంచాన్ని చూస్తాం. సాకార పరమాత్మను వీక్షించగల్గుతాం. సాధన పరిపక్వమయినపుడు అంతశ్చక్షువులతో మనలో వుండే అంతర్యామినీ దర్శించగల్గుతాం. శ్రోత్రాలతో శబ్దాలను వింటాం. నాసికతో గంధాన్ని ఆఘ్రాణిస్తాం. జిహ్వతో షడ్రసోపేతమైన భోజన సుఖాన్ని ఆనందిస్తాం.

షట్చక్రాలలో కీలకమైన ఆజ్ఞా, ఫాల,, సహస్రదళ పద్మశోభితమైన సహస్రార చక్రాలు శిరసులోనే ఉంటాయి. అంతిమ ఘడియలో ప్రాణనిష్క్రమణ జరిగే బ్రహ్మరంధ్రం కూడ శిరస్సు పై భాగంలోనే ఉంటుంది. ఆధ్యాత్మిక క్రతువులో భాగంగా శిరోముండనం చేయించుకొని శిఖ మాత్రం ఉంచుకుంటారు. శిఖ లేకపోతే శిరస్సులేని దానితో సమానమని సిద్ధాంతం. అది వైదిక సాంప్రదాయం.

బాల్య, కౌమార, యవ్వన, వార్ధక్యలక్షణాలు ప్రముఖంగా ప్రస్ఫుటమయ్యేది ముఖంలోనే. ముఖం చూసి వయసు చెప్పడం సులువు. ముఖాకృతి జన్యుపరంగా తల్లిదండ్రులు, రక్తసంబంధీకుల నుంచి సంప్రాప్తిస్తుంది. మనోభావాలు ముఖంలో ప్రస్ఫుటమవుతాయి. కొందరు సాధనతో మనసులోని భావాలు కనబడకుండా జాగ్రత్తపడగలరు. మగువల అందాన్ని ప్రస్ఫుటం చేసే; దృష్టి దోషాలను పరిహారం చేసే తిలకధారణ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేయగా, ఆజ్ఞాచక్రం ఉత్తేజితం కాగలందుకు సనాతన ధర్మాన్ని పాటించేపురుషులూ బొట్టు ధరిస్తారు. సంతోష, దుఃఖ, క్రోధాదివికారాలన్నీ ముఖంలో ప్రతిబింబించడం మనం చూడవచ్చు. ఏదేని మనసులోని దుర్భావాన్ని, లేదా బలహీనతను పసిగట్టి దాన్ని బయట పెట్టినపుడు ఆ వ్యక్తి ముఖం నల్లబడిందనడం పరిపాటి. శరీర అస్తిత్వాన్ని నిలబెట్టేందుకు అవసరమైన ఆహార పానీయాలు గ్రహించే; భావ వ్యక్తీకరణ చేసే నోరు ప్రాధాన్యత అంతాయింతా కాదు. నోటి ద్వారా పదార్థాలను గ్రహించగల శక్తి కోల్పోయాక వ్యక్తి అనతికాలంలో ప్రాణం వదలవలసి ఉంటుంది.

ముఖం కేవలం కొన్ని జీవక్రియలు జరపటానికే కాదు; అందం, దర్పం, హోదావంటి విశిష్ట లక్షణాలన్నీ ప్రస్ఫుటమయ్యే కేంద్ర స్థానమదే. లేతబంగారు ఛాయలో ఉండే శరీర వర్ణం ముఖ శోభను ఇనుమడింపజేస్తుంది. సమాజంలో అలాంటి వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. సంభాషణాచాతుర్యం ఉంటే ముఖం విలువ మరింత పెరుగుతుంది. ఏదేని వస్తు, లేదా ఆస్తి విలువ మదింపు చేసేపుడు 'ముఖవిలువ' అంటూ ప్రస్తావించడం పరిపాటి.

తేజోభరితమైన ముఖం భగవద్దత్తమైనది. అందరికీ అది లభించేది

కాదు. ఆధునిక కాలంలో ముఖంలోని లోపాలను సరిదిద్దగల వైద్య ప్రక్రియలున్నాయి. అందంగా కనిపించాలనే తపన అందరిలోను ఉండవచ్చు. కానీ అందమైన మనసు సంతరించుకుంటే ముఖ సౌందర్యం లేకపోయినా జన్మ చరితార్ధమౌతుంది. సమాజంలో గౌరవాదరాభిమానాలూ లభిస్తాయి. భగవదనురక్తి లేని వ్యక్తి ఎంత అందం సంతరించుకున్నా అది వ్యర్ధమే! చేతులారా శివపూజ చేయని, నోరునొప్పి పెట్టేలా హరిని కీర్తించని బ్రతుకు బ్రతుకు కాదన్న పోతనామాత్యుడి పలుకులు చిరస్మరణీయం. శిరోధార్యం! ❋

# 46. సత్యం

ధర్మరాజు, హరిశ్చంద్రుడు, నలుడు వంటి పురాణ పురుషులు సత్యవాక్పరిపాలన చేసిన ధర్మమూర్తులు. సత్యమే ధ్యేయంగా కోరి కష్టాలను ఆహ్వానించిన ధీశాలురు వారు. త్రికాలాలలో శాశ్వతంగా నిలిచేది సత్యమే అన్నాయి శ్రుతులు. ఇబ్బంది కల్గించే నిజాన్ని కూడ ప్రియకరంగా చెప్పడం ఓ కళ. సత్యమే అయినా అప్రియంగా చెప్పకూడదంటుంది శాస్త్రం.

ఒక బ్రాహ్మణుడు యజ్ఞపశువుగా వినియోగించేందుకు బలిష్టమైన మేకనొక దానిని సంతలో కొనడం ముగ్గురు మోసగాళ్ళు చూశారు. ఎలాగైనా బ్రాహ్మణ్ణి మోసగించి మేకను కాజేయాలన్నది వారి పన్నాగం. ప్రణాళికలో భాగంగా బ్రాహ్మణుడు ఇంటికి వెళ్లే దారిలో ముగ్గురూ మూడుచోట్ల కాపుకాశారు. భుజాల మీద మేకతో నడుస్తున్న బ్రాహ్మణుడితో మొదటి ప్రబుద్ధుడు 'అయ్యా! ఇదేం చోద్యం? బ్రాహ్మణుడివై ఉండి నీచమైన కుక్కను మోసుకెళుతున్నావు? అన్నాడు. 'ఏం మాట్లాడుతావోయ్?! ఇది పదహారణాలా మేకే'! అంటూ ముందుకు సాగిపోయాడు బ్రాహ్మణుడు. రెండవచోట మాటు వేసిన ధూర్తుడు, 'అదేంటి మహానుభావా! వేదాలు చదివిన వాడివి ఓ పందిని భుజాన మోసుకెళుతున్నావు?' అంటూ హేళన చేసినపుడు బ్రాహ్మణుడు మొదటివాడికి చెప్పిన సమాధానమే చెప్పి ముందుకు నడిచాడు. మూడవ చోట మాటు వేసిన మోసకారి మేకను గాడిదగా అభివర్ణించగా, ఆ అటవీ ప్రాంతంలో ఓ బ్రహ్మారాక్షసి తిరుగాడుతుందన్న వదంతులు విని వున్న బ్రాహ్మణుడు తను మోసుకువెళుతున్న మేక ఆ బ్రహ్మారాక్షసి కాదు కదా! ముగ్గురు వ్యక్తులకు మూడు రూపాలుగా అందుకే కనిపించింది కాబోలు! అనుకుంటూ భయంతో గభాల్న మేకను దించేసి రిక్తహస్తాలతో

ఇంటిదారి పట్టాడు. తాత్కాలికంగానే అయినా పదిమంది పలికిన అసత్యం సత్యంగా చలామణి కావటం పరిపాటి అంటాడు యోగివేమన.

ఎవరికీ నష్టం లేనపుడు పరిస్థితులననుసరించి అసత్యాన్నయినా చెప్పవచ్చున్నది తార్కిక న్యాయం. ఎవరైనా అబద్ధం ఒక ప్రయోజనం ఆశించే ఆడుతారు. ఓ దీర్ఘరోగి ఇక ఎంతోకాలం బ్రతకడని వైద్యుడు నిర్ధారించాడు. నిజం వింటే అతడు తట్టుకోలేడని భావించిన వైద్యుడు త్వరలో కోలుకుంటావని రోగితో నమ్మబలికాడు. వైద్యుడి మాటలపై సంపూర్ణ విశ్వాసం ఉంచిన రోగి ఆశావహదృక్పథంతో ఔషధం సేవిస్తూ అటు వైద్యుని, ఇటు బంధువర్గాన్నీ ఆశ్చర్యపరచే విధంగా కాలగతిన కోలుకుని ఆరోగ్యవంతుడయ్యాడు.

మందువలె నిష్ఠుర సత్యం చేదుగా ఉంటుంది. ఔషధంలా సత్యం; పలికేవారికి, వినేవారికి మేలే చేస్తుంది. ప్రయత్నం చేత సత్యం మౌలిక స్వరూపాన్ని మార్చి అంతిమంగా విజయం సాధించినవారు చరిత్రలో ఎవరూ కనబడరు. ఒక అబద్ధాన్ని నిజంగా నమ్మించేందుకు మరెన్నో అబద్ధాలు ఆడవలసి రావచ్చు. అబద్ధాల కోరు చెప్పే నిజాన్ని కూడ లోకం విశ్వసించదు.

ఒక మునీశ్వరుడు తను నిజం చెబితే ఓ అమాయక జంతువుకు ప్రాణాపాయం కలిగే దుస్థితి ఉందని గ్రహించాడు. దాని ఆచూకీ అడిగిన వేటగాడితో 'చూచేకళ్ళు చెప్పలేవు, చెప్పే నాలుక చూడలేదు' అంటూ ఉపాయం చేత ఆ మూగజీవిని రక్షించిన కథ మనకు విదితమే. సత్యమే దైవం. సత్యాన్ని సచ్చిదానంద పరబ్రహ్మంగా చెబుతారు పండితులు. సత్యభాషణమే వ్రతంగా, భగవదారాధనగా ఆచరించి చూపిన మహనీయులు మనకు ఆదర్శం. సత్యభాషణం వల్ల వ్యక్తిత్వం ఇనుమడిస్తుంది. ప్రజలు సత్యమార్గగాములు అయినపుడు సమాజంలో నీతి ప్రవర్ధిల్లుతుంది. అశాంతికి కారణంకాగల అవినీతికి సత్యవర్తనం వల్ల తిలోదకాలు వదలటం సాధ్యమని తెలుసుకున్న సాధకుడికి ఆనందపు చిరునామా కరతలామలకమే! ❋

# 47. లోపలి మనసు

కలిసిపోయే స్వభావం ఉన్నచోటనే అపార్థాలకూ తావుంటుంది. మంచి వున్నదంటే చెడు ఉనికీ ఒప్పుకుతీరాలి. ఆరోగ్య అనారోగ్యాలు, నిజానిజాలు, హెచ్చుతగ్గులు, మానవత్వ విలువలు – రాక్షసత్వం.. ఇలా ఒక అంశం వుంటే దానికి వ్యతిరేకమయిన భావం మరొకటి ఉండనే ఉంటుందన్నది జీవితం బోధించే విశేష సత్యం! స్వభావసిద్ధంగా మానవుడు సానుకూలతను ఇష్టపడతాడు. ఆనందంగా హాయిగా జీవితం సాగిపోవాలని కోరుకుంటాడు. కోరిన విధంగా ఎంపిక చేసుకొనే వెసులుబాటు కల్పిస్తే ఉన్నత విలువలు గల అంశాలనే మనిషి ఎంపిక చేసుకుంటాడు. అదో సార్వజనీన సత్యం!

మనసు కదిలే మనసుగా, నిద్రాణ మనసుగా రెండు పార్శ్వాలతో పని చేస్తూ జీవన గమ్యానికి చేరడంలో తోడ్పడుతుంది. ఒక మంచి మనిషిలోను, చెడ్డ మనిషిలోనూ మనసు తాలుకూ ఈ రెండు పార్శ్వాలూ ఉంటాయి. బయటి మనసు ఆలోచనలు చేస్తుంది. ఆశలు కల్పిస్తుంది. ఆశయాలు వల్లిస్తుంది. కోపతాపాలు ప్రదర్శిస్తుంది. లోపలి మనసు లక్షణాలు వేరుగా వుంటాయి. ఆంతరిక మనసు దివ్యత్వానికి ప్రతీక. లోపల ఉండే నిద్రాణమైన మనసు దేనిని నిజమని విశ్వసిస్తుందో దానిని సాకారం చేయడానికి సర్వప్రయత్నం చేస్తుంది. రూపకల్పన కోసం అహరహం శ్రమించే పనిలో నిమగ్నమవుతుంది. నమ్మకాలను నిజం చేసి చూపగల సత్తా లోపలి మనసుకు ఉండడంతో నమ్మి నిర్ధారించుకోవలసిన విషయాలు మానవత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో చూచుకోవలసిన బాధ్యత మనిషిపైనే ఉంటుంది. నమ్మాక లోపలి మనసు సాఫల్యం చేయలేని కార్యం ఉండదు. ఉగ్రవాదులు తాము నిజమని భావించిన అంశాల రూపకల్పన దిశగా అడుగులు వేసినపుడు విధ్వంసం

జరుగుతుంది. ఉగ్ర చర్యల్లో ప్రాణనష్టం ఆస్తినష్టం అనివార్యం గనుక విశ్వశాంతి కోసం మంచి హృదయం, కరుణ, శాంతి...ఇత్యాది సానుకూల భావాల కనుగుణంగా మనిషి వ్యక్తిగత నమ్మకాలను దృఢపరచుకోవలసి వుంది. సమాజానికి కీడు జరగగల ప్రతికూలాంశాలను నమ్మి వ్యక్తి శ్రేయస్సును, సంఘ శ్రేయస్సును పాడుచేసుకోవడం అవివేకమంటారు మనోవైజ్ఞానికులు.

అనురాగం, శాంతి, ప్రేమ, సమాజ కల్యాణం, అనాథలు – నిరుపేదల జీవనగతి సముద్ధరణ వంటి జాత్యనుకూల భావాలతో లోపలి మనసును నింపి ప్రేరితం చేయాలంటారు మానసిక శాస్త్రవేత్తలు.

శాంతి, ఆనందం అందరూ కోరుకునే వరాలు! వాటి సాధనకోసమే మనిషి తన సర్వశక్తులూ దారవోసి ప్రయత్నిస్తాడు. స్వాతంత్ర్య సముపార్జన అనే దివ్యమనోరథ సిద్ధికోసం గాంధీజీ వల్లించిన భావాలు ప్రేరణ గీతాలై భాసిల్లాయి. ఆయన స్వప్నం సాకారమైంది. ఆయన ఓ వ్యక్తిగా కాక శక్తిగా పరిణతించి దేశశ్రేయస్సు సాధించారు.

మగతలాంటి నిద్రాణ మనోస్థితిలో చేసిన ప్రార్థనలు ఫలిస్తాయంటారు మనోవైజ్ఞానికులు! మానవుడి అపారమైన లోపలి మనోశక్తులు ప్రజ్వలనం పొందేది ఆ అవస్థలోనే అన్నది వారిమాట! హిప్నోసిస్ సాయంతో ఒక మనిషి మనసును ప్రభావితం చేసినపుడు అతడి లోపలి మనోశక్తి ప్రజ్వలితమై ఓ దుర్బలుడు సైతం అసాధ్యమైన పనులు చేయడం చూస్తాం. అది ఓ మాయ అనుకొనేకంటే నిద్రాణ స్థితిలో లోపలి మనసు అంతటి ప్రభావవంతమైనదని గ్రహించడం సమర్థనీయం! లోపలి మనోశక్తిని ఉపయోగించి మన ప్రాచీన రుషులు ప్రార్థనలు చేసి రోగోపశమన ప్రక్రియలు చేసే వారని తెలుస్తుంది. ఇదిలావుండగా.. నిద్రవంటి ధ్యానస్థితిలో కోరికలను స్పష్టమైన రీతిగా మలచుకొని లోపలి మనసుకు నివేదిస్తే అవి వాస్తవరూపం దాల్చుతాయన్నది పాశ్చాత్య మనోవైజ్ఞానికుల ప్రగాఢ నమ్మకం! ధ్యాన చిత్తంతో సాధించలేని మహత్కార్యం లేదని మన ప్రాచీన యోగులూ నమ్మారు. దృఢచిత్తంతో, స్పష్టమైన సంకల్పంతో ఆంజనేయుడు నూరుయోజనాల సముద్రాన్ని నేరుగా దాటి లంకలో ప్రవేశించి రాక్షస ప్రభువును

ఒక ఊపు ఊపిన ఘట్టం రామాయణ మహాకావ్యంలో మహత్తరమైనది. మనం సాధారణంగా ఉపయోగించే మనసు సామాన్య వ్యాపకాలు నిర్వర్తించగా లోపలి మనసు మనిషిని పనిచేసే దిశగా ప్రోత్సహించి మహత్కార్యాల సాధనకు ప్రేరణ ఇస్తుంది. లోపలి మనసు ఉనికి తెలుసుకొని జీవిత రథాన్ని ముందుకు నడిపిస్తూ గొప్ప గొప్ప కార్యాలను సాధించవచ్చు. స్వామి వివేకానంద చెప్పినదీ ఈ మహా సత్యమే! లోపలి మనసు సాయంతో సంకల్ప బలాన్ని పెంచుకొని నేర్పుతో కూడిన కార్యాచరణ సాగించేవారికి అపజయమంటూ వుండదు. అదే జీవన ప్రగతికి ఉపకరించే రాచబాట! ❃

# 48. సుందర ప్రకృతి

ఒక కారడవిలో ఓ దేవదారు వృక్షం, దాని ప్రక్కనే ఓ ముళ్ళ చెట్టు వుండేవి. ఒకరోజు దేవదారు వృక్షం గర్వంగా ముళ్ళ చెట్టుతో 'నీకు పునర్జన్మంటూ వుంటే నాలా నిఖార్సయిన వృక్షంగా పుట్టాలని కోరుకుంటావు కదూ?!' అంది. అందుకు ముళ్ళ చెట్టు 'లేదు.. లేదు నేనిలా ముళ్ళ చెట్టుగానే పుట్టాలని కోరుకుంటాను. ఎందుకంటే నీలా పెద్ద వృక్షంగా పుడితే కలప కోసం మనిషి రంపానికి గురికావలసిన దుర్గతి పట్టవచ్చు. నేనున్న ఈ స్థితి నాకు గర్వంగానే వుంది' అంది. ప్రకృతిలో చిన్నా పెద్దా తేడాలేక అణువణువూ భగవదనుగ్రహానికి నోచుకుని ఆవిర్భవించిన ఉపాధులే! చరాచర సృష్టిలో స్థావర జంగమాలన్నీ ప్రకృతి సమతుల్యతకు తోడ్పడుతున్న భగవదావిష్కరణలే!

ప్రకృతిలో ఓ లయ వుంది. దాని పోకడలో ఓ శ్రుతి వుంది. స్వరబద్ధం చేయబడిన గీతంలా ఒక సహజ బాణీలో దాని పోకడ సాగుతుంది. ఓ పద్ధతి ప్రకారం కొనసాగే ప్రకృతి నడత మనిషికి సదా అనుసరణీయం! 'వికసించిన పువ్వుల రూపంలో భూమాత సుందర మందరస్మితం మూర్తిమంతంగా ప్రకటితమౌతుంది' అంటాడు తత్వవేత్త ఎమర్సన్.

ఫలభరితమైన వృక్షాలు కోరిన వారికి మధుర ఫలాలు అందించినట్లు సంపన్నులు ఆర్తులకు ఆపన్నహస్తం అందించాలన్నది ప్రకృతి ధర్మం. కర్కశమైన మండువేసవిలో కూడ మనిషి ఆస్వాదించదగ్గ మామిడిపండ్లు, మల్లెపువ్వులు లభించినట్లు తామసికులు సైతం మానవీయకోణం సంతరించుకొనవలసిన అవసరాన్ని ప్రకృతి ధర్మంగానే చెప్పుకోవాలి. సంసార సాగరంలో ఆటుపోట్లు సహజమనీ, ఓర్పు వహిస్తే పోగొట్టుకున్న పూర్వవైభవం, కొత్తకళ పునః స్వాయత్తం చేసుకోవచ్చనీ చంద్రకళలు నిరూపిస్తాయి.

ఈ భూమి, ఆకాశం, అరణ్యాలు, పొలాలు, నదీనదాలు, పర్వతాలు, సముద్రాలు అనుభవజ్ఞులైన అధ్యాపకుల వంటివి. పుస్తకాలకంటే ఎక్కువ జ్ఞానం మనిషికి వాటి నుండే లభిస్తుంది' అంటాడు విమర్శకుడు జాన్ లబ్బాక్.

అప్పుడప్పుడూ సంభవించే ప్రకృతి వైపరీత్యాలు మానవ విపరీత పోకడకు ఫలితాలు. ప్రకృతిని ప్రేమించి పరిపోషణ చేస్తే అనేక విలువలు సంతరించుకొని సుందర ఆవిష్కరణగా భాసిస్తుంది. ప్రకృతిని ప్రవర్ధిల్లజేసుకొనే ప్రయత్నంలో మనిషి సాధించే విజయాలు ఆనందకారకాలవుతాయి.

నీటి ఎద్దడి బాగా వున్న గ్రామమది. ఒక యువకుడు కావడి కుండలతో ఏటి నుంచి నీరు తెచ్చి అవసరమైన వారికి సరఫరా చేసేవాడు. కావడి కుండల్లో ఒకటి ఓటిది. ఏటి నుంచి గ్రామం దాకా దారిలో ఎంతో నీరు వృధా అవుతుండేది. ఒకరోజు ఓటికుండ ఇలా అనుకొంది. 'నేనో అసమర్ధురాలిని. సగం నీళ్ళు వృధా అవుతున్నాయి'. యువకుడికి క్షమాపణ చెప్పింది. అతడు మందహాసం చేసి అన్నాడు. 'దారంట నీరు కారే వైపు చక్కటి పూలమొక్కల విత్తులు నాటాను. కారిపోతున్న నీటి వలన అవి చక్కగా మొలిచి ఏపుగా పెరిగి పరిమళభరితమైన పువ్వులు పూస్తున్నాయి. నువ్వు గమనించలేదా?' తన అసమర్ధతను సమర్ధంగా మలచుకొని బాటను నందనవనం చేసిన యువకుడికి కృతజ్ఞతలు చెప్పింది ఓటికుండ.

'నన్ను నేను పరిశుభ్రంగా ఉంచుకొనేందుకు, నా ఇంద్రియాలను కట్టడి చేసుకొనేందుకు నేను సుందర ప్రకృతి సహాయాన్ని అర్థిస్తాను' అంటాడు రాబిన్ విలియమ్స్. ప్రకృతిని వశం చేసుకోవాలని కాక దానిపోకడను అనుసరించి లబ్ధి పొందే ప్రయత్నం మానవాళికి అనుసరణీయం. ప్రకృతిలో ఎగసిపడే ఆధ్యాత్మిక శోభను తమ సాధనకనువుగా మలచుకొని తరించారు మన ప్రాచీన రుషులు. భౌతిక ప్రకృతితో పాటు మాయ అనే 'మూలప్రకృతి'ని కూడ తెలుసుకొని మనిషి చింతన చేస్తే అతడి పారమార్థిక లక్ష్యాలు సుళువుగా నెరవేరుతాయి. ❋

# 49. దైవీగుణం

భగవంతుడు మానవుడికి కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ధారాదత్తం చేసి తెలివితేటలు, విచక్షణాశక్తి యిచ్చి తన తర్వాత తనంతటి వాడుగా తీర్చిదిద్ది ఈ లోకంలో నిల్పాడు. ప్రతిగా కృతజ్ఞత చూపే బదులు మనిషి కల్పనా ప్రపంచంలో బ్రతుకుతూ ఇంకా తనకు ఏవో లేనివాటి గురించి ఆలోచిస్తూ అసంతృప్తుడై జీవిస్తున్నాడు. చల్లని మలయమారుతం హాయి గొల్పుతుంది. తొలకరి పలకరించినపుడు పులకరింపుకల్గుతుంది. చలిలో నులివెచ్చని సూర్య స్పర్శ సుఖాన్నిస్తుంది. ప్రకృతికి అధిపతిగా వుండి తనకు తోడు, నీడ సర్వమూ కల్పించి అనుగ్రహించిన భగవంతుడి పట్ల మనిషి చూపే శ్రద్ధ, భక్తి కలిలో మసకబారటం ఓ దురదృష్టకర పరిణామం. 'మనకు కావలసింది శ్రద్ధ. ఒక వ్యక్తిని గొప్పవాడు గాను, మరొకడిని అధముడుగాను చేసేది ఈ శ్రద్ధలోని తారతమ్యమే. భగవంతుడి పట్ల శ్రద్ధ వృద్ధి చెందిననాడు మనిషి సర్వోన్నతుడవుతాడు' అంటారు స్వామి వివేకానంద.

లోకంలో మానవరూపంలో దైవం అవతరించిన సందర్భాలే ఎక్కువ. దశావతారాలే అందుకు తార్కాణం. దైవీగుణం నిండిన అవధూతలు, ప్రవక్తలు భూమిపై పరమాత్మ వాణి వినిపించారు. మానవ జీవన బాణీ వివరించారు. ఉదాత్తగుణాలు మానవుడు సంతరించుకోవడం దైవానుగ్రహంతోనే సాధ్యమవుతుంది. అయితే మనిషి అప్రయోజకుడుగా మారి ఆ సర్వాంతర్యామి ఉనికినే ప్రశ్నిస్తూ విజ్ఞులు నిరాశపడేలా ప్రవర్తిస్తూ జీవయాత్ర కొనసాగించడం ఓ విచారకర పరిణామం.

దైవం త్రిగుణాతీతుడనీ, గుణరహితుడనీ శ్రుతులు కీర్తించాయి.

సర్వోత్తమ గుణాలు గల భగవంతుని రుషీశ్వరులు తమదైన రీతిలో స్తుతించారు. కీర్తనలు రచించారు. తనను కీర్తిస్తే మురిసి, పొంగిపోయే దైవం బోళా శంకరుడయ్యాడు. మహనీయులు అవధూతలుగా ఉద్భవించి సమాజాన్ని జాగృతం చేసినప్పుడల్లా మానవుడు ప్రభావితుడై భక్తి భావాన్ని సంతరించుకొంటూనే ఉన్నాడు. సామాన్యుడుగా జన్మించి భగవత్తత్వం చేత ఆకర్షింపబడి సమాజానికి నీతి, న్యాయం, సత్యాహింసలు బోధించి ఆదర్శ జీవితం గడిపిన నవయుగపు యోగిపుంగవుడు గాంధీజీని మనం ఆదర్శంగా చెప్పుకోవచ్చు.

సత్యవాక్కు, ఔదార్యం, శాంతస్వభావం, క్షమ, పట్టుదల, శ్రద్ధ, అహింస, ప్రేమ, కరుణ - ఇలా ఏ సద్గుణాన్ని తీసుకున్నా అంతిమంగా అది మనిషి ఆత్మాభ్యున్నతికీ, ఆనందానికీ కారణభూతమౌతున్నదే. దైవీగుణాల్ని సంతరించుకొని పారమార్థిక పథంలో జీవిక నెరపగల మార్గదర్శకాలను మహాత్ముల నుంచి నేర్చుకొని మానవుడు ప్రవర్ధిల్లవలసివుంది.

ఔదార్యం అరుదుగా మానవులలో వ్యక్తమయ్యే దైవీగుణం. ఓ కోటీశ్వరుడు సైతం వ్యక్తం చేయలేని ఉదారగుణం ఓ నిరుపేద ద్వారా ప్రకటమైనప్పుడు ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు.

చరఖాసంఘం స్థాపించి నిధుల కోసం మహాత్ముడు ఊరూరా తిరిగి చందాలు సేకరిస్తున్న రోజులవి. ఒడిశాలోని ఓ మారుమూల కుగ్రామంలో ఆయన ఉపన్యసిస్తున్న వేళ చర్మం ముడతలుపడి, నడుం వంగిపోయి, చిరుగుల వస్త్రం ధరించిన ఓ నిరుపేద వృద్ధ మహిళ గాంధీగారిని కలిసేందుకు అత్యుత్సాహం చూపింది. వలంటీర్లు ఆమె అలా కలవటానికి వీల్లేదన్నారు. అది గమనించిన మహాత్ముడు ఆమెను అడ్డుకోవద్దని వారికి చెప్పాడు. వృద్ధురాలు తన చీరకొంగు మడతల్లోంచి ఓ రాగినాణెం వెలికి తీసి తన విరాళంగా మహాత్ముడికి అందించింది. కోశాధికారిగా వ్యవహరిస్తున్న పెద్దమనిషి ఆ నాణెం కోసం చేయి చాపినపుడు మహాత్ముడు నాణేన్ని తనవద్దే వుంచుకుంటానన్నాడట. వేలకు వేల ధనానికి కోశాధికారిగా వున్న తనను ఆరాగినాణెం కోసం విశ్వసించలేరా? అంటూ ఆయన గాంధీజీని ప్రశ్నించాడు. అందుకు మహాత్ముడు

దరహాసం చేసి ఓ లక్షాధికారి కొన్నివేలు విరాళం యిస్తే అదిగొప్ప మొత్తం కాకపోవచ్చు. కానీ ఈ నిరుపేద వృద్ధురాలు యిచ్చిన చిన్ని విరాళం తనకు ఎంతో అమూల్యమనీ, తీపిగురుతుగా ఆ నాణేన్ని తన వద్దే భద్రంగా ఉంచుకుంటాననీ అన్నారట గాంధీజీ. ఔదార్యానికి మహాత్ముడు స్పందించి ఇచ్చిన ప్రత్యేక గుర్తింపది. గాంధీజీ వ్యక్తిత్వ విలువలకు ఇచ్చిన ప్రాముఖ్యత చూసి కోశాధికారితో పాటు చరఖాసంఘ సభ్యులందరూ ముగ్ధులయ్యారట! దైవీగుణాల పట్ల మహనీయులు ఎంతటి అనురక్తి కల్గివుంటారో ఈ సంఘటన తేటతెల్లం చేస్తుంది. ❋

# 50. అనిమీలిత ధ్యానం

శబ్దరత్నాకరంలో 'ధ్యాన' శబ్దానికి 'చాంచల్యం లేకుండా భగవంతుని మనసులో తలచుట' అని అర్థం చెప్పబడింది. ఇది ఆధ్యాత్మిక ప్రయోజనం. ఐతే ఆరోగ్యాభిలాషులై ధ్యాన ప్రక్రియ ఆచరిస్తున్న సాధకులు అసంఖ్యాకంగా వున్నారు.

పూర్వం యోగులు సత్యాన్వేషణ కోసం ధ్యానం చేసేవారు. అనంతమైన ఆనందాన్ని ప్రసాదించేది ధ్యానమే అని తలచి మరికొందరు ధ్యానమాచరించారు. పిచ్చికోతివంటి చంచలమైన మనస్సును కట్టడిచేసే ప్రయత్నంలో భాగంగా మరికొందరు మునీశ్వరులు ధ్యాన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రోజుకు రెండుసార్లయినా ధ్యానం చేయాలన్నారు వివేకానందస్వామి.

ధ్యానం వలన భావోద్వేగాలు నియంత్రణ అవుతాయి. మనిషి ఒత్తిడిని తట్టుకోగల్గుతాడు. ధ్యానం ఓ మానసిక వ్యాయామమంటారు వైద్యనిపుణులు. ధ్యాన ప్రపంచంలో కొన్ని వందల పద్ధతులున్నాయని భోగట్టా!

ధ్యానాన్ని దైవచింతనతో ముడిపెట్టి ఆచరిస్తున్నవారు కొందరుండగా కేవలం ఆరోగ్యం కోసం మరికొందరు ఆచరిస్తున్నారు. ధ్యానంలో మూడు పార్శ్వాలు – ధ్యాత (చేసేవాడు), ధ్యేయం (లక్ష్యం), ధ్యానం వుంటాయి. శ్వాసమీద ధ్యాస నిలిపిచేసే బుద్ధ ప్రతిపాదిత 'ఆనాపానాసతి' బహుళ ప్రాచుర్యం పొందింది.

ధ్యాత ధ్యానానికి ఉపక్రమించే ముందు ఓ ఆసనం (చాప లాంటి ఆచ్ఛాదన) అవసరం. అది భూ అయస్కాంత శక్తికి నిరోధంగా పనిచేస్తుంది. పద్మాసనంలోగాని, అర్ధపద్మాసనంలో గాని, సుఖాసనంలోగాని కూర్చుని ధ్యానానికుపక్రమించాలి. గోడవంటి దాని ఆసరా తీసుకోవచ్చు. శ్రీకృష్ణుడు గీతలో ఆజ్ఞాచక్రంపై మనసునిల్పి చేసే ధ్యానం ప్రతిపాదించగా విశుద్ధ (స్వరపేటిక) చక్రంపై, అనాహత (హృదయ)

చక్రంపై, సహస్రార (శిరస్సు) చక్రంపై ధ్యాస నిల్పుతూ చేయడం ఆచరణలో వుంది. ఓంకారం జపిస్తూ చేసే ధ్యానం ఆధ్యాత్మికం. ఉచ్ఛ్వాస నిశ్వాసలు ధ్యాన సమయంలో నియంత్రణ పొంది శ్వాసావయవాలు పరిశుద్ధమవుతాయి.

మనసొక ఊహల కర్మాగారం. నిరంతరం ఆలోచనలు కడలి తరంగాల్లా పడుతూ లేస్తూ వుంటాయి. అలా పుట్టుకొచ్చే ఆలోచనల ప్రవాహంలో ధ్యేయం మరుగున పడటం సహజం. అయినా ఫర్వాలేదు. ఆ చర్యను గమనిస్తూ ఉండండి చాలు! అంటుందో ధ్యాన పద్ధతి. ఊహా సంద్రాన్ని కల్లోల రహితం చేసి కడలి తీరంలో ధ్యేయమనే పడవకు లంగరు వేయగల్గితే ధ్యాన ప్రక్రియ పరిపూర్ణమైనట్లే. ధ్యానాన్ని ఆధ్యాత్మికతతో జత చేసినపుడు ఆరోగ్య పారమార్థిక ప్రయోజనాలు రెండూ సిద్ధిస్తాయి.

ధ్యాన స్థితిలో కొందరిని నిద్ర ఆవహిస్తుంది. శరీరానికి తగినంత విశ్రాంతి లేనపుడు ఆ స్థితి కలగవచ్చు. ఉదయ సాయంత్రాలు ధ్యానానికి అనుకూలం. ధ్యానం మానసిక అలజడిని దూరం చేసి ఉల్లాసాన్ని కల్గిస్తుంది.

పరిసరాల శబ్దాలను గమనిస్తూ వాటిపై మనసు నిల్పి ధ్యాన ప్రక్రియకు ఉపక్రమించడం, ఓ దీపాన్ని చూసి కళ్ళు మూసుకొని దానినే ధ్యానించడం వంటివి కొన్ని పద్ధతులు కాగా, అంతగా ప్రాచుర్యం పొందని కళ్ళు తెరచి ధ్యానం చేసే పద్ధతి కూడా మరొకటుంది. ఒక దృశ్యాన్ని తదేకంగా నిర్వికారంగా దృష్టి చెదరని రీతిలో వీక్షిస్తూ ధ్యానంలోకి వెళ్ళిస్తబ్దుగా మస్తిష్కంలో ఆ దృశ్యాన్ని విలీనం చేయడం ఆ పద్ధతి.

కళ్ళు మూసుకున్నా, తెరచి వున్నా కంటి ఎదుటలేని ఎన్నో దృశ్యాలు మనసు తెరపై ఆవిష్కృతమౌతుంటాయి. అలాటి స్థితినే పరధ్యానం అంటారు. పరధ్యానం వలన ధ్యాన ప్రయోజనాలు సిద్ధించవు. సరికదా ఇబ్బందులు ఎదురు కావచ్చు ఒక దృశ్య శకలం మస్తిష్కపు పొరల్లో లయం చెందగా కడలి కెరటంలా మరొకటి ఉవ్వెత్తున లేవటం పరిపాటే అయినా స్పష్టమైన ధ్యేయ వస్తువుపై ఏకాగ్రత సాధించి ధ్యాన ప్రయోజనాలు పొందటం సాధకుడి లక్ష్యం కావాలి. ❋

# 51. మాయా ప్రపంచం

జగత్తు, జీవనం రెండూ మాయాపూర్ణమని తెలిసీ మనిషి సాధారణ మనుగడ సాగించే ప్రయత్నం చేయడం సృష్టి వైచిత్రి! ఒక సంఘటన ఎప్పుడూ జరిగేదైతే అందులో వింతేమీలేదు. ఎప్పుడూ జరగనిది – ఏ ఒక్కసారో జరిగేదైతే దాన్ని మహిమ, లేక అద్భుతం అంటున్నాం. ఐతే రోజూ మనకళ్ళముందు జరుగుతుండే మహాద్భుతాలను అలా గుర్తించలేకపోవడం విశేషం!

తూర్పున ఉదయించి, పగటివేళ జాజ్జ్వల్యమానంగా ప్రకాశించి సాయంత్రం పశ్చిమాన అస్తమించే సూర్యుడూ అలాంటి ఓ మహిమాన్విత విశేషమే! ఖగోళ శాస్త్రజ్ఞులు సూర్యుడు ఓ నక్షత్రమనీ, మండే అగ్నిగోళమనీ, ఆ ఫలితమే పగటి వెలుగనీ చెప్పినా సామాన్యుడికి ఆ వెలుగు మర్మపు జ్ఞానం అవిదితం! అలాగే మన కంటికి కనిపించక స్పర్శామాత్రంగా అనుభూతికి వచ్చే వాయువు మరో అద్భుతం! రెండు కర్రల ఒరిపిడి (అరణి)కి అగ్ని ఎలా ఉద్భవిస్తుంది? సమస్త నదీనదాల నీటిని గ్రహించి కూడ కడలి ఎందుకు ఉప్పొంగదు? మనం నివశిస్తున్న భూమి వందల మైళ్ళ వేగంతో తిరుగుతూ కూడ మనిషికి సుస్థిర భ్రాంతి కల్గించడంలోని మర్మమేమిటి? ఇలా అన్నీ ప్రశ్నలే!

సప్త ధాతువులతో నిర్మింపబడి చర్మం వలన ఒక స్పష్టమైన ఆకృతి దాల్చే ప్రాణుల శరీరాలు అద్భుతాలే! మృత్యువాతపడి మట్టిగా మారే సమస్త ప్రాణికోటి ఉపాధులూ మహిమాన్విత భగవదావిష్కరణలే!

సూర్యుడు అస్తమించాక భూమండలాన్ని ఆవరించే పెనుచీకటి 'మాయ' తెరకు మరో స్పష్టమైన రూపం! స్వయం ప్రకాశకాలైన నక్షత్రరాశి మరో పెద్ద నక్షత్రమైన భానుడి ప్రచండ కాంతికిరణాల ప్రభావంగా పగటివేళ ఉనికి కోల్పోవడం ప్రకృతి మాయాజాలమే!

మానవదేహంలో మనసెక్కడ వుంది? మెదడులోనా? హృదయమెక్కడ వుంది? గుండెలోనా? మెదడులోని సూక్ష్మ కండర పొరల్లో నిక్షిప్తమై వుండి కంటికి అగుపడని అపార జ్ఞాపకాల, అనుభవాల మాటేమిటి? వెన్నుపాము క్రింద వుండే మూలాధార చక్రం నుంచి శిరస్సుపై ఉండే సహస్రార చక్రందాకా గల షట్చక్రాల విషయమేమిటి? శస్త్ర ప్రయోగం చేసినా బాహ్య నేత్రాలకు కనిపించని ఆ చక్రాల ఉనికి తాలూకు మర్మం ఏమిటి? ఇవన్నీ మనిషి ఊహకు అందని విశేషాలు!

కనబడనివన్నీ 'లేనివి' కాదు. ఆ గ్రహింపే 'ఆధ్యాత్మికత – భగవంతుడు' అనే పవిత్ర భావనకు పునాది.

ప్రకృతిలో అణువణువునా దైవం ఇమిడి వున్నాడన్నది ఆధ్యాత్మికత బోధించే సత్యం! జ్ఞానేంద్రియాలైన శబ్దస్పర్శ రూప రసగంధాల ఆకర్షణలోని విషయాసక్తి విడనాడి దైవం వైపు దృష్టి మరల్చి సాధకుడు బంధవిముక్తుడు కావటం ఆత్మజ్ఞాన పరిపూర్ణతకు తార్కాణం! భగవంతుడు ఓ మహారూపశిల్పిగా చైతన్య, జడపదార్థాలను తనదైన బాణీలో, మానవ మేధకు అంతుచిక్కని మూలపదార్థాలతో సృజించాడు. విశ్వవ్యాపకత్వం, నాయకత్వం గల దైవమే తను సృజించిన మాయకు అతీతుడుగా, యజమానిగా వెలుగొందుతున్నాడు.

'స్వప్న' సదృశ అనుభవంగా భాసించే మాయతెరను 'మెలకువ' లాంటి వాస్తవ దృష్టితో అవగతం చేసుకున్నప్పుడు అంతటా ఆత్మవ్యాపించి వుందన్న మహాసత్యం బోధపడుతుంది. ఆత్మ నిజతత్వం బోధపడ్డ జ్ఞానిపై మాయ 'పెత్తనం' చేయదు సరికదా, అతడి నుండి వైదొలగి పలాయనం చిత్తగిస్తుంది. మాయాపూర్ణమైన 'నేను', 'నాది' అను పదాల గుట్టు తెలుసుకున్న జ్ఞానికి భగవంతుడి ఉనికి కరతలామలకమే! ❃

# 52. ఆత్మబంధం

భగవంతుడనే అంశానికి మానవ జీవితంలో ఎంతో ప్రాధాన్యత వుంది. మనుష్యులకేనా? జంతుపక్షి మృగాదులకు భగవంతుడి అవసరం లేదా? అన్న ఆలోచన ఎవరికైనా, ఎప్పుడైనా కల్గవచ్చు. మనుష్యేతర ప్రాణులకు భగవదవసరం ఉందో, లేదో కానీ మనిషి మాత్రం ఆ జీవులకూ ఆధ్యాత్మికంగా సముచిత స్థానమిచ్చి అవికూడ దైవచింతన చేస్తాయని వచించే పురాణ గాధలను మననం చేసుకుంటాడు.

సాలీడు, పాము, ఏనుగు - వాయులింగేశ్వరుని ఆరాధించి, తరించి శ్రీ-కాళ-హస్తి క్షేత్రనామానికి కారణమైన దివ్యగాధ మనకు తెలుసు. భగవంతుడు మత్స్యకూర్మ వరాహ నారసింహాది రూపాలలో అవతరించడం సృష్టిలో ఏ ప్రాణీ అల్పమైనది కాదని వెల్లడి చేయడానికేనని భావించవచ్చు. సనాతనధర్మంలో అసంఖ్యాక రూపాలలో దేవతలు ఆరాధింపబడతారు. 'వైకుంఠ ఏకాదశి', ముక్కోటి దేవతలు వైకుంఠవాసుని ఆరాధించే దివ్యపర్వంగా మనకు తెలుసు. చాలహిందూయేతర ధర్మాలలో ఏకేశ్వరోపాసన వుండగా, హిందూ ధర్మంలో వివిధ దేవతల ఉపాసన మనం చూస్తాం.

ప్రతిమనిషీ ఆత్మ 'లోవెలుగు'గా ప్రకాశించే కారణంగా దైవాంశ సంభూతుడుగా పరిగణింపబడతాడు. సృష్టిలో ఏజీవీ, వస్తువూ అక్కరకు రానిది లేదు. సృష్టికి మూలమైన స్త్రీమూర్తికి అరుదైన, అపారమైన గౌరవాన్ని ఆపాదిస్తూ ఆమెను శక్తి స్వరూపిణిగా కొలవడం శక్తి ఆరాధనకు మూలంగా భావించవచ్చు.

దేవతలు యజ్ఞయాగాదుల ద్వారా మానవులు సమర్పించిన హవిస్సులు స్వీకరించి, అందుకు ప్రతిఫలంగా వర్షాలు కురిపించి, పంటలు అనుగ్రహించి విశ్వమానవ శ్రేయస్సుకు కారణమౌతారని శాస్త్రాలు తెలియజేస్తాయి.

దైవాన్ని నమ్మిన భక్తులు ఆయన దీవెనలు అందుకొని ఆయురారోగ్య ఐశ్వర్యాలు పొందుతారు. మరి నాస్తికుల మాటేమిటి? వారి అభ్యుదయానికి ఎవరి అనుగ్రహం లభిస్తుంది? అన్న ప్రశ్న  సామాన్యుల మనసులో ఉత్పన్నం కావచ్చు. నాస్తికులలోనూ ఉన్నత విద్యావంతులు, మేధావులు, సంపన్నశ్రేణి, పెద్దపెద్ద పదవులు నిర్వహిస్తున్నవారు వుండటంలోని రహస్యం సామాన్య ప్రజల మేథకు అందని విషయం. ఒకటి చెప్పుకోవాలి. దైవాన్ని నమ్మని వారు కూడ 'ఆత్మ' విశ్వాసం (తమపై తమకు నమ్మకం) కల్గివుండటం వల్ల, ఆత్మయే దైవం కావడం వల్ల, వారు ప్రత్యక్షంగా భగవంతుని నమ్మకపోయినా, అంతర్యామిగా వున్న పరమాత్మ కరుణకు పాత్రులౌతారు.

దైవ విశ్వాసులు ఆపద మొక్కులు మొక్కిన సందర్భంలో కష్టాలు గట్టెక్కి కొంతకాలం గడిచాక, గండం దైవానుగ్రహం వల్లనే గడిచిందా? లేక యాదృచ్ఛికంగా అలా జరగవలసివుండటం వల్ల కష్టాలు గట్టెక్కాయా? అని సంశయించడం కొందరి విషయంలో జరగవచ్చు. అలాంటి సంశయం న్యాయం కాదనిపించినా అది భగవత్ కల్పిత మాయ ప్రభావానికి లోబడే జరుగుతుందని భావించవచ్చు. ఓ ఆధ్యాత్మిక అన్వేషిగా భగవత్తత్వాన్ని అర్థం చేసుకొనవలసిన బాధ్యత మనిషిపై వుంటుంది.

దైవం వున్నాడన్నవారికి వున్నాడు. లేదన్నవారికి (బాహ్యంలో) లేక పోయినా అంతర్యామిగా ప్రతిప్రాణినీ ఆశ్రయించి వున్నాడన్న నిజం తెలుసు కున్నప్పుడు ఆ భావన సాధకుడిలో కల్గించే ప్రేరణ అపూర్వం! ఆత్మ విశ్వాసమే మనిషి అన్ని విజయాలకూ కారణమనీ, అతడు సృష్టిలో దేవుడి తర్వాత దేవుడంతటి వాడన్న నిజాన్ని గుర్తిస్తే దేవుడికీ, మనిషికీ గల అభేదం బోధపడుతుంది.

అదే ఆదిశంకరులు వచించిన అద్వైత స్థితి. ఆ భావన తాలూకు ఎరుకే భక్తుణ్ణి కైవల్య పథగామిని చేస్తుంది. ❋

# 53. గతమెంతో ఘనం

మానవ మెదడు కేవలం ఓ మాంసపు ముద్ద కాదు... భగవంతుని సృష్టిలో దేహమే ఓ అద్భుతమైతే దానిని మకుటాయమానమైన మేథస్సుకు నెలవైన శిరస్సు ప్రాధాన్యం అంత ఇంత అని చెప్పలేనిది. జ్ఞానేంద్రియాలకు మూలస్థానం మస్తకం. మస్తకంలో అంతర్లీనంగా ప్రకాశించే మెదడు విజ్ఞానానికి, చైతన్యానికి ప్రతీక. ఇక్కడే తలరాతలను మార్చగల నిర్ణయాలు తీసుకోబడతాయి. ఓ దేశాధినేత మస్తిష్కం దేశ ప్రజల భవితకు మూలకారణమైతే ఓ తిరుగులేని విశ్వనేత మస్తిష్కపు ఆలోచనలతో ప్రపంచశాంతి నిర్ధారింపబడుతుంది. సామాన్యుడి మస్తిష్కం తన, తనవారి బ్రతుకుతెరువుకు, శాంతి సౌఖ్యాలకు కారణభూతమౌతుంది.

చిన్ననాటి అనుభవాలు, జ్ఞాపకాల రూపంలో మెదడు పొరల్లో నిక్షిప్తమై వుంటాయి. అవమాన భారాలు, వ్యథలు స్వీయచరిత్ర పుటల్లో కరిగిపోయి వేరొకనాటికి 'ఓస్! ఇంతేనా! వాటన్నిటినీ నేను విజయవంతంగా అధిగమించాను"! అని గర్వపడతాడు మనిషి. చిన్నపాటి మధుర జ్ఞాపకాలను గుర్తుంచుకొని నెమరు వేసుకుంటూ వార్ధక్యంలోనూ బాలకుడౌతాడు. తను చిన్నప్పుడు ఓ అధ్యాపకుడికి నమస్కరిస్తే ఆయన చిరునగవుతో ప్రతిస్పందించిన సన్నివేశం అతడి జ్ఞాపకాల పొరల్లో ఎన్నటికీ పదిలమే! తన బాల్య స్నేహితులు, ఉపాధ్యాయులు... ఆ మాటకొస్తే ఎరిగిన ఎవరైనా అదే రూపంలో వుండే అవకాశం లేకపోయినా, లేదా శాశ్వతంగా కనుమరుగైనా ఆ జ్ఞాపకాలు మనసు మడతల్లో భద్రంగా, పదిలంగా వుంటాయి. ఎక్కడో పర్యాటక ప్రదేశాలలో గడిపిన అపురూప అనుభవాలు, అక్కడి అనుభూతులు నిత్య నూతనంగా అలరారుతాయి. ఎప్పటికీ వినూత్న సొబగులతో మనోనేత్రం ముందు సాక్షాత్కరిస్తాయి. తనను అలరించిన ఓ మిత్రుడు, మిత్రురాలు ముదిమిపైబడిన వారై ఎదుటపడినా పాత జ్ఞాపకాలు ప్రస్తుతపు చేదుతో ఎంత మాత్రం కలుషితం కావు. అందుకే అన్నారేమో శరీరానికి వయసుంటుందేమో కానీ మనసుకు వుండదని! ఆత్మకు చావులేదన్నది ఎంత

సత్యమో మనసుకూ మరణం లేదన్నది (ఆధ్యాత్మిక కోణంలో కాదు) అంతే సత్యమని తెలుసుకొనే మనిషిని నూతనోత్తేజం ఎన్నటికీ ఆవరించే వుంటుంది. చలన చిత్రాలలో కథానాయికా నాయకుల చిన్ననాటి ముద్దు ముచ్చట్లు గంటల కొద్దీ పరిచయం చేశాక ప్రస్తుతంలో వారి ఎడబాటు నిశ్చయమైనప్పుడు ప్రేక్షకుడు కంటతడిపెడతాడు. వారి ముందు నాటి ముద్దు ముచ్చట్లు అనుభవాలు తెరపై లీలగా మరల చూపించినప్పుడు గతించిన వసంతమై అవి అతడిని కలవరపెడతాయి. అందుకే గతకాలపు ఘనకీర్తిని జ్ఞాపకాల అంచులకు తెచ్చుకొని మరీ మురిసిపోతాడు మనిషి.

కాలం బాధించదు. బంధించదు. దాని స్వభావమే వేరు. అనుభవాలు మాత్రమే బాధిస్తాయి... బంధిస్తాయి. కాలచక్రభ్రమణంలో అవే ఋతువులు, అవే శోభలు! ఈ పునరావృత్తి ప్రపంచంలో జనన మరణాలు పునరావృతం కాకుండా చూచుకోవాలంటారు ద్రష్టలు! కొన్ని జ్ఞాపకాలను సంస్మరించుకుంటే ఆనందం, మధురానుభూతులు వెల్లువెత్తుతాయి. గతించిన బాధలు బాధించని అనుభూతులుగా మిగులుతాయి తప్ప ప్రస్తుతంలో వాటికి బాధించే నైజం వుండదు. తను అధిగమించిన గడ్డుకాలాన్ని సంస్మరించుకొని మనిషి గర్వపడతాడు కూడా. మరొకరైతే తనలా తట్టుకొని నిలబడేవారు కాదని గొప్పతనం ఆపాదించుకొని మరీ మరుస్తాడు మనిషి. 'జ్ఞాపకాలు' స్ఫురణకు తెచ్చుకొని మురిసిపోవడానికీ, రంగుల కలలో విహరిస్తూ జీవించడానికీ కాదు జీవితం! స్ఫురణ ఓ కొత్త అనుభవాన్ని అనుభూతినిచ్చేందుకు ప్రేరణనిస్తూ సాయపడే మంత్రదండం కావాలి! చిన్ననాడు కష్టాలు అనుభవించి గొప్పవాడుగా ఎదిగిన వ్యక్తి, అటువంటి వారు ఎవరైనా కష్టాలలో వున్నప్పుడు సాయమందించగల సామాజిక బాధ్యత స్వీకరించిన నాడు సమాజానికి మేలు జరుగుతుంది. ఊహల్లో విహరిస్తూ జీవించడం వల్ల ఒరిగేదేమీ వుండదు. ఇప్పటి స్పృహతో జీవిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగల సత్తా చాటుకున్న నాడు ఎవరూ ఎవరికీ భారం కారు. 'కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అంటాడో కవి. పటుతర మానసిక శక్తి సామర్థ్యాలు వున్న తల్లులు, తండ్రులు ఏ వయసువారైనా సమాజానికి, కుటుంబాలకు, యువతకూ ఎప్పటికీ తరగని సంపదే! ❋

# 54. స్త్రీ

'భారత మహిళ అర్ధరాత్రి ఒంటరిగా ఆరుబయట సంచరించగల్గిన నాడు దేశానికి నిజంగా స్వాతంత్ర్యం వచ్చినట్లు' అన్నారు గాంధీజీ. ఆరు దశాబ్దాల పైచిలుకు సుదీర్ఘకాలం తర్వాత పునరాలోచించుకుంటే మనకు స్వతంత్ర్యం వచ్చినా రానట్లేనని బోధపడుతుంది. అందుకు కారణం స్త్రీల పట్ల సగటు భారతీయుడి ఆలోచన ఆమోదయోగ్యంగా లేకపోవడమే! అర్ధరాత్రి మాట అటుంచి పట్టపగలే మహిళ ఒంటరిగా వీధుల్లో తిరగలేని దుస్థితి నేడుంది. స్త్రీల పట్ల నాగరికులైన పురుషుల ప్రవర్తన దిగజారుతుండడం జాతిని కలవరపరిచే అంశం! 'కామాతురాణాం న భయం న లజ్జ' అన్న కాళిదాసు మహాకవి మాటలను నిజం చేస్తూ ఏ భయం, బెరుకు లేకుండా అతివల పట్ల అనుచితంగా, అనాలోచితంగా ప్రవర్తించే మగవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. చిన్నారులు, కన్యలేకాదు, వివాహితులు, వృద్ధ స్త్రీలు కూడా కామాతురుల అఘాయిత్యాలకు బలి పశువులు కావడం నివ్వెరపరిచే అంశం!

వయసులో వున్న పడతి బజారుకెళితే కొందరు వ్యసన పరులు తినేసేట్లు చూస్తారు. వారి ఇండ్లలోనూ స్త్రీలు వుంటారు. తమ అక్కాచెల్లెళ్ళ పట్ల ఎవరైనా అనాలోచితంగా ప్రవర్తిస్తే సహించలేని అలాంటివారు పరస్త్రీలను కామభావనతో చూడటం హాస్యాస్పదం. కొందరు తండ్రులు రక్తసంబంధానికి, మానవీయతకు మచ్చతెచ్చే విధంగా కామాంధులై కన్యలైన తమ బిడ్డలపైనే అఘాయిత్యానికి పాల్పడటం విస్తుగొలిపే నిజం! మద్యం సేవించి మరీ లైంగిక దాడికి పాల్పడటం జాతికి తలవంపులు తెస్తున్న అంశం! విద్యావంతులు, నిరక్ష్యరాస్యులు ఒకేలా ప్రవర్తించడం చిత్రమైన విషయం. ఈ సమస్య ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితం కాక యావత్ జాతి కీర్తి ప్రతిష్టలకు మచ్చ తెచ్చే విధంగా వ్రేళ్ళూనడం కలవరపరచే

నిజం! ఈ మధ్య రాజధానిలో ఒక యువతిపై జరిగిన పాశవిక చర్యకు పర్యవసానంగా నిర్భయ చట్టం ఆవిర్భవించినా నేరాలు కొనసాగుతూనే వుండటం సమస్య తీవ్రతకు దర్పణం పడుతుంది. పర్యటన కోసం మనదేశం వచ్చే విదేశీ మహిళలకు వారి ప్రభుత్వాలు భారత్ సందర్శించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించడం ఏ స్థాయిలో మనదేశ ప్రతిష్టకు భంగం వాటిల్లిందో తెలియజేస్తుంది.

స్త్రీలపై పురుషాధిక్యత ఈనాటిది కాదు. ఒకదేశానికి మాత్రమే పరిమితమైనది కాదు. మన ఇతిహాసాలను పరిశీలిస్తే రామాయణంలో సీత, భారతంలో ద్రౌపది పాత్రలు పొందిన అవమానాలు జాతిని జాగృతం చేసే అంశాలే! స్త్రీల పట్ల అనుచిత ప్రవర్తన వల్ల ఏ స్థాయిలో నష్టం వాటిల్లుతుందో వివరిస్తూ నేర ప్రవృత్తిగల వారిని సన్మార్గంలో నడిపించేందుకు మహర్షులు చేసిన ఓ సత్ప్రయత్నమే ఈ కీలక స్త్రీ పాత్రలు! కామాతురుడైన ఒక వ్యక్తి విజయవంతంగా జగజ్జేత అయిన సందర్భం జాతి చరిత్రలో కనబడదు. ఉన్నా అటువంటి ఆధిక్యం తాత్కాలికమే.

గాంధీజీ తనకు నాల్గవ సంతానం కల్గిన తర్వాత 37వ ఏట నుంచీ పాటించిన బ్రహ్మచర్య నిష్ఠ ఎందరికో ఆదర్శంగా నిలిచింది. రామకృష్ణ పరమహంస తన భార్య శారదాదేవిలో కాళికామాతను దర్శించడం విశేషం! యుక్త వయసు దాటకుండానే సిద్ధార్థుడు భార్యను, కుమారుని, అంతఃపుర సౌఖ్యాలను వదలి జ్ఞానాన్వేషణలో సన్యాసి కావడం ఆయన జ్ఞాన పిపాసను తెలియజేయడమే కాక భారతీయ ఆధ్యాత్మిక విలువలకు అద్దం పడుతుంది. వివేకానందుడు అమెరికా పర్యటిస్తున్నప్పుడు స్త్రీల పట్ల ఆయన మనో నిగ్రహాన్ని పరీక్షించిన విమర్శకులు వున్నారు. మచ్చలేని వ్యక్తిత్వంతో స్వామీజీ సుదీర్ఘకాలం ఆ దేశంలో పర్యటించి భారత కీర్తి ప్రతిష్ఠలను దిగ్దిగంతాలకు విస్తరించారు.

స్త్రీ పురుషులలో ఒకరి పట్ల ఒకరికి ఆకర్షణ సహజమే అయినా విచక్షణ కోల్పోవడం పురుషుడి విషయంలోనే జరుగుతుంది. శారీరకంగా బలవంతుడైన పురుషుడు నైతికంగా దిగజారితే కలిగే అనర్థం అతడి పతనానికి దారితీస్తుంది.

మొన్నటి స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రసంగిస్తూ స్త్రీల పట్ల కొందరు మగవారి అనైతిక ప్రవర్తనను భారత ప్రధాని మోడీ ఎండగట్టారు. 'తల్లిదండ్రులు తమ కుమార్తెలను పర్యవేక్షించే విధంగా మగ సంతానాన్ని సైతం పర్యవేక్షించి హద్దుల్లో వుంచాలి. ప్రతి పురుషుడూ ఓ తల్లి కుమారుడే గదా?! అన్న ఆయన మాటలు ఆలోచింపజేస్తాయి. ఏ ఇంట స్త్రీ గౌరవింపబడుతుందో ఆ ఇంట సిరి తాండవిస్తుందన్న మనుస్మృతిలోని వాక్యం ప్రతి భారతీయుడి ఎదలో ప్రతిధ్వనించాలి. ఆ మేలు కొలుపు జాతిని ప్రగతిబాట పట్టిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ❋

# 55. ఇంద్రియ విజయం

ఆత్మ, అంతఃకరణ చతుష్టయం, ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు – వీటి సాధికార వలయంలో సాగుతుంది మానవ జీవితం. వాటి అధికార దర్పం మానవదేహం పంచ భూతాలలో కలిసిపోయేదాకా కొనసాగుతుంది. అవి పునరుజ్జీవం పొందాలంటే ఆత్మ మరో దేహం ధరించవలసిందే! ఇంద్రియాలు శత్రువులుగా మారకుండా చూచుకోవడానికి సాధన పరిపక్వత సాధించవలసి ఉంది. ఇంద్రియ లౌల్యం వల్ల మనిషి పతనమౌతాడు. వాటిపై పట్టు సాధించాక విజేత కాగల్గుతాడు.

ఇంద్రియ ప్రాబల్యాన్ని అధిగమించడం దేహి సామర్థ్యానికి ఓ పరీక్ష. విశ్వామిత్రుడుగా లోకానికి చిరపరిచితుడైన కౌశికుడు ఓ మహారాజు. రాజుగా అతడికి తీరని కోరికలు, ఇంద్రియ సుఖాలూ లేవు. వసిష్ఠాశ్రమంలో సపరివారంగా అతడు పొందిన ఆతిథ్యం మహర్షి పట్ల అతడి అసూయకు కారణమైంది. అందుక్కారణం వసిష్ఠుడు మహారాజులకు అంతఃపురాలలో లభించే అపురూపమైన ఆతిథ్యాన్ని కామధేనువు సహాయంతో కౌశికుడికి దండిగా అందించడమే. కామధేనువు తన వద్ద ఉండటమే సమంజసమనీ, దానిని తనకు అప్పగించమనీ కోరినపుడు మహర్షి తిరస్కారం కౌశికుడిలో క్రోధాగ్నిని ప్రజ్వలింపజేసింది. సైన్యంతో యుద్ధానికి ఉపక్రమించాడు. గోవు అండతో రాజ సైనికులను మట్టికరిపించగల సైనిక శక్తిని సృజించిన వసిష్ఠ మహర్షి పట్ల కౌశికుడికి ఈర్ష్యాద్వేషాలు కలిగాయి. మహర్షిబలం భౌతికమైనది కాదని తెలుసుకున్న రాజు ఆధ్యాత్మిక బలంకోసం తీవ్ర తపమాచరించాడు. పరమేష్ఠి అనుగ్రహంతో దివ్యాయుధాలను సంపాదించాడు. తన ఆయుధ సంపత్తి వసిష్ఠుడి బ్రహ్మదండం ముందు దిగదుడుపే అని గ్రహించడానికి అతడికి ఎంతో సమయం పట్టలేదు.

కఠిన తపమాచరించి బ్రహ్మచేత రాజర్షి అనిపించుకున్నాడు. ఇంద్రియాలను కట్టడి చేసిన అతడిపై శబ్ద స్పర్శ రూప రస గంధాలేవీ ప్రభావం చూపలేదు. దేవతలు ఎరగా పంపిన మేనకతో కాపురం చేశాక జరిగిన అనర్థం బోధపడ్డ కౌశికుడు తిరిగి తీవ్ర తపస్సుకు ఉపక్రమించాడు. ఇంద్రుడు పంపిన దేవ వేశ్య రంభ అతడిలో కామం రగిలించలేక పోవడమేకాక తీవ్రశాపానికి గురయింది. త్రిశంకుడిని భౌతిక శరీరంతో స్వర్గానికి పంపే ప్రయత్నం చేసిన విశ్వామిత్రుడు (కౌశికుడు) వసిష్ఠుడి చేత బ్రహ్మర్షిగా పిలిపించుకొనేదాకా అతడి తీవ్ర తపోసాధన ఆగలేదు. ఇంద్రియాలపై విజయానికి పట్టుసడలని సంకల్పం అవసరమని రుజువు చేసిన రుషి శ్రేష్ఠుడు విశ్వామిత్రుడు ఆధ్యాత్మిక సాధకులకు ఆదర్శం!

కర్మేంద్రియాల వలన మనోచాపల్యం కలగదు. జ్ఞానేంద్రియ విషయాలైన శబ్ద స్పర్శ రూపరసగంధాల వలన కలిగే ప్రలోభాలను అరికట్టేందుకు సాగవలసిన క్రతువే తపస్సు. అపర బ్రహ్మగా ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుడు ఇంద్రియ విజయానికి సంకేతం. 'పూర్ణం నుండి పూర్ణం ఆవిర్భవిస్తుంది. సంపూర్ణంగా తొలగిన పూర్ణం నుండి ఆవిర్భవించే ఫలం కూడ పూర్ణమే!' అన్నది శ్రుతుల సారాంశం. ఇంద్రియాల ప్రభావాన్ని విస్మరించగలిగినపుడే వాటిపై ఆధిక్యత కోసం సాగే ప్రయత్నం ఫలిస్తుంది. ఇంద్రియాల సుడిగాలి వలన ప్రభావితులవుతూ కూడ గమ్యం చేరేదాకా విశ్రమించని మహాతపస్వులు సాధకులకు ఆదర్శం! ఇంద్రియాలను జయించడం అసాధ్యమని భావింపక ప్రయత్న లోపంలేకుండా పరిశ్రమించడం అందరి కర్తవ్యం. అందుకు యోగీశ్వరుల జీవితాలు మనకు ప్రేరణ అవుతాయి. ఆ ప్రేరణకు భగవదనుగ్రహం తోడయితే సాధన ఫలవంతమైనట్లే! ❋

# 56. ఆత్మనిగ్రహం

పదబంధం 'ఆత్మనిగ్రహ'మే అయినా మనిషి నిగ్రహించుకోవలసింది మనసునే. సాధారణ జీవన ప్రవంతిలో ఎన్నో సమస్యలు ఉత్పన్నమౌతుంటాయి. ప్రతి సమస్యకూ తీవ్రంగా స్పందిస్తూ పోతే ఫలితం చిరాకు, దుఃఖమే! ప్రతి స్పందించే సందర్భంలో ఆశావహంగా వ్యవహరిస్తే మానసిక సమతౌల్యానికి భంగం వాటిల్లదు. వాంఛలు ఈడేరనపుడు కలిగే నిరాశ అశాంతిని దూరం చేయగల మహత్తర సాధనం భగవచ్చింతనే! ఆత్మ సాధన కొరకు దృఢ సంకల్ప శక్తి అవసరం! నిగ్రహశక్తి రాత్రికి రాత్రే సాధించగల్గేది కాకున్నా నిరంతర తపస్సు (సాధనాక్రమం)తో మనిషి సత్ఫలితాలు కైవసం చేసుకోవచ్చు.

ఒక సైనికుడు యుద్ధరంగంలో వీరోచితంగా పోరాటం సాగిస్తున్నాడు. శత్రు సైనికుడి కవ్వింపు అతడిలో సమరోత్సాహాన్ని ద్విగుణీకృతం చేసింది. సమధికోత్సాహంతో శత్రువు ఎత్తులను చిత్తు చేస్తూ పోరాడి గెలుపు సాధించాడు. నిద్రాణమై వున్న అతడిలోని పోరాట పటిమ శత్రు సైనికుడి కవ్వింపు చర్యతో జాగృతమై అతడి గెలుపునకు తోడ్పడింది. కోపం, చిరాకు, ఆందోళన వ్యక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. పరిస్థితిని అనుకూలంగా మలచుకొనే సత్ ప్రయత్నమే సాధన.

అరిషడ్వర్గాల వికృతచర్య వల్ల చిత్త సమతౌల్యం కోల్పోయిన వాడికే చిత్తశాంతి అవసరం. అపజయాలతో విసిగిపోయిన ప్రజ్ఞావంతుడికే విజయం కావాలి. నిజాయితీగా ప్రయత్నిస్తే సంక్లిష్టతలను అధిగమించే నేర్పు సాధకుడి స్వంతం కాకపోదు. భర్తృవియోగాన్ని అనుభవిస్తున్న సీతాదేవి దుఃఖాన్ని నిగ్రహించుకొని శ్రీరాముడు ససైన్యంగా లంకకు తరలివస్తాడనీ, రావణ వధ జరుగుతుందనీ సంపూర్ణ విశ్వాసం ప్రదర్శించింది. లంకాపురికి హనుమ

దాగమనం ఆమె స్థైర్యాన్ని రెట్టింపుచేసింది. దుఃఖాల కడలిని తమ మనో నిగ్రహ శక్తితో ఈదిన పాండవులు శ్రీ కృష్ణుడి పట్ల, తమ భవిత పట్ల ప్రదర్శించిన విశ్వాసం యుగయుగాలకూ ఆదర్శం!

సమకాలీన ప్రపంచంలో ఎందరో సరదాకోసం ప్రారంభించే దురలవాట్లు వ్యసనాలుగా మారి వారి జీవితాలను బలిగొంటున్న సందర్భాలు అనేకం. నిగ్రహం పాటిస్తే విలాసాలకు దాసులు కాకుండా యువత తమను తాము రక్షించుకోవచ్చు.

మనసు చంచలమైనది. బలహీనమైనది. శక్తివంతమైనది కూడా! అందుకే దానిపట్ల అప్రమత్తత అవసరం. ఈర్ష్యాసూయలు, కోపతాపాలను రగిలించేందుకు తోడ్పడే ఇంధనం కూడ మనసులోనే ఉత్పన్నమౌతుంది. ఆందోళన వల్ల మనశ్శాంతి దగ్ధం కాకుండా కాపాడే అగ్ని మాపకం ఆత్మనిగ్రహమే! ఉద్వేగభరిత క్షణాల్లో సముచిత రీతిలో వ్యవహరిస్తే గౌరవాదరాలు, లౌకిక పారమార్థిక విజయాలూ సాధకుని వరిస్తాయి. నోటిదురుసుతనం కొందరినైజం. ఆ దుర్గుణం అహంకారం వల్ల ఇంతలంతలవుతుంది. మాటతూలే వారికి దివ్యౌషధం మనోనిగ్రహమే! కార్యసాధనకు అదే తోడ్పడుతుంది. ఆత్మోన్నతి సాధించకుండా ఆత్మ సాక్షాత్కారం దుర్లభం!

పుట్టుకతో మనసు కల్లాకపటం లేనిది. ఇహపు హంగులు, రంగులు, పొంగులతో కలుషితమయ్యే మనసు వల్ల పారమార్థిక ప్రగతి సాధించలేం. ఆత్మనిగ్రహం సాధన చేసిన దైవాభిలాషికి చిత్తశాంతి కరతలామలకమే! కొంత వరకు అవకాశమున్నా, మనసులో పొందలేని ఆనందం ఎక్కడో బయటి నుంచి లభిస్తుందనుకోవడం పొరపాటు. ఆత్మనిగ్రహం పాటిస్తూ మనో మాలిన్యాలను తొలగించుకొనే మానవుడు అందరికీ ఆప్తుడౌతాడు. సాధకుడు దైవానికి ఆప్తుడు కావటంలో నిగ్రహశక్తి ఎనలేని పాత్ర పోషిస్తుంది. ❋

# 57. ఆత్మజ్ఞాన రహస్యం

'ఆత్మజ్ఞానం!' విరివిగా ఆస్తికుల నోట నానుతుండే పదబంధమిది. జ్ఞానఖనులైన మహాత్ములు తరచూ ప్రవచించే అంశం ఆత్మజ్ఞానమే!

ప్రాణుల హృదయసీమల్లో భగవంతుడు ఆత్మ స్వరూపంగా నెలకొని ఉంటాడు. దేహమే దేవాలయం, హృదయమే అంతరాలయం! అందులో దేవదేవుడు జీవుడుగా వెలుగొందుతాడు. భగవదంశ కారణంగా ప్రతి వ్యక్తీ ఆరాధనీయుడే! ప్రేమాస్పదుడే! ఆత్మస్వరూపుడే! ఆత్మ, పరమాత్మయొక్క అల్పాంశ. మనిషిలో'నేను'గా భాసించే ఆత్మతత్వమే అతడిని దైవ స్వరూపుడుగా చేస్తుంది. ప్రతి వ్యక్తీ తనను 'నేను' అంటూ సంభావించుకుంటాడు. అన్ని నేనుల కలయికే కోటి సూర్య ప్రభాభాసితమైన పరమాత్మతత్వం. ఆ తత్వరహస్యం ఎరిగినవాడే ఆత్మజ్ఞానిగా వెలుగొందుతాడు.

'ఓస్! ఆత్మజ్ఞానం ఇదేనా! ఇదినాకు తెలియదా!' అంటూ ఓ సగటు మనిషి తేలిగ్గా పొరబడే అవకాశం ఉంది. ఈ రోజుల్లో మహాత్ములు ప్రవచించే ఆత్మజ్ఞానతత్వం చెవిపడని సాధకుడు ఉండడు. ఆ రహస్యాన్ని ఆకళింపు చేసుకొని, నమ్మి, ఆచరించిన మహనీయులు ఆత్మజ్ఞానులయ్యారు. సగటు మనిషి ఆ తత్వరహస్యం ఎరిగినా ఆచరణ తెలియని కారణంగా అజ్ఞానిగానే జీవితం సాగిస్తాడు, ముగిస్తాడు. పామరులకు ఆత్మజ్ఞానం అందని ద్రాక్షేనా? అన్నపుడు 'కాదు!' అని ముక్తకంఠంతో వచిస్తారు ద్రష్టలు. ఆత్మజ్ఞానాన్ని ఆచరించడంలో భాగంగా మనిషి క్రియాశీలంగా సాధన చేయవలసి వుంది. ఆ సాధన జీవిత పర్యంతం కొనసాగించవలసి రావచ్చు. అలా చేసినా జీవితకాలంలో జ్ఞానం ఒడిసి పట్టగలడన్న హామీమాత్రం సాధకుడికి లభించదు.

కొందరు అతి తక్కువ వ్యవధిలోనే ఆత్మజ్ఞానులౌతారు. కృషికి

దైవానుగ్రహం తోడైతే ఆ మహర్దశ పడుతుంది. అటువంటి మహనీయులే లోక ప్రసిద్ధులైన రామకృష్ణపరమహంస, శ్రీరమణులు, షిర్డీసాయిబాబా మొదలైనవారు. వీరిని అవతార స్వరూపులుగా భక్తులు విశ్వసిస్తారు. ఆత్మజ్ఞానం ఆశించే సగటు మనిషి. నిర్విరామ సాధన కొనసాగించవలసి ఉంటుంది. సాధన పరిపక్వం చెందితే అచిరకాలంలోనే వారికి దివ్య జ్ఞాన సంపద సిద్ధించవచ్చు.

ఆత్మతత్వ విస్తరణ, భౌతిక ఆకర్షణలు ప్రలోభం ఎక్కువగా ఉండే పాశ్చాత్య దేశాల్లో తక్కువ. ఆత్మతత్వరహస్యం ఆచరణాత్మకంగా, కూలంకషంగా ఆకళింపు చేసుకున్న మహనీయులు ఎందరో పవిత్ర భారతావనిలో తమ జీవయాత్ర సాగించారు. సాధన చేసే అనేక వేల మందిలో ఏ ఒక్కడో మోక్షసాధన చేస్తాడు. అటువంటి వేలమంది మోక్షార్థులలో ఏ ఒక్కడో నన్ను చేరుకుంటాడు' అన్న శ్రీకృష్ణ భగవానుడి వాక్కు సదా సంస్మరణీయం. వేలాది ప్రజలు ఆధ్యాత్మిక సాధన చేస్తే వారిలో ఒకరికైనా శ్రీకృష్ణ పరమాత్మ సన్నిధిప్రాప్తి కలుగుతుందన్న భగవానుడిహామీ వల్ల నిర్దుష్టమైన సాధనతో భగవత్ప్రాప్తి సాధ్యమేననీ, నెరవేరనికల కాదనీ బోధపడుతుంది. కర్మభూమి అయిన భరతభూమిలో పవిత్ర జీవనం చేస్తూ ఆత్మప్రాప్తికోసం అర్రులు చాచేవారు అధిక సంఖ్యలోనే వుంటారు. వారి నిష్కపట, నిష్కళంక జీవనశైలి వల్ల ఈ ధర్మక్షేత్రంలో ఎల్లెడలా ఆధ్యాత్మిక జ్యోతి వెలుగులు విరజిమ్ముతూనే వుంటుంది.

వస్తుతః ఆత్మజ్ఞానం అవగతం చేసుకోలేనిది కాకపోయినా ఆచరణలో జీవితకాలం సాధనచేసి సఫలీకృతులు కావలసి వుంది. మోక్షసాధన లక్ష్యంగా పరిపక్వత సాధించడం కోసం జగద్గురువైన శ్రీకృష్ణభగవానుడి దివ్యచరణాలను ఆశ్రయించడం ముముక్షువులకు సర్వదా అభిలషనీయం. వాచావేదాంతం కాక అనుష్ఠాన వేదాంతం వైపు దృష్టి మరల్చి ఆ దిశగా సాధకుడి తొలి అడుగు పడిననాడు ఆశించిన లక్ష్యం అవలీలగా చేరుకోవడం మరీ కష్టతరం కాకపోవచ్చు. ఆత్మసాక్షాత్కారం జీవితకాలంలో సంభవమే అని సాధకుడు దృఢంగా విశ్వసించాలి. అలా మనసావాచా కర్మణా నమ్మిన సాధకుడికి ఎన్నడూ అపజయం ఉండదు. నమ్మి చెడినవారు లేరన్నది పెద్దలు నుడివిన సత్యమేకాక ఆధ్యాత్మిక సాధనాక్రమంలో అది చాలామందికి అనుభవైక వేద్యమే! ❋

# 58. గుర్తింపు

మనిషి తను చేసిన పనికి ప్రతిఫలంగా పారితోషికం లభించకపోయినా తృప్తిపడతాడేమోగానీ తన కృషికి తగిన గుర్తింపు లభించకపోతే మాత్రం నిరాశపడతాడు. కొన్ని సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగుల ఆమేయపాత్రకు ప్రతిఫలంగా ప్రశంశాపత్రాలు జారీచేయడం చూస్తుంటాం. ఆ పత్రాల వల్ల ఎలాంటి ఆర్థిక వెసులుబాటు లేకపోయినా, పదోన్నతులలో వాటి పాత్ర నామమాత్రమే అయినా ఆ గుర్తింపు పత్రాన్ని చూసి యాజమాన్యం తనపట్ల ప్రదర్శించిన ప్రశంశాపూర్వక వైఖరికి మురిసిపోతాడు ఉద్యోగి. తన వారికి చూపి మహదానంద పడతాడు.

ఈ దృశ్య జగత్తులో ఏ ప్రాణి కూడా భగవత్ సృజన కానిది లేదు. అందరూ దైవం చేత సృజింపబడ్డవారే! ఒక బిడ్డ ఆవిర్భావానికి తల్లిదండ్రుల పాత్ర కేవలం నామమాత్రమేనని, దైవశక్తి ప్రమేయం అమేయమనీ గ్రహించ గలవారు తక్కువ సంఖ్యలోనే ఉంటారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, తల్లి గర్భంలో ఉన్న శిశువు బొడ్డు కోసేదాకా పూర్వజన్మ స్మృతి కల్గి ఉంటాడని తన కాలజ్ఞానంలో ఉల్లేఖించడం ప్రస్తుతనీయం.

కొందరికి ఐశ్వర్యముంటుంది. కొందరికి ప్రయోజకులైన సంతానం వుంటారు. కొందరికి లలితకళలలో ఎవరికీ లేని ప్రజ్ఞ ఉంటుంది. కొందరు వృత్తి నైపుణ్యంలో రాణిస్తారు. మరికొందరికి ధనముండదు. విద్య ఉండదు...అందం ఉండదు...ఆకర్షణ వుండదు..ఎలాంటి ప్రతిభకూ నోచుకోరు, గాలికి తిరుగు తుంటారు, చూచేవారు వారిని అప్రయోజకులుగా చెప్తారు. వారి జన్మవెనుక ఎలాంటి ప్రయోజనమూ లేదని కావలసిన వారూ అంటారు. నిజంగా వారి అస్థిత్వంవల్ల లోకానికి ఎలాంటి ప్రయోజనం లేదా? అన్నది విజ్ఞులను సైతం కలవరపరిచే ప్రశ్న.

గీతలో భగవానుడైన శ్రీకృష్ణుడంటాడు... “అర్జునా! ఈ లోకంలో ప్రతి ప్రాణినీ నేనెరుగుదును. వారి భూత భవిష్యత్ వర్తమానాలు నాకు కరతలామలకం! కానీ జగతిలో ఎవరూ నన్ను సంపూర్ణంగా తెలుసుకున్న వారు లేరు” (7-26) ఈ నేపథ్యంలో అనామకులు సైతం భగవానుడి సునిశిత వాత్సల్య దృష్టిని, అద్భుత స్పర్శను పొందుతున్న వారే అని బోధపడుతుంది. అలాంటప్పుడు ‘నేను దురదృష్టవంతుడిని. భగవత్ కృపకు నోచుకున్న వాడిని కాదు’ వంటి నిరాశాపూరిత ఆరోపణ (ఆలోచనలు) చేయడం జీవితాన్ని ఇంకా కృంగదీసుకొనే ధోరణిలో ఒక భాగమే అవుతుంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ పూర్వాశ్రమంలో ఎన్నో అపజయాలు పొంది దురదృష్టవంతుడిగా ముద్రపడినవాడే. ‘అందరికీ సుగతే!’ అన్న మాతృశ్రీ అనసూయాదేవి మాటలు ప్రాధాన్యతను సంతరించుకొని ఉన్నాయి.

అనాథలు ప్రత్యక్షంగా తల్లిదండ్రుల వాత్సల్య భావానికి నోచుకోకపోయినా భగవంతుడి కృపాకటాక్ష వీక్షణ చేత ఉదారులైన సంపన్నులచేత దత్తతకు స్వీకరింపబడటం ప్రభుత్వేతర, ప్రభుత్వ నిర్వహణలోని దాతృత్వ సంస్థల పరిపోషణలో పెరిగి పెద్దవారు కావటం వంటివి యాధృచ్ఛికంగా జరిగేకార్యాలు కావనీ, భగవదనుగ్రహానికి ఆ విధంగా ఆ బాలబాలికలు నోచుకున్నారనీ భావించటం సబబు. అలా పెరిగి విద్యాబుద్ధులు నేర్చిన ఆ బాలల్లో కొందరు పెద్ద పెద్ద పదవులు చేపట్టడం జరుగుతుంది. ఎవరూ ఎవరినైనా తక్కువ చేయటం అవివేక చర్యగా భావించాలే తప్ప నిజానికి ప్రపంచంలో ఎవరూ తక్కువ వారు లేరు. పాత్రతను అనుసరించి మనిషి గౌరవం అందుకుంటాడు. నిజమే! కానీ ఏ మనిషినీ తోటి వ్యక్తి తక్కువ చేయటం తగని పని! లోకంలో సంపన్నుడుగా చలామణి అవుతున్న ఓ అధోజగత్తు నాయకుడు బయట ప్రపంచానికి గొప్పవాడిగా కనిపించినా అచిరకాలంలో అతడి దుశ్చర్యలు వెలుగులోకి వచ్చాక స్థానిక ప్రభుత్వం విధించే శిక్షకు గురికావడం తప్పనిసరి! పైపై మెరుగులు చూసి గుర్తించి గౌరవించడం కాక ఓ మనిషిని మనిషిగా చూసి గౌరవించడం మానవత్వమనిపించుకుంటుంది. అందరూ అలా ప్రవర్తించడం జరిగితే ఏ వ్యక్తీ అకారణంగా తనకు అగౌరవం కలిగిందని భావించే అవకాశముండదు. ❋

# 59. మూడు నిజాలు

'లోకంలో ఏ అంశమైనా జరగవలసిన రీతిలోనే జరుగుతుంది.

'ఏ సంఘటనైనా కాలం సమీపిస్తే ఎవరూ ఆపలేని విధంగా నిర్దేశిత క్షణంలో తప్పక జరుగుతుంది.'

'భగవంతుడు కరుణామయుడు. మనిషి ఐహిక, ఆముష్మిక వ్యవహారాలలో ప్రగతి ఆయన కరుణమీదే ఆధారపడి వుంటుంది.

తన అనుభవంలో ఆచరణాత్మకంగా ఈ 'మూడు నిజాల'ను తెలుసుకున్నా నన్నపుడు అతడి మిత్రుడు, 'భేష్! జీవితంలో ఎరగవలసిన సత్యాలు ఈ మూడే! వీటిని నువ్వు తెలుసుకున్నావు. నీవు ఓ యోగిపుంగవుడితో సమానం!' అంటూ ప్రశంస అందించినపుడు అతడుపొందిన సంతృప్తి అంతా ఇంతా కాదు.

నిజానికి ఈ అనుభవాలు ఎవరి జీవితంలోనైనా సంభవమే! మనిషి ఓ కార్యసాఫల్యతను ఊహించుకుంటాడు. దాని సిద్ధికోసం దృఢసంకల్పం చేస్తాడు. కానీ కొద్ది తేడాలో విజయం చేజారిపోతుంది. అపుడు ఆ వ్యక్తి ఆవేదన వర్ణనాతీతం! నిజానికి అతడు విచారించవలసింది ఎంత మాత్రం లేదు. లోకంలో ప్రతివారి అనుభవాలూ దైవ నిర్దేశిత ప్రమాణంలోనే జరిగిపోతాయంటారు పెద్దలు. ఆశించినది, నిజంగా జరిగినది ఒక్కటే అయితే మనిషికి విజయం సిద్ధించినట్లే! అంతా తన ప్రతిభవల్లే జరిగిందని మనిషి చాలాసార్లు పొరబడతాడు. ఆత్మవిశ్వాసం ఉండవలసిందే! కానీ తన గొప్పతనం వల్లే అన్నీ సానుకూలమవు తున్నాయని భావించడం అవివేకం! విధిని నమ్మిన ఎవరి అనుభవమైనా ఈ సత్యాన్నే ధృవీకరిస్తుంది. ప్రపంచస్థాయి నైపుణ్యం వున్న శస్త్రచికిత్సకుడైనా ఒక్కోసారి వైఫల్యాన్ని చవిచూస్తాడు. పురుషప్రయత్నంతో పాటు విధి ఆనుకూల్యత వున్నపుడే మనిషి విజయాలబాట పడతాడు.

కొన్ని క్రియలకు ఫలితం తక్షణం లభిస్తుంది. కొన్ని కర్మలు

కొంతసమయం తీసుకొని ఫలితం చూపిస్తాయి. ఒక విత్తు చెట్టుగా మారటం అలాంటిదే! కత్తి ప్రయోగించినపుడు గాయం అదే క్షణంలో జరుగుతుంది. సాధారణంగా నకారాత్మక కర్మల ఫలితాలు వెంటనే అందివస్తాయి. ఉత్పాదక విలువలుండే పనులు సావధానంగా జరుగుతాయి. అందుకే దైవాన్వేషణలో సాధకుడు ఓ జీవితకాలం ఖర్చు చేయవలసిరావచ్చు.

భగవంతుడు కరుణామయుడు. ఆయన ఆశీర్వాదంతోనే లోకాలు సుభిక్షంగా ఉంటాయి. అపజయాల పాలవుతున్న కృషీవలుడు తనకు దైవానుగ్రహం లభించడం లేదని వాపోతాడు. ఓ విజయానికి, అపజయానికి మధ్య రేఖ బహు స్వల్పం. 'కొంచెంలో తప్పిపోయింది. లేకపోతే నేను విజయం సాధించి వుండేవాడిని' అన్న అభిప్రాయం ఈ కోవకు చెందినదే! తానున్న స్థాయిలో మనిషి జీవిస్తాడు. స్థాయి అల్పమయినది కావచ్చు; గొప్పదీ కావచ్చు. హీన స్థాయిలో మరికొందరుంటారు. సాధకుడు ఆ తేడా గమనించి కార్యాచరణకు నడుం బిగించాలి. ఓ దేహాన్ని పొంది జీవించి వున్నందుకయినా మనిషి మాధవుడికి కృతజ్ఞతలు తెలుపుకోవలసి వుంది.

ప్రకృతిలో మానవుడు అంతర్భాగం. ప్రకృతికి కొన్ని నియమాలు వున్నాయి. కొన్ని లక్ష్మణ రేఖలను ప్రకృతి జవదాటదు. తాను కలలు కన్నట్లు జీవితం లేదని వాపోయి ఉన్న కొద్దిపాటి ఆనందానికీ, మనిషి దూరం అవుతాడు. అది అవివేకమే! భగవంతుడు కంటికి కనబడడు. అసలు దైవమే లేడనీ కొందరు భావిస్తారు. భూమ్మీద కోట్లాది ప్రజలు, పక్షులు, జంతువులు, ఇతర ప్రాణులు భగవంతుడి ప్రతినిధులే అని మనిషి అంగీకరించాలి. సృష్టి సుగుణాలు – దుర్గుణాల కలబోత! హంస నీటిని వదలిపాలు తాగినట్లు సాధకుడు తన అనుభవంలోకి వచ్చే అంశాల లోని చెడును వేరుచేసి మంచిని స్వీకరించాలి. మంచి ఆచరించినపుడు సత్ఫలితం వెంటనే కనిపించక పోయినా నిరాశ చెందక అంతిమంగా విజయం తప్పక ప్రాప్తిస్తుందని నమ్మి ముందుకు సాగాలి. అలా సాగినపుడు ఎన్నడూ కలత చెందవలసిన అవసరం రాదని గుర్తుంచుకోవాలి. 'భగవంతుడు కరుణాసముద్రుడు. నమ్మినవారిని ఎన్నడూ దైవం నిరుత్సాహపరచడు. ఏ పురాణంలో వెదకినా గోచరించే మహాసత్యమిదే!' అన్న అన్నమయ్య పదంలోని భావం చిరస్మరణీయం! ❋

# 60. ఉదాత్త సాధన

సంసార సాగరంలో మునిగి కొట్టుమిట్టాడే జీవులు కోరుకునేది అధికంగా గానీ అల్పంగా గానీ మానసిక 'శాంతి'. శాంతి గణనకు మించి లభ్యమైనపుడు అదే 'ప్రశాంతి'. భీరువులకు శాంతి అందని ద్రాక్షపండే! రుణబాధలు, అనారోగ్యం, మరణభయం మానవులను నిరంతరం పట్టి పీడించే జలగలు. అనారోగ్యాన్ని ఔషధాలు వాడి తొలగించుకోవచ్చు. ప్రయత్నించి రుణబాధల నుండి బయటపడవచ్చు. మరణం, పుట్టిన ఏ ప్రాణి కూడ తప్పించుకోలేనిదైనా మరణభయం నుంచి తప్పించుకొనే అవకాశం వుంది. నిరంతర సాధన వల్ల భగవదనుగ్రహంతో ఆ లబ్ధి చేకూరుతుంది. మరణభయాన్ని జయించితే మరణాన్ని జయించినట్లే!

తన అన్వేషణలో భాగమైన ఇతర జాడ్యాలతో పాటు మరణ రహస్యాన్నీ తెలుసుకోవాలనుకున్నాడు సిద్ధార్థుడు. పేదరికం, రోగం, వచ్చిపోయే అతిథులవంటివి. ముసలితనం కాలానుగుణంగా శరీరం సంతరించుకొనే మార్పు. అవగాహనతో ముసలితనం వల్ల సంక్రమించే మనోవ్యధ నుంచి తప్పించుకోవచ్చు. ముసలితనం లాగానే మరణం కూడ శరీరం అనుభవించే మరో దశనీ, అజ్ఞానం వల్ల ఈ విషయాలు భయాన్ని కల్గిస్తాయనీ, భయాన్ని దూరం చేసుకున్నపుడు మిగిలేది ప్రశాంతేననీ జ్ఞానోదయం పొందిన సిద్ధార్థుడు కనుగొన్న మహా సత్యం! అజ్ఞానం పోవాలంటే నిజమైన ప్రకృతి తీరేమిటో తెలుసుకోవాలి. ఆ నిజం తెలుసుకున్న మరుక్షణంలో మనసును కలవరపరచే బాధలన్నీ మటుమాయ మవుతాయని ఆయన ప్రవచనం!

ఒక మంచి అనుభవాన్ని అందరూ హర్షిస్తారు. మరల మరల ఆనందం కల్గించే అటువంటి అనుభవాలే కలగాలని ఆకాంక్షిస్తారు. లోకం తీరు మంచి

– చెడుల సమాహారమైనపుడు చెడు అనుభవాలు సైతం మనల పలకరించకుండా ఎలా వుంటాయి? అన్నాన్ని తిని పిప్పిని విసర్జిస్తాం. జల్లెడ మేలు గింజలను పైకి తేల్చి తాలుగింజలను నెట్టివేస్తుంది. ప్రకృతి యొక్క ఈ సూత్రాన్ని వర్తింపజేసుకొని మనకెదురయ్యే చెడు అనుభవాలకు ప్రాముఖ్యత ఇవ్వకుండా మంచివాటిని ఆహ్వానించి ఆస్వాదించాలి.

దేహ సుఖాల పట్ల ప్రేమ, ఆసక్తి మన అనేకానేక బాధలు, నిస్పృహలకు కారణమౌతాయంటారు విజ్ఞులు. సుఖం కల్గినపుడు ఉప్పొంగిపోకుంటే దుఃఖం ఎదురైనపుడు నిరాశ ఆవహించదు. రైలు బండ్లలో కొందరు శీతలీకరించిన పెట్టెలలో ప్రయాణించగా మరికొందరు సాధారణ బోగీలలో కిక్కిరిసిన ప్రయాణీకుల మధ్య ప్రయాణిస్తారు. చేరేది ఒకే గమ్యం కావచ్చు. గమనంలో సౌఖ్యం కొందరి సొత్తవుతుంది. అసౌకర్యం మరి కొందరి వంతు. బాధను బాధగా గుర్తించని మనో స్థైర్యమే యోగం. యోగాన్ని ఆశ్రయించిన మహర్షులు కఠోరమైన తపోనిష్ఠ అవలంబించేవారు. వివిధ దేవీ దేవతల దీక్షలు కూడ ఆ కోవలోకే వస్తాయి. దీక్ష విరమణ చేశాక సాధారణ సౌకర్యాన్ని సైతం సాధకుడు గొప్పగా ఆస్వాదించగల్గుతాడు. కష్టసుఖాలను లెక్కచేయనపుడే మనిషికి నిజమైన ఆనందం లభిస్తుందంటాడు గీతాచార్యుడు.

కొందరు సంపన్నులకు విశేషధనముండవచ్చు. అయినా యాచకులకు సైతం పైసా విదల్చబుద్ధిపుట్టదు. ఆ మనస్తత్వాన్ని 'లోభ'మన్నారు. త్యాగం వల్లే అమృతత్వం సిద్ధిస్తుందని ఉపనిషత్తులు వచిస్తాయి. ఇవ్వడంలో ఎంతో హాయి వుందనీ, మరోవిధంగా ఆ హాయి పొందడం సాధ్యంకాదనీ ఓ ఆధునిక కవి ఎలుగెత్తి చాటడం విశేషం! తనకున్నంతలో దానం చేసే వారు కొందరయితే, తమ స్థాయికి మించి, స్వలాభాన్ని సైతం లెక్కచేయకుండా ఆపన్నహస్తం అందించే మహాత్ములు మరికొందరు.

దైవీగుణాలు ఆనందానికి చిరునామాలు. అవి అటు సాధకుడికి, ఇటు సమాజానికి మేలు చేకూర్చుతాయి. అజ్ఞానానికి ప్రతీకలైన అసురీగుణాలు వాటికి విరుద్ధమైనవి. వాటిని సాధకులు తప్పక విసర్జించాలి. దైవీ గుణాలను సాధన

చేసే సాధకులకు అమృత సమానమైన మనసు సిద్ధిస్తుందంటాయి శాస్త్రాలు. అటువంటి వారు తమ సాధనను పరిపక్వం చేసుకోగలగడమే కాక సమాజాన్నీ ఉద్ధరించే మహాత్ములుగా వెలుగొందుతారు. సాధన వల్ల మానసిక ప్రశాంతి సిద్ధిస్తుందని తెలుసుకున్నపుడు ఆ లక్ష్యసాధన కోసం పరిశ్రమించడం విలువలతో కూడి వుంటుందని సాధకులు తెలుసుకోవాలి. ❋

# 61. సజ్జనుడి కోపం

ఈ చరాచర సృష్టి మహిమాన్వితమైనది. జననం, వృద్ధి, లయం అనే మూడు దశలను ప్రతిప్రాణి అనుభవిస్తుంది. బిడ్డ పుడితే జనులు ఆనందపరవశులౌతారు. వృద్ధి జరిగితే పరవశించిపోతారు. చావు, లేక లయం జరిగినపుడు కృంగిపోతారు. వియోగ దుఃఖం ఆత్మీయులను బాధిస్తుంది. లోకంలో ఎవరైనా మరణిస్తే ఆప్తులైతే మనిషి దుఃఖితుడవుతాడు. ఎరిగిన వారయితే నిర్లిప్తంగా ఆ వార్తను స్వీకరిస్తాడు. తనకు మాత్రం మరణం అప్పుడే రాదని భ్రమిస్తూ మనిషి ధీమాగా జీవించే ప్రయత్నం చేస్తాడు. ఒక వ్యక్తి సహజంగా మరణించడం వేరు, అతడిని ఆవేదనకు గురిచేసి ఆ మరణానికి కారకులు కావడం వేరు. మంచివారికి జరిగే అవమానం కారకులైన వారికి ఎన్నో వెతలు తెచ్చిపెడుతుందన్నది కాదనలేని నిజం! సజ్జనుడి కోపాన్ని మనిషి ఎన్నడూ విస్మరించరాదు.

ఉపపాండవులను చంపిన అశ్వత్థామ అర్జునుడు ప్రయోగించిన అస్త్రరాజ్యాన్ని ఎదుర్కొనే క్రమంలో 'పాండవక్షయం జరుగునుగాక!' అంటూ ప్రయోగించిన అస్త్రం అగ్నికీలలు వెలయిస్తూ గర్భస్థపిండంగా వున్న పరీక్షిత్తును దహించివేయసాగింది. శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహంతో పిండరూపంలో వున్న పరీక్షిత్తు ప్రాణాలు నిలబెట్టుకున్నాడు. గర్భస్థ సమయంలో తనను రక్షించిన మహాపురుషుడు శ్రీకృష్ణుడే అని విన్న అతడు జననమందాక తనను చూడవచ్చిన ప్రతి వ్యక్తినీ శ్రీకృష్ణుడేమో అను సంశయంతో పరీక్షగా చూడనారంభించాడట! ఆ కారణంగా అతడికి 'పరీక్షిత్తు' అన్న పేరు సార్థకమైంది.

అచంచల భక్తి విశ్వాసపరుడైన పరీక్షిత్తు ఒకరోజు అడవికి వేటకు వెళ్ళాడు. మృగాలను వేటాడే క్రమంలో అడవంతా కలియదిరుగుతూ దాహార్తికి

గురయ్యాడు. గుక్కెడు మంచినీళ్ళు ఎక్కడా దొరక్క పోవడంతో శమీక మహాముని ఆశ్రమానికి చేరుకున్నాడు. ఆయన హరిచింతనలో సమాధినిష్ఠుడై వుండడంతో రాజు నీటి కోసం తనను ఆర్తిగా పిలిచిన శబ్దాన్ని వినలేకపోయాడు. అది ముని అహంకారంగా భావించిన పరీక్షిత్తు ఓ చచ్చిన పామును శమీకుడి మెడలో వేసి నిష్క్రమించాడు. శమీకుడి పుత్రుడు శృంగి విషయం తెలుసుకొని కోపగ్రస్తుడయ్యాడు. అది ఒక మహారాజు చేయవలసిన పనికాదని భావించి, నాటికి ఏడవనాడు తక్షకుడి కాటుతో మహారాజు మరణిస్తాడని శపించాడు. విప్రుడి శాపవార్త విన్న పరీక్షిత్తు తనకు అంత్యం సమీపించిందని తెలుసుకొని వారం రోజుల అతితక్కువ వ్యవధిలో తన జన్మను తరింపజేసుకొనే మార్గం కోసం గురువులనాశ్రయించాడు. వ్యాస మహర్షి కుమారుడైన శుకబ్రహ్మ పరీక్షిత్తుకు ఆ తక్కువ వ్యవధిలో భాగవత శ్రవణం చేయించి తన దివ్యోపదేశంతో మహారాజును ఉద్ధరించాడు.

అవి శ్రీకృష్ణుడు పరమపదం పొందిన తొలి రోజులు. కలియుగ ప్రారంభంతో కలి పురుషుడు విజృంభించి లోకాన్ని తన ప్రభావంతో వణికించసాగాడు. మూడు కాళ్ళు తెగిన ఓ ఎద్దును రాజు వేషంలో వున్న ఓ కిరాతుడు హింసిస్తున్నాడు. వృషభంతో పాటు వున్న ఓ ఆవును కూడ నిర్బంధించి దుర్భాషలాడుతూ కొట్టసాగాడు. ఆ దృశ్యం రాజ్య పర్యటనలో వున్న పరీక్షిన్మహారాజు కంట బడింది. ఒక్కో యుగంలో ఒక్కో కాలును కోల్పోతూ కలియుగ ఆరంభానికి ఒంటి కాలితో మిగిలిన తాను ధర్మదేవత అనీ, ఆవు రూపంలో వున్నది భూమాత అనీ చెప్తూ తపస్సు, శౌచం, దయ అను పాదాలు కోల్పోయి సత్యం అను ఒకే ఒక్క పాదంతో తాను మిగిలిపోయాననీ అది కలి ప్రభావమేననీ చెప్పాడు ధర్మదేవత. కలిని దండించబోయిన పరీక్షిత్తు, కలి కూడా తన పాలనలో పాలితుడే అని గ్రహించి అతడు నివసించేందుకు స్థానం అనుగ్రహించాడు. ప్రాణిహింస, స్త్రీ వ్యసనం, జూదం, మద్యపానం జరిగే చోట్లు కలి నివసించే ప్రదేశాలుగా ఉంటాయని చెప్పి కలిని వదలివేశాడు. స్వచ్ఛమైన అతడి పాలనలో ధర్మదేవతకు లోపించిన మూడు పాదాలూ తిరిగి మొలవడం విశేషం!

కలియుగాన్ని కలహాయుగమన్నారు. అవినీతి, దురహంకారం, స్త్రీలోలత్వం, ధనవ్యామోహం వల్ల ప్రజలు ఆనందిస్తున్నామని భ్రమిస్తూ పొందే మానసిక అశాంతి వల్ల వారి జీవితాలు దుర్భరమవుతున్నాయి.

పరీక్షిత్తు తల్లి గర్భంలో వున్నపుడే శ్రీకృష్ణ భగవానుడి కరుణామృతాన్ని గ్రోలిన అదృష్టశాలి. అతడికే శృంగి వంటి సజ్జనుడి కోపాన్ని అధిగమించడం సాధ్యం కాలేదు. వారం రోజుల మరణాసన్న వ్యవధిలో శుకమహర్షి సాన్నిహిత్యంలో అతడు పరమపదం పొందేందుకు తగిన అర్హత సంపాదించాడు. అందుకే మంచివారి నోటినుంచి వెలువడే అమంగళకర వాక్యాలకు సాధకులు అప్రమత్తులు కావలసి వుంది. సజ్జనులను ఆదరించడం ముముక్షువుల పరమావధి కావాలి. ఓ దురనుభవం తమ తప్పిదాల ఫలరూపమైతే నివారణకు చర్యలు చేపట్టాలి. సకల పాపహరమైన హరినామాన్ని స్మరించి, హరిలీలలు విని సత్సంగంలో విహరించి శ్రీహరి పద సన్నిధికి చేరుకున్న పరీక్షిత్తు మనకు ఆదర్శం కావాలి. తెలిసీ తెలియక చేసిన అపరాధానికి వ్యాస పుత్రుడైన శుకమహర్షి ద్వారా పరీక్షిత్తు పునీతుడైన వైనం సాధకులకు సాధనోపాయం చూపుతుంది. మరణాసన్న సమయాన్ని సచ్చిదానంద ఘనస్వరూపమైన శ్రీహరి గానామృత హేలగా మార్చుకున్న పరీక్షిత్తు చరిత్ర జాతికి ఆదర్శం. ఎవరిపట్ల చేసినా అపరాధం అపరాధమే! ఓ సజ్జనుడి పట్ల జరిగే అపరాధం తప్పు చేసిన వారి బ్రతుకును నిర్వీర్యం చేస్తుంది. దిద్దుబాటు చర్యగా హరిచింతన ముముక్షువుల సాధనను తప్పక ఫలవంతం చేస్తుందని విశ్వసించి అడుగు ముందుకు వెయ్యాలి. ❋

# 62. చిత్త ఏకాగ్రత

మానవ జీవన సరళిలో లౌకిక విషయాలకు సంబంధించి గానీ, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించి గానీ మనిషి మనసు పెట్టి పని చేయవలసి వుంటుంది. చిత్త ఏకాగ్రత వల్ల అద్భుతాలు జరుగుతాయి. ధారణాశక్తి పెరుగుతుంది. పేద రాజవుతాడు, నిరక్షరాస్యుడు మేధావి అవుతాడు. ఏకాగ్రత లేని తపస్సు సత్ఫలితాలు ఇవ్వదు. ఏకాగ్రత లేని చదువులో ఉచ్ఛారణ దోషాలు పెరుగుతాయి. ఒక పదాన్ని పలుకవలసిన రీతిలో పలుక లేకపోయిన కుంభ కర్ణుడు జీవిత పర్యంతం నిద్రాదేవి ఒడిని ఆశ్రయించవలసిన దుర్గతి పట్టింది. 'నిర్దయ'ను కోరుకున్న అతడు 'నిద్ర'గా తన కోరికను బ్రహ్మదేవుడి ముందు వ్యక్త పరచిన కారణంగా ఆ పరిస్థితి తలెత్తింది.

ఏకాగ్రత వల్ల జ్ఞానం ఒంటబడుతుంది. సాధారణ వ్యక్తి తన ఆలోచనలలో స్పష్టత కొరవడే కారణంగా తొంభైశాతం శక్తులు నష్టపోతాడని స్వామి వివేకానంద చెప్పడం విశేషం! ఏకాగ్రత వల్లనే మానసిక శక్తులు వికసిస్తాయనీ, ధ్యాన ప్రక్రియ ఫలవంతమవుతుందనీ తెలుసుకోవాలి. మన ప్రాచీన ఋషులు తపోధ్యానాదులను అనుష్ఠించే సమయంలోనే వేద మంత్రాలలోని 'సూక్ష్మ' భావాలను గ్రహించగలిగే వారట!

మానవుడు సంఘజీవి. ప్రాచీన కాలంలో అతడు గురు కులాలలోనే కాదు సమాజం నుంచి కూడ పాఠాలు నేర్చుకొనేవాడు. ఇది ఏ కాలానికైనా వర్తించే సార్వజనీన సత్యం. అందుకే ఆధునిక విద్యాలయాల్లో 'సామూహిక చర్చలు' ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మనో ఏకాగ్రత ఒక్క రోజులో కుదిరేది కాదు. నిరంతర సాధనతో క్రమంగా మనస్సును ఏకాగ్రత వైపు నడిపించాలంటారు మనో వైజ్ఞానికులు. ప్రార్థనతో మనసు నిర్మలమవుతుంది. పవిత్రత

సంతరించుకుంటుంది. మానవ శరీర అంగాలు ప్రకృతిలోని వివిధ అంశాలకు ప్రతీకలు! సూర్యుడికి, వెలుతురుకు అవినాభావ సంబంధం ఉండడం వల్లను, కేవలం  కన్నుల ద్వారా వెలుతురును, ఆ వెలుగులో ప్రపంచాన్ని చూడటం సాధ్యమవటం వల్లనూ సూర్యుడికి, కంటికి అభేదం చెప్పాయి ఉపనిషత్తులు, కంటికి కనిపించే వెలుగు జ్ఞానానికి ప్రతీక! సూర్యుడిని జ్ఞాన ప్రదాతగా అభివర్ణించాయి వేదాలు. ఆంజనేయుడికి సూర్య భగవానుడు గురువుగా వెలుగొందాడనే అంశం చాల మందికి తెలిసిన విషయమే!

దేహం పంచభూతాత్మకం కాబట్టి పంచ భూత శక్తులు దేహాన్ని, తద్వారా మనసును పరిపాలిస్తాయి. అవి విశ్వాసాన్ని సైతం పాలించే దైవీ శక్తులు! చిత్త ఏకాగ్రత సాధిస్తే  మనిషిలోని ఆ అతీంద్రియ శక్తులు అతడి వశమవుతాయి తప్ప అతడు వాటికి బానిస కావడం జరగదన్నారు రుషులు.

తప్పులు చేయడం మానవ నైజం. జంతువులు, పక్షులు, ఇతర ప్రాణికోటికి తప్పులు చేయడం తెలియదు. మానవ తప్పిదాలు సంకల్ప వికల్పాల వల్లనే జరుగుతాయి. సంకల్పంలో బలం లోపించినపుడు మనిషికి కార్యసిద్ధి లోపిస్తుంది. ఏదైనా పని చేయ సంకల్పించినపుడు దాని గురించిన పూర్తి అవగాహన మనిషి ఏర్పరచుకోవాలి. సంకల్పాన్ని అనుసరించి కాక పెడ త్రోవన వెళ్ళడం వల్ల సంకల్పానికి విఘాతం కల్గుతుంది. పని గురించి ఏకాగ్రంగా ఆలోచన చేయడం వల్ల మనిషికి కొత్త విషయాలు స్ఫురిస్తాయి. వాటిలో కొన్నయినా కార్యజయానికి తోడ్పడతాయి. ఆ రకంగా కార్యసిద్ధి జరగడం ప్రకృతిలోని  విశేషాంశం!

లోక హితం కలిగే కార్యాల సాఫల్యం కోసం సమాజంలోని వారిని కలుపుకు పోవడం మనిషి నేర్వవలసి వుంది. సంఘంతో కలిసి నడవడం వల్ల ఒక వ్యక్తిలో లోపాలు వుంటే అవి ఇతరుల సామర్థ్యం వల్ల సమసి పోతాయి. కార్యసాధన నైపుణ్యం రెండింతలవుతుంది. యజుర్వేదంలోని తైత్తిరీయ ఉపనిషత్తులో ఒక శ్లోకంలో అధ్యాపకుడు, విద్యార్థి సమష్టిగా బ్రహ్మ జ్ఞానం పొందేందుకు ప్రార్థించడం చూడవచ్చు. నిజానికి గురువు ద్వారానే విద్యార్థికి

జ్ఞానం లభిస్తుంది. వారిరువురూ కలిసి బ్రహ్మ జ్ఞానం కోసం ప్రార్థించడం అంశంగా లోకంలో 'సమష్టి'కి ఎంత ప్రాధాన్యం వుందో అవగతమవుతుంది.

విద్యాలయాల్లో విద్యార్థులు గురువు దగ్గర సామూహికంగా విద్య నేర్చుకుంటారు. ప్రాచీన కాలంలోని గురు కులాల్లోనూ అలాగే జరిగేది. ఒక్కరుగా విద్య నేర్పడం సంప్రదాయం కాకపోయినా ఏకలవ్యుడు దృఢ సంకల్పంతో, చిత్త ఏకాగ్రతతో ధనుర్విద్య అభ్యసించి మెలకువలు నేర్చుకొని పరిపూర్ణుడు కావడం చూస్తాం. జప ధ్యానాదులు సామూహికంగా చేసినపుడు అందరికీ ఏకాగ్రత కుదిరి విశేష ఫలం చేతికందటం మన అనుభవంలోని విషయమే! లౌకిక విద్యలోను, భగవదనురక్తి పెంపొందించే ఆధ్యాత్మిక విద్యలోను ఏకాగ్రత లేనిదే పరిపూర్ణత సాధించడం కష్టం. చెట్టు కొమ్మపై వున్న బొమ్మ పక్షి 'కంటిని' కొట్టవలసిన తరుణంలో నల్గురు పాండవులకు, కౌరవులకు భిన్నంగా అర్జునుడికి పక్షి బొమ్మ 'కన్ను' మాత్రమే కనిపించిందనీ, దానిని అతడు విజయవంతంగా ఛేదించాడనీ వెల్లడయిన మహాభారత కథ చిత్త ఏకాగ్రత అంశంగా మనకు ఆదర్శనీయం! ❋

# 63. ఆస్తికత్వం

ఒక పరమ సత్యాన్ని ఉన్నదున్నట్లు నమ్మడమే ఆస్తికత్వం. అందుకు విరుద్ధమైనది నాస్తికవాదం. మానవుడి జీవనగతికి అనేక ప్రత్యామ్నాయాలుంటాయి. ఎంపిక చేసుకొనే గతిని అనుభవించే వెసులుబాటు మనిషికి ఉంది. ఈ విషయంలో ఒత్తిళ్ళు అంతరంగికంగానూ, బాహిరంగానూ ఎదురుకావచ్చు. అంతిమ నిర్ణయం తీసుకొనే సర్వాధికారం మాత్రం మనిషికి ఉంటుంది. ఓ భోజన పదార్థం, ఓ నివాస ప్రాంతం, ఓ రవాణా సాధనం ఎంపికలో మనిషికి స్వేచ్ఛ ఉన్నపుడు తను గడపవలసిన (నైతిక) జీవన పంథాకు సంబంధించి సైతం స్వేచ్ఛ ఉండనే ఉంటుంది.

మనుషుల్లో ఆధ్యాత్మిక పరంగా చూస్తే ఉండేవి రెండే వర్గాలు. ఒకటి ఆస్తికవర్గం, రెండవది నాస్తిక వర్గం. ఆస్తికులు దైవం ఉన్నాడంటారు. అవసరం తీర్చే ఒక వస్తువు 'ఉన్నది' అనటంలో ఎంతో ఆనందం ఉంటుంది. ఉన్న దానికోసమే అన్వేషణకు అవకాశం! లేని దాని గురించి వెదకే ప్రయత్నం ఉండదు. తొలకరి ప్రారంభమౌతుందన్న ఆశ లేకపోతే రైతు భూమి దున్నడు. ఎరువులు వేయడు. తనకు పూర్ణాయుష్షు ఉంటుందన్న ఆశతో జీవిస్తాడు మనిషి. కాలంతో ముందుకు సాగుతాడు. నేడో రేపో మరణం అన్నపుడు అడుగు ముందుకు పడదు. నిరాశ మనిషిని నిర్వీర్యం చేసే భూతం. క్షణమొక యుగమౌతుంది. మనసు రగిలే కొలిమి అవుతుంది.

ఆశ చివుళ్ళ మొలక! ఊహలకు బాసట! నిర్వీర్యమైన ఆనందానికి ప్రాణం పోసే సంజీవని ఆశ! ఉన్నది పుష్టి కాబట్టి ఆశావాది నిర్భీతిగా జీవిస్తాడు. ఆశావాదికి ఆనందం అరచేతిలో ఉసిరిక ఫలమే! నిరాశావాదికి జీవితం చింతాక్రాంతమౌతుంది. ఆశావాదికి ఆస్తికవాదం ఆనందాన్ని ప్రసాదించే అమృత

ఫలం కాగా నిరాశా వాదికి నాస్తిక మార్గం చేదును పంచే అనృతఫలమౌతుంది. అయితే నిరాశావాదం నుంచి పుట్టుకొచ్చిన నాస్తిక వాదం సైతం కొందరిని ఆకర్షించడం వెనుక ఉన్న రహస్యం ఆ కొందరికి దాని పట్ల వుండే ఆసక్తి మాత్రమే!

దేవ దానవులు సముద్రాన్ని చిలికింది అమృతం లభిస్తుందనే ఆశతోనే! ఆ ఆశ వారిని కార్యోన్ముఖులను చేసింది. కార్యసాధన కోసం సాత్విక స్వరూపులైన దేవతలు దుష్ట రాక్షసులతో జత కట్టారు. అమృతాన్ని సురులకు దక్కింపజేసేందుకు శ్రీ మహా విష్ణువు మహా సంకల్పం చేశాడు. వారి ఆశ సఫలం కావడానికి శ్రీహరి తోడ్పడిన వైనం, ఆశా వాదానికి దైవం తోడ్పాటు ఉంటుందనే సత్యాన్ని రూఢి చేస్తుంది. 'కొనసాగుతుంది' అన్న సృష్టికర్త మహా సంకల్పం మేరకు సృష్టి అనంతరం ఈ భౌతిక జగత్తు 'నిలిచి' వున్నదంటారు దార్శనికులు.

ఉన్న సంపదను మనిషి అనుభవించవలసింది ఉంది. లేనిదాని సాకారం కోసం అతడి ప్రయత్నమూ అంతే అవసరం! ఓ వస్తువు సృజన, లేక సంపాదన కోసం చాల సందర్భాల్లో పదుగురి తోడ్పాటు అవసరమౌతుంది. ఒక్కొక్కసారి కోరకుండానే అపరిచితుల స్నేహహస్తం మంచి సంకల్పంతో చేసే పనులకు అందుతుంది. అది ఎలాంటిదంటే ఓ దేవాలయ నిర్మాణం జరుగుతున్నపుడు పదుగురు దాతలు పలు విధాల సాయపడటం వంటిది. సత్కార్యాలకు మంచి వారి సహకారం ఎన్నడూ ఉంటుందన్న సానుకూల భావనే ఆస్తికుల సంపద. దైవాన్ని విశ్వసించేందుకు సంకల్ప బలం మినహా మరే బలమూ అవసరం లేదు. హోదా, అధికార, కుల, వర్గ బలాల అవసరం అసలే లేదు. ఊపిరి నిలవడానికి శ్వాస ఆధారమైనట్లు దైవం ఉన్నాడన్న విశ్వాసం నిలవడానికి నమ్మకం పునాది అవుతుంది. ప్రయత్న శీలుడైన వ్యక్తి ప్రపంచాన్నే సాధించవచ్చు. ఆత్మను తెలుసుకున్న ధీరుడికి దృశ్య జగత్తు లెక్కలోనిది కాదు. దైవాన్ని విశ్వసించి నష్టపోయిన వారు లోకంలో లేరన్నది మాటల్లో వినబడే మహా సత్యం. ఈ సందర్భంగా ఓ దార్శనికుడన్న మంచి మాటలు స్ఫురణకు వస్తాయి. 'నమ్మి పోరాడటం (ప్రయత్నించడం) వల్ల (వి)ముక్తి లభిస్తుంది. పోయేదేమైనా ఉంటే అది (భవబంధాల) బానిస సంకెళ్ళు మాత్రమే ! ❋

# 64. మనసా! వ్యాకులపడు!

'వయసుతో నిమిత్తం లేకుండా ఆధ్యాత్మిక సాధన మొదలెడతాం! అర్థాంతరంగా దేహం చాలించవలసి వస్తే అప్పటిదాకా చేసిన సాధన ఏమౌతుంది? బూడిదలో పోసిన పన్నీరేనా?' ప్రశ్నించాడో యువ శిష్యుడు గురువు గారిని.

'సాధన వృద్ధాప్యంలో మొదలెట్టకూడదు. సాధన క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లు తట్టుకొనే శక్తి వార్ధక్యంలో ఉండదు. ఫలవంతమైన సాధన సాధ్యం కాదు. యవ్వనంలోనే భక్తి సాధన ప్రారంభించాలి. శరీరం మరణిస్తే అప్పటిదాకా సాగిన సాధన వృధాకాదు. మృత్యువు వలన అడ్డంకి ఏర్పడితే సాధన మరుజన్మలో కొనసాగుతుందని గీతాకారుడు సెలవిచ్చాడు' అంటాడు గురువు.

పునర్జన్మ ఉంటుందని అందరూ విశ్వసించరు. పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్మడం వలన సాధకుడికి మేలే జరుగుతుంది.

నిషిద్ధ కర్మల వల్ల పాపాలు సంప్రాప్తిస్తాయి. కర్మ ఫలం మంచిదైనా చెడ్డదైనా అనుభవించవలసే ఉంటుంది. ఆ మేలుకొలుపు మనిషి పాపం చేయకుండా కాపాడుతుంది. పాపభీతి మతవిశ్వాసమైతే దాని వలన మనిషికి ప్రయోజనమే చేకూరుతుంది.

'భక్తుడికి భగవంతుడి పట్ల వ్యాకులత ఉండాలి. అది తల్లి పట్ల చిన్న బిడ్డకుండే మోహం వంటిది. తన కోసం ఆరాటపడుతూ వ్యాకులత చెందే చంటి బిడ్డ కోసం తల్లి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. వ్యాకులత ఉన్న భక్తుడి పట్ల భగవంతుడి వైఖరి కూడా అలాగే ఉంటుం'దన్నారు రామకృష్ణ పరమహంస. 'కొన్నిసార్లు ప్రార్థిస్తే ఆయన కనిపించలేదు. ఆయన నుంచి


సమాధానం రాలేదు కాబట్టి భగవంతుడే లేడు' అనడం సరికాదంటారు పరమహంస. భగవంతుడి ఉనికి తెలుసుకొనేందుకు భక్తుడు త్రికరణ శుద్ధిగా ప్రయత్నిస్తే, ప్రయత్న లోపం ఇసుమంతైనా లేకపోతే సరైన సమయంలో ఆత్మానుభవం తప్పక కలుగుతుందన్నది అంతర్యామితో సంస్పర్శగల సనాతన భారతీయ పరమ యోగుల అనుభవాలసారం.

తనను ప్రార్థించిన భక్తుడి ప్రార్థనలు ఎందుకు ఆలకించాలి? కోరికలు ఎందుకు తీర్చాలి? అన్న కోణంలో భగవంతుడు ఆలోచించ వచ్చని భావించడం ఎంతవరకు సబబు? మానవుల ఆలోచనలకు పరిధులు, పరిమితులు ఉంటాయి గానీ దైవం అనుగ్రహానికీ, ఆశీస్సులకు ఎల్లలు వుండవు. మానవ మేధ ఆలోచనకనుగుణంగా లౌకిక సిద్ధాంతాలు ఉంటాయి. లౌకికతకు అతీతమైనది దైవమార్గం. అర్హత సాధించిన సాధక భక్తుల విషయంలో ఆయన వాత్సల్యం పరిమితి లేనిదన్నది జగదేక సత్యం.

చైతన్య మహా ప్రభువుకు యవ్వనంలోనే భగవద్భక్తి అలవడింది. ఆయనకు భగవన్నామం మినహా మరో ఆలోచన రుచించేది కాదట! గుట్టలో పుట్టలో, కొండలో కోనలో, కాయలో పండులో, ఆకులో అలములో, పృధివిలో ఆకాశంలో, అనంత విశ్వంలో భగవంతుడే కనిపించసాగాడాయనకు. ఆ మహా పురుషుడి దివ్య నామమే ఓ నాదంగా చైతన్యుడి శ్రవణ ఇంద్రియాల్లో మారు మోగింది. భగవంతుడి కోసం అతడి నయనాలు అశ్రుధారలు వర్షించాయి. భక్తిలో సంలీనమై తనను తాను మరచిపోయే వాడు చైతన్యుడు. భగవన్నామంతో ఎడబాటు క్షణకాలం కలిగినా ఎన్నో యుగాల బాధాతప్త అనుభూతికి లోనయ్యే వాడాయన! పరమాత్మ లేని లోకాన్ని ఊహించలేక పోయేవాడు. తన శరీరం, మనసు, హృదయం సర్వం భగవంతుడి అధీనమయ్యాయని భావించిన అతడు ఆ పరమాత్మ దివ్య స్పర్శ అందిరాని క్షణంలో యమయాతన అనుభవించాడు. అంతెందుకు? చైతన్యుడు భగవంతుడిలో భాగంగా మారిపోయాడు. ఆ చైతన్యుడి భగవదనుభవ సాధనలో లేశ మాత్రం అనుభూతించిన అదృష్టవంతుడికి సైతం ఉత్తమ గతులు సంప్రాప్తించాయి.

నమ్మకం మనిషిని నడిపిస్తుంది. ఇహంలో మానవ సంబంధాలలో గానీ, పరంలో భగవద్విషయంలో గానీ విశ్వాసం పాత్ర కొలమానాని కందనిది. ఆ విశ్వాసానికి వ్యాకులత తోడయినపుడు భౌతికమైన ప్రేమ, విస్తరించిన అనుబంధాలతో మంచి స్నేహితులను సంపాదించి పెడుతుంది. అలౌకికమైన భగవత్ ప్రేమ సాక్షాత్ భగవంతుడినే ఆర్జించి పెడుతుంది.

ఓ మనసా! భగవంతుడి కోసం వ్యాకులత చెందగల అరుదైన మనస్తత్వాన్ని సంతరించుకో! అది మహోన్నత వ్యక్తిత్వానికి పునాది అవుతుంది. పునాదులు బలంగా ఉన్న భవనాలు బీటలు వారవు. నమ్మకం, వ్యాకులత అనే ఇటుకలు, సున్నంతో గట్టిపరచిన భక్తుల హృదయగత భగవదనుభవాలు ఎన్నటికీ నిర్వీర్యం కావు. అటువంటి వారి స్తోత్ర పాఠాలు యుగ యుగాలకూ నిలిచివుండే జ్ఞాన భాండాగారాలై అనుసరించే వారికి ఉత్తమ గతులు సంపాదించి పెడతాయి. భగవంతుడు, భక్తుడు వేరు వేరు కాని మహోన్నత దివ్యస్థితి అటువంటి సాధకులకు అనుభూత మవుతుంది. ❃



## రచయిత గోపాలుని రఘుపతిరావు గురించి...

తల్లిదండ్రులు : స్వర్గీయ శ్రీమతి వెంకమ్మ, స్వర్గీయ శ్రీ వెంకట శేషయ్య

జన్మస్థలం : ప్రకాశం జిల్లా, దొనకొండ మండలం, పెద్ద గుడిపాడు గ్రామం.

పుట్టిన తేది : 29.6.1952

విద్య : బి.కాం. జె.కె.సి. కాలేజి, గుంటూరు

ఉద్యోగం : కెనరా బ్యాంకులో 9.7.1974న ప్రవేశం; ఉద్యోగవిరమణ 18.2.2010న

స్థిర నివాసం : బాపట్ల, గుంటూరుజిల్లా, ఎ.పి.

వివాహం : సీతాదేవి తో 13.11.1976 న

కుటుంబం : పెద్దబ్బాయి మధుశ్రీనివాస్, కోడలు రేణుక,
మనుమరాళ్లు సహస్ర, సంహిత
రెండోఅబ్బాయి చంద్రశేఖర్, కోడలు శాంతి,
మనుమరాలు కృతి.
ఆఖరబ్బాయి సాయికుమార్, కోడలు మాధవీలత,
మనుమరాలు ఆద్య.

రచయితగా : 1990లో ఓ కవితతో ఆంధ్రభూమిలో ప్రస్థానం ప్రారంభం. ఇప్పటిదాకా 300 దాకా సాధారణ వ్యాసాలు, 40 కవితలు, 45 దాకా కథలు, 100 పైచిలుకు ఆధ్యాత్మిక వ్యాసాలు ప్రచురణ. తెలుగులో దాదాపు అన్ని దిన, వార, మాసపత్రికలలో అంశాలు ప్రచురించబడ్డాయి. ప్రస్తుతం 'ఈనాడు' దినపత్రికలో 'అంతర్యామి' కాలమ్‌లో ఆధ్యాత్మిక వ్యాసాల రచన.

ఇప్పటిదాకా
ప్రచురణలు : 'కృషితో నాస్తి దుర్భిక్షం' (కథల సంకలనం) 'అమ్మపల్లకి' (కవితా సంపుటి) www.kinige.com ఆన్‌లైన్ బుక్‌స్టోర్‌లో లభ్యమవు తున్నాయి.
'ఆధ్యాత్మిక తోరణం' ప్రింట్ బుక్‌గా రచయిత చిరునామాకు వ్రాసి పొందవచ్చు.

పురస్కారాలు : 2003 జూన్‌లో SET, చీరాల వారి నుంచి 'సేవాభారతి' పురస్కారం. 2013లో ఘంటసాల కళాపరిషత్, తెనాలి వారి ఆధ్వర్యంలో ప్రముఖ హాస్యనటులు స్వర్గీయ శ్రీ A.V.S. గారి చేతుల మీదుగా సన్మానం.

ప్రచురింపబోవు
రచనలు : ఓ ఆధ్యాత్మిక వ్యాస సంకలనం, సాధారణ వ్యాస మాలిక.



రచయిత : **గోపాలుని రఘుపతిరావు**

రచయిత వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి అయినా, సాహిత్యాభిలాష ఉన్న కారణంగా గత 26 ఏళ్ళుగా సాహిత్య సృజన చేస్తున్నారు. సాహిత్యం పట్ల ఆయనకు గల మమకారం పలు సాహితీప్రక్రియలకు శ్రీకారం చుట్టింది. కథ, కవిత, వ్యాసం, ఇలా సాగిన రచయిత సాహితీవ్యాపకం సామాజిక వ్యాసాల నుంచి ఆధ్యాత్మిక వ్యాసాల రచన దాకా కొనసాగటం విశేషం! 2015లో **'ఆధ్యాత్మిక తోరణం'** పేరిట ఓ ఆధ్యాత్మిక వ్యాసాల సంకలనం ముద్రణకు నోచుకుంది. అదే పరంపరలో ఆవిర్భవించిన ఈ గ్రంథం **'ఆధ్యాత్మిక వెలుగు'** ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు వారి సాధన దిశగా ఇతోధికంగా సాయపడగలదని నమ్మకం! ఇందులోని వ్యాసాలు దేనికదే ప్రత్యేకత కల్గినవి. కొన్ని వ్యాసాలు వ్యక్తిత్వ వికాసానికీ దోహద పడగల సాహితీ స్పర్శ కల్గి ఉన్నాయి.

**నీకు నీవే ప్రత్యేకం**
**విద్యాగంధం**
**మరణం లేని మనం**
**భయంలేని జీవితం**
**ఆనందమందిరం**
**బ్రతుకు తీపి**
**యోగసాధన**
**మనసుతెర**
**స్వార్థం**
**సజ్జనుడి కోపం**
**జాతవేదుడు**
**ముఖం**
**సుందర ప్రకృతి**
**మాయాప్రపంచం**
**స్త్రీ**

వంటివి గ్రంథంలోని ముత్యాల్లాంటి వ్యాసాలలో మచ్చుకు కొన్ని. ఇవన్నీ పాఠకులు చదివేందుకు ఆసక్తిని కల్గించడంతో పాటు విజ్ఞాన దాయకంగానూ ఉండగలవని ఆశిస్తున్నాం.